# హాస్యానందం

తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక

సంపూర్ణ హాస్య మాస పత్రిక

ఫిబ్రవరి-2021

## నవ్వుల తెర తారల ప్రత్యేక సంచిక



# అమ్మా నాన్నలకు
# వివాహ దినోత్సవ శుభాకాంక్షలు
(ఫిబ్రవరి, 19)



**శ్రీమతి & శ్రీ సరోజ సత్యనారాయణ**

కుమారుడు: **డా॥చంద్రశేఖర్,** పెర్త్, ఆస్ట్రేలియా
కుమార్తెలు: **శ్రీమతి ఇందిరారాణి,** లండన్, యూకే
**శ్రీమతి ఉషారాణి,** యాష్బర్న్, వర్జీనియా, యు.ఎస్.ఎ
మనుమలు, మనుమరాండ్రు:
**ఆరతి, ఆర్య, సోనిక, సాత్విక్, సాహిత్, నితిన్, జాక్లిన్**

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

# హాస్యానందం

సంపూర్ణహాస్య మాస పత్రిక

**200 వ సంచిక**

**నవ్వుల తెర తారల ప్రత్యేక సంచిక**

**ఫిబ్రవరి-2021**

*Publisher& Editor*-**Ramu.P**

**గౌరవ సంపాదకులు: సరయూ శేఖర్**

*Full Pillar*- Bnim

*Well Wishers:*

Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Mallik,
Sanku

*D.T.P:* P. Ramalakshmi, 9440304993

*Perpetuals:* A.Dayakar, Bachi, Krishna, Chaitanya, Lepakshi, Bannu, Nagisetty, Nagraj, Venkat

**సంవత్సర చందా రూ.300/-**

**2 సంవత్సరాల చందా రూ.500/-**

**జీవిత చందా రూ.5000/-లు**

Editorial Office:

**HASYANANDAM**

# 8-215/4, Near Ramalayam,

**Po:YERRABALEM-522 503,**

Mangalagiri Mandal, Guntur dist.

*Ph* : **9849630637**

email: **hasyanandam.mag@gmail.com**

**Hyderabad & Secunderabad Distributors:**

M.Panduranga,

**Risingsun News Agency**

Abids, Hyderabad. Cell. 9666680857.

ile in every page Satisfaction in every smile

## నవ్వుల తెరతారల వరుస ఇందులో...

### కీర్తి శేషులు

| | | | |
|---|---|---|---|
| చార్లీచాప్లిన్ | -14 | ఏవీఎస్ | -36 |
| కస్తూరి శివరావు | -15 | మాడా వెంకటేశ్వరరావు | -37 |
| వంగర | -16 | ఎమ్.ఎస్.నారాయణ | -38 |
| సి.ఎస్.ఆర్. | -17 | ధర్మవరపు సుబ్రహ్మణ్యం | -39 |
| రేలంగి | -18 | గుండు హనుమంతరావు | -40 |
| రమణారెడ్డి | -19 | కొండవలస లక్ష్మణరావు | -41 |
| బాలకృష్ణ | -20 | వేణు మాధవ్ | -42 |
| అల్లురామలింగయ్య | -21 | జయప్రకాష్‌రెడ్డి | -43 |
| పద్మనాభం | -22 | సురభి కమలాబాయి | -44 |
| చదలవాడ కుటుంబరావు | -23 | జవ్వాది గంగారత్నం | -45 |
| పేకేటి | -24 | సూర్యకాంతం | -46 |
| చలం | -25 | ఛాయాదేవి | -47 |
| రాజబాబు | -26 | సురభి బాలసరస్వతి | -48 |
| నాగేష్ | -27 | కనకం | -49 |
| సీతారామ్-నల్లరామ్మూర్తి | -28 | మీనాకుమారి | -50 |
| రావి కొండలరావు | -29 | గిరిజ | -51 |
| రాళ్ళపల్లి | -30 | భానుమతీ రామకృష్ణ(స్పెషల్) | -52 |
| చిడతల అప్పారావు | -31 | గీతాంజలి | -53 |
| నూతన్‌ప్రసాద్ | -32 | నిర్మలమ్మ | -54 |
| మల్లిఖార్జునరావు | -33 | తెలంగాణ శకుంతల | -55 |
| సుత్తివేలు | -34 | కల్పనారాయ్ | -56 |
| సుత్తి వీరభద్రరావు | -35 | | |

### కీర్తి వంతులు

| | | | |
|---|---|---|---|
| సారథి | -58 | బాబూ మోహన్ | -71 |
| విశ్వేశ్వరరావు | -59 | సునీల్‌వర్మ | -72 |
| చంద్రమోహన్ | -60 | వెన్నెల కిషోర్ | -73 |
| రాజేంద్రప్రసాద్ | -61 | రఘుబాబు | -74 |
| సుధాకర్ బేత | -62 | కృష్ణ భగవాన్ | -75 |
| నరేష్ | -63 | సప్తగిరి | -76 |
| కోట శ్రీనివాసరావు | -64 | షకలక శంకర్ | -77 |
| బ్రహ్మానందం | -65 | జెన్ని | -78 |
| అలీ | -66 | రమాప్రభ | -79 |
| భరణి తనికెళ్ళ | -67 | శ్రీలక్ష్మి | -80 |
| ఎల్బీ శ్రీరాం | -68 | కోవై సరళ | -81 |
| గుండు సుదర్శన్ | -69 | సత్యనారాయణ (స్పెషల్) | -82 |
| అల్లరి నరేష్ | -70 | ఆరోగ్యకరమైన హాస్యానికి చిరునామా | -89 |

| ప్రత్యేకం | | శీర్షికలు | |
|---|---|---|---|
| శుభాశీస్సులు | -6 | కార్టూన్‌పోటీ ఫలితాలు | -84 |
| హాస్య నట కులం చాలా పెద్దదే! | -12 | శంకర్‌గారి రేఖాశీస్సులు | -86 |
| 'హాస్యమే పునాది' -వాణిశ్రీ | -13 | | |



అమ్మ గొప్పతనాన్ని తెలియజేసి,
మాకు దూరమయిపోయిన
**మా అమ్మ శ్రీమతి జాంబువతికి**
ఈ ప్రత్యేక సంచిక అశ్రునయనాలతో
అంకితమిస్తున్నాను.
**–రాము.పి, ఎడిటర్**

## హాయ్...సానందంగా...

**హాస్యానందం ఆప్తులకు, సన్నిహితులకు, అభిమానులకు హాస్యాభివందనాలు.**

**హా**స్యానందం 200 వ సంచికకు చేరుకున్న ఈ శుభతరుణం నిజంగా ఆనందదాయకం! అయితే ఈ ప్రయాణంలో ఎన్ని ఒడిదొడుకులో అననుగానీ.. ఎంతోమంది మహానుభావులు అండదండలు, సహాయసహకారాలు, ఆశీస్సులు, మార్గదర్శకాలు అందించారని చెప్పడానికి గర్వపడుతున్నాను. ఇది మన పత్రిక అంటూ భావించిన నా ఆత్మీయులందరినీ ఈ సందర్భంగా గుర్తు చేసుకోవలసిన బాధ్యతగా భావిస్తున్నాను.

డా॥కె.వి రమణాచారిగారు, శ్రీతనికెళ్ళ భరణిగారు, డా॥సుదర్శన్‌గారు, శ్రీబ్నింగారు, డా॥గురవారెడ్డిగారు, శ్రీఎల్బీశ్రీరాంగారు, డా॥యండమూరి వీరేంద్రనాథ్‌గారు శ్రీ మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు, శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు... ఇంకా మన రచయితలు, రచయిత్రులు, చిత్రకారులు, కార్టూనిస్టులు, పత్రికా చందాదారులు, జీవిత చందాదారులు, ఏజెంట్లు... వీరందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

సకాలంలో పత్రిక రావడానికి ముఖ్య కారకులైన మా 'రెయిన్‌బో' ప్రెస్ అధినేత శ్రీనరేంద్రగారికీ, అక్షరదోషాలు లేకుండా టైప్ చేసి, నాపనిని తగ్గిస్తున్న శ్రీమతి లక్ష్మీగారికీ ప్రత్యేకమయిన కృతజ్ఞతలు.

ఈ 200 సంచిక తెలుగు హాస్య పత్రిక చరిత్రలో ఒక గొప్ప 'స్త్మెలురాయి'!
2013 లో నేనూ, నా మిత్రుడు దయాకర్ కలిసి ప్రారంభించిన 'హాస్యానందం' ఈ రోజు హాస్య ప్రియుల, హాస్యాభిమానుల అభిమానాన్ని సంపాందించుకుని ఈ 'స్థాయి'కి చేరుకుంది.

ఈ సందర్భంగా మన తెలుగు హాస్య నటీనటుల గురించి 'క్లుప్తంగా' విషయసేకరణ చేసి ఒక ప్రత్యేక సంచిక రూపొందిద్దాం... అని మా చిరకాల మిత్రులు సినీ కాలమిస్ట్ శ్రీ సరయూశేఖర్‌గారితో నా ఆలోచన చెప్పాను. ఆయన అంగీకారంతో ఈ కార్యాచరణ మొదలెట్టాము.

మా ఈ ప్రయత్నం చెప్పగానే– 'సన్‌షైన్' డాక్టర్ గురవారెడ్డిగారి ప్రోత్సాహంతో, చేయూతతో 'గొప్ప' సంచికగా రూపొందించాలనే ఆలోచనగా మారింది. ఈ క్రమంలో డాక్టర్ రామకుమార్, గుంటూరు, డా॥చంద్రశేఖర్, ఆస్ట్రేలియా, డాక్టర్ టి.చంద్రశేఖర రెడ్డి, బాపూరమణ అకాడమీ శ్రీసుబ్బరాజు, సాంబమూర్తి ఎంటర్‌ప్రైజేస్ అధినేత శ్రీ కె.వి.వి. సత్యనారాయణ, సాహితీ ప్రచురణలు శ్రీమతి లక్ష్మీ, గో.తెలుగు.కామ్ బన్నుగార్లు... ఇంకా 'అభినందన' ప్రకటనలిచ్చిన మిత్రులు ఈ ప్రత్యేక సంచిక రూపకల్పనకు మూల స్థంభాలయ్యారు.


**వీరందరి అండదండలతో ఎక్కువ పేజీలతో, మంచి పేపరుతో రూపొందించిన ఈ ప్రత్యేక సంచిక వ్యయం ఎక్కువయినా, పాఠకులకు ఆర్థిక భారం పడకుండా 20 రూపాయలకే అందిస్తూన్నాం!**

ఈ సందర్భంగా హాస్యానందానికి తమ ఆశీస్సులు అందించిన ఆత్మీయులందరికీ నా కృతజ్ఞతలు.


నా ఈ ప్రయాణం సాఫీగా సాగడానికి ఎల్లప్పుడూ నన్ను ప్రోత్సాహించే ముఖ్యవ్యక్తి నా సహధర్మచారిణి 'భవాని' కి నా ప్రేమపూర్వక కృతజ్ఞతలు.

అందరి అభిమానాన్ని, నమ్మకాన్ని కాపాడుకోవడానికి మరింత శ్రద్ధతో పత్రికని రూపొందిస్తానని మనవి చేసుకుంటూ... ఈ సంచిక రూపొందించటంలో ఏమైనా పొరపాట్లు జరిగుంటే పెద్ద మనసుతో మన్నించండి!
అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...

Ramv.P




# శుభాశీస్సులు



**హా**స్యానందం 200 సంచిక విడుదల కావడం హాస్యానందం పత్రిక అభిమానులు అందరికీ ఆనందదాయకమైన విషయం. ఒక పత్రికను నిర్వహించడమే కష్టంగా ఉండే పరిస్థితుల్లో హాస్య ప్రధానంగా 18 యేళ్ళుగా నిరవధికంగా నిర్వహించడమనేది కత్తిమీద సాములాంటిది. రాము ఎప్పటికప్పుడు వినూత్న పంథాలో ఈ పత్రిక నిర్వహించాలని అనుకోవటం హాస్యానందం పత్రిక చూస్తే మనకు అర్థమయిపోతుంది. ఎంతోమంది కార్టూనిస్టులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో ఇది కార్టూన్ల పత్రికనా అన్న రీతిలో కార్టూనిస్టులను ప్రోత్సాహించడం జరుగుతుంది. ప్రతినెలా ఏదో ఒకరకమైన పోటీ, బహుమతులు, విజేతలు... ఇలా కార్టూనిస్టులను ఎప్పటికప్పుడూ వెన్ను తట్టి ప్రోత్సాహిస్తునటువంటి పత్రిక హాస్యానందం. రాము స్వయంగా కార్టూనిస్టు కాదు. కానీ అదేం చిత్రమో కార్టూనిస్టుల కోసమే పత్రిక నిర్వహిస్తున్నాడు. అయితే హాస్యానికి కేంద్రంగా భావించి హాస్యానందాన్ని నిర్వహించాలనే రీతిలో 200 సంచికను తెలుగు సినీ హాస్య నటీనటుల ప్రత్యేక సంచికగా విడుదల చేయడమనేది ఇది ఒక కొత్త పుంత. ఈ రకంగానే ప్రతి సంచిక రాము చేతిలో కొత్తగా రూపుదిద్దుకుంటుందని ఆశీస్తున్నాను. హాస్యానందం పత్రిక అభిమానులందరికీ 200 సంచిక విడుదల సందర్భంగా నా శుభాకాంక్షలు. రాము ప్రయత్నం ప్రతిసారిలాగే ఈసారీ విజయవంతమవ్వాలని అభిలాషిస్తూ పత్రిక సంపాదకులు రాముకి శుభాభినందనలు. నిర్వహాకులందరికీ అభినందనలు,


**–కె.వి.రమణాచారి, ఐ.ఎ.ఎస్ (రి)**






**తె**లుగు హాస్య పత్రికల్లో చారిత్రాత్మక విజయం సాధించిన హాస్యానందానికి నా అభినందనలు. దీని వెన్నెముకగా నిలబడి నిర్వహిస్తున్న మా రాముకి శుభాకాంక్షలు. శుభం భూయాత్!

**–తనికెళ్ళ భరణి,**
ప్రముఖ రచయిత, నటులు



### నవనవ్యానందాల...హాస్యానందం

**హా**స్యానందం– మూస పత్రికలా కాక... అసలు సిసలు 30 రోజుల 'మాసపత్రిక'లా తీర్చడానికి హాస్యానందం రాముగారికి ఎన్నెన్ని ఆలోచనలో... ఓ కొత్త దారి వెతుక్కుంటూ ప్రతీనెలా కొంగ్రొత్త సొంపులు తీరుస్తూన్న హాస్యానందం రాముగారికి 'తెలుగు హాస్యం' చాలా బాకీ తీర్చాల్సి వుంది. ఆయనకి రాత్రి కల వస్తుందేమో... పొద్దుటే ఫోన్ చేసి, ఇలా చేద్దామా... అలా చేద్దామా అని సలహాలు అడుగుతున్నట్లు నటించి తన కొత్త ప్రణాళికలు ఆశ్చర్యపోయేలా చెప్పేస్తూ... చేసేస్తూ ఉంటారు... ఇప్పుడిప్పుడే ఎన్నెన్ని శీర్షికలో పెరుగుతున్నాయి... ఎందరెందరో బహుమతులు ఇస్తామని... తమ పేర్న పోటీలు పెట్టమని అడుగుతున్నారు... కొంతమంది చందాదారులుగా జీవితాంతం మీ పత్రిక చదువుతాం బాబోయ్ అని నవ్వేస్తూ... 'చెక్కే'స్తున్నారు...ఇవన్నీ సజావుగా నిర్వహించాలి... ఇవి ఒక వ్యక్తి చేయలేని పన్లు... ఒకే ఒక వ్యక్తి చేయగల పన్లు... ఆయన హాస్యానందం రాము. ఆయన పత్రికలో తప్పులుండవు గానీ... పత్రిక కోసం అప్పులు చేస్తున్నారా అని నా అనుమానం... అందుకనే ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ ఇచ్చి వెయ్యవ సంచిక దాకా మనం హాస్యానందాన్ని నడిపిద్దాం... ఆ తరువాత అదే పరిగెడుతుంది... అప్పుడు దాని వెనకే పడదాం. శుభాకాంక్షలతో...

**–బ్నిం,** ప్రఖ్యాత రచయిత, కవి, కార్టూనిస్టు


**200 నెలలు..** ఈ కాలంలో చాలామంది చాలా పోగొట్టుకుని ఉంటారు. అప్పులని, మిత్రులని, కుటుంబసభ్యులని ఉద్యోగరీత్యానో మరో విధంగానో! తెలుగువాళ్ళు అనేక హాస్య పత్రికలని కూడా పోగొట్టుకున్న కాలం ఇది. కానీ మనం పోగొట్టుకోనిది హాస్యానందం!

అందుకే హాస్యానందానికి జేజేలు.

హాస్యానందం ఇలా కొనసాగుతూ ఉండాలని ఆశిస్తూ...

**–మల్లాది వెంకటకృష్ణమూర్తి,** ప్రఖ్యాత రచయిత

## హాస్యానందం పత్రిక! 200వ సంచిక!!



**వావ్!** ఆశ్చర్యంతో కూడిన ఆనందం. ఆశ్చర్యమెందుకంటే ఇదేదో టివి షోనో, సీరియల్లో కాదు 100వ ఎపిసోడ్, 200వ ఎపిసోడ్ అని వేసుకోడానికి. ఇది ప్రింట్ మీడియా... కథారచనలు, గొప్ప కథా రచనలు, సాహితీ విలువలు వున్న ప్రతిష్ఠాత్మకమైన పత్రికలే కనుమరుగైనటువంటి గడ్డుకాలం. అటువంటి కాలగమనంలో కార్టూన్లని, హాస్యకథల్ని ఆలంబనగా చేసుకుని, ప్రత్యేకంగా హాస్యం కోసం ఒక పత్రిక ప్రారంభించి 18 ఏళ్ళ పాటు చదువరుల్ని ఆనంద పరుస్తూ నిరాటంకంగా, విజయవంతంగా నడప(గల్గ)టం ఆశ్చర్యమే కాదు, మహా ఆశ్చర్యం!... ఎందుకంటే ఆర్థిక నేపథ్యమో, అంగబలమో, సాంకేతిక/యంత్రసౌలభ్యమో, గొప్ప ఇన్‌ఫ్రాస్ట్రక్చరో ఉన్న వ్యక్తి నడుపుతున్నది కాదు. కేవలం పత్రిక నడపాలన్న నిజాయితీ కలిగిన ఓ (ఆ) కాంక్ష... ఆశయం!

లెక్కలు, బేరీజులు లేకుండా ఇంతమందికి ఆనందం పంచాలన్న ధ్యేయం. తన కష్టాలని, లాభనష్టాల్ని ఏకరువు పెట్టకుండా వాటిని ఇష్టాలుగా చేసుకునే నైజం. ఇవన్నీ కలిగిన ఏకైక వ్యక్తి ఓ ఒంటరి సైన్యం ఎడిటర్ రాముగారి సంకల్పబలం. ఆయన సంకల్పబలాన్ని నిస్వార్థ చిత్తశుద్ధిని గ్రహించిన పెద్దల ఆశీస్సులు మిత్రుల ప్రోత్సాహం వీటన్నిటి ఫలితమే ఈనాటి 200వ సంచిక వరకు సాగిన ఆనందకర ప్రయాణం. ఆనందం, ఆరోగ్యం, ఉల్లాసం ఇవ్వటమే ఆయనకి ఆనందం. అందుకే హాస్యానందం రాముగారిది ఆనందకర ప్రయాణం. ఈ 200వ మైల్‌స్టోన్‌ని సగర్వంగా ప్రతిష్ఠిస్తున్న, సమర్పిస్తున్న శుభవేళ నా శుభాభినందనములు.

మనందరి అండదండలు, ఆదరాభిమానాలే హాస్యానందానికి, రాముగారికి గొప్ప సన్మానం. హాస్యానందం వెయ్యి సంచికలతో, వందేళ్ళు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ...

**–మీ సుదర్శన్,** ప్రఖ్యాత సినీ హాస్యనటులు



ఒక తెలుగు హాస్యపత్రిక మొదటిసారిగా 200 సంచికను చేరుకోవటం గొప్ప విషయం. హాస్యానందానికి నా అభినందనలు.


**–యండమూరి వీరేంద్రనాథ్,** ప్రముఖ రచయిత



**18** యేళ్ళుగా హాస్యంతో ఆనందం పంచుతున్న హాస్యానందం 200వ సంచికకు చేరుకున్న సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు... 2000 సంచిక కూడా అందరూ చూస్తారని ఆశీస్తున్నాను.

**–మల్లిక్,** ప్రముఖ కార్టూనిస్ట్

## ఎవర్‌గ్రీన్ హాస్యానందం!



**హా**స్యం మీద ఒక మేగజైన్ స్థాపించబడి కేవలం హాస్యానికి సంబంధించిన కథలు, కార్టూన్లు, వ్యాసాలు, ఆర్టికల్స్, ఎంట్రీస్ ఇవన్నీ కూడా దాని మీదే నవ్వించేదిగా ఒక పత్రిక 200 ఇష్యూలు రావడమనేది, అంటే దాదాపుగా పద్దెనిమిదేళ్ళు ఏకధాటిగా నడపడమనేది ఒక అద్భుతం. ఇంతకాలం ఒక మేగజైన్ క్రేజీగా నడపడమనేది మామూలు విషయం కాదు. ముఖ్యంగా తెలుగులో ఎంత మంది కార్టూనిస్టులు ఉన్నారో గొప్ప గొప్ప వాళ్ళ దగ్గరనుండి కొత్తవాళ్ళ దాకా వాళ్ళందరికీ ఒక వేదికగా కృష్ణదేవరాయల ఆస్థానంలాగా, హాస్యానికి ఒక వేదికగా నిలబడి ఇన్నేళ్ళుగా కొనసాగటం, ఎవరి ప్రతిభని వాళ్ళు చాటుకోవడం, అవి చూసి జనాలందరూ మైమరచి పోయి హాస్యాన్ని ఆస్వాదించేలాగా చేసిన ఘనత హాస్యానందం రాము గారిదే. ఆయన పేరే హాస్యానందం రాము. రామారావుగార్లు ఎంతో మంది ఉన్నా, ఎన్.టి.రామారావుగారు ఒక్కరే ఎలాగో, అలాగే ఎంతోమంది రాములున్నా హాస్యానందం రాము గారు ఒక్కరే. ఆయన భుజం మీద వేసుకుని ఇదంతా నడపడం గొప్ప విషయం. మనందరికీ గొప్ప గర్వకారణం.

ఇంకా దీనికి ప్రత్యేకత ఏమిటంటే ఒక్కొక్కరి మీద ఒక్కొక్క ప్రత్యేక సంచిక అప్పుడప్పుడు తీసుకురావడం. ఇలా ఎన్ని వచ్చాయో ప్రత్యేక సంచికలు. దాదాపు అందరి కార్టూనిస్టులవి వచ్చుంటాయి. అంతే కాకుండా నామీద కూడా ఒక ప్రత్యేక సంచిక వేసారు. ఇది నాకు ఒక అపురూపం. నేనెప్పటికీ గుండె అలమరలో దాచేకునే ఫస్ట్ పుస్తకం ఇది. నా గురించి ఎవరికైనా సంక్షిప్తంగా చెప్పాలి అంటే ఈ పుస్తకం పనికొచ్చేలా ముద్రించిన ఘనత రాముగారిది. ఏ పేజీ తిప్పినా అందులో నా గురించి చక్కగా నాలుగు మాటలు ఎవరో ఒకరు మాటాడినవి ఉన్నాయి. అదొక అపురూపం నాకు. హాస్యానికి సంబంధించిన వాళ్ళందరూ ఇంకా దీన్ని ఆదరిస్తూ, అభిమానిస్తూ ముమ్ముందుకు తీసుకెళ్ళాలి. రాముగారికి ఫుల్ సపోర్టుగా, అన్నివిధాలుగా ఉండాలి అని ఆశిస్తూ ఈ ఘన విజయాన్ని నేను ఇందులో చిన్న భాగస్వామిగా ఆనందిస్తున్నాను అని చెప్పడానికి గర్వపడుతున్నాను. థాంక్యూ.

ఆల్ ది బెస్ట్ రాముగారు. ఎవర్‌గ్రీన్ హాస్యానందం.

**–ఎల్బీశ్రీరాం,** ప్రముఖ రచయిత, నటులు, దర్శకులు



**ఈ** రోజులు తీరిక లేనివిగా అయినాయి. హాయిగా నవ్విస్తూ ఆరోగ్యం అందిస్తూ 200వ సంచికగా ముస్తాబయిన హాస్యానందం పత్రికకి అభినందనలు. హాస్యంతో మనసుని ఆహ్లాద పరుస్తున్న పత్రిక ఇది ఒక్కటే. ఇవే నా హార్దిక శుభాకాంక్షలు. **–ఏవీఎమ్,** ప్రముఖ కార్టూనిస్ట్

## 300 సంచికలో కలుస్తాను...



**మూ**డు నెలల క్రితం నేను ఓ పుస్తకంలో ఎడిటోరియల్ చదివాను. 'మనమందరం ఏదో ఓ పని చేస్తూ జీవనం సాగిస్తుంటాం!... వంట దగ్గర్నుంచి, డ్రైవింగ్ దాక వారి వారి నైపుణ్యంతో పాటు నిబద్ధత తోడైతే ఆ వ్యక్తులకొచ్చే గుర్తింపు గొప్పది. మనం చేసే వృత్తిని దైవంగా భావించి, దాన్ని గౌరవించి... శ్రద్ధగా చేస్తే... ఎవరికైనా విజయం తథ్యం!

పై వ్యాఖ్యలు చదివినప్పట్నుంచి పలు రంగాల్లో నాకు తారసపడిన తారక'రాము'లని పరిశీలించినప్పుడు ఇవి అక్షరసత్యాలని, లక్షల మార్కులు వేసి చెప్పొచ్చు!

ఇప్పుడు ఈ వ్యాఖ్యలు పొల్లుపోకుండా రాముగారికి వర్తిస్తాయి.

రాముగారు ఒక హీరో...తన యుద్ధం తనే చేస్తాడు... తన తిప్పలు తనే పడతాడు... తన చాకిరి తనే చేస్తాడు...

కానీ ఎవరైనా ఎప్పుడు హీరోలు అవుతారంటే... వారు యుద్ధం చేశాక వచ్చే ఫలితాన్ని పదిమంది ఆనందంగా అనుభవిస్తే. హాస్యాన్ని ఆనందాన్ని కలిపి ఆరోగ్యవంతమైన... అందులోనూ సంపూర్ణ హాస్య మాసపత్రిక రూపంలో సునామీలోనూ... కరోనాలోనూ... మన ముందుకు తెచ్చారు.

ఇది ఆయన దిగ్విజయ యాత్రలో 200వ సంచిక. 100ఏళ్ళపాటు ఆయన హాస్య, ఆనంద, ఆరోగ్య, ఐశ్వర్యాలతో మనల్ని నవ్విస్తూ... మన హృదయాల్లో నివసిస్తూ... సరస్వతీ లక్ష్ముల కటాక్ష పాత్రుడుగా ఉండాలని కోరుకుంటున్నాను.

కొసమేరుపు: పైన నేను రాసిన ఎడిటోరియల్ వ్యాఖ్యల్ని చదివింది హాస్యానందం( 197వ సంచికలో) పత్రికలో. అది రాసింది రాముగారు. నేను ఆయనకోసం అరువు తెచ్చుకొని వాడే హక్కుదారుణ్ణి. అందుకే అడ్డంగా వాడేశాను....మళ్ళీ 300వ సంచికలో కలుస్తాను.

**–జనర్దన మహర్షి, సినీ రచయిత, దర్శకులు**

---




**కా**మెడీ సినిమా నాలుగువారాలు ఆడితే గొప్పగా ఫీలైపోతాము. అటువంటిది యాభై రోజులు ఆడిందనుకోండి చాల అద్భుతం! అటువంటిది ప్రింట్ మీడియాలో హాస్యానందం రెండు వందల సంచికల పూర్తి చేసుకోవటమనేది మామూలు విషయం కాదు. ఇది డబుల్ సెంచరి!

ట్వంటీయేత్ సెంచరిలో డబుల్ సెంచరి కొట్టిన హాస్యానందానికి నా శుభాకాంక్షలు, హాస్యాభికాంక్షలు, హాస్యాభినందనలు. దశావతారంలాగా పది సెంచరీలు కొట్టాలని ఆశిస్తూ...

–ఎప్పటికీ సదా హాస్యాన్నే నమ్ముకున్న

**శివనాగేశ్వరరావు,** దర్శకులు



**వావ్!...** 200వ సంచిక... ఇదెంతో గొప్ప విషయం! అన్ని రకాల రచనలు వేస్తూ, పత్రికను నడపడం మనం చూస్తూనే ఉంటాం! కానీ ఇది కేవలం హాస్యాన్ని చొప్పించే కథలు, కార్టూన్లు, స్కిట్‌లతో పత్రికని తేవడమంటే మాటలు కాదు. ఈ హాస్యం ఒకోసారి బూతు కబుర్లతో పక్కదారి పట్టవచ్చు. అలా రాకుండా ఉండటానికి నిబద్ధత ఉండాలి. పత్రికను సకాలంలో తేవడం... వీటిలో చిరంజీవి రాము సక్సెస్ అయినట్టే. ఇలాంటి గడ్డుకాలంలో హాస్యానందం పత్రిక మనల్ని హాస్యంతో ముంచెత్తుతుందని, తెలుగులో వెలువడుతున్న ఇదొక్కటే హాస్య పత్రిక అని గర్విద్దాం! దీని గమనం నిరాటంకంగా సాగాలని కోరుకుందాం. తగు రీతిన చేయూతనిద్దాం!

**–బాలి,** ప్రముఖ చిత్రకారులు, కార్టూనిస్టు

---

## రెండొందల సార్లు



**ఆ**యనెవరో ఒకసారి చెబితే వందసార్లు చెప్పినట్టట! రెండు సార్లు చెబితే రెండొందల సార్లట!

ఇప్పుడు 'హాస్యానందం' రెండుసార్లు కాదు... నిజంగా రెండొందల సార్లు చెప్పింది. పురి విప్పింది!

గీసే సార్లు చాలామంది ఉన్నారు... రాసే సార్లూ ఉన్నారు...చూసే సార్లు కూడా ఉన్నారు గణనీయంగా... అయితే కొనే సార్లు కొద్దిమందే! ఏ మాటకామాటే చెప్పుకోవాలి. కొద్దిమంది సలహాల సార్లు, భుజం తట్టే సార్లు ఉన్నమాట నిజమే. భుజం తట్టినా, బూతులు తిట్టినా భరించేసారు... ఏదొచ్చినా మోసేసారు... అన్నిటికీ నవ్వేసారు ఒకడే! ఆయనే రాము సారు!!

పత్రిక పెట్టి చేతులు కాల్చుకున్న ఎంతోమంది పెద్దమనుషుల్ని చూసి కూడా తెలివి తెచ్చుకోలేని ఈ పెద్ద మనిషి ఏం మాజిక్కులు చేస్తున్నాడో, వాళ్ళు ఎక్కడ కాల్చుకుంటున్నాడో తెలియదు కాని పత్రికని నెలనెలా వెన్నెలలో వెలిగించి, రవ్వల పువ్వుల నవ్వుల్లో ముంచి తెస్తున్నాడు!

ఇది ఓ అద్భుతం!

కార్టూను 'కళ' కలగా కరిగిపోకుండా తన వంతు కాపలా కాస్తూ; నొప్పింపక, తానొవ్వక కార్టూనిష్టులందరినీ కలుపుకుపోతూ, వేలాది రూపాయలను బహుమతుల రూపంలో చేతుల్లో పెడుతూ, పెట్టిస్తూ; తెర వెనుక కష్టనష్టాలను సహనంతో సహిస్తూ రెండు వందల సంచికలను తేవడం ఆషామాషీ వ్యవహారం కాదు.

ఆ పనిని సాధించి చూపిన రాము గారికి మనసారా అభినందనలు తెలియజేస్తున్నాను.

సాధనమ్ము చేసి సాధింపబూనినన్ సాధ్యపడని దేది సాధకునకు??

**–సరసి,** ప్రముఖ చిత్రకారులు, కార్టూనిస్టు



**హాయ్** అండి! నా పేరు డైమండ్ రత్నబాబు. 'సన్ ఆఫ్ ఇండియా' సినిమా డైరెక్టర్‌ని. నేను మీ ముందుకు ఎందుకు వచ్చానంటే ... హాస్యానందం పత్రిక 200వ సంచిక మన ముందుకు వచ్చింది. ఆ మాట వింటుంటే సచిన్ టెండూల్కర్ వంద సెంచరీలు కొట్టినంత ఆనందంగా ఉంది... వీరేంద్ర సెహ్వాగ్ అరడజను డబుల్ సెంచరీలు కొట్టినట్లుగా ఖుషీగా ఉంది.

హాస్యానందం 200వ సంచిక... ఈ మాట వింటుంటే మన ఫేవరేట్ హీరో సినిమా 200 రోజులు ఆడినట్లుంది.

ఈ హాస్యానందం పత్రిక మనకు 200 సంచికలు రావడానికి ఒకే ఒక్క కారణం రాముగారు. ఆయన గురించి దేవుణ్ణి గట్టిగా అడిగేదేంటంటే అందరికీ వందేళ్ళు ఇచ్చారు. రాముగారికి మాత్రం 200 ఏళ్ళు జీవితకాలాన్నివ్వండి గురువుగారు! ఎందుకంటే ఈ హాస్యానందం ద్వారా మనందర్నీ నవ్విస్తున్నారు, చాలా కృషి చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తి 200 ఏళ్ళు బతికేస్తే ఇలాంటి పత్రికలు 200 సంచికలు కాదు, రెండువేల సంచికలు మనం చదువుకోవచ్చు... నవ్వుకోవచ్చు... ఇంకా ఎక్కువ కాలం బతకొచ్చు. నా ఈ కోరికని, అలాగే మనందరి కోరికని ఆ దేవుడు నెరవేర్చాలని గట్టిగా డిమాండ్ చేస్తూ... ఐ లవ్ యు రాముగారు.

**–మీ డైమండ్ రత్నబాబు.**



**ఏ** పత్రిక విజయానికైనా ప్రధానంగా చూస్తే... ఎడిటర్‌ని బట్టి ఎలివేషన్... రైటర్స్‌ని బట్టి రెప్యుటేషన్... సరుకుని బట్టి సర్క్యులేషన్ అనేవి వుంటాయి.

మరి మన హాస్యానందం విషయానికొస్తే దీని పాపులారిటీ వెనుక ఇంకొన్ని వెరైటీ విషయాలున్నాయి...

తెలుగుసాహితీవనవిహారి శ్రీరమణాచారిగారి ఆశీర్'వచనాలు'... హాస్యానందం ఫుల్‌పిల్లర్ బ్నిం, తనికెళ్ల భరణి, గుండు సుదర్శన్‌గార్ల వంటి హాస్యరస రత్నాలు ఈ హాస్యానందానికి 'కంద' దండలుగా ప్రత్యేకంగా ప్రస్తావించదగిన విషయం.

కొట్లో పుస్తకాలు, ఇంట్లో పుస్తకాలని 'నెట్లో' నెట్టేస్తున్న 'ఈ' యుగంలో పలు పత్రికలు తమ ఉనికిని చాటుకునేందుకు 'కుస్తీ' పడుతూ 'సుస్తీ' పాలవుతున్న సమయంలో హాస్యానందం తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవటం ఎడిటర్ రాముగారి నిబద్ధతకు నిదర్శనం.

200 సంచిక వెలువడే తరుణం హాస్యానందానికి ఓ 'న్యూ'తన సంవత్సరంగా భావిస్తున్నాను.

హాస్యప్రియులందరూ నెలనెలా తమ తనివితీరా ఈ హాస్యానందాన్ని తప్పక ఆస్వాదించు'కొనా'లని ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలు.

**–బి.యం.పి.సింగ్, విజయవాడ**



**మన** హాస్యానందం ఇప్పుడిలా ద్విశత సంచికను ఆవిష్కరించి, సంపూర్ణ తెలుగు హాస్యపత్రికా ప్రచురణ రంగంలో గణనీయమైన చరిత్రను సృష్టించిన సందర్భంగా శ్రీ రాముగారికి నా హృదయ పూర్వక అభినందనలు.

తెలుగుహాస్యానికి పెద్దపండగలాంటి ఈ సందర్భాన్నీ, ఈ 200వ ప్రత్యేకసంచికను మన తెలుగు చలనచిత్ర హాస్యనటీనటుల విశేష సంచికగా వెలువరించినందుకు శ్రీ రామూగారికి మరోమారు నా ప్రత్యేక అభినందనలు.

మన హాస్యానందం మరెన్నో వత్సరాల దిగ్విజయ జైత్రయాత్రను దిగ్విజయంగా కొనసాగించాలని దృఢంగానమ్ముతూ, శుభాకాంక్షలతో...

**–శంకు,** కార్టూనిస్టు, హాస్యప్రియ సంపాదకులు



**ప**త్రికా విశ్వపు మైదానంలో అజేయంగా... ద్విశతం(200) సాధించి, త్రిశతకం వైపు ఉత్సాహంగా నవ్వుతూ, నవ్విస్తూ అడుగులు వేస్తున్న హాస్యానందం పత్రికారత్నపు సుత్రాంతులైన ఎడిటర్ రాము గారికి, సహృదయులైన హాస్యానందం పాఠకులకు, సుమనస్కులైన హాస్యానందం రచయితలకు, సుపథాన్ని చూపే హాస్యానందం కార్టూనిస్టులకు హాస్యరససుమాంజలి.

మంచి పని చేయడానికి సంకల్పం అవశ్యకం. ఐతే సంకల్పం ఒక్కటీ సరిపోదు. నలుగురూ కలవాలి... అవసరం ఐతే నలభై మందిని కలుపుకు పోవాలి. నొప్పించకూడదు... ఒప్పించాలి. మంచి సంకల్పం, శ్రమించే తత్వం, ఒప్పించే గుణం, కలుపుకుపోయే లక్షణం ఉంటే... ఏం జరుగుతుందో హాస్యానందం 200వ సంచిక దాకా రావడం నిరూపించింది.

పత్రికల సంవాహములోకి హాస్యానందం వామనుడిలా వచ్చి, బాధలను అధోలోకానికి తొక్కి సంతోషాన్ని పంచే త్రివిక్రమమయ్యింది.

హాస్యాన్ని అందరూ ఇష్టపడతారు. అదేం మాయరోగమో కానీ హాస్య నటులను, హాస్య రచయితలను, హాస్యగీతాలను... అగ్రతాంబూలపు స్థాయిలో పెట్టకుండా అటు అధమంలోకి నెట్టకుండా చాలా తెలివిగా త్రిశంకుస్వర్గంలా మధ్యలోకి నెడతారు. హాస్యానందం దానికి చరమగీతం పాడడానికి తోడ్పడింది.


ఐతే హాస్యపు రచన,కార్టూన్‌లో వ్యవహారాన్ని సీరియస్ గా చెప్పలేము. గంగా–యమునా నదుల్లా బయటికి హాస్యం–మనోల్లాసం కనిపిస్తాయి, కానీ అంతర్వాహిని ఐన సరస్వతిలా 'చైతన్యం' ప్రవహిస్తూ ఉంటుంది. అందుకే హాస్యానందం 200 వ సంచికలో కూడా మొదటి సంచికలో కనిపించిన ఉత్సాహం, 200 సంచికలలోని అనుభవం కనిపిస్తాయి.

ముందు ముందు మరిన్ని శతకాలై , సహస్రాలై వర్ధిల్లాలని... సర్వదా హాస్యానందం హిమోన్నతిని అభిలాషిస్తూ... హాస్యాభివందనాలతో...

**–కంద్లకుంట శరత్ చంద్ర,** కథ–నవలా రచయిత.

కత్తి మీద సాములాంటి పత్రిక రంగాన్ని...
అందునా కష్టమైన హాస్య రసాన్ని భుజాన ఎత్తుకుని,
పట్టుదల, చాకచక్యం, అకుంఠిత దీక్ష, ఒకింత మొండితనం
ఆయుధాలుగా నిరంతరంగా కృషి చేస్తూ 200 వ సంచిక
తీసుకురావటం ఆషామాషి కాదు!
కరోనా కాలంలో ప్రపంచం స్థంభించిన వేళ కూడా
పత్రిక ఆగలేదంటే ఆయన సమయపాలన నిబద్ధత మనకి
కనబడుతోంది.
దేశంలో నలు చెరుగుల ఉన్న కార్టూనిస్టులకు పెద్ద పీట
వేసింది మన హాస్యానందం అనడంలో అతిశయోక్తి లేదు.
200వ సంచిక విడుదల సందర్భంగా మా రాముగారికి
భగవంతుడు ఆయురారోగ్య, ఐశ్వర్యాలను ఇచ్చి...
ఈ పత్రిక నిరంతరం నడిపిస్తూ మా అందరికీ హాస్యపు
జల్లులు సదా కురిపిస్తూ ఉండాలని కోరుకుంటూ...

-కె.వి.వి.సత్యనారాయణ
సాంబమూర్తి ఎంటర్‌ప్రైజెస్, విజయవాడ



# ముళ్లపూడి సింగిల్ పేజీ హాస్యకథల పోటీ

ప్రఖ్యాత రచయిత ముళ్లపూడి వెంకటరమణగారి పుట్టిన్రోజు జూన్,28 సందర్భంగా సింగిల్ పేజీ హాస్య కథల పోటీ హాస్యానందం నిర్వహిస్తోంది. శ్రీ ఏ.వి.కృష్ణమూర్తి, సికింద్రాబాదు గారు సమర్పిస్తున్న ఈ పోటీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం!

## పది కథలకు వెయ్యి రూపాయలు చొప్పున పది బహుమతులు

✦ మీ కథలు రాత ప్రతిలో రెండు పేజీలకు మించకూడదు ✦ తెలుగుతనం ఉట్టిపడేలా కథలు ఉండాలి ✦ కొసమెరుపుకి ప్రాధాన్యం!

కథలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ ఏప్రిల్ 20,2021.

కథలు ఈ మెయిల్‌కి పంపండి- hasyanandampoteelu@gmail.com



# హాస్య నట కులం చాలా పెద్దదే!



తెలుగు సినిమా ప్రారంభమైనప్పటినుండి ఎన్నో వందల చిత్రాలు రూపొందాయి. అన్ని చిత్రాలలోనూ హాస్యం రాజ్యమేలింది. కొన్ని చిత్రాలైతే కేవలం హాస్యం కోసమే రూపొందించినవి ఉన్నాయి. ఆయా చిత్రాల్లో అనేకమంది హాస్యనటులు తెలుగు తెరపై నవ్వులు కురిపించారు.'కందం రాసిన వాడు కవి, హాస్యం చేసిన వాడే నిజమైన నటుడు' అన్న మాట ప్రకారం... మన హాస్య నటీనటుల గురించి ఒక సంచిక వేద్దాము అని హాస్యానందం ఎడిటర్ రాము గారు అడిగినప్పుడు అసలు హాస్యనటులు ఎంతమంది ఉన్నారు అని ప్రశ్నించుకుని... సమాధానం కోసం చూడగా దాదాపు 150పైచిలుక హాస్యనటులు తెలుగు తెరపై హాస్యం పండించినట్లుగా తేలింది. అయితే స్థలాభావం దృష్ట్యా ఈ సంచికలో దాదాపు 70 మంది ముఖ్యమైనవారిని పరిచయం చేయడం జరిగింది.

వీరే కాక ఇంకా అనేకమంది తెలుగు చిత్రాలలో అద్భుతమైన హాస్య పాత్రలు పోషించి శభాష్ అనిపించుకున్న వారెందరెందరో మహానుభావులు ఉన్నారు. వారందరి గురించి ఈ చిన్న వ్యాసంలో టూకీగా చెప్పే ప్రయత్నం చేస్తాను.

తొలి హాస్య నటులుగా ఘండికోట జోగినాధాన్ని చెబుతున్నారు సినీపెద్దలు. అలాగే తొలి హాస్యనటుడైన కథానాయకుడి పాత్రలో లంకాసత్యం 'బారిస్టర్ పార్వతీశం' అనే చిత్రంలో నటించారు. ఆ తరువాత జోగారావు, బొడ్డపాటి కృష్ణారావు, శివరామకృష్ణయ్య, లడ్డూ రామచంద్రరావు, లంకా సత్యం, మోదుకూరి సత్యం, కోళ్ళ సత్యం, సురలీ రాజన్, చంద్రబాబు, ద్రాక్షారామంసరోజ, ఈవీ సరోజ, సాక్షి రంగారావు, పొట్టి ప్రసాద్, కెకె శర్మ, కె.వి.చలం, థమ్, లక్ష్మీపతి, ఐరన్ లెగ్ శాస్త్రి, కళ్ళు చిదంబరం, కంచి నరసింహం, కాకరాల, డా.శివప్రసాద్, పి.ఎల్ నారాయణ, జూనియర్ భానుమతి, మమత, రాధాకుమారి, మనోరమ, వేళంగి, రావుగోపాలరావు, లింగమూర్తి, రావురమేష్, కృష్ణుడు, శివాజీరాజా, యాదాకృష్ణ, సంపూర్ణేష్‌బాబు, పొట్టి వీరయ్య, శ్రీనివాసరెడ్డి, గౌతంరాజు, చిట్టిబాబు, అనంత్. మిఠాయి చిట్టి, అశోక్‌కుమార్, చిన్నా, చిత్రంశ్రీను, దువ్వాసి మోహన్, హర్షవర్ధన్, జూనియర్ రేలంగి, నర్సింగ్ యాదవ్, మిశ్రో, రఘు కారుమంచి, రాజేష్‌బాబు, సుమన్‌శెట్టి, గీతాసింగ్, హేమ, జయలలిత, జయశీల, కృష్ణవేణి, రజిత, విద్యుల్లేఖ రామన్, కె. విజయ, పావలా శ్యామల, ప్రసన్నరాణి, చంద్రిక, అపూర్వ, ఎస్విఆర్, నాగభూషణం, జి.వరలక్ష్మి, ఏఎన్ఆర్, లక్ష్మీకాంతం, ఎన్‌టిఆర్, గుమ్మడి, రాజనాల, కమలహాసన్, వెంకటేష్, శ్రీదేవి, అంజలీదేవి, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, దాసరి నారాయణరావు, బాల, జీవా, బబ్లూ, శుభలేఖ సుధాకర్, పోసాని కృష్ణ మురళి, ధన్‌రాజ్, ఎమ్.ఎన్.రాజం, వడ్లమాని విశ్వనాథం, ఆహుతి ప్రసాద్, ఉత్తేజ్, సుహాసిని, సుభాషిణి, పృథ్వీ, కళ్లు చిదంబరం, సూర్యకళ, బండజ్యోతి, చిలక రాధ, డా॥రమేష్ లాంటి ఎందరెందరో మహానుభావులు ఉన్నారు.

వీరందరూ ఆయా పాత్రాల్లో అద్భుతమైన టైమింగ్‌తో కామెడీని పండించినవారే. వారందరికీ శత సహస్ర వందనాలు అర్పిస్తూ ... మా ఈ ప్రయత్నాన్ని ఆదరించి, ఈ ప్రత్యేక సంచికని ఆదరిస్తారని ఆశిస్తూ...



**-సరయూ శేఖర్**
**9676247000**

# 'హాస్యమే పునాది'

**-వాణిశ్రీ**

**'కం**దం రాసిన వాడే కవి అన్నట్లుగా హాస్యాన్ని పండించినవాడే నిజమైన నటుడని చెప్పాలి. మన తెలుగు చిత్ర పరిశ్రమలో ఎంద రెందరో నటులు ఎన్నో రకాల పాత్రలు ధరించి నవరసాలను పోషిం చారు. అందులో హాస్యం కన్నా గొప్పదైనది మరేదీ లేదు.

ఎంత ప్రేమ కథ ఉన్నా హాస్యం లేకపోతే ఆ చిత్రం ఉప్పు లేని వంటకంలా తయారౌతుంది. అందుకే హాస్యానికి పెద్ద పీట వేసారు మన దర్శక నిర్మాతలు. హాస్యం అపహాస్యం కాకుండా, చూసేవారికి ఆనందాన్నిస్తూ గిలిగింతలు పెడితే చాలు అది పండినట్లే! చాలామంది నటులు అద్భుతమైన పాత్రలు చేయగలరు కాని హాస్యాన్ని మాత్రం పండించలేరు. అందుకే నేనంటాను హాస్యాన్ని పండించినవారే నిజమైన నటి, నటుడు అని.



నేను పరిశ్రమకు వచ్చిన తొలి రోజుల్లో హాస్యపాత్రలే వేసాను. అనేకమంది హాస్యనటుల సరసన ఆయా పాత్రలు నాకు గుర్తింపు తీసుకువచ్చాయి. మొదట చిన్న చిన్న పాత్రల్లో నటిస్తున్న నాకు హాస్య పాత్రలు రావడానికి ప్రధాన కారణం బి.విఠలాచార్య.

ఆయన మంగమ్మ శపథం చిత్రాన్ని రూపొందిస్తున్న రోజులవి. ఆ చిత్రంలో చంచల పాత్ర ఒకటి ఉంది. జమునకు చెలికత్తెగా నటించాలి. ఆయన ఎందరినో పరిశీలిం చారు. చివరికి నన్ను ఎంపిక చేసుకున్నారు.

'అదేంటి సార్ నేను కథానాయిక వేషాలు వేస్తున్నాను' అని చెప్పి ఆయనకు చెప్పాను. అందుకు ఆయన 'అమ్మా! నేను ఎంతోమందిని ఈ పాత్ర కోసం పరిశీలించాను. ఈ పాత్రకు న్యాయం చేయటానికి నువ్వు తప్ప మరెవ్వరూ నాకు కనిపించటం లేదు' అని, ఆ పాత్రలో



నన్ను నటింపజేసారు. డైలా గులు చాలా తక్కువగా ఉంటా యి. బాడీలాంగ్వేజ్, ఎక్స్ ప్రెషన్ మీదే ఆ పాత్ర నడు స్తుంది. దర్శకులు బి.విఠలా చార్య ఆ పాత్రను అద్భుతంగా తీర్చిదిద్దారు. అందుకే ఆ పాత్ర నాకు ఎంతో పేరు తెచ్చి పెట్టింది.

ఆ చిత్రంలో నటించడం, నాకు మంచి పేరు రావడంతో వాణిశ్రీ అద్భుతమైన కామెడీ చేయగలదన్న నమ్మకం ఏర్పడింది పరిశ్రమలో. ఆ తర్వాత కథానాయికగా నిలదొక్కు కున్న తర్వాత హీరోలతో కలిసి చిన్న చిన్న కామెడీలు చేయడానికి అదే పునాదిగా నేను భావిస్తాను.

ఏది ఏమైనా హాస్యానందం పత్రిక 200వ సంచికను హాస్య నటీనటుల స్పెషల్‌గా తీసుకురావడం ఎడిటర్ రాముగారి ముందుచూపుకు నిదర్శ నంగా నేను భావిస్తాను. ఆయనకు అభినందనలు.

హాస్యనటులు తెరపై ఎన్నో నవ్వులు కురిపించినా వారి జీవితాలు చివరి రోజుల్లో విషాదంగా ముగియడం చాలా మందిని నేను ఎరుగు దును. అందుకే హాస్యనటులు తమకు వచ్చిన కొన్ని సినిమాలకు పనిచేసిన పారితోషికాన్ని జాగ్రత్త చేసుకోవాలని తద్వారా భవిష్యత్తు అంధకారం కాకుండా ముందు ప్లాన్ వేసుకోవాలని నేను కోరుకుంటు న్నాను.

హాస్యానందం పత్రికకు నా హాస్యాభినందనలు!




హాస్యానందం ఇంకా పది కాలాలపాటు
హాస్యపు జల్లులతో... ఆనందపు హరివిల్లులతో...
అలరించాలని ఆకాంక్షిస్తూ...

-డాక్టర్ రమేష్ & డాక్టర్ ఇందిరా జోస్తి
New Albany, Ohio, USA

# హాస్యానికే రారాజు...
# చార్లీచాప్లిన్



**హా**స్యం వేరు. కరుణం వేరు. హాస్యాన్ని, కరుణరసాన్ని మేళవించి ప్రేక్షకులకు నవ్వులు కురిపించిన గొప్ప నటుడు చార్లీచాప్లిన్.

మూకీల కాలంలో తన చిత్రాలను దృశ్య మాధ్యపు అద్భుతంగా తీర్చిదిద్ది, గొప్ప కళాకారుడు చార్లీచాప్లిన్. నవీనయుగంలో మనం ఉపయోగిస్తున్న ఎస్కలేటర్లను ఆ కాలంలోనే దాదాపు వంద సంవత్సరాల క్రితమే చూపించి దానిపై కూడా హాస్యాన్ని రంగరించి ప్రేక్షకులను నవ్వించిన గొప్ప క్రాంతదర్శి చార్లీచాప్లిన్.

సకల కళావల్లభుడు, బహురూపి, రచయిత, గాయకుడు.

ముఖ్యంగా యుద్ధాన్ని నిరసించిన శాంతికాముకుడు ఆయన. ప్రపంచానికే నవ్వులరాజు. అందానికి ఆరాధకుడు.

ఆయన ఒక ప్రపంచ అద్భుతం!

ఇంగ్లండ్‌లో 1889 ఏప్రిల్ 16న జన్మించిన ఆయన బాల్యం చాలా దుర్భరంగా గడిచింది. తల్లి, తండ్రీ దూరమై పొట్ట పోసుకోవడానికి అనేక చిన్న చిన్న పనులు చేయాల్సి వచ్చింది. మూడేళ్ళకే స్టేజిపై ఎక్కి మిమిక్రీ చేసాడు పొట్ట నింపుకోవడం కోసం. ఆ విధంగా స్టేజిలపై నటిస్తూ ఎదిగాడు.

అదే పరంపరలో అనేక కామెడీషోలు చేసాడు. అనేక మూకీ చిత్రాలను రూపొందించాడు. అనేక సంస్థలు తమకు సినిమాలు తీసిపెట్టమని ఆయనను సంప్రదించాయి. నిర్మాతలందరూ ఎంత డబ్బు కావాలంటే అంత ఇస్తామంటూ వరసలో నిలబడ్డారు. అంత డిమాండ్ అతనికి వచ్చింది. అప్పట్లోనే దాదాపు 10 లక్షల డాలర్ల పారితోషికాన్ని ఆయన తీసుకోవడం విశేషం.... ఓ రికార్డు!

జులాయి అవతారం, హిట్లర్ మీసం, టైట్ కోటు, వదులు పేంటు, పెద్ద బూట్లు, వంకీ కర్ర, టోపీ ఇవి చార్లీచాప్లిన్ ఆహార్యమంటే అనే ముద్రను వేసుకున్నాయి.

హాస్యాన్ని చెబుతూనే ప్రకృతి రక్షణ, కరుణ, జాలి యాంత్రిక జీవనం ఎలా ఉన్నది? అనే విషయాలను ఆయన వివరించాడు.

ది కిడ్, సిటీలైట్స్, గ్రేట్ డిక్టేటర్, గోల్డ్‌రష్, మెష్యూర్ వెర్డూ, లైమ్‌లైట్ లాంటి చిత్రాలను రూపొందించాడు.

ప్రపంచంలో అన్ని భాషల వారు మెచ్చిన హాస్యనటుడు చార్లీచాప్లిన్.

నటుడే కాదు స్క్రీన్‌ప్లే రైటర్, స్క్రిప్ట్‌రైటర్, కంపోజర్ కూడా. తొలిచిత్రం 1914 లో వచ్చినా 'మేకింగ్ ఏ లివింగ్'కు గుర్తింపు రాలేదు. కిడ్, ఆటో రేసెస్, ఎట్ వెనిస్, లిటిల్ ట్రాంప్ తదితర చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపును తెచ్చాయి.

'కాట్ ఇన్ ది రెయిన్' చిత్రం నుంచి దర్శకత్వం చేయడం మొదలుపెట్టాడు.

ది ట్రాంప్ అనేది ఆయనకు ట్రేడ్‌మర్క్ వేషధారణగా నిలిచిపోయింది. సైలెంట్ చిత్రాల ద్వారా ప్రపంచ ప్రేక్షకులందర్నీ అలరించిన చాప్లిన్ తన సినిమాల్లో శబ్దాన్ని ఉపయోగించాడానికి ఇష్టపడేవాడు కాదట.

ది గ్రేట్ డిక్టేటర్‌లో చివరలో ఉన్న ఒక ఉపన్యాసం ఇచ్చి తన నియమాన్ని భంగం చేసాడు.

1975లో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు 'సర్' అనే బిరుదునిచ్చింది.

కమ్యూనిస్టు అన్న ఆరోపణతో అమెరికా ప్రభుత్వం ఆయనకు ఇవ్వవలసిన గౌరవాన్ని ఇవ్వలేదు.

ఆస్కార్ వేడుకలలో ఆయనకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇచ్చినప్పుడు అందరూ స్టాండింగ్ ఓవేషన్ ఇవ్వడం ఆయన జీవితంలో మరపురాని విషయమని చెబుతారు చార్లీచాప్లిన్.

మేర్లిన్ బ్రాండో, సోఫియా లారెన్స్ హీరో హీరోయిన్లుగా ఆయన రూపొందించిన 'ఏ కౌంటెస్ ఫ్రం హాంకాంగ్' అనే చిత్రంలో చివరిసారిగా చార్లీచాప్లిన్ నటించారు.

1977, డిసెంబర్ 25న ఆయన మనకు దూరమయ్యారు.

చార్లీచాప్లిన్ ప్రపంచ హాస్యానికి రారాజు అనే మాట ఎవరూ కాదనలేని సత్యం!

# తొలిస్టార్ కమెడియన్-
# కస్తూరి శివరావు

తెలుగు చిత్రాలలో హాస్యరసానికి ఆద్యుడు కస్తూరి శివరావు.

తొలినాళ్ళలో ఆయన పండించిన హాస్యం ప్రేక్షకులను అలరించింది.

అప్పట్లో ఎవరి పాటలు వారే పాడుకునేవారు.ఆ క్రమంలో కస్తూరి శివరావు పాటలు ప్రేక్షకులను ముగ్ధులను చేసేవి. శ్రీలక్ష్మమ్మ కథలో 'రాకరాక, రావే రమణి ముద్దులగుమ్మ' లాంటి పాటల్లో ఆయన చమక్కులు విసిరేవారు. అలాగే రక్షరేఖ చిత్రంలో 'సన్యాసి సుఖీ చలోరే ఠింగణా' లాంటి పాటలు కూడా పాడటం ఆయనకే చెల్లింది. పరమానందయ్య శిష్యులులో ఓ మామా అన్న పాటలో కూడా ఆయన గాత్ర వైశిష్ట్యాన్ని గమనించవచ్చు.

కాకినాడ ప్రాంతం నుంచి వచ్చిన ఈ హాస్యనటుడు తొలినాళ్ళలో మూకీచిత్రాలకు వ్యాఖ్యాతగా పనిచేసేవారు. ఆయన వ్యాఖ్యానం చేస్తున్నారు అంటే ప్రజలు ఆ మూకీ చిత్రాలను చూడటానికి విరగబడేవారు.

అప్పట్లోనే ఊతపదాలకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చారు. 'గిడిగిడి' లాంటి మాటలను నిశ్శబ్ద చిత్రాలకు ఆయన అనునయిస్తూ చెప్పే వ్యాఖ్యానం ప్రేక్షకులను గిలిగింతలు పెట్టింది.

చలన చిత్రాలకు, మూకీ చిత్రాలకు ఆయన వ్యాఖ్యానం చేస్తూనే మరోవైపు నాటకాలలో నటించేవారు. చింతామణి, వరవిక్రయం లాంటి తొలినాళ్ళ చిత్రాల్లో కూడా ఆయన పాత్రలు ధరించాడని అంటారు. తన పాటకు ప్రాధాన్యం ఇచ్చుకున్న ఈ నటగాయకుడు తొలినాళ్ళలో కలకత్తాకు వెళ్లి చింతామణి అనే చిత్రంలో ఓ పాత్రలో నటించారు. ఆ తరువాత ఆయన పద్యాలు, పాటలే ఆయనను చిత్రరంగం వైపు ప్రయాణించేలా చేసాయి. ముఖ్యంగా ఆయన నటన, రూపం చూస్తేనే ప్రేక్షకులకు నవ్వు వచ్చేది.

1941లో వచ్చిన చూడామణి చిత్రంలో మంగలి శాస్త్రి పాత్ర ద్వారా ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలాగే స్వర్గసీమలో నటించిన పాత్ర కూడా ఆయనకు మంచి పేరు తెచ్చింది. దాంతో స్టార్‌డమ్ వచ్చింది.

బాలరాజు కథలో అక్కినేని నాగేశ్వరరావు చెలికాడిగా ఆయన నటన అమోఘంగా సాగింది. గ్రామఫోన్ కంపెనీలు కూడా ఆయనచేత హాస్యగీతాలు పాడించి విడుదల చేసేవి. జానపద గీతాలు కూడా అద్భుతంగా పాడేవారాయన.

అలా అనేక చిత్రాల్లో నటించి స్టార్ కమెడియన్‌గా ఎదిగారు.

అత్యంత ప్రేక్షకాదరణ పొందిన హాస్యనటులుగా ఆయనకున్న పేరు అమోఘమైనది.

ఏదైనా వేడుకలో హీరోలతో పాటు కస్తూరి శివరావు వుంటే హీరోలకన్నా ముందు కస్తూరి శివరావుని చూడడానికే ప్రజలు ఎగబడేవారు ఆ కాలంలో. గుణసుందరి కథ చిత్రంలో ఆయనే హీరో. ఆ చిత్రంలో ఆయన చేసిన డ్యాన్స్‌లు, ఊతపదాలు పలికిన విధానం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసాయి.

1950లో పరమానందయ్య శిష్యులు అనే చిత్రాన్ని ఏఎన్ఆర్, గిరిజ జంటగా తన దర్శకత్వంలోనే రూపొందించారాయన. కాని ఆ చిత్రం సరియైన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో ఓడలు బండ్లయ్యాయి.



విలాసవంతమైన కార్లలో తిరిగి, చివరికి ఆయన మొదట తిరిగినటువంటి సైకిల్ పైనే తిరగసాగారు.

రేలంగి హవా పెరగడంతో అవకాశాలూ తగ్గాయి. చివరికి నాటకాలు వేస్తూ చివరి రోజులు గడపవలసి వచ్చింది.

లైలామజ్ను, మొదటిరాత్రి, శ్రీలక్ష్మమ్మ కథ, స్వప్న సుందరి, అప్పు చేసి పప్పుకూడు లాంటి అనేక చిత్రాల్లో ఆయన అద్భుతంగా నటించారు.

ఓ నాటకాన్ని ప్రదర్శించడానికి తెనాలి వెళ్లిన ఆయన నాటకం పూర్తయ్యాక తిరిగి మద్రాసు వెళ్లడానికి తెనాలి రైల్వేస్టేషన్‌కి వచ్చి నిద్రపోయారు. ఆ నిద్రలోనే ఆయన చివరి శ్వాస విడిచారు. 1966 ఫిబ్రవరి 24న మనకు దూరమైన ఆయన ఎప్పటికీ తన హాస్య నటన ద్వారా చిరంజీవిగానే ఉంటారు.



# ఆయన మాటే తేనెలతేట...
# 'వ్యంగ్యల' వంగర!

**మా**యాబజార్ చిత్రంలో శాస్త్రి,శర్మలుగా వంగర వెంకటసుబ్బయ్య, అల్లురామ లింగయ్య నటించారు. ఆ సన్నివేశాలు మనకి గుర్తుండే ఉంటాయి. వంటగదిలోకి వచ్చిన శాస్త్రి శర్మలు ఆహార పదార్థాలు లేకపోవడంతో హతాశులౌతారు. ఇద్దరూ వెళ్లి శకునికి ఫిర్యాదు చేస్తారు. తిరిగి వచ్చి చూస్తే మళ్ళీ యథాస్థానంలో అన్ని తినుబండారాలు ఆయా పాత్రల్లో కనిపిస్తాయి.

ఈ సన్నివేశాలలో అద్భుతమైన కామెడీని పండించారు దర్శకుడు కె.వి.రెడ్డి. రచయితల ఆలోచనలకు తగిన విధంగా వంగర వెంకటసుబ్బయ్య ఈ పాత్రలో జీవించారు. తానా అంటే తందనా శాస్త్రులుగా ఈ చిత్రంలో వారి నటన హైలెట్‌గా నిలిచింది.

1897 నవంబరు 24న తెనాలి దగ్గర వున్న సంగం జాగర్లమూడిలో జన్మించారు వెంకట సుబ్బయ్య. చిన్నప్పటినుండే నాటకరంగంపై మక్కువ పెంచుకున్నారు. రామ విలాస నాటక కంపెనీలో అనేక నాటకాలను ప్రదర్శించేవారు. అలా ఆయన వాచకము, టైమింగ్, నటన చూసి అందరూ ఆయనను సినిమా పరిశ్రమకు వెళ్ళమని చెప్పడంతో తొలిసారిగా 'బాలయోగిని'లో వేషం వేసారు.

విప్రనారాయణలో రంగదాసుగా నటించాక సరియైన అవకాశాలు రాకపోవడంతో, తిరిగి మళ్ళీ నాటక రంగానికే వచ్చారు. వేదం చదువుకున్న ఆయన స్పష్టమైన వాచకం, గాత్రంతో అలరించేవారు. వేదాన్ని వెనకనించి కూడా చదవగల దిట్ట.

గూడవల్లి రామబ్రహ్మం నిర్మించిన 'మాలపిల్ల' చిత్రంతో రీఎంట్రీ ఇచ్చారు. ఆయన సెట్‌లో వున్నారూ అంటే అందర్నీ నవ్విస్తూ వ్యంగ్యాస్త్రాలు విసురుతూ ఉండేవారు. అందుకే ఆయనకు తెలిసిన వాళ్ళందరూ– వ్యంగ్యంగా నవ్విస్తారు కనుక 'వ్యంగ్యర' అనేవారు.

మాయాబజార్‌లో ఆయన నటనను చూసిన కె.వి. రెడ్డి ఆ తరువాత పెద్దమనుషులు చిత్రంలో ఆయనకు ప్రధాన భూమికను ఇవ్వడం విశేషం.

'ఓరి వెర్రి నాతండ్రి' అంటూ ప్రతి వారినీ సంబోధించేవారట. కన్యాశుల్కం, లక్ష్మమ్మ, ప్రియురాలు, లక్ష్మి, చక్రపాణి, పల్నాటియుద్ధం, తెనాలి రామకృష్ణ, శ్రీకృష్ణ తులాభారం, గీతాంజలి, మంత్రదండం, పేరంటాలు, శాంతి, సక్కుబాయి, పరమానందశిష్యులకథ, బభ్రువాహన, నర్తనశాల, తిరుపతమ్మ కథ, భీష్మ, మహాకవి కాళిదాసు, శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం, చెంచులక్ష్మి, మాంగల్యబలం, పాండురంగ మహాత్మ్యం, ఏది నిజం, ధర్మ దేవత, మల్లీశ్వరి, మనదేశం, రక్షరేఖ, మాలపిల్ల తదితర చిత్రాల్లో ఆయన నటించి తెలుగు ప్రేక్షకులకు నిజమైన హాస్యాన్ని అందించారు.



'ఏమండీ వంగరగారూ కులాసానా?' అని ఎవరైనా ప్రశ్నిస్తే 'అంతా లాసే కు లేదు.' అని చమత్కరించటం ఆయనకే చెల్లింది.

శ్రీకృష్ణపాండవీయం చిత్రంలో రుక్మిణీదేవి పంపగా శ్రీకృష్ణుడి దగ్గరికి రాయబారం తీసుకువెళ్లిన అగ్నిద్యోత నుడుగా నటించారు. ఆ చిత్రంలో ఆయనపై పాటలు, పద్యాలు చిత్రీకరించటం విశేషం. భక్తతుకారాం చిత్రంలో చివరిసారిగా నటించిన ఆయన వంద పైచిలుకు చిత్రాల్లో నటించారు. 1975లో పక్షవాతంతో తెలుగు ప్రేక్షకులకు దూర మయ్యారు. ఆయన ముద్ర మరెవరికి సాధ్యంకానిది.

# వెండితెరపై తొలి కృష్ణుడు-
# సి.ఎస్.ఆర్.

**ఎన్.** టి.ఆర్. నటించిన జగదేకవీరుని కథలో రాజనాల వద్ద మంత్రిగా సి.ఎస్.ఆర్. చిలికించిన హాస్యం గొప్పగా పండింది.

'హే రాజన్ హే శృంగార వీరన్' అంటూ రాజనాలను పొగుడుతూ ఆయన చూపించిన ప్రతి కదలికలో కూడా హాస్యం తొణికిసలాడింది. అలాగే మాయాబజార్‌లో శకుని మామగా చివర్లో సత్యపీఠమెక్కి, తన పన్నాగమంతా చెప్పి, తరువాత 'ఏమైతే ఏం మాకు జరగవలసిన శాస్తి జరిగింది' అంటూ చెప్పిన డైలాగ్‌లో ఆయన చెప్పిన విషయాన్నంతా దాని భావాన్నంతా ఒక్క డైలాగ్‌లోనే చెప్పడం గమనించదగింది.

ఎలాంటి భావాన్నైనా ఒక్క క్షణంలో ఒక్క మాటతోనే పలికించగల దిట్ట సి.ఎస్.ఆర్. ఆంజనేయులు.

మన తెలుగు చలనచిత్ర ప్రస్థానం ప్రారంభమైన దశలో తొలిగా కృష్ణుడు వేషాన్ని వేసిన నటులు సి.ఎస్.ఆర్. టాకీలు రాకముందే మూకీలలో ఆయనే కృష్ణుడు. కృష్ణుడు అంటే సి.ఎస్.ఆరే!

1907 జూలై 11న గుంటూరు జిల్లా నరసరావుపేటలో జన్మించారు సి.ఎస్.ఆర్. ఎస్.ఎల్.సీ వరకు చదువుకున్నారు. అందుకు తగ్గ ఉద్యోగం వచ్చినా చిన్నప్పటినుండే నాటకాల మీద అమితమైన పిచ్చి ఉన్న కారణంగా నాటకరంగాన్నే ఆయన ఉపాధిగా ఎంచుకున్నారు.

రంగస్థలంపై కృష్ణుడిగా, శివుడిగా, రాముడిగా, భవానీశంకరుడుగా, సారంగ ధారుడిగా, సత్యవంతుడిగా, విజయరామరాజు, రామదాసులాంటి అన్ని పాత్రల్లో ఆయన ఇమిడిపోయేవారు.

రంగస్థలంపై ఆయన నటిస్తుంటే చూసేవాళ్ళకి వేయికన్నులు చాలేవి కాదట. భక్తరామదాసులో భక్తునిగా, ద్రౌపదీ వస్త్రాపహరణంలో కృష్ణునిగా, 1939లో వచ్చిన శ్రీవెంకటేశ్వర మహాత్యంలో శ్రీనివాసునిగా అద్భుతమైన నటనతో ఆ కాలంలో పేరు గడించారు. 'గృహప్రవేశం' చిత్రంలో ఆయన నటించిన కామెడీ విలన్ పాత్ర, ఆ తర్వాత ఎంతోమంది కామెడీ విలన్స్‌కు ఓ ఆణిముత్యంలా నిలిచింది.

ఆ సినిమాలో రమణారావుగా సి.ఎస్.ఆర్. పండించిన వైవిధ్యమైన శైలి ఆ తర్వాత తరాలకు ఓ మార్గదర్శకమయింది.

'మై డియర్ తులసమ్మక్కా లక్కీ ఛాన్స్ కొట్టేసా' అనే పాటలో ఆయన చూపిన హావభావాలు, ఆ తర్వాత ఎంతమంది చేసినా ఆ స్టైల్ మాత్రం ఆయనదే అన్నట్లు మిగిలిపోయింది.

హాస్యంతో కూడిన విలనిజం అంటే తొలుతగా గుర్తొచ్చేది సి.ఎస్.ఆర్. జీవితం చిత్రంలో ఆయన నోట పలికించిన 'ఆ కాలంలో నేను చదువుకునే రోజుల్లో' అనే డైలాగ్ అప్పట్లో అందరి నోట్లో నానుతుండేది.

మధ్యవయస్కులనుండి వృద్ధుల వరకు ఎవరిని కదిపినా 'ఆ కాలంలో నేను కాలేజీ చదువుకునే రోజుల్లో' అంటుండేవారట.

అప్పు చేసి పప్పుకూడు అనే చిత్రంలో అప్పు అనే పదానికి కొత్త అర్థాన్ని నిర్వచించి మరీ నవ్వించారు. వెయ్యి రూపాయలు కావాలంటే పదిమంది దగ్గర పది వందలు తీసుకునే కంటే ఒక్కరి దగ్గర తీసుకో. వడ్డీ చెల్లిస్తే సరి అసలు చెల్లించినప్పుడు మాట కదా అంటూ తత్వంగా చెప్పేవారు హాస్యంగా.



కన్యాశుల్కంలో రామప్ప పంతులుగా, ఇల్లరికంలో మేనేజర్‌గా, జయం మనదేలో మతిమరుపు రాజుగా, దేవదాసులో సావిత్రి భర్తగా, కన్యాదానంలో పెళ్లిళ్ళ పేరయ్యగా, పాతాళభైరవిలో రాజుగా ఇలా ఎన్నో పాత్రలకు ఆయన ప్రాణప్రతిష్ఠ చేసారు.

తన జీవితకాలమంతా కళాసేవకే అంకితమైన ఆయన 1963 అక్టోబరు 8న చెన్నైలో కన్నుమూసారు.

భౌతికంగా ఆయన లేకపోయినా బభ్రువాహన, కన్యాశుల్కం, అప్పు చేసి పప్పుకూడు, పెళ్లిసందడి, జగదేకవీరుని కథ, పాతాళభైరవి, ఎత్తుకు పైఎత్తు, జయం మనదే, దేవదాసు లాంటి చిత్రాలతో మన కళ్ళముందే కదలాడుతుంటారాయన.

# హాస్యానికే రూపం- రేలంగి

**అ**తి పోకడల హాస్యం, అపహాస్యమై నిజమైన హాస్యంగా చలామణి అవుతున్న ఈ రోజుల్లో కల్తీ లేని హాస్యాన్ని మనకందించిన విశిష్ట తెలుగు హాస్యనటుడు రేలంగి.

తెలుగు ప్రేక్షకులకు హాస్య నిధిని అందించిన రేలంగికి నవ్వుల ఋణం ఎప్పుడూ తీర్చుకోలేం మనం. తెలుగు హాస్యనటులలో తొలిసారిగా పద్మశ్రీ అవార్డు పొందిన నటుడు రేలంగి.

రావులపాలెంలో జన్మించిన రేలంగి వెంకట్రామయ్య, ప్లేబాక్ సింగర్‌గా ఎన్నో పాటలను పాడారు. చిన్నతనంలోనే నేర్చుకున్న పద్యాలు, రాగాలు ఆలపించేవారు. కాకినాడలో శ్రీ గండికోట జోగినాథంగారి శిష్యరికంలో నటనతోపాటు సాధించుకున్న సంగీత జ్ఞానం, యంగ్‌మెన్ హేపీ క్లబ్బులో వేసిన నాటకాల ద్వారా వంటబట్టిన నటన రేలంగిది. రెండున్నర దశాబ్దాల పాటు తెలుగు సినిమాకు దరహాసం, ప్రేక్షకుడికి వరహాసంగా భాసిల్లిన హాస్యనట చక్రవర్తి రేలంగి పౌరాణిక జానపద, సాంఘిక చిత్రాలలో ఏ పాత్రకైనా అచ్చు గుద్దినట్లు సరిపోయిన మహానటుడు, గాయకుడు కూడా.

నవరసాల్లో హాస్యేతర ఏ రసం ప్రదర్శించినా నవ్వులు పూయించిన నటుడు రేలంగి. నటనలో ప్రత్యేకమైన టైమింగ్ అనేది ఎస్.వి.రంగారావు, రేలంగి ఇద్దరికీ గొప్పగా వుండేది అని ఆనాడు చెప్పుకునేవారు.

గుణసుందరి కథ, ప్రియురాలు, దొంగరాముడు, సువర్ణసుందరి, రహస్యం, పాతాళభైరవి, మిస్సమ్మ, అప్పు చేసి పప్పుకూడు, మాయాబజార్, అగ్గిరాముడు, పక్కింటి అమ్మాయి (హీరోగా చేసారు ఈ చిత్రంలో) వెలుగునీడలు, తోడికోడళ్ళు, కులగోత్రాలు, చెంచులక్ష్మి, వాగ్దానం, విప్రనారాయణ, చింతామణి, రోజులు మారాయి, చెరపకురా చెడేవు, పెళ్లికానుక, ప్రేమించి చూడు, భాగ్యరేఖ, భలేరాముడు, ఇలా ఎన్నెన్నో చిత్రాల్లో తనదైన ముద్రను వేసి హాస్యాన్ని ఒలికించారు రేలంగి.

మాయాబజార్ చిత్రంలో లక్ష్మణకుమారుడిగా ఆయన నటన అమోఘం. రాజదర్పం, ఆత్మాభిమానం తండ్రి తరపు నించి సంక్రమించిన లక్షణాలన్నిటికి అద్దం పట్టిన రీతిలో రేలంగి హావభావ ప్రదర్శన అద్భుతంగా సాగింది ఆ చిత్రంలో. అలాగే శశిరేఖకు తాళి కట్టే సమయంలో పెద్దపులి, భూతం కనిపించగానే అంత చేరువలో అవి ప్రత్యక్షమయితే ఎంత గాభరా పడి గావుకేకలు పెడతామో అక్షరాలా అలా ప్రవర్తించి సన్నివేశాన్ని పండించిన మహానటుడు రేలంగి.

ఓ పక్క చెక్కలౌతున్న కడుపుని పట్టుకుని అతనికి జోహారు చెయ్యని ప్రేక్షకుడు లేడు ఆనాడు. ఆయనలో వున్న మరొక విశేషం హార్మోనియం చక్కగా వాయించగలరు. అదే విషయాన్ని మనం మిస్సమ్మ చిత్రంలో గమనించవచ్చు. యంగ్‌మెన్ హేపీ క్లబ్బులో నాటకాలు ప్రదర్శించే రోజుల్లో స్త్రీ పాత్రలు కూడా ధరించారు. అదే అనుభవంతో పాతాళభైరవిలో ఓ సన్నివేశంలో స్త్రీగా మారిపోయి నటిస్తారు. ముప్ఫైవ దశకంలో వచ్చిన శ్రీకృష్ణ తులాభారంలో తొలివేషం వేసారు.

శోభనాచల థియేటర్స్ వారి చిత్రాలన్నిటికి ప్రొడక్షన్ కార్యక్రమాలు చూసేవారు. గొల్లభామ, భామావిజయంలో ఆయన వేసిన పాత్రలు రెండుసార్లు వేసారు.




ఆ చిత్రాలు రెండుసార్లు రూపొందిస్తే రెండుసార్లూ వేసిన పాత్రనే వేయడం విశేషం. అంజలీదేవితో కలిసి పక్కింటి అమ్మాయి అనే చిత్రంలో కథానాయకుడిగా నటించి మెప్పించారు.

బాలనాగమ్మ రెండుసార్లు రూపొందిస్తే రెండు చిత్రాల్లో ఒకే పాత్రాల్లో నటించిన ఘనత ఆయనది.

తనతోటి హాస్యనటులు రమణారెడ్డి, అల్లురామలింగయ్య, చదలవాడ, రామకోటి, నల్ల రామ్మూర్తి, సీతారాం, లంక సత్యం, బొడ్డపాటి వంటి వారికి ఆయన పెద్ద దిక్కుగా ఉండేవాడు.

చివరి చిత్రం పూజ.

1975 నవంబరు 26న ఆయన కాలధర్మం చెందారు. ఆయన లేకపోయినా ఆయన నటించిన చిత్రాలు ఇప్పటికీ గిలిగింతలు పెడుతున్నాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు.



# హాస్యానికి మారుపేరు – రమణారెడ్డి

హాస్యనటులు రమణారెడ్డి ఓసారి షూటింగ్ ముగించుకుని అడవిదారిలో కారులో ప్రయాణిస్తున్నారు.

మధ్యలో దొంగలు ఆయనను అటకాయించి ఆయన దగ్గర వున్న నగదును... బంగారాన్ని ఇవ్వమని అడిగారు.

వెంటనే ఆయన చాలా సునయాసంగా ఇచ్చేస్తూ... మళ్లీ ప్రింట్ చేసుకుంటానులే తీసుకోండయ్యా అన్నారట. వెంటనే ఆ దొంగలు ఇవి దొంగనోట్లు... మాకెందుకు అని చెప్పి అక్కడే పడేసి వెళ్లిపోయారట.

ఆ విధంగా దొంగలను ఆయన ఏమార్చి ఆ అపాయం నుండి ఉపాయంగా తప్పించుకున్నారు. జీవితంలో వచ్చిన అనేక ఒడిదుడుకులను అదేవిధంగా తన మాటకారితనంతో తప్పించుకోవడంలో హాస్యాన్ని సృష్టించడంలో దిట్ట శ్రీ తిక్కవరపు రమణారెడ్డి.

నెల్లూరు జిల్లా జగద్దేవిపేటలో 1921 అక్టోబరు 1న జన్మించారు రమణారెడ్డి.

సన్నగా, నిటారుగా వున్న వెదురుకర్రకి వేలాడుతున్న రెండు చేతులు తగిలిస్తే ఆ రెండు చేతులు తోలుబొమ్మల చేతుల్లా కదిలిస్తూ నెల్లూరు మాండలిక భాష మాట్లాడేస్తూ నవ్వులు కురిపించే, ఆయన కచ్చితంగా హాస్యనటులకు ఓ కేరాఫ్ అడ్రస్.

చదువుకునే రోజుల్లో, ఉద్యోగం చేసుకునే రోజుల్లోను రంగస్థలం మీద, నాటకాలాడడం ఆయనకు మక్కువ. మేజిక్ చేయడం కూడా ఓ హాబీగా మారుతుందని ఆయన అనుకోలేదు. రంగస్థలంపై మేజిక్కులు చేస్తూ నటిస్తూ ఆయన సినిమాలవైపు ఆకర్షితులయ్యారు.

మిత్రుల ప్రోత్సాహంతో రమణారెడ్డి సినిమాలకు దగ్గరయ్యారు.

1951లో వచ్చిన 'మాయపిల్ల' చిత్రంలో తొలిసారిగా వేషం వేసారు రమణారెడ్డి. ఆ సినిమా ఆశించిన విజయం అందకపోవడంతో అవకాశాలు ఆయనకు రాలేదు. నటనపై ఉత్సాహంతో ఆయన ప్రయత్నాలు చెయ్యడం ఆపలేదు. అదే సమయంలో కొన్ని డబ్బింగ్ చిత్రాలకు గాత్రదానం(డబ్బింగ్) చేసారు.

1954లో వచ్చిన బంగారుపాప అనే చిత్రంతో రమణారెడ్డి అనే ఒక నటుడున్నాడని ప్రేక్షకులకు తెలిసింది. ఆ చిత్రంలో ముక్కుతో మాట్లాడి హాస్యాన్ని పలికించారు.

1955లో వచ్చిన మిస్సమ్మలో రమణారెడ్డి హాస్యనటుడిగా స్థిరపడ్డారు. ఆ చిత్రంలో ఆయన పోషించిన దేవిడ్ పాత్ర మంచి గుర్తింపును తీసుకువచ్చింది. దాంతో కామెడీ విలన్ వేషాలు ఆయన్ను వరించసాగాయి.

ఇక రేలంగి, రమణారెడ్డిల కాంబినేషన్ ఆ రోజుల్లో లారెల్ అండ్ హార్డీల కాంబినేషన్ అని తెలుగు ప్రేక్షకులు చెప్పుకునేవారు. మాయాబజార్‌లో చిన్నమయ్యగా ఆయన చేసిన పాత్ర అద్భుతమైనది. ఆ సినిమా విజయానికి ఆ పాత్ర కూడా ఎంతో ముఖ్యమని చిత్ర దర్శక నిర్మాతలు చెప్తుండేవారు. పార్వతీ కళ్యాణం అనే చిత్రంలో నారదుడిగా జుబ్బా వేసుకుని నటించారు రమణారెడ్డి.

ఎమ్మెల్యే, శోభ, అత్తా ఒకింటి కోడలే, పెళ్లిసందడి, జయభేరి, ఇల్లరికం, శ్రీవెంకటేశ్వర మహాత్మ్యం, శ్రీరేణుకాదేవి మహాత్యం, ఆత్మగౌరవం, గుళ్ళో పెళ్ళి, గుండమ్మకథ, అవే కళ్ళు, కులగోత్రాలు, రాముడు భీముడు, దాగుడుమూతలు, సత్యహరిశ్చంద్ర, లవకుశ తదితర చిత్రాలలో ఆయన హాస్యానికి ప్రేక్షకులు బ్రహ్మ రథం పట్టారు.

చిత్రాలలోనే కాకుండా బయట కూడా సీరియస్‌గా ఉంటూ అందర్నీ నవ్వించేవారు, మేజిక్ విద్యలో కూడా అఖండుడవటం వల్ల అనేక ప్రదర్శనలిచ్చి ఎన్నోసార్లు విరాళాలు సేకరించి గుప్తదానాలు చేసారు.

లివర్ వ్యాధితో బాధపడే ఆయన, వ్యాధి తీవ్రంగా వున్నా చిత్రాలలో నటిస్తూనే వుండేవారు. తెలుగు చిత్రాలలో ఉవ్వెత్తున లేచిపడిన ఆ హాస్య తరంగం అల్సర్‌తో బాధపడుతూ 1974 నవంబరు 11న తెలుగు ప్రేక్షకులకు దూరమయ్యారు. తెలుగు చిత్రాల్లో రమణారెడ్డి స్థానం మరెవరూ భర్తీ చేయలేక పోయారు. అదీ ఆయన ప్రతిభ!

# అంజిగాడంటేనే నవ్వు...
# బాలకృష్ణ

**'మా**యాబజార్'లో దర్శకులు కె.వి.రెడ్డి, బాలకృష్ణ అంటే అంజిగాడికి రెండు పాత్రలు ఇచ్చారు. ఒకటి లక్ష్మణకుమారుడి చెలికాడు, మరొకటి కావలి కాసే భటుడు.

ఆ రెండు పాత్రల్లో ఆయన చూపిన వైవిధ్యం అమోఘమైనది. సహజంగా మాయాబజార్ చిత్రంలో ఎవరూ ద్విపాత్రాభినయం చెయ్యలేదు. ఒక్క బాలకృష్ణ మాత్రమే ద్విపాత్రాభినయం చేసి రికార్డు సృష్టించారు. అంటే కె.వి.రెడ్డి గార్కి బాలకృష్ణ మీద వున్న నమ్మకం అలాంటిది.

ఒక సభలో కత్తివీరుడు కాంతారావు బాలకృష్ణ గురించి మాట్లాడుతూ– 'ఆయన గొప్పతనం ఆయనకు తెలీదనీ, ఆయన వంటి నటుడ్ని తానింతవరకూ చూడలేదనీ, తన గురించి తాను తెలుసుకుకోకపోవడం వల్ల ఎంత పారితోషికం తీసుకోవాలో ఆయనకు తెలియకపోవడం వల్ల నష్టపోయాడనీ అటువంటి నటుడు మరి పుట్టబోరని' తెలిపారు.

ఈ మాట నిజమే. అంజిగాడు అన్న పేరుతో తెలుగు ప్రేక్షకులకు పాతాళభైరవి చిత్రంలో పరిచయమైన వల్లూరి బాలకృష్ణ మంచి టైమింగ్ ఉన్న ఆర్టిస్టుగా ఆ కాలంలో పేరు తెచ్చుకున్నారు. ముఖ్యంగా బి.విఠలాచార్య చిత్రంలో ఆయన ఏదో ఒక పాత్రలో కనిపించేవారు. వివిధ రకాల హావభావాలతో శరీరాన్ని స్ప్రింగ్ లాగ కదిలిస్తూ హాస్యాన్ని పండించడంలో అందె వేసిన చేయి బాలకృష్ణది.

ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరులో ఆగస్టు 20, 1925లో ఆయన జన్మించారు. తాతా తండ్రులు కరణీకం చేసేవారు. చిన్నప్పట్నించి చదువులకు డుమ్మా కొడుతూ నాటకాల పిచ్చితో అక్కడా ఇక్కడా తిరుగుతూ వుండేవారు. ఏలూరులో వున్న తండ్రి వద్దకు చేరి నాటకాల కంపెనీల చుట్టూ తిరిగేవారు. చిన్న చిన్న వేషాలు వేసేవారు. ఆ క్రమంలో దర్శకుడు సి.పుల్లయ్య దృష్టిలో పడ్డారు అంజిగాడు.

1955లో 'శ్రీకృష్ణ తులాభారం'లో గోపాలబాలకునిగా వేషం వేసారు. అవకాశాలు రాకపోవడంతో ఏలూరుకు వెళ్లిపోయి తాలూకా గుమస్తా ఉద్యోగంలో చేరారు.

వాహిని స్టూడియో వారి ఉత్తరం మళ్లీ నటించమని అందడంతో మద్రాసు చేరుకున్నారు. పర్మినెంట్ ఆర్టిస్టుగా నెలజీతంపై వాహిని స్టూడియోలో చేరారు. భోజన వసతితో పాటుగా జీతం కూడా ఆయనకి ఇచ్చేటట్లు, ప్రతి సినిమాకు పారితోషికాన్ని అందించేటట్లు ఆయనకు కాంట్రాక్ట్ కుదిరింది.

షావుకారు చిత్రంలో ఎస్.వి.ఆర్ అనుచరుడిగా నటించారు. ఆ తరువాత పాతాళభైరవిలో ఓ చిన్న పాత్ర లభించింది. అది హీరో పాతాళభైరవి కోసం ఓ మర్రిచెట్టు ఎక్కినప్పుడు వచ్చే చిన్న పిల్ల దెయ్యం పాత్ర. ఆ పాత్రలో నటించాక ఇక నీకు ఈ సినిమాలో సన్నివేశాలు లేవని చెప్పి, పారితోషికం ఇచ్చి, వెళ్లిపొమ్మన్నారట. కాని ఆ సినిమాను వదలలేక అక్కడే వుండిపోయిన బాలకృష్ణను చూసి హీరో చెలికాడుగా పెట్టవచ్చు, కాని, చాలా బక్కపలచగా వున్నాడన్న అనుమానంతో మొదట సందేహించినా ఆ తరువాత ఆ పాత్రను ఆయనకే ఇచ్చారు. అలా పాతాళభైరవిలో రెండు పాత్రలు చేసారు బాలకృష్ణ. ఆ చిత్రంతోనే తెలుగు సినీ ప్రేక్షకులకు అంజిగాడిగా సుపరిచితులయ్యారు బాలకృష్ణ.



జానపద, సాంఘిక, పౌరాణిక చిత్రాల్లో విలక్షణమైన పాత్రల్లో నటించారు. బాలకృష్ణ నటన తననెంతో ప్రభావితం చేసిందని అప్పుడప్పుడు రాజబాబు చెబుతుండేవారు. ఓరోజు తన పుట్టినరోజున బాలకృష్ణను సన్మానించి ఈ విశేషాలన్నీ వెల్లడించాడు రాజబాబు. విఠలాచార్య చిత్రాల్లో నటిస్తుండడంతో స్వంత ఇల్లు, కార్లు అన్నీ అమర్చుకున్నారాయన.

ఆయనకు ఏడుగురు ఆడపిల్లలు సంతానం. ప్రతిజ్ఞా పాలన, నవగ్రహ పూజామహిమ, కనకదుర్గ పూజా మహిమ, అగ్గిబరాటా, లక్ష్మీకటాక్షం, పిడుగురాముడు, నిప్పులాంటి మనిషి, పున్నమినాగు, మదనకామరాజు కథ, బొబ్బిలియుద్ధం తదితర చిత్రాల్లో ప్రేక్షకులకు మర్చిపోలేని హాస్యపు గిలిగింతలు పెట్టారు. చివరి రోజుల్లో సరియైన అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడ్డారు ఆయన.

# హాస్యానికి అల్లుడు -
# అల్లురామలింగయ్య

**బా**లనటుడిగా ఎన్నో చిత్రాల్లో హాస్యాన్ని పండించిన జి.విశ్వేశ్వరరావు, అల్లురామ లింగయ్య కలిసి ఓ చిత్రంలో నటిస్తున్నారు.

రిహార్సల్స్‌లో అల్లురామలింగయ్య ఒకలా నటించేవారు. టేకాన్‌లో మరోవిధంగా నటించేవారు. టేకాన్‌లో చేసిన సీను అద్భుతంగా పండేది. అది మిగతా నటీనటులకు ఏ మాత్రం తెలిసేది కాదు. అలా ఇతర నటీనటులకు, తనకు తారతమ్యం వుండేలా తన హాస్యం సరికొత్తగా ఉండేలా ఎప్పటికప్పుడు సన్నివేశాన్ని తనలో తను ఆలోచించు కుని ఓ ఫ్రేమ్ నిర్ణయించుకుని ప్రేక్షకులకు కొత్తదనాన్ని అందించటంలో అల్లురామ లింగయ్య మొదటి వరసలో ఉండేవారు.

అలా ఒకసారి ఇద్దరూ కలిసి నటిస్తూ వుంటే అల్లురామలింగయ్య చేసిన యాక్షన్ కన్నా విశ్వేశ్వరరావు చేసిన యాక్షన్ అద్భుతంగా పండింది. వెంటనే ఏమాత్రం తడుముకోకుండా అల్లురామలింగయ్య 'నా బాణీ పట్టేసేవురో' అని మెచ్చుకున్నారట. అలా సహజనటులను మెచ్చుకోవటంలో ఆయన మనసు వెన్నపూసలాంటిది.

పాలకొల్లులో 1922 అక్టోబరు 1న జన్మించిన ఆయన నాటకాల్లో చిన్న చిన్న వేషాలు వేసే ప్రయత్నం చేసారు.

పశ్చిమగోదావరి జిల్లా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకి వెళ్లారు కొన్నాళ్ళు. గరికపాటి రాజారావు 1952లో రూపొందించిన 'పుట్టిల్లు' అనే చిత్రంలో తొలివేషం వేసారు అల్లురామలింగయ్య. జమునకు కూడా తొలి చిత్రం ఇదే కావడం విశేషం.

ఆయన హాస్యం దాదాపు 3 తరాల సినీ ప్రేక్షకులను అలరించింది. చదువు పెద్దగా అబ్బకపోవడంతో ఆకతాయిగా తిరుగుతూ అందర్నీ అనుకరిస్తూ నవ్వించేవారు. ఇదే క్రమంలో నాటకాలలో నటించాలనే ఉత్సాహం పెరిగి, ఊళ్ళోకి నాటకాలు ఆడే వాళ్ళు ఎవరు వచ్చినా వారి వెంట తిరుగుతూ తనకూ ఓ వేషం ఇవ్వాలని అభ్యర్థించే వారాయన.

తొలిసారిగా భక్తప్రహ్లాద నాటకంలో బృహస్పతి వేషం వేసే అవకాశం వచ్చింది ఆయనకు.

గాంధీజీ పిలుపునందుకుని క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకి వెళ్లిన ఆయన అక్కడ కూడా తోటివారిని పోగేసుకుని నాటకాలు ప్రదర్శించేవారు. తొలిచిత్రం 'పుట్టిల్ల'యితే మలిచిత్రం 'వద్దంటే డబ్బు'.

మద్రాసుకు మకాం మార్చిన ఆయన సరియైన అవకాశాలు లేక, ఒకవైపు హోమియో వైద్యం కూడా ఉచితంగా చేస్తూ వేషాల కోసం ప్రయత్నాలు చేసేవారు.

అనేక అడ్డంకులు ఎదురైనా చివరికి హాస్యపు తరంగంలా చిత్రసీమలో ఎదిగారు. కామెడీ చేస్తూ కామెడీ విలన్‌గా కూడా ఆయన సరికొత్త బాణీతో తెరపై ఆయన నటనను ఆవిష్కరించారు.

హాస్యపుజల్లుగా ఎదిగి, ముత్యాలముగ్గు, అందాలరాముడు, శంకరాభరణం, మాఊరికథ, మనుషులంతా ఒక్కటే తదితర చిత్రాల్లో నటించి తనకెదురు లేదని పించారు.



గీతా ఆర్ట్స్ అనే సంస్థను నెలకొల్పి బంట్రోతు భార్య, దేవుడే దిగివస్తే, బంగారుపతకం, డబ్బు భలే జబ్బు తదితర చిత్రాలను రూపొందించారు. 'ఆమ్యాం ఆమ్యాం, అప్పుం అప్పుం' లాంటి ఊతపదాలు వినగానే అల్లురామలింగయ్యే గుర్తుకొస్తారు. శంకరాభరణం, మా ఊరికథ, బావమరదులు తదితర చిత్రాల్లో ఆయన నటన ఎప్పటికీ మర్చిపోలేం.

ముత్యాలముగ్గు చిత్రంలో ఆయన చేసిన కోతి నటన ఎప్పటికీ చిరంజీవిగానే నిలుస్తుంది.

1990లో పద్మశ్రీ అవార్డు, 2001 లో రఘుపతి వెంకయ్య అవార్డును అందుకున్నారు. 1116 చిత్రాల్లో నటించాలనే ఆయన కోరిక తీరకుండానే 1030 చిత్రాల్లో నటించి 2004 జూలై 31న కాలధర్మం చెందారు. ఆయన జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం తపాలా బిళ్లను కూడా విడుదల చేసింది.

# హాస్య పద్మ పరిమళం-
# పద్మనాభం

**'సో**డా సోడా ఆంధ్రా సోడా, గోలీ సోడా', 'ఆకలయ్యి అన్నమడిగితే పిచ్చోడన్నారు నాయాళ్ళు, నన్ను వెర్రోడన్నారు నాయాళ్ళు'... ఈ రెండు పాటలు గుర్తు చేసుకుంటే మనకు కళ్ళ ముందు కదలాడేది పద్మనాభం. పాత్రకు అవసరమయితే ఎటువంటి మేకప్‌నైనా చేసుకోవటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ముఖ్యంగా స్వర్ణమంజరి చిత్రంలో ఓ చిన్న గుండులాగ మారిపోయి మొత్తం బురద పూసుకుని కళ్ళు మాత్రమే కనిపించే విధంగా కాళ్ళు అన్నీ మడిచి ఒక బంతిలాగా కూర్చుని నటించిన ప్రతిభగల నటుడు పద్మనాభం.

పులివెందుల దగ్గర సింహాద్రిపురంలో 1931 ఆగస్టు 20న జన్మించారు పద్మనాభం. ఆయన అసలు పేరు బసవరాజు వెంకట పద్మనాభరావు. తాత, తండ్రులు గ్రామ కరణీకం చేసేవారు. పెద్దలనుండి ఆయనకు వారసత్వం వచ్చినా ఇష్టంలేక రంగస్థల నటుడిగా ఎదగాలని అభిలషించారు. చిన్నప్పటినుండి సంగీతం వినడం, పాడడం, పద్యాలు పాడడం లాంటివి అందరి ముందూ చేస్తూ ఐదేళ్ళ వయసులోనే నాటకంలో నటించారాయన.

తన ఊరిలో టెంటు హాల్లో ప్రదర్శించే ద్రౌపదీ వస్త్రాపహరణం, వందేమాతరం, సుమంగళి, భక్తప్రహ్లాద లాంటి చిత్రాలను చూసి, ఇంటికి వచ్చి ఆ పద్యాలు, పాటలు, హాస్య సన్నివేశాలు, మిమిక్రీలు చేస్తూ అందర్నీ నవ్వించేవారాయన. తమ్ముడితో కలసి ప్రొద్దుటూరులో చదివిన చదువు వంటబట్టక చివరికి సినిమాల వైపే మనసు లాగడంతో మద్రాసు చేరారు. నటీమణి కన్నాంబ ఇంటికి వెళ్లి తాను సినిమాల్లో నటించటానికి వచ్చానని, చక్కగా పాడుతానని చెప్పడంతో ఆమె తమ కంపెనీలో వుండమని చెప్పారు.

అలా రాజరాజేశ్వరి కంపెనీలో ఉంటూ, ఓ వైపు సినిమాల్లో నటిస్తూ, ఒకవైపు నాటకాలు ప్రదర్శించేవారు పద్మనాభం. నటుడు సి.ఎస్.ఆర్.ట్రూపు, నటి ఋష్యేంద్ర మణి ట్రూపుల్లో ఆయన పాదుకాపట్టాభిషేకం, హరిశ్చంద్ర, సతీ సక్కుబాయి, రంగూన్ రౌడీ, శ్రీకృష్ణలీలలు, భక్తతుకారాం లాంటి అనేక నాటకాలలో నటించి గుర్తింపు పొందారు. అదే సమయంలో 'పాదుకా పట్టాభిషేకం' అనే చిత్రంలో కోరస్ పాటలు పాడే అవకాశం వచ్చిందాయనకు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన 'మాయాలోకం' చిత్రంలో కోరస్ పాడడమే కాక ఓ పాత్రలో ఆయన నటించారు కూడా. అదే తొలివేషం ఆయనకు.

ఆ తరువాత త్యాగయ్య, ముగ్గురు మరాఠీలు, నారద నాదరి, యోగివేమన, భక్త శిరియాళ, రాధిక, వింధ్యారాణి, గుణసుందరి కథ తదితర చిత్రాల్లో నటించారు. గుర్తింపు తెచ్చిన పాత్ర షావుకారులో నౌకరు పోలయ్య. ఆ తరువాత పాతాళభైరవిలో ఎస్.వి.ఆర్ శిష్యుడిగా 'మోసం గురూ!' అన్న డైలాగ్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు పద్మనాభం. పెళ్లి చేసి చూడు, చంద్రహారం, శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం, కృష్ణప్రేమ, సతీ సుకన్య, కృష్ణలీలలు, శ్రీరామకథ, సతీ తులసి, ప్రమీలార్జునీయం తదితర చిత్రాల్లో నారదుడిగా నటించి ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. పరిశ్రమలో తన స్నేహితుడైన వల్లం నరసింహారావుతో కలిసి రేఖా అండ్ మురళీ ఆర్ట్స్ అనే సంస్థను స్థాపించి దేవత, పొట్టి ప్లీడర్, శ్రీశ్రీ మర్యాదరామన్న, కథానాయిక మొల్ల, శ్రీరామ కథ లాంటి



అద్భుతమైన చిత్రాలను నిర్మించి అనేక అవార్డులు, రివార్డులు గెల్చుకున్నారు. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యాన్ని తొలిసారిగా 'శ్రీశ్రీశ్రీమర్యాదరామన్న' అనే చిత్రంతో తెలుగు పరిశ్రమకు పరిచయం చేయడం విశేషం.

కథానాయిక మొల్ల చిత్రానికి బంగారునంది అవార్డు పొందారు. 'పేరిగాడు రాజంట', 'చింతామణి' లో సుబ్బిశెట్టి పాత్రలలో ఆయన నాటకాలు వేస్తుంటే ప్రేక్షకులు వెర్రెత్తిపోయి చూసేవారు. సంబరాల రాంబాబు, యోగి వేమన, వాగ్దానం, వెలుగునీడలు లాంటి అనేక చిత్రాలలో ఆయన నటన మరువలేనిది.

అనేక టివి సీరియల్స్‌లో కూడా నటించారు. ఆయన చివరగా 'భద్ర' చిత్రంలో తాతగా నటించారు. దాదాపు 500 చిత్రాలకు పైచిలుకు నటించిన ఆయన 2010 ఫిబ్రవరి 20వ తేదీన తెలుగు ప్రేక్షకులను వదిలి దివికేగారు.

# నవ్వులవాడ–
# చదలవాడ కుటుంబరావు

సహజంగా హాస్యనటులు దర్శకులు, నిర్మాత ఎవరు ఏవిధంగా చెప్తే, ఆ విధంగానే డైలాగ్‌ని చెప్పిన పద్ధతిలో (మాడ్యులేషన్) చెప్పే ప్రయత్నం చేస్తారు. కాని, చదలవాడ కుటుంబరావు మాత్రం, తనకు వచ్చిన మాండలికం, అదే కృష్ణా జిల్లా మాండలికంలోనే తన కెరీర్ అంతా డైలాగ్స్ చెప్పి, ఎక్కడా మోనాటమీ లేకుండా, బోర్ కొట్టకుండా హాస్యాన్ని రంగరించి తెలుగు ప్రేక్షకులకు అందించారు.

రమణారెడ్డి నెల్లూరు మాండలికంలో మాట్లాడితే, చదలవాడ కుటుంబరావు కృష్ణా జిల్లా మాండలికంలో మాట్లాడి అద్భుతాలు సృష్టించారు.

కృష్ణా జిల్లా ఈడ్పుగల్లు దగ్గర వున్న వెల్దిపాడు అనే గ్రామంలో ఆయన జన్మించారు. చిన్ననాటినుండి నాటకాలపై మక్కువతో అనేక నాటకాల్ని ప్రదర్శించారు. ముఖ్యంగా ప్రజానాట్యమండలి కళాకారుడిగా 'పల్లెపడుచు' నాటకంతో మంచి పేరు గడించారు. ముఖ్యంగా 'పిచ్చయ్య' పాత్ర, ఆయనకు గుర్తింపునిచ్చింది. ఇవేకాకుండా బుఱ్ఱకథల్లో వంత హాస్యగాడుగా కూడా అనేక ప్రదర్శనలిచ్చారు. పాతాళభైరవిలో ద్విపాత్రాభినయం చేసిన నటుడిగా కూడా గుర్తింపు పొందారు. 'అత్త ఒకింటి కోడలే' చిత్రంలో సీతతో చేసిన 'మాయదారి కీసులాట మామధ్య వచ్చింది రాయబారం చేయవే తడికో తడికో' అన్న పాట ఆ రోజుల్లో పెద్ద హిట్టు. ఎక్కడ చూసినా అదే పాట మారుమ్రోగేది. ఆ పాటతో చదలవాడ కుటుంబరావుకి మంచి పేరు వచ్చింది.

మాయాబజార్ చిత్రంలో ఎస్.వి.ఆర్ అనుచరుడిగా చిన్నమయ్య(రమణారెడ్డి) దగ్గర పాఠాలు నేర్చుకునే విద్యార్థిగా ఆయన, నల్లరామ్మూర్తి కలిసి చేసిన హాస్యం ఎప్పటికీ మరువలేనిది! లంబుగా ఆయన చేసిన నటన ఆ చిత్రంలో అందర్నీ అలరించింది. దుసటచతుసనటయం అన్న మాటను విరిచి విరిచి పొడి పొడి చేసిన నటుడు చదలవాడ కుటుంబరావు.



ఆయన మృదుస్వభావి. అందర్నీ చక్కగా పలకరించేవారు. జోవియల్ పర్సనాలిటీతో ఆయన ఎక్కడ వున్నా అందర్నీ నవ్వించేవారు. 'తాశీల్దారు' సినిమాతో ప్రారంభమైన ఆయన కెరీర్ 'అర్ధరాత్రి' అనే చిత్రంతో ముగిసింది. ఆ చిత్రంలో నటించి తెల్లవారే షూటింగ్‌కి వెళ్లాల్సి వుండగా, ఉదయాన్నే లేచి కాఫీ తాగి, ఇంట్లోనే హార్ట్ స్ట్రోక్ వచ్చి ఆయన మనకు 1968లో దూరమయ్యారు.

కృష్ణలీలలు, కులదైవం, చిట్టితమ్ముడు, నవరాత్రి, ఆడపడుచు, అప్పుచేసి పప్పుకూడు, జయభేరి, శ్రీకృష్ణార్జున యుద్ధం, మాయాబజార్, తిరుపతమ్మ కథ, తోడికోడళ్ళు, స్వర్గసీమ, పల్లెటూరు, పెద్దమనుషులు, కన్యాశుల్కం, అర్ధాంగి, పెళ్లినాటి ప్రమాణాలు, తదితర చిత్రాల్లో దాదాపు 110 చిత్రాల దాకా ఆయన నటించి తన సత్తా చూపారు. సుజనా ఫిలింస్ అనే సంస్థను స్థాపించి 'సతీతులసి' అనే చిత్రాన్ని విక్టరీ మధుసూదనరావు దర్శకత్వంలో రూపొందించారు. విక్టరీ మధుసూదనరావు చదలవాడకు అల్లుడే.



పెద్దమనుషులు చిత్రంలో ఆయనది మెయిన్ లీడ్ రోల్. అదే విధంగా నిరుపేదలు, పరివర్తన చిత్రాల్లో ఆయన నటన అసామాన్యమైనది. ముఖ్యంగా ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్, సావిత్రి, ఎస్వీఆర్, సూర్యకాంతం కాంబినేషన్‌లో ఎన్నో అద్భుతమైన చిత్రాల్లో నటించి ఆయన తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

# సాటిలేని మేటి
# పేకేటి



ఏ.ఎన్.ఆర్.నటించిన 'దేవదాసు' లో భగవాన్ పాత్ర పోషించాడు పేకేటి శివరాం. దేవదాసుకి తాగుడు నేర్పించి తాగుబోతుగా మార్చిన క్రెడిట్ పేకేటి శివరాంకే దక్కింది. అంటే ఆయన నటించిన పాత్రకే దక్కింది. ఆ సినిమా విడుదలైన రోజుల్లో పేకేటి శివరాంని ప్రత్యేకంగా ఈ విధంగానే చెప్పుకునేవారు.

'మనవాడు తలుచుకుంటే ఏదైనా చేస్తాడు' అనే డైలాగ్ మేనరిజంతో దేవదాసు చిత్రంలో నటించిన పేకేటి శివరాంకు అద్భుతమైన గుర్తింపు వచ్చింది.

1918 అక్టోబరు 8న తూర్పుగోదావరి జిల్లాలోని పేకేరులో జన్మించారు పేకేటి శివరాం. ఘంటసాల అప్పుడే పరిశ్రమకు వచ్చిన రోజులు. అప్పుడే పేకేటి శివరాం కూడా పరిశ్రమకు వచ్చారు. సినీ పరిశ్రమలో కొన్నాళ్ళు కెమేరా డిపార్టుమెంట్‌లో, ఆ తరువాత హెచ్.ఎమ్.వి గ్రామఫోన్ రికార్డుకంపెనీలో పనిచేసారు.

'శ్రమజీవి' అనే పత్రికకు కొన్నాళ్ళు సంపాదకుడిగా కూడా పనిచేసారు. 'చిత్ర' అనే సినిమా పత్రిక బాధ్యత కూడా వహించారు. బెంగుళూరు నుండి వచ్చే సినిమా 'ఫ్లేమ్' అనే పత్రికకు రిపోర్టర్‌గా పనిచేసారు. ఆయనలో రచయిత కూడా ఉన్నాడు. భగవాన్ అనే పేరుతో పద్దెనిమిది డిటెక్టివ్ నవలలు రాసారు ఈయన. చిత్రాలు రూపొందించే ప్రతిభ సంస్థ, వినోదసంస్థ తదితర సంస్థల యొక్క ప్రొడక్షన్ వ్యవహారాలు నిర్వహిస్తూ కార్యక్రమాలు నిర్వహించేవారు.

1952లో శాంతి అనే చిత్రం ద్వారా సావిత్రి సరసన తొలి వేషం వేసారు. 53లో దేవదాసులో భగవాన్ పాత్రతో గుర్తింపు వచ్చింది. అప్పటినుండి తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో హాస్యనటుడుగా, కేరక్టర్ ఆర్టిస్టుగా దాదాపు వందకు పైగా చిత్రాల్లో నటించారు. కన్నడంలో ఆయన రూపొందించిన 'చక్రతీర్థ' చిత్రానికి కేంద్రప్రభుత్వ అవార్డులు లభించాయి. కన్నడంలోనే 'కులగౌరవం' అనే చిత్రాన్ని రూపొందించగా, తెలుగులో ఎన్.టి.ఆర్.తో మళ్లీ తిరిగి రూపొందించడం విశేషం. చుట్టరికాలు, భలే అబ్బాయిలు తదితర చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు.

కొందరు సినీ పరిశోధకులు ఈయన తొలిచిత్రం 1963లో వచ్చిన 'కన్నతల్లి' అని చెప్తారు. దాదాపు 11 చిత్రాలకు దర్శకత్వం వహించారు. తమిళనటుడు త్యాగరాజన్ పేకేటి శివరాం అల్లుడే. తమిళ హీరో ప్రశాంత్ ఆయన మనవడు.



కన్యాశుల్కం, వద్దంటే డబ్బు, రేచుక్క, చిరంజీవులు, ఏది నిజం? సువర్ణసుందరి, భాగ్యరేఖ, పాండురంగ మహాత్యం, వీరకంకణం, పెళ్లినాటి ప్రమాణాలు, ఇల్లరికం, జయభేరి, శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం, గులేబకావళి కథ, ఉషా పరిణయం, గాలిమేడలు, మురళీకృష్ణ, వెలుగునీడలు, పునర్జన్మ, తదితర చిత్రాల్లో నటించారు.

1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో తెలుగు తల్లి పేరుతో ప్రభుత్వం తరఫున పేకేటి శివరాం ఓ డాక్యుమెంట్‌ను రూపొందించారు. 2002లో పేకేటి శివరాంకు హెచ్.ఎమ్.రెడ్డి అవార్డును ప్రదానం చేసారు. డిసెంబరు 30, 2008న ఉబ్బసం వ్యాధితో బాధపడుతూ పేకేటి శివరాం చెన్నైలో కాలధర్మం చెందారు.



# నవ్వుల దిలీప్ - చలం

**ది**లీప్‌కుమార్ అంటేనే హీరోయిజం. అటువంటి హీరోయిజానికి హాస్యాన్ని రంగరించి కథానాయకుడిగా, హాస్యనటుడిగా, రెండవ కథానాయకుడిగా, అప్పుడప్పుడు విలన్‌గా పూర్తి స్థాయి నటుడ్ని తెలుగు తెరపై ఆవిష్కరింపజేసిన నటుడు చలం.

మే 18, 1929లో జన్మించారు కోరాడ సూర్యాచలం. ఉరఫ్ దిలీప్ ఉరఫ్ చలం.

1952లో దాసి చిత్రం ద్వారా సినిమారంగంలో ప్రవేశించారు. ఆ తరువాత నా చెల్లెలు, జాతకఫలం, తోడుదొంగలు, వదినగారి గాజులు, సంతానం తదితర చిత్రాల్లో నటించారు. ఆయన నటన, ముఖకవళికలు చూసి హిందీ నటుడు పృథ్వీరాజ్ కపూర్ ఆయనకు 'ఆంధ్రా దిలీప్' అన్న టైటిల్ ఇచ్చారు. ఎన్.టి.ఆర్. కథానాయకుడిగా నటించిన 'బభ్రువాహన' చిత్రంలో టైటిల్ రోల్ చలందే. ఆయన తన నటనతో నవ్వించగలరు. కన్నీరూ పెట్టించగలరు.వీర శృంగార హాస్య కరుణ రసాలను తెరపై ఒలికించి ప్రేక్షకులకు దగ్గరయ్యారు.

నటి శారదను వివాహం చేసుకున్నారు. కాని వారి వైవాహిక జీవితం ఎక్కువ రోజులు సాగలేదు. పట్టిందల్లా బంగారం, లంబాడోళ్ళ రాందాసు, బొమ్మా బొరుసా, మట్టిలో మాణిక్యం, సంబరాల రాంబాబు, పూలరంగడు, నవరాత్రి, గోవుల గోపన్న, బ్రహ్మచారి, నిండుహృదయాలు, డాక్టర్ చక్రవర్తి, సిరిసంపదలు, పెళ్లిసందడి, తండ్రులు కొడుకులు, జాతకఫలం... చిత్రాల్లో ఆయన తన నటనతో ప్రేక్షకులను నవ్వించారు.

కథానాయకుడుగా, బంట్రోతుభార్య, తోటరాముడు, సంబరాల రాంబాబు, సత్తెకాలపు సత్తెయ్య, బుల్లెమ్మ బుల్లోడు, దేవుడమ్మ, లంబాడోళ్ల రాందాసు, మట్టిలో మాణిక్యం, పట్టిందల్లా బంగారం తదితర చిత్రాల్లో నటించారు.

'బొమ్మా బొరుసా' అనే చిత్రంలో గడసరి అత్తలకు యముడు లాంటి అల్లుడు టైప్ చిత్రాలు ఆ సినిమాతోనే ప్రారంభమయ్యాయి. ఆయన రూపొందించిన 'మట్టిలో మాణిక్యం' చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ భాషా చిత్రంగా నేషనల్ అవార్డు వచ్చింది. 'వాగ్దానం' చిత్రంలో గుమ్మడితో కలసి ఆయన చేసిన విలనిజం ఎవరు మరువలేరు.

'కురిసింది వాన నా గుండెలోన, ఓ బంగరు రంగుల చిలక పలకవే, రిమ్‌జిమ్ రిమ్‌జిమ్ హైదరాబాద్ రిక్షావాలా జిందాబాద్, నీ పాపం పండెను నేడు నీ భరతం పడతా చూడు, అమ్మ అన్నది ఓ కమ్మని మాట అది ఎన్నెన్నో తెలియని మమతల మూట, ఎక్కడో దూరాన కూర్చున్నావు ఇక్కడ మా తలరాతలు రాస్తున్నావు... అనే పాటలు ఆయన చిత్రాల్లో ప్రత్యేకంగా గుర్తింపు నిచ్చాయి. దాదాపు 100 కు పైచిలుకు చిత్రాల్లో నటించిన ఆయన 1989 మే 4న తెలుగు ప్రేక్షకులకు దూరమయ్యారు.



హాస్యానందం 200వ సంచిక విడుదల సందర్భంగా శుభాకాంక్షలు

శ్రీ దండెంరాజు ఫౌండేషన్, బెంగళూరు

డా॥ డి. ఎన్. వి. రామశర్మ
స్థాపక నిర్వాహకులు

# నవ్వుల బాబు...
# రాజబాబు



రాజబాబు పేరు చెబితేనే నవ్వులు వెల్లి విరుస్తాయి. దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు స్టార్ కమెడియన్‌గా ఓ వెలుగు వెలిగిన ఆయన ఈ శతాబ్దపు గొప్ప హాస్య నటుడిగా గుర్తింపు పొందారు.

పుణ్యమూర్తుల అప్పలరాజుగా రాజమండ్రి దగ్గర నర్సాపురంలో 1937 అక్టోబరు 20న జన్మించారు రాజబాబు. నటనపై మక్కువ ఉన్నా, బుర్రకథలు నేర్చుకోవడం మొదలుపెట్టారు. ఆ తరువాత తెలుగు ఉపాధ్యాయుడిగా కొన్నాళ్ళు పనిచేసారు. నాటకాలు వేసేవారు. సినిమాలో నటించాలనే అభిలాషతో మద్రాసు వెళ్ళారు. వెంటనే అవకాశాలు రాకపోవడంతో దర్శకుడు అడ్డాల నారాయణరావు పిల్లలకు ప్రైవేటు చెప్పేవారు. అడ్డాల నారాయణరావు రూపొందిస్తున్న 'సమాజం' అనే చిత్రంలో ఓ పాత్రను రాజబాబుకిచ్చి ప్రోత్సహించారాయన. ఆ సినిమాతో హాస్యనటుడిగా ఓ గుర్తింపు వచ్చింది.

ఆ తరువాత కులగోత్రాలు, తండ్రులు కొడుకులు, స్వర్ణగౌరి, మంచిమనిషి తదితర చిత్రాలలో ఆయనకు అవకాశాలు వచ్చాయి. మరోవైపు కుక్కపిల్ల దొరికిందా, నాలుగిళ్ళ చావిడి, అల్లూరి సీతారామరాజు వంటి నాటకాలలో కూడా ఆయన పాల్గొనేవారు. అంతస్తులు, ఆకాశరామన్న, భక్తశబరి, ప్రచండభైరవి, సత్యహరిశ్చంద్ర, సంగీతలక్ష్మి, పరమానందయ్య శిష్యుల కథ, ఉమ్మడికుటుంబం, విచిత్ర కుటుంబం లాంటి చిత్రాల్లో నటించాక ఆయనకు అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. స్టార్ కమెడియన్‌గా ఎదిగారు. రాజబాబు అంటే ఆయనకు జంటగా రమాప్రభ ఉండాల్సిందే.

ఇద్దరమ్మాయిలు, ప్రేమనగర్, ఇల్లు ఇల్లాలు, పల్లెటూరి బావ, సెక్రటరీ, జీవనజ్యోతి, కార్తీకదీపం, అడవిరాముడు, సోగ్గాడు లాంటి చిత్రాల్లో ఆయన కీర్తి అందనంత ఎత్తుకి ఎదిగింది. తాతా మనవడు, పిచ్చోడిపెళ్లి, తిరుపతి, ఎవరికి వారే యమునాతీరే, మనిషి రోడ్డున పడ్డాడు లాంటి చిత్రాల్లో కథానాయకుడుగా నటించారు.

ప్రేక్షకులను తన హాస్యంతో కడుపుబ్బా నవ్వించిన రాజబాబు నిజ జీవితంలో గొప్ప తాత్వికుడు. ప్రతిసంవత్సరం తన పుట్టినరోజు సందర్భంగా సీనియర్ నటీనటుల్ని సత్కరించడం ఆయనకు అలవాటు. తనకు ఇష్టమైన అనేక సంస్థలకు అనేక దానాలు ఇచ్చారాయన. రాజమండ్రిలో పారిశుధ్య కార్మికులకు, అదే ఊరిలో దానవాయిపేటలో ఇళ్ళు కట్టుకోడానికి భూములిచ్చిన మహాదాత రాజబాబు. కోరుకొండలో విద్యార్థుల కోసం జూనియర్ కాలేజీ కట్టించారు. వరసగా 7సార్లు ఫిలింఫేర్ అవార్డులు పొందిన మొట్టమొదటి హాస్యనటుడిగా రాజబాబు రికార్డుకెక్కారు. ఆయన జీవితంలో మొత్తం 9 ఫిలింఫేర్ అవార్డులు, 3 నంది బహుమతులు, ఎన్నెన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. చెన్నై ఆంధ్రాక్లబ్ వారు వరుసగా 5 సార్లు రోలింగ్ షీల్డ్‌ని ఆయనకే ప్రదానం చేసారు. అలా ఒక శతాబ్దపు హాస్యనటుడిగా రాజబాబు కీర్తి ప్రతిష్టలు పొందారు.

కొరడావీరుడు, చిన్నన్న శపథం, జేబుదొంగ, శాంత, అప్పగింతలు, చిట్టితమ్ముడు, బందిపోటు, కానిస్టేబుల్ కూతురు, మంచిమనిషి, చంద్రహాస, గూఢచారి 116, నవరాత్రి, భూలోకంలో యమలోకం, అపాయంలో ఉపాయం, ఉమ్మడి బతుకులు, పిన్ని, బ్రహ్మచారి, శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న, సాక్షి, అత్తగారు కొత్తకోడలు, బంగారు పిచ్చిక, బంగారు సంకెళ్ళు, బందిపోటు దొంగలు, సర్కారు ఎక్స్‌ప్రెస్ లాంటి అనేక వైవిధ్యమైన చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు రాజబాబు.

'బాబ్ అండ్ బాబ్' అనే ప్రొడక్షన్ సంస్థను స్థాపించి మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందించారాయన.

అనేక గుప్తదానాలు చేసిన రాజబాబు చివరి రోజుల్లో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవడం విచారకరం. గొంతు క్యాన్సర్ తో హైద్రాబాద్ థెరిస్సా ఆస్పత్రిలో చేరారు. ఫిబ్రవరి 14, 1983న తెలుగు సినీ అభిమానులను శోక సంముద్రంలో ముంచి స్వర్గస్తులయ్యారాయన.

ఆయన లేకపోయినా ఆయన చిత్రాలతో మన ముందు ఎప్పుడూ చిరంజీవిగానే నిలుస్తున్నారు రాజబాబు.

# ప్రతి ఎక్స్‌ప్రెషనూ హాస్యమే
# నాగేష్



ఒక సభలో నటుడు సత్యనారాయణ చాలాసేపు ఒక విషయం గురించి మాట్లాడి అది హాస్యనటుడు నాగేష్‌కి అర్థమయ్యిందో లేదో తెలుసుకోవడానికి 'ఓకే నాగేష్' అన్నారు. ఆ మాట వినగానే నాగేష్ 'నేను ఓకే నాగేష్ కాదండి. సి.కే నాగేష్ నా పేరు' అని అప్పటికప్పుడు చమత్కారంగా సందర్భానుసారంగా జోక్ పేల్చి సభనంతా నవ్వించారు. అలా సిట్యుయేషన్ కామెడీని పండించడంలో నాగేష్‌ది అందె వేసిన చేయి.

సహజంగా హాస్యనటులు అంటే వాళ్ళకి భాషాభేదాలు ఉండవు. ఏ భాషలోనైనా నటించగలరు. అలా దక్షిణ భారతదేశానికి చెందిన అన్ని భాషల్లో నటించి మంచిపేరు పొందిన నాగేష్ తెలుగువారికి కూడా ప్రియమైన హాస్యనటుడే.

అసలు పేరు గుండూరావు. దక్షిణ దేశ చార్లిస్‌చాప్లిన్ అని అభివర్ణిస్తారు.

తెలుగు తమిళ, మళయాళ కన్నడ భాషల్లో అనేక చిత్రాల్లో నటించి ఓరకంగా గిన్నిస్ బుక్ అవార్డే అందుకున్నారు.

కర్ణాటక తుంకూరు జిల్లా టిప్తూరు దగ్గరలోని చెయ్యూరులో ఆయన జన్మించారు. చిన్నతనంలోనే ఇంట్లో అమ్మానాన్నలతో పంతం పట్టి తానేంటో నిరూపించుకుంటానని శపథం చేసి మరీ మద్రాసు చేరారు.

ఆ కాలంలో తమిళ రచయితలు వాలి, నటుడు శ్రీకాంత్‌లతో కలిసి ఒకే రూమ్‌లో మకాం పెట్టారు. ఆ తరువాత చిన్నగా ఆ పని ఈ పని చేస్తూ రైల్వే డిపార్టుమెంట్‌లో ఉద్యోగం సంపాదించారు.

కాని ఆ ఉద్యోగం ఆయనకు సంతృప్తినివ్వలేదు. లోపల ఏదో సాధించమని చెబుతోంది మనసు. అందుకే నాటకాలపై మక్కువ పెంచుకున్నారు.

నాటకాల నుండి తొలిసారిగా 'నీర్‌కుళిమి' అనే తమిళ సినిమాలో వేషం ధరించారు. తెలుగువారికి సర్వర్ సుందరంగా పరిచయమయ్యారు. పూర్తి హాస్యాన్ని అందించిన చిత్రంగా ఆ సినిమా కొనియాడబడింది.

ఆ చిత్రం ఆయనకు మంచి పేరూ తెచ్చిపెట్టింది. సుమారు వెయ్యికి పైగా చిత్రాలలో నటించిన రికార్డు ఆయనది. సర్వర్ సుందరం చిత్రం తరువాత స్టార్ కమెడియన్‌గా ఎదిగి హాస్య నటచక్రవర్తిగా ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు.

కమెడియన్‌గా హాస్యాన్ని చిందిస్తూనే అవకాశం వచ్చినప్పుడల్లా విలన్‌గా కూడా రాణించారు.

పెళ్ళంటే భయం, బస్తీలో భూతం, పోస్ట్‌మాన్ రాజు, భయంకర గూఢచారి, సికింద్రాబాద్ సిఐడి లాంటి అనువాద చిత్రాలలో తెలుగువారికి దగ్గరయ్యారు.

పాపం పసివాడు, సోగ్గాడు, మనుషులంతా ఒక్కటే, సావాసగాళ్ళు, కన్నవారిల్లు, ముగ్గురు మూర్ఖురాళ్ళు, ఊర్వశి నీవే నా ప్రేయసి, జస్టిస్ చౌదరి, వేటగాడు, ఇంద్రుడు చంద్రుడు, మేడమ్, తొలిప్రేమ, తమ్ముడు, దళపతి, విచిత్ర సోదరులు, భామనే సత్యభామనే తదితర చిత్రాల్లో ఆయన నటన ఎన్నదగింది.

నటుడుగానే కాకుండా వ్యాపారవేత్తగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసారు. చెన్నైలో థియేటర్స్ నిర్మించారు.

ఆయనకి ఇద్దరు కుమారులు. కేరమ్స్, టేబుల్ టెన్నిస్ బాగా ఆడే క్రీడాకారుడు. క్రికెట్‌లో కూడా ఫాస్ట్ బౌలర్‌గా రాణించారు.

నాగేష్, మనోరమ జంట ఉంటే తమిళ సినిమాల్లో పండగే. మనకు రాజబాబు, రమాప్రభ ఎంత హిట్టో తమిళంలో వాళ్ళిద్దరి జంట అంతే హిట్టు.

నిర్మాత డి.రామానాయుడు ప్రోత్సాహంతో సత్య నారాయణ హీరోగా 'మొరటోడు' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు నాగేష్.

తమిళ అభిమానులు ఆయన్ని సూపర్‌స్టార్ అని పిలుస్తారు. ఆయన చివరి చిత్రం 'దశావతారం'. 75 సంవత్సరాల వయసులో 2009 జనవరి 31న తుది శ్వాస విడిచారు. ఆయన గౌరవార్థం ఆయన పేరిట తపాలాబిళ్ళ విడుదల చేయడం హాస్యలోకానికే గర్వకారణం.

# జంట హాస్యం లప్పాం టప్పాం-
# సీతారామ్-నల్లరామ్మూర్తి

**అ**క్కినేని నాగేశ్వరరావు నటించిన దేవదాసు చిత్రంలో క్లైమాక్స్‌లో బండి వాడు పాత్రలో ఒదిగిపోయి కరుణరసాన్ని కురిపించిన నటుడు, అందులోనూ హాస్యనటుడు భీమన సీతారాం. ఆ చిత్రంతో ఆయనకు అద్భుతమైన గుర్తింపు వచ్చింది.

ముందుతరం హాస్యనటుల్లో తనదైన స్టైలున్న నటుడు భీమన సీతారాం. ఆయనతో పాటుగా కలిసి అనేక చిత్రాల్లో జంటహాస్యం కురిపించిన నల్ల రామ్మూర్తి కూడా ఓ అద్భుతమైన టైమింగ్ వున్న నటుడు. ముఖ్యంగా నల్ల రామ్మూర్తి వాయిస్ వింటే అందరికీ నవ్వు వచ్చేది. ఆ వాయిస్ కోసమే ఆయనకు అవకాశాలు ఇచ్చేవారు దర్శక నిర్మాతలు.

సీతారాం, నల్లరామ్మూర్తి ఊహ తెలిసినప్పటినుండి నటనే ప్రాణంగా పెరిగారు. నల్లరామ్మూర్తి సీతారామ్‌లు కలిసి సినీ వనంలో జంటగా మెలిగి అనేక చిత్రాల్లో నటించారు. అందుకే వారిద్దరికీ జంట హాస్యనటులు అనే పేరు వచ్చింది.

సీతారాం విజయవాడ కొత్తపేట సెంటర్లో 1944 ముందు నుండే నటన తోడిదే లోకంగా తిరిగేవారు. ఆయనకో స్నేహితుడు వాలిశెట్టి కోటేశ్వరరావు ఇద్దరూ కలిసి నటించాలి అనే ఆశతో ఎక్కడ ఏ నాటకాలు జరిగినా అక్కడకు వెళ్లిపోయేవారు.

హాస్యనటనకు ఓనమాలు దిద్దిన నాటినుండి అనేక వేషాలు వేసినా, అత్తరు సాయిబు నటనకు ప్రజలు జేజేలు పలికారు సీతారాంకు. ఎక్కడికి వెళ్లినా సాయిబు అని పిలిచేవారు. ప్రేక్షకులు ఇచ్చిన వెన్నుదన్నుతో మద్రాసుకు వెళ్లారు.

చిన్నప్పటినుండి వామపక్ష భావాలతో ఎదిగిన సీతారాంకు అక్కడ భారీ పరిచయాలు కూడా ఉపయోగపడ్డాయి. యానాంపేటలో ఓ గది అద్దెకు తీసుకున్నారు. సీతారాం మరీ బక్కపలచగా ఉండడంతో వేషాలు రావడం కష్టమయ్యింది. నాటకంలో తన అత్తరు సాయిబు వేషాన్ని మిమిక్రీగా చేసి హెచ్.ఎమ్. రెడ్డి ముందు ప్రదర్శించాడు.

హెచ్.ఎమ్. రెడ్డి నిర్మిస్తున్న తెనాలిరామకృష్ణలో తొలిసారిగా అదే అత్తరు సాయిబు నటనకు గుర్తింపు వచ్చింది. అదే ఆయన తొలి చిత్రం. స్టేజి ఆర్టిస్టు వి.వి.లక్ష్మణస్వామి హీరోగా నటిస్తే ఆ చిత్రంలో ఎల్.వి.ప్రసాద్ కూడా నటించారు. శోభనాచల స్టూడియోవారు రూపొందించిన చిత్రం పల్లెటూరి పిల్ల. ఈ చిత్రంలో నల్ల రామ్మూర్తి, సీతారాం హాస్య జంటగా పేరు తెచ్చుకున్నారు. లప్పాం టప్పాం అని కనిపించే ఆ పాత్రల్లో గయ్యాళి భార్యకు భయపడుతూ వద్దుర బాబోయ్ పెళ్లి వద్దుర బాబోయ్ చిటపట చినుకులు అంటూ సాగే పాటల్లో వారి అభినయానికి తెలుగు ప్రేక్షకులందరూ అభిమానులౌతారు.

అదే జంట మళ్లీ నల్లరామ్మూర్తి, సీతారాం హీరోలుగా 1951లో 'టింగురంగా' అనే చిత్రం రూపొందించారు. అది సరియైన ఫలితాన్నివ్వలేదు. తరువాత కేరక్టర్ ఆర్టిస్టుగా అనేక చిత్రాల్లో నటించారు. గొల్లభామ చిత్రంలో యువరాజుకు స్నేహితుడుగా గుఱ్ఱంపై సీతారాం చేసిన విన్యాసం సరికొత్తగా ఆ రోజుల్లో చెప్పుకునేవారు.

బాలరాజు, స్వప్నసుందరి, అంతా మనవాళ్ళే, రోజులు మారాయి, భాగ్యదేవత, ఎత్తుకు పైఎత్తు, కుంకుమరేఖ, పెద్దరికాలు, కలసి వుంటే కలదు సుఖం, మాంగల్యబలం, చెంచులక్ష్మి, బందిపోటు దొంగలు, జయసింహ, కదలడు వదలడు, చివరకు మిగిలేది, మహాకవి కాళిదాసు, శ్రీలక్ష్మమ్మకథ, అనార్కలి లాంటి చిత్రాలలో సీతారాం తనదైన నటనతో తెలుగు ప్రేక్షకులను మెప్పించారు.



దర్శకుడు కె.బాబూరావు అనేక చిత్రాలలో ఆయనకు అవకాశాలు ఇచ్చారు. వేషాల కోసం మద్రాసు వీధుల్లో లాల్చీ పైజామా వేసుకుని, ఓ పాత సైకిల్‌పై ఆఫీసుల చుట్టూ తిరిగేవారు. ఆ తరువాత ఆయన చుట్టే దర్శక నిర్మాతలు తిరిగేటట్టు చేసుకున్నారు.

ఆ రోజుల్లో సీతారాం, నల్ల రామ్మూర్తి జంటకు ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉండేది.

దాదాపు 300 పైచిలుకు చిత్రాల్లో నటించిన సీతారామ్ 12.12.1981న తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. నల్లరామ్మూర్తి, సీతారాంలు కలిసి నటించి హాస్యం కురిపించిన చిత్రాలు ఇప్పటికీ మరచి పోలేము.

# నవ్వుల తావి–
# రావి కొండలరావు

ఇంగ్లీష్‌లో ఎన్‌సైక్లోపీడియా అనే మాట ఉంది. ప్రపంచంలోని అన్ని విషయాలు ఎన్‌సైక్లోపీడియాలో ఉంటాయి. అలాంటి వ్యక్తులు కూడా అరుదుగా మనకు కనిపిస్తూంటారు. అలాగే తెలుగు సినిమా పరిశ్రమకు సంబంధించిన ఎన్‌సైక్లోపీడియా ఎవరు అంటే ఎవరైనా చెప్పే పేరు–రావికొండలరావు.

1932 ఫిబ్రవరి 11న అంటే తెలుగు సినిమా పుట్టిననాడే ఆయన పుట్టారు. ఆ సినిమాతోనే ఎదుగుతూ వచ్చారు. శ్రీకాకుళంలో రావి చిదంబరం, పార్వతమ్మలకు ఆయన జన్మించారు. తొలినాళ్ళలో నటనపై అభిరుచి ఉండడంతో నాటకాలవైపు ఆయన ప్రస్థానం సాగింది. నటుడు, దర్శకుడు, ఎడిటర్, నిర్మాత, సంగీతకారుడు, రచయిత, నాటకకర్త, డబ్బింగ్ కళాకారుడు, రేడియో ప్రవక్త లాంటి ఎన్నో విశేషమైన ప్రక్రియలతో, తన ప్రతిభతో ప్రస్థానం సాగించారు.

ఓ రకంగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పలువురు సినీ దర్శక నిర్మాతలు ఆయనను కొనియాడుతూనే వుంటారు.

చిన్న వయసులో వేమూరి గగ్గయ్య గారి చిత్రాలు చూసి పద్యాలు పాడి నటించాలని అనుకునేవారట.

ఆయన 16వ ఏటనే తొలి కథ అచ్చయ్యింది. అదే సంవత్సరం నటన కూడా ప్రారంభమయ్యింది ఆయన జీవితంలో.

పరిశ్రమకు వచ్చాక తొలినాళ్ళలో అక్కినేని నాగేశ్వరరావు సైకిల్ మీద తిరగటం కూడా చూసారాయన. ఎన్.టి.ఆర్ తొలిషాట్‌లో కూడా ఆయన ప్రత్యక్షంగా ఉన్నారు.

దర్శకుడు, రచయితలు బాపూరమణలతో ఆయన స్నేహం అపూర్వమైనది.

తొలినాళ్ళలో 'సరదా', 'బంగారుపాపలు' అనే చేతివ్రాత పత్రికలు నడిపించారు.

ఆనందవాణి అనే పత్రికలో తొలిసారిగా ఉద్యోగంలో చేరారు.

ఆర్.ఎస్.ఎస్.లో పాల్గొని రాజమండ్రి సెంట్రల్ జైలులో కొన్నాళ్ళు జైలు జీవితం కూడా గడిపారు.

చిత్తూరు నాగయ్యగారంటే ఆయనకు వల్లమాలిన అభిమానం. ఆయనను ఒక్క సారైనా చూస్తానా అని అనుకునేవారట. అటువంటిది ఆయనతోనే నటించి, ఆయన ఆత్మకథను రాసారు రావికొండలరావు.

ఓవైపు నటుడిగా, మరోవైపు విజయచిత్ర ఎడిటర్‌గా రెండు పార్శ్వాలను రెండు జోడు గుర్రాల సవారీలా సాగించారాయన.

చిత్రాల్లో నటిస్తూనే మధ్యమధ్యలో వాహినీ స్టూడియోలో విజయచిత్ర ఆఫీసుకు వచ్చి ప్రూఫ్‌లు దిద్దుకునే అనేక సందర్భాలు ఉన్నాయని చెబుతారు. అప్పుడప్పుడు వ్యాసాలు కూడా రాసేవారు. మాంత్రికుడి వేషంలో వుండి ఇదేంటి ఇలా రాస్తున్నాడు అని అబ్బురపడేవారుట అప్పట్లో చూసేవారు. అలా ఏ పనినైనా సరే వంద శాతం న్యాయం చేకూర్చేలా ఆయన ప్రయత్నించేవారు.

ప్రేమించిచూడు, రాముడు భీముడు, ఆలీబాబా 40 దొంగలు, తేనెమనసులు, అందాలరాముడు, దసరాబుల్లోడు, జీవితచక్రం, తాసీల్దారు గారి అమ్మాయి, రంగూన్‌రౌడీ, పెళ్ళి పుస్తకం, మేడమ్, బృందావనం, మీ శ్రేయోభిలాషి, కింగ్, వరుడు



లాంటి అనేక చిత్రాల్లో నటించి స్టార్ వేల్యూను సాధించారు.

పాత్ర ఏదైనా దాని ప్రభావాన్ని తెరపై అద్భుతంగా ఆవిష్కరిస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు రావికొండలరావు.


పెళ్లి పుస్తకం చిత్రానికి ఉత్తమ కథారచయితగా నంది అవార్డు అందుకున్నారు.

ఇంటూరి మెమోరియల్ అవార్డు, నాగావళి నుండి మంజీర వరకు అనే పుస్తకాన్ని రచించినందుకు ఆయనకు గొప్ప పేరు వచ్చింది.

అలాగే కళాప్రపూర్ణ టైటిల్ కూడా వరించింది.

ఎటువంటి దురభ్యాసాలు లేకపోవడమే నా ఆరోగ్యానికి కారణం అనే ఆయన 88వ ఏట 2020 జూలై 28న అభిమానులను శోకసంద్రంలో ముంచి దివంగతులయ్యారు. దాదాపు 600 చిత్రాల్లో నటించిన ఆయన ఎప్పటికీ తరగని కీర్తిని, గుర్తింపు పొందారు.

# ఒక్కడే...
# రాళ్ళపల్లి



నటులు, నటనను ఓ వృత్తిలా కాకుండా ప్రవృత్తిగా భావించి అదే ప్రాణంగా, దైవంగా భావిస్తే ఆ నటుడినించి వచ్చే అద్భుతాలు ఇన్నని చెప్పలేము. అటువంటి అరుదైన వ్యక్తులలో రాళ్ళపల్లి ఒకరు.

హీరోగా నటించేవారికి కొన్ని పడికట్టు పాత్రలుంటాయి. అలాగే కేరక్టర్ ఆర్టిస్టుకి వారికి తగ్గ గుండెపోటు పాత్రలు ఉంటాయి. కాని రాళ్ళపల్లి లాంటి నటుడికి ఈ పాత్రలే కచ్చితంగా సరిపోతాయి అన్న మాట ఏ దర్శకుడి నుండీ వినలేం.

తాగుబోతు మొగుడుగా రాధాకళ్యాణంలో బాపు చూపించారు. 'ఏం మొగుడో ఏం మొగుడో వద్దంటే వినడేమి ఓరి దేవుడో తాగవద్దంటే వినడేమి ఓరిదేవుడో' అన్న పాటలో ఏ హీరోకి తక్కువ కాకుండా నృత్యం చేసారు రాళ్ళపల్లి. చలిచీమలు చిత్రంలో స్వీయగాత్రంలో 'ఏమి పాయె పుత్ర పాయె' అన్న గీతంలో ఆయన నటన ఏ హీరోకి తీసిపోనిది. ఇక్కడ దర్శకుడు రాళ్ళపల్లిలో ఓ విప్లవకారుణ్ణి చూసాడు. విలనిజం చేసే పాత్రను వంశీ అన్వేషణలో ఇచ్చాడు. అది సాత్విక విలనిజం.

హాస్యం, శృంగార, సాత్త్విక, భయానక, రౌద్ర, బీభత్స రసాలు ఏదయినా సరే రాళ్ళపల్లి ముందు తలొంచాల్సిందే.

చిన్నప్పటి నుండే తన ఇంటి పక్కన పిల్లలకు మేకప్పులు వేసి వీధి అరుగు మీద నాటకాలు ఆడే దర్శక నటుడాయన. ఎన్నో నాటకాలు రాసాడు. ఆ నాటకాలన్నిటికీ తానే దర్శకత్వం వహించాడు. అలా తనలోని నటుడ్ని తెరపై ఆవిష్కరించాలని దర్శకుడు ప్రత్యగాత్మకు ధైర్యంగా ఒక లేఖ రాసారు. 'నేను అంత ఎత్తు కాదు. అందగాడ్ని కాదు. కాని పదిహేడేళ్ళ నాటకానుభవం వుంది. హీరోగా పనికిరాను. కాని ఏ పాత్ర ఇచ్చినా చేస్తా' అన్న తమాషా అయిన ఉత్తరాన్ని చూసి ప్రత్యగాత్మ 'స్త్రీ' అనే చిత్రంలో తొలి అవకాశమిచ్చారు.

అప్పటినుండి ఆయన ఒకవైపు నాటకాలు, మరోవైపు సినిమాల జోడెద్దుల బండి పై సవారీ చేసారు. ఏ పాత్ర అయినా సరే రాళ్ళపల్లి నటిస్తున్నాడూ అంటే అది అద్భుతంగా వుంటుంది అనిపించేలా చేసాడు.

1945 ఆగస్టు 15న అనంతపురంలో జన్మించిన ఆయన చిన్నతనం నుండే నాటకాలు వేసేవారు. తొలినాళ్ళలో కొన్ని చిత్రాల్లో చిన్న చిన్న పాత్రల్లో నటించినా 'నాగమల్లి' చిత్రంతో ఆయనకు హాస్యనటుడిగా గుర్తింపు వచ్చింది. తనికెళ్ళ భరణి, రాళ్ళపల్లి గురుశిష్యులుగా అనేక ప్రదర్శనలు ఇచ్చారు. తన ప్రతి పుట్టినరోజునాడు ఒక కళాకారునికి యాభైవేలు నగదుతో పాటుగా సన్మానాన్ని అందించిన గొప్ప మనసున్న కళాకారుడు రాళ్లపల్లి.

చిల్లరదేవుళ్ళు, సీతాకోకచిలుక, లేడీస్‌టైలర్, ఏప్రిల్ 1 విడుదల, జోకర్, సితార, కనకమహాలక్ష్మీ రికార్డింగ్ డాన్స్ ట్రూప్, బొంబాయి, ఆడది, ఆలీబాబా అరడజను దొంగలు, సాహసవీరుడు సాగరకన్య చిత్రాలలో నటించి ఆయన మంచి గుర్తింపు పొందారు. ముఖ్యంగా సీతాకోకచిలుకలో స్మిత పనివాడుగా చేసిన నటన గొప్పగా నిలిచింది. బొంబాయి చిత్రంలో హిజ్రాగా నటించి పలువురి మన్ననలు పొందారు.

నాటకాలు దాదాపుగా 8,000 ప్రదర్శనలు ఇవ్వడం ఓ రికార్డు. శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ 2019 మే 17న హైద్రాబాద్‌లో ఆయన కన్నుమూసారు.

1960లో ఆయన ముఖానికి రంగు వేసుకున్న ఆయన, చనిపోయేంతవరకు అది ఆపలేదు. 8,000 నాటకాలు, 850 చిత్రాల్లో నటించారు.

రఘుపతి వెంకయ్య అవార్డు, ఎన్‌టిఆర్ జాతీయ అవార్డు, బిఎన్ రెడ్డి అవార్డు, నాగిరెడ్డి చక్రపాణిల అవార్డులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. సినిమా ప్రయోజనం ప్రేక్షకుణ్ణి చెడగొట్టకుండా వుండడమే అనే ఆయన బూతు కామెడీకి నటీనటులు కారణం కాదని, ఆయా దర్శకులే కారణమని, నటులు కేవలం కీలుబొమ్మలు మాత్రమేనని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేవారు. నాటకం సజీవమైనది. భుక్తి కోసం సినిమా. ఆత్మసంతృప్తి కోసం నాటకాలు వేస్తున్నానంటూ చెప్పే ఆయన నిజంగా కర్మయోగి.

# చిడతల చిరుత–
# చిడతల అప్పారావు

మన తెలుగు చిత్రాలలో అందం లేకపోయినా అభినయం వుంటే వారికి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా వస్తాయని తెలియచేయటానికి ఒక ఉదాహరణ చిడతల అప్పారావు.

రాజమండ్రి దగ్గర అన్నపూర్ణమ్మపేట నివాసం. అయితే వీరి పూర్వీకులు శ్రీకాకుళం నుండి వలస వచ్చినవారు. అప్పట్లో నాటకాలలో పద్యాలు పాడేటప్పుడు, పాటలు పాడటానికి చిడతలు వాయించేవారు. ఆ చిడతల వాయింపు శబ్దాన్ని తన చేతితోనే వినిపించేవారు. అందుకే ఆయనకి చిడతల అప్పారావు అనే పేరు స్థిరపడిపోయింది.

నటనపై మక్కువతో రాజమండ్రి నుంచి రాజబాబు, నిర్మాత జయకృష్ణ, మరికొందరు మిత్రులు కలిసి మద్రాస్ చేరారు. పొట్టి ప్రసాద్, ధమ్, పొట్టి సత్యం కూడా వీరి స్నేహితులే. తొలినాళ్ళలో అవకాశాలు రాకపోయినా సినీ దుస్తులు కుట్టే టైలర్‌గా, ఆ తర్వాత మేకప్‌మెన్‌గా పని చేస్తూ మేకప్ వేసుకుని నటించడం కూడా మొదలుపెట్టారు.

ఆయన తొలిసారిగా నటించిన చిత్రం ఎన్.టి.ఆర్. తొలిచిత్రం మనదేశం. ఆ తరువాత రాజు పేద, పెంకిపిల్ల తదితర చిత్రాల్లో చిన్న చిన్న వేషాలు ధరించారు. చిడతల అప్పారావు లోని ప్రతిభను గమనించిన దర్శక నిర్మాతలు ఆయనకోసం చిన్న చిన్న పాత్రలను ఆఫర్ చేసేవారు. ఏ పాత్రనైనా సరే తన ముద్ర ఉండేలా ఆయన నటించి చూపించేవారు. దాదాపు 800 చిత్రాలలో అనేక పాత్రల్లో నటించారు. ఇ.వి.వి. సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన ఆలీబాబా అరడజను దొంగల్లో ఓ దొంగగా అద్భుతంగా నటించి ప్రేక్షకులను మెప్పించారు.

సతీ అనసూయ, రైతుబిడ్డ, వింతఇల్లు సంతగోల, ప్రయాణాల్లో పదనిసలు ఇలాంటి అనేక చిత్రాల్లో నటించిన ఆయన కృష్ణ, శోభన్‌బాబు పరిశ్రమకు వచ్చినప్పుడు వారికి కూడా కాస్ట్యూమ్స్ తయారు చేయడం విశేషం.

1979లో హాస్యనటులు రమణారెడ్డి పురస్కారాన్ని చిడతల అప్పారావు అందుకున్నారు. తన తండ్రి మొదటి చిత్రంలో నటించిన నటుడిగా చిడతల అప్పారావును నటులు బాలకృష్ణ సన్మానించారు. పరిశ్రమలో అందరిచేత మంచి వ్యక్తి అనిపించుకున్న అప్పారావుకు భార్య దుర్గ, కుమారుడు నవీన్‌కుమార్ ఉన్నారు. నవీన్‌కుమార్ ప్రస్తుతం కెమేరామెన్‌గా పరిశ్రమలో పలు చిత్రాలకు పని చేస్తుండటం విశేషం.



ఆయన చివరి చిత్రం దాసరి నారాయణరావు దర్శకత్వంలో వచ్చిన మాయాబజార్.

1933లో రాజమండ్రిలో జన్మించిన చిడతల అప్పారావు 1995 నవంబర్ 7వ తేదీన లంగ్ క్యాన్సర్‌తో మరణించారు.

With Best compliments from
SANAAREE computers
GOLD PARTNER
Printing & Personal System Group
K.Hara Gopal MBA
Cell: 98490 01655
RICOH,
DELL
TVSE
EPSON
SAMSUNG
CANONLEXMARK
LENOVA
101,Sanatana Ecstasy, # 3-6-369/1, Street No-1, Himayatnagar,
Hyderabad-500 029. Tel: 040-27634186, 040-27650083.
emai: hara@sanaaree.com, sanaaree@gmail.com. www.sanaaree.com

# నూటొక్క జిల్లాలకు అందగాడు-
# నూతన్‌ప్రసాద్

'మన దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో వుంది', 'శిశువా', 'దేవుడో దేవుడా'. ఇటువంటి సంభాషణలు వినగానే గుర్తుకొచ్చే పేరు నూతన్‌ప్రసాద్.

1970, 80వ దశకంలో తెలుగు సినిమా చరిత్రలో ఓ సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్న నటుడు నూతన్‌ప్రసాద్.

'కొత్తా దేవుడండి కొంగొత్తా దేవుడండీ' అంటూ బాపురమణలు రూపొందించిన 'రాజాధిరాజు' చిత్రంలో అద్భుతంగా నటించి సాతాను ఎలా ఉంటాడో అన్న మాటకు సమాధానంగా నిలిచారు వెండితెరపై.

అభిమానుల చేత నూటొక్క జిల్లాల అందగాడుగా పిలిపించుకున్న ఆయన, తాడినాడ వరప్రసాద్‌గా పరిశ్రమలో సుపరిచితుడు.

డిసెంబరు 12న 1945లో కైకలూరులో జన్మించారు నూతన్‌ప్రసాద్. బందరులో ఐ.టి.ఐ.చదివి నాగార్జునసాగర్, హైద్రాబాద్‌లలో చిరుఉద్యోగాలు చేసి చివరికి హెచ్.ఏ.ఎల్.లో సెటిలయ్యారు.

వలయం, గాలివాన, కెరటాలు లాంటి నాటకాలతో కళారంగానికి పరిచయమయ్యారు. 'మాలపల్లి' నాటకాన్ని వంద పైచిలుకు ప్రదర్శించి ఓ రికార్డు సృష్టించారాయన. బాపురమణలు రూపొందించిన 'అందాలరాముడు' చిత్రంలో తొలిసారి వెండితెరపై మెరిసారు. నీడలేని ఆడది, ముత్యాలముగ్గు, ప్రాణం ఖరీదు, సమాజానికి సవాల్, ప్రెసిడెంట్ పేరమ్మ, ఇంటింటి రామాయణం, తదితర చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్నారు.

ప్రెసిడెంట్ పేరమ్మలో హీరో కేరక్టర్‌లో నటించారు. రాజాధిరాజులో విలన్‌గా నటిస్తే, తాతయ్య ప్రేమలీలలులో తాతయ్యగా నటించడం మరో విశేషం.

పెళ్లిళ్ళోయ్ పెళ్ళిళ్ళు లాంటి కొన్ని హాస్య చిత్రాలలో కథానాయకుడుగా కూడా నటించారు. ఆ తరువాత కమెడియన్‌గా, కేరక్టర్ ఆర్టిస్టుగా ఆయన ప్రస్థానం సాగింది.

చలిచీమలు చిత్రంలో ఆయన నటించిన పాత్రకు నూటొక్క జిల్లాల అందగాడు అన్న పేరు వచ్చింది. అదే ఆ తరువాత ఆయనకు సార్థక నామధేయమయ్యింది.


ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు ప్రాణం పోసారు. ఎంత పెద్ద డైలాగ్‌నైనా ఒకే టేక్‌లో చెప్పేసేవారు.

ఒకసారి 12 వందల అడుగుల షాట్‌ని ఒకేరోజులో పూర్తి చేసి సంచలనం సృష్టించారాయన. దర్శకుల మనోభావాలను అర్థం చేసుకుని అతి క్లిష్టమైన సన్నివేశానికి తగిన విధంగా నటించి చూపేవారు. దాదాపు 365 చిత్రాల్లో నటించారు.

భానుమతికి జంటగా 'బామ్మ మాట బంగారు బాట' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఆ సినిమా షూటింగ్ సందర్భంలో యాక్సిడెంట్ కావడంతో వీల్ ఛెయిర్‌కే పరిమితమయ్యారు. వీల్‌ఛెయిర్‌లోనే మరికొన్ని చిత్రాల్లో నటించారు.


దాదాపు 200 చిత్రాలలో జడ్జి పాత్రల్లో నటించారు. ఓ నటుడు అనారోగ్యానికి గురై కేవలం వీల్ ఛెయిర్‌కే పరిమితమై శతాధిక చిత్రాల్లో నటించడం ఓ రికార్డుగా నిలిచింది.

ఆనందం, రుద్రనేత్ర, ఖైదీ నెం 786, ఒక రాధ ఇద్దరు కృష్ణులు, శ్రీవారికి ప్రేమలేఖ, దొంగ, మంత్రిగారి వియ్యంకుడు, పట్నం వచ్చిన పతివ్రతలు, అబ్బాయిగారు, తిరుగుబాటు, అగ్నిపర్వతం, కలెక్టర్‌గారి అబ్బాయి, ఇంటింటి రామాయణం, బిగ్‌బాస్, ఘరానాబుల్లోడు, తాజ్‌మహల్, కర్తవ్యం, మాస్టర్, ఆవారాగాడు, విజయ్, ఆదర్శవంతులు, యుద్ధభూమి, త్రినేత్రుడు, ఆఖరి పోరాటం, చూపులు కలసిన శుభవేళ, దొంగకోళ్ళు, తదితర చిత్రాల్లో ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టారు ఆయన.



వీల్ ఛెయిర్‌కే పరిమితమైనా మొక్కవోని ధైర్యంతో ఆయన కెరీర్ కొనసాగించారు. 2011 మార్చి 30న హైద్రాబాద్‌లో అనారోగ్యంతో కన్నుమూసారు. ఆయన కన్ను మూసినా నూటొక్క జిల్లాల అందగాడుగా ఇప్పటికీ ఆయన రికార్డు ఆయన పేరిటే నిలబడడం విశేషం. ఆయన స్థానంలో మరొకర్ని ఊహించడం కష్టం ప్రేక్షకులకు.

# బట్టల సత్తి–
# మల్లిఖార్జునరావు!



'ఏదో ఫ్రెండ్‌షిప్ కోసం చెప్పాం' అన్న మాట వినగానే గుర్తొచ్చే నటుడు మల్లిఖార్జునరావు. అతని అసలు పేరు పీలా కాశీ మల్లిఖార్జునరావు.

రంగస్థల నుండి వెండి తెరపైకి వచ్చిన నటుడాయన. అందుకే ఏ పాత్ర ధరించినా ఆ పాత్ర స్వచ్ఛంగా ఉంటుందనడంలో ఎటువంటి సందేహంలేదు.

1951 డిసెంబరు 13న అనకాపల్లిలో జన్మించారు. చిన్నతనం నుండే నాటకాలు ఏకపాత్రాభినయాలు ప్రదర్శిస్తూ ఉండేవారు. బాల్యంలోనే దాదాపు 50 నుంచి 60 నాటకాలు ఆడినట్లుగా ఆయనే ఒకసారి చెప్పారు.

భమిడిపాటి రాధాకృష్ణ రాసిన 'లెక్కలు తెచ్చిన చిక్కులు' ఆయన తొలి నాటకం. ఆయన్ని రంగస్థలంపై నటుడిగా నిలబెట్టింది 'పలుకే బంగారమాయె' నాటకంలో నిర్మాత వేషం ఆయనకెంతో గుర్తింపు తెచ్చింది. అనకాపల్లిలోనే ఎమ్.బి.ఎమ్. ఆస్పత్రిలో కొన్నాళ్ళు ఉద్యోగం చేసారు. అక్కడ ట్రేడ్ యూనియన్‌కు నాయకత్వం వహించారు. నటుడు రావుగోపాలరావు సహకారంతో వెండితెరకు వచ్చారు.

1972లో 'తులసి' అనే చిత్రంలో ఓ చిన్న వేషం వేసారు. ఆ సమయంలోనే పార్వతీ పరమేశ్వరులు చిత్రానికి సహాయ దర్శకుడుగా కూడా పనిచేసారు. 'నాగమల్లి' లాంటి కొన్ని చిత్రాల్లో నటించాక వంశీతో ఏర్పడిన పరిచయం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది.


మంచుపల్లకీలో ఆయన ఓ చిన్న పాత్రలో నటించారు. అన్వేషణలో పులిరాజుగా మల్లిఖార్జునరావు నటన చిత్రసీమను ఆకట్టుకుంది. ఆ తరువాత లేడీస్‌టైలర్ చిత్రంలో బట్టల సత్యం పాత్రకు అద్భుతమైన గుర్తింపు రాగా ఇక అవకాశాల కోసం వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం లేకుండా పోయింది.

సితార, శ్రీకనకమహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్, ఏప్రిల్ 1 విడుదల, హలో బ్రదర్, ఆలీబాబా 40 దొంగలు, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, బద్రి, ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు, ఎవడి గోల వాడిది, దాసన్న, 143... లాంటి చిత్రాలు ఆయనకి మంచి గుర్తింపునిచ్చాయి. ముఖ్యంగా హలో బ్రదర్ చిత్రంలో కోటతో కలిసి చేసిన కామెడీ కన్నీళ్ళు తెప్పించింది ప్రేక్షకులకు. అలాగే జంబలకిడి పంబలో పురిటినొప్పులు పడిన తండ్రిగా ఆయన నటన హైలెట్‌గా నిలిచింది.

తమ్ముడు చిత్రానికి ఉత్తమ సహాయనటుడుగా నంది అవార్డు అందుకున్నారు. మా జనరల్ సెక్రటరీగా, టిడిపి కల్చరల్ సెక్రటరీగా ఆయన పని చేసారు. రఘుపతి వెంకయ్యనాయుడు బంగారు పతకాన్ని పొందారు. దాదాపు 400 చిత్రాలకు పైగా నటించారు. మల్లిఖార్జునరావు నటనలో తనకంటూ ఓ పంథాను ఏర్పరచుకున్నారు. తొలినాళ్ళలో రావుగోపాలరావు ప్రభావముండేది. తన సంభాషణా ఉత్తరాంధ్ర యాసను మేళవించడంతో జనాన్ని సులభంగా ఆకట్టుకోగలిగారు. ఆ యాసని, మాండలికాన్ని సాధికారికంగా మాట్లాడగలిగే నటుడిగా గుర్తింపు పొందారు.



గ్రామీణ నేపథ్యం ఉన్న పాత్రలకు జీవం పోసే నటుడిగా ఆయన ముందుండేవారు. 'మహానగరంలో' చివరి చిత్రం. 57 సంవత్సరాల వయసులో లుకేమియా వ్యాధితో బాధ పడుతూ 2008 జూన్ 24న తుదిశ్వాస విడిచారు. ఇప్పటికీ బట్టల సత్తి అనే పేరుని మాత్రం ఆయనకు సార్థక నామధేయంగా మిగిలిపోయింది. ఆ పేరు వినగానే మల్లిఖార్జునరావే గుర్తుకు వస్తారు.



# వేలుతో హాస్యం-
# సుత్తివేలు

'**మీ**రు ఏమంటే సుత్తి తీస్తారోనని భయమండయ్యా. సుత్తి వేయకండయ్యా' అన్న డైలాగులతో పాపులర్ అయిన నటుడు సుత్తివేలు. చిన్నప్పుడు సన్నగా, రివటగా ఉన్న ఆయనను చూసి పక్కింటివారు వేలు అని పిలిచేవారు. అలా వేలు కాస్త సినిమాల్లోకి వచ్చాక 'సుత్తివేలు'గా మారారు. ఆయన అసలు పేరు కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు. 1947 ఆగస్టు 7న మచిలీపట్నం వద్ద వున్న భోగిరెడ్డిపల్లెలో జన్మించారు.

బాల్యం నుండి నాటకాలపై ఆసక్తి ఉండేది. 1966లో పీయుసి పూర్తి చేసి హైద్రాబాద్ వచ్చి, ఉద్యోగం చేసారు. బాపట్లలో మరి కొన్నాళ్ళు ఉద్యోగం చేసారు. స్నేహితులతో నాటకాలు వెయ్యటం మొదలుపెట్టారు. 1981లో విశాఖపట్నం డాక్‌యార్డ్‌లో పర్మనెంట్ ఉద్యోగం సంపాదించారు. అక్కడ భమిడిపాటి వారి నాటకాలు 'అంతా ఇంతే', 'మనిషి నూతిలో పడితే' అన్న నాటకాలకు మంచిపేరు వచ్చింది సుత్తివేలుకు.

ఆ నాటకంలో నటనను చూసి దర్శకుడు జంధ్యాల తాను తొలిసారిగా రూపొందిస్తున్న 'ముద్దమందారం' చిత్రంలో అవకాశం ఇచ్చారు. సినిమాలలో పడి ఉద్యోగం పోవడంతో నటననే వృత్తిగా స్వీకరించారాయన.

నాలుగు స్తంభాలాట, వందేమాతరం, ప్రతిఘటన, మల్లెపందిరి, ఆనందభైరవి, రెండు జెళ్ళ సీత, శ్రీవారికి ప్రేమలేఖ, చంటబ్బాయ్, త్రిశూలం, కలికాలం, ఒసేయ్ రాములమ్మ, వీరభద్ర, శ్లోకం, ఆదిత్య 369, ఖైదీ నెం 786, కిల్లర్, అత్తకు యముడు అమ్మాయికి మొగుడు, విజయ్, యముడికి మొగుడు, చైతన్య తదితర చిత్రాల్లో ఆయన నటించారు. దాదాపు 200 చిత్రాలలో నటించిన ఆయనకు ప్రతిఘటనలో ఉత్తమమైన నటన ప్రదర్శించినందుకు, ఆ తర్వాత 1984లో వందేమాతరం చిత్రానికి ఉత్తమ సహాయనటుని పాత్రకు అవార్డులు దక్కాయి. పరిశ్రమ చెన్నైని వదిలి హైద్రాబాద్ రావడంతో ఆయనకు అవకాశాలు సన్నగిల్లాయి. కొన్నాళ్ళు హైద్రాబాద్‌లోనే వుండి టెలీసీరియల్స్‌లో నటించారు. ఆనందోబ్రహ్మ, మల్లాది రామకృష్ణశాస్త్రి కథలు, భమిడిపాటి రామగోపాలం కథలలో ఆయన నటనకు మంచిపేరు వచ్చింది. చివరి రోజుల్లో హైద్రాబాద్‌కు మకాం మార్చారు. కాని ఆయనకు సరియైన అవకాశాలు రాలేదు. కలికాలం చిత్రంలో ఆయన నటనకు ముగ్ధులవని తెలుగు ప్రేక్షకులు లేరంటే




సందేహం లేదు. చివరిరోజుల్లో అనారోగ్యంతో బాధ పడుతూ 2012 సెప్టెంబర్ 16న మద్రాసులో కాలధర్మం చెందారు. ఆయన లేకపోయినా సుత్తివేలు అనే పేరు మాత్రం నిలిచి వుంటుంది... ప్రేక్షకులకు గిలిగింతలు పెడుతూనే వుంటుంది.





# హాస్య పట్టభద్రుడు
# సుత్తి వీరభద్రరావు



హైదరాబాదు, ఆదిలాబాదు, సికింద్రాబాదు, అహ్మదాబాదు, ఫకీరాబాదు, అలహాబాదు, ఫరీదాబాదు, ఔరంగాబాదు. తరువాత బీసెంట్ రోడ్డు, బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, నక్కల రోడ్డు, తిక్కల రోడ్డు. ఇలాంటి డైలాగ్స్ వినగానే తొలుత మనకు గుర్తుకు వచ్చేది సుత్తి వీరభద్రరావు గారు.

ఆయన నటించిన సినిమాలు చాలా తక్కువే అయినా, ఆయనకు వచ్చిన గుర్తింపు చాలా ఎక్కువ. ఆయన హాస్యనటుడే కాక రేడియో నాటక కళాకారుడు.

అందరూ సుత్తి వీరభద్రరావుగా పిలిచే... ఆయన అసలు పేరు మామిడిపల్లి వీరభద్రరావు.

1947 జూన్ 6న తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. చిన్నతనం నుండే నాటకరంగం మీద మక్కువతో తండ్రి చూసిన అనేక ఉద్యోగాలను కాదనుకుని ఓ వైపు నాటకాలు, మరో వైపు ఉద్యోగం అంటూ అటూ ఇటూ తిరిగారు కొన్నాళ్ళు. చివరికి ఉద్యోగం ఆకాశవాణిలో రావడంతో అక్కడ స్థిరపడ్డారు.

ఆయన నటించిన మొదటి చిత్రం-'బలిపీఠం! ఒకసారి సరదాగా ఓ మిత్రుని దగ్గరకు వెళ్లిన వీరభద్రరావుని మాదాల రంగారావు చూసి 'ఎర్రమల్లెలు' చిత్రంలో ఓ వేషం ఇచ్చారు. ఆ చిత్రంలో లాయర్‌గా నటించారు. ఆ సినిమాలలో గుర్తింపు రాలేదు. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన నాలుగు స్తంభాలాట చిత్రంలో సుత్తి వీరభద్రరావుగా అందరికీ పరిచయమయ్యారు. ఆ తరువాత ఆయన వెనక్కి తిరిగి చూసుకునే అవకాశమే లేకుండా పోయింది.

విజయవాడలో ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ కళాశాల నుండి పట్టభద్రుడైన ఆయన, ఆకాశవాణి నుండి సినీరంగానికి వచ్చేసారు.

సుత్తివేలు, సుత్తి వీరభద్రరావు జంట అప్పట్లో చాలా పాపులర్ కమెడియన్ జంటగా పేరు పొందింది. రమణారెడ్డి, రేలంగిలకు ఎంత పేరు ఉండేదో వీరిద్దరికీ కూడా 80వ శకంలో అంత పేరుండేది.

ఆయన పేరునే టైటిల్ రోల్‌గా వచ్చిన చిత్రం 'బాబాయ్ అబ్బాయ్'. ఈ చిత్రంలో బాలకృష్ణ కథానాయకుడైనా 'బాబాయ్‌గా వీరభద్రరావు చేసిన నటన అమోఘంగా పండి మంచి పేరు తీసుకువచ్చింది ఆయనకు.

'తరై నా తరై' అన్న డైలాగ్‌ను ఆయన చెప్పిన తీరు అప్పట్లో అందరికీ నచ్చింది.

'అహ నా పెళ్ళంట' చిత్రంలో బావ కోడిని కట్టుకుని భోంచేస్తున్న సీనులో చికెన్ తింటున్నాను అనగానే, ఆ సన్నివేశాన్ని చూసి బట్టలు చింపుకుని చేసిన యాక్షన్ ఇప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా హాస్యప్రియులకు ఆనందాన్నిస్తూనే ఉంది. జంధ్యాల రాసిన వైవిధ్యమైన డైలాగ్‌లు పలకడంలో కూడా అందె వేసిన చేయి వీరభద్రరావుది.

ఓ ప్రాసలో జంధ్యాలగారు రాస్తే దాన్ని అద్భుతంగా పండించారు వీరభద్రరావు. 'కోడలేదంటే గోడలకేసి చూస్తావేరా ఊడలజుట్టు వెధవా, అక్కుపక్షి, అశుద్ధ భక్షి' ఇలాంటి డైలాగులు చెప్పాలంటే సుత్తి వీరభద్రరావే. 'ఆట్టే వాగావంటే తిత్తి తీస్తా' అన్న డైలాగ్ ఇప్పటికీ ఆయనకు ఓ ట్రేడ్‌మార్క్‌లా మిగిలిపోయింది.

బాబాయ్ అబ్బాయ్, నాలుగు స్తంభాలాట, మంత్రిగారి వియ్యంకుడు, మూడుముళ్ళు, రెండు జెళ్ళ సీత, కాంచనగంగ, మెరుపుదాడి, శ్రీవారికి ప్రేమలేఖ, పుత్తడిబొమ్మ, చంటబ్బాయ్, అహ నా పెళ్ళంట, రాక్షస సంహారం, చిన్నికృష్ణుడు, వివాహ భోజనంబు లాంటి చిత్రాలు ఆయనకు మంచి పేరు తెచ్చాయి. మొత్తం మీద 60 చిత్రాల్లో మాత్రమే ఆయన నటించారు. చివరి చిత్రం చూపులు కలసిన శుభవేళ. హైదరాబాద్‌లో ఓ పాట చిత్రీకరణ జరిగే సమయంలో వేలు బెణకడంతో మధుమేహం ఉందని తెలిసింది. విశ్రాంతి తీసుకోడానికి ఆస్పత్రిలో చేరగా అక్కడ నిద్ర కోసం ఇచ్చే ఇంజక్షన్ వికటించి హార్ట్‌ఎటాక్ వచ్చి, 30 జూన్ 1988న కేవలం 41 సంవత్సరానికే ఆయన తెలుగు ప్రేక్షకులకు దూరమయ్యారు.

ఆయన దూరమైనా 'సుత్తి' అన్న పదం వింటే ఆయన చిరంజీవిగానే తెలుగు ప్రేక్షకుల ముందు కదలాడు తుంటారు.

# తుత్తిగా నవ్వులు–
# ఏవీఎస్



**తుత్తి!** అదేనండీ తృప్తి!! తృప్తిగా నవ్వుకోవాలి అంటే ఒక్కసారి ఏవియస్‌ని గుర్తు చేసుకోవాలి. ఆ పదముతో పాటే నవ్వులు మనకి వెంట వెంటనే వచ్చేస్తాయి.

ఆమంచి వెంకట సుబ్రహ్మణ్యం అంటే తెలీదు. ఏవియస్ అంటేనే సుపరిచితులు.

తెనాలిలో జనవరి 2, 1957న జన్మించారు. అక్కడే డిగ్రీ దాకా విద్యాభ్యాసం పూర్తి చేసారు. చదువుకునే రోజుల్లోనే నాటకాలను ప్రదర్శించేవారు. రసమయి అనే సంస్థను స్థాపించి ఓవైపు నాటక కళాకారుడిగా, మరోవైపు మిమిక్రీ కళాకారుడిగా, దానికితోడు నిబద్ధత ఉన్న మంచి జర్నలిస్టుగా పత్రికా రంగంలో పేరు సంపాదించారు.

అలా ఓవైపు నాటకాలు, మిమిక్రీలు, జర్నలిజం చేస్తున్న ఆయన బాపుగారి కంట్లో పడ్డారు.

వెంటనే 'మిస్టర్‌పెళ్లాం' అనే చిత్రంలో కమెడియన్‌గా అవకాశం వచ్చింది. దొరికిన మొదటి పాత్రనే అద్భుతంగా మలుచుకుని, చక్కని అభినయంతో ఆకట్టుకుని ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఆ ఒక్క చిత్రంతోనే 'తుత్తి' అనే మాటతో ఏవియస్ తెలుగు ప్రేక్షకులకు దగ్గరయిపోయ్యారు.

ఆ తరువాత వచ్చిన శుభలగ్నం చిత్రంలో 'గాలి కనపడుతుందా?... భోజనం చేసారా?... మీ ఇంట్లో బల్లి మగదా?.. ఆడదా?...' లాంటి చొప్పదండు ప్రశ్నలు వేసి ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు.

'రంగు పడుద్ది' అనే డైలాగ్‌ను మాటిమాటికి అనేక రకాలుగా పలుకుతూ... ఒక్క డైలాగ్‌తోనే అనేక అర్థాలను స్ఫురింపచేసి హాస్యాన్ని పండించారు. అదే ఆయన ప్రత్యేకతగా నిలిచింది.

అనేక టివి కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా పాల్గొన్నారు. పలు కార్యక్రమాల్లో ఆయన వుంటే నవ్వులు విరజిమ్మేవి.

మాయలోడు, మేడమ్, ఆమె, శుభమస్తు, ఒహోనా పెళ్ళంట, ధర్మచక్రం, మావిడాకులు, శుభలగ్నం, యమలీల, ఇంద్ర, వినోదం, ఎవడైతే నాకేంటి, దేనికైనా రెడీ, లక్కీ, తూనీగ తూనీగ, ఝుమ్మందినాదం, కింగ్, మధుమాసం, పెళ్లిసందడి, సంక్రాంతి, వెంకి, జాబిలమ్మ పెళ్లి తదితర చిత్రాల్లో ఆయన ప్రేక్షకులకు అందించిన హాస్యం గిలిగింతలు పెట్టింది.

నటుడిగా కెరీర్ కొనసాగిస్తూనే దర్శకుడిగా మారి కోతిమూక, అంకుల్ లాంటి చిత్రాలను రూపొందించారు. ఉత్తమ కేరక్టర్ ఆర్టిస్టుగా నంది పురస్కారాన్ని, అంకుల్ సినిమాకు స్పెషల్ జ్యూరీ పురస్కారాన్ని అందుకున్నారు. శుభలగ్నంలో నటనకు ఉత్తమ కమెడియన్‌గా కూడా నంది పురస్కారాన్ని అందుకున్నారు.

ఏవియస్‌కు తన ఊరు తెనాలిపై మక్కువను ఏ రోజుకారోజు పెంచుకున్నారు. అందుకే సమయం దొరికినప్పుడల్లా అక్కడికి వెళ్ళి మిత్రులను, గురువులను, నటన నేర్పించిన మార్గదర్శకులను కలిసి వచ్చేవారు. తెనాలిని సినిమా కళాకారులను తయారు చేసే హబ్‌గా ఆయన అభివర్ణించేవారు.

కళల రాజధానిగా తెనాలికి గుర్తింపు తీసుకురావాలని తపన పడేవారు.

కళాకారులను ప్రోత్సహిస్తూ విద్యాసంస్థలతో కలిసి అనేక వైద్య శిబిరాలను నిర్వహించేవారు. ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందేలా సహకరించేవారు. కాలేయ మార్పిడి శస్త్రచికిత్స జరగడంతో కొన్నాళ్ళు ఆయన నటనకు దూరంగా ఉన్నారు. ఆ తరువాత అదే వ్యాధి ముదరడంతో 2013 నవంబరు 8న తెలుగు ప్రేక్ష కులకు దూరమయ్యారు. మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా సేవలు చేసారు.

దాదాపు మూడు సార్లు ఆ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికైన మొదటి వ్యక్తి ఏవియస్.

చివరగా పవిత్ర అనే చిత్రంలో నటించిన ఆయన దాదాపు ఐదువందల పైచిలుకు చిత్రాల్లో నటించడం విశేషం. 19 ఏళ్ల కెరీర్‌లో ఓరి నీ ప్రేమ బంగారం గానూ, రూమ్‌మేట్స్, కోతిమూక తదితర చిత్రాలను ఆయన దర్శకత్వంలో రూపొందించి తనలోని దర్శకుడ్ని ప్రేక్షకులకు పరిచయం చేసారు ఏవియస్.

# పిన్నమ్మోయ్ చూడు! - మాడా వెంకటేశ్వరరావు

తెలుగు తెరపై నపుంసక పాత్రకు పేటెంట్ హక్కుదారుడు మాడా వెంకటేశ్వరరావు.

తెలుగు చిత్రాల్లో అప్పుడప్పుడు కనిపించే అలాంటి పాత్రలో మరెవ్వరికీ రాని క్రెడిట్, గౌరవం, గుర్తింపు మాడా వెంకటేశ్వరరావుకే దక్కింది.

'ఏంటి బాయా, మాయదారి సంత మాయదారి సంతని...' ఇటువంటి మాటలు వినగానే మనకు గుర్తొచ్చేది ఆయనే. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దూళ్ళ గ్రామంలో 1935 జూన్ 4న జన్మించారు. చిన్నతనం నుండే నటనపై మక్కువ వుండడంతో నాటకాలు ప్రదర్శించేవారు. ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తి చేసాక విద్యుత్ శాఖలో ఉప సాంకేతిక అధికారిగా కొన్నాళ్ళు ఉద్యోగం చేసారు.

మరోప్రపంచం, సుడిగుండాలు లాంటి చిత్రాలలో తొలిసారిగా అవకాశాలు వచ్చాయి. కొన్నాళ్ళు సినీ జర్నలిస్టుగా కూడా పనిచేసిన ఆయన స్టేట్ సివిల్ డెవలప్ మెంట్ ఆఫీసులో ఇంజనీరుగా కూడా సేవలను అందించారు.

ఓవైపు సినిమాలు, మరోవైపు నాటకాలు, మరోవైపు ఉద్యోగం. ఇవన్నీ కుదరక చివరికి సినిమా పరిశ్రమలోనే ఆయన తన భవిష్యత్తును వెదుక్కున్నారు. అలా అనేక చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తున్న సమయంలో 'చిల్లర కొట్టు చిట్టెమ్మ' చిత్రంలో ఆయన చేసిన హిజ్రా పాత్రకు అద్భుతమైన గుర్తింపు రావడంతో, వేరే పాత్రలు ఇవ్వడానికి దర్శక నిర్మాతలు కూడా ఆసక్తి చూపకపోవడంతో అవే పాత్రలు ఆయన్ని వరించసాగాయి.

ముత్యాలముగ్గు, లంబాడోళ్ళ రాందాసు, మాయదారి మల్లిగాడు, సఖియా, శివయ్య, మెరుపుదాడి, కృష్ణగారడి, అంతస్థులు, ఆయుధం, సాహసవీరుడు సాగరకన్య తదితర చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టాయి. డ్రైవర్‌రాముడు చిత్రంలో ఎన్‌టిఆర్, సత్యనారాయణ, మాడా వెంకటేశ్వరరావు ముగ్గురూ స్త్రీలుగా వేషాలు వేసుకుని నటించి నవ్వులు రువ్విన సన్నివేశం ఇప్పటికీ హైలెట్‌గా నిలుస్తుంది. హిజ్రా పాత్రలే రావడంతో మొనాటనీ కూడా ఏర్పడింది.

'అభినయ కళానిధి' బిరుదుతో ఆయనకు సత్కారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013లో ఉగాది పురస్కారం అందించింది. అనంత పురంలో అనంత కళావాహిని సంస్థ దశమ వార్షికో త్సవం సందర్భంగా స్వర్ణ కంకణధారణ జరిపి సన్మా నించారు.



దాదాపు 600 చిత్రాలకు పైనే నటించిన ఆయన అనారోగ్యంతో బాధపడుతూ హైద్రాబాద్‌లో 2015 అక్టోబరు 24న తుదిశ్వాస విడిచారు. ఆయన లేక పోయినా ఆయన పేటెంట్ 'పాత్ర' ఎప్పుడు ఎవరు నటించినా ఆయనే గుర్తుకు రావటం సహజం.





# పేరడీ ఫన్ కింగ్ -
# ఎమ్.ఎస్.నారాయణ

దేవదాసు అనగానే ముందుగా మనకు గుర్తుకు వచ్చేది అక్కినేని నాగేశ్వరరావు. ఆ పాత్రలో ఆయన జీవించారు హీరోగా.

కాని కమెడియన్ దేవదాసు అనగానే గుర్తొచ్చే పేరు ఎమ్. ఎస్. నారాయణ.

దాదాపు 700 చిత్రాల్లో నటిస్తే అందులో దాదాపు 200 చిత్రాలు తాగుబోతు పాత్రలే నటించారు. గ్లాస్ చేతిలో పట్టుకున్న ప్రతి పాత్రనూ ప్రేక్షకులు ఎంతో ఎంజాయ్ చేసారు.

తాగుబోతు పాత్రలో ఎమ్.ఎస్.ఒదిగిపోయిన విధానం... అదే విధంగా పేరడీ పాత్రలకు ఆయన పెట్టింది పేరుగా నిలిచారు.

దూకుడు, డిస్కో, దుబాయ్ శీను తదితర చిత్రాల్లో పేరడీ నటనావైదుష్యంతో ప్రేక్షకుల దృష్టిలో నిలిచిపోయారు. అది ఏ పాత్రయినా సరే ఆ పాత్రలో పేరడీగా సరికొత్తగా ఒదిగిపోవడం ఆయనకే చెల్లింది.

తాగుబోతు తండ్రి పాత్రకు పేటెంట్ హక్కు.. ఆ తరువాత పేరడీ నటనకు పెట్టింది పేరుగా ఎమ్.ఎస్ తన కెరీర్‌ను కొనసాగించారు.

1951 ఏప్రిల్ 16న పశ్చిమగోదావరి జిల్లాలోని నిడమర్రులో జన్మించారు. ఆయన రచయిత, నటుడు, దర్శకుడు కూడా.

భీమవరంలో తెలుగు అధ్యాపకునిగా పని చేస్తూ సినీ రచయితగా కూడా ప్రయత్నాలు ప్రారంభించారు. వేగుచుక్క పగటిచుక్క కథా రచన చేసారు.

రైతుకుటుంబంలో జన్మించిన ఆయన ఏడుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిల మధ్య పెరగడంతో చదివే స్థోమత లేకపోయినా పట్టుదలతో భాషాప్రవీణ కోర్సు పాసయ్యారు. కాలేజీలోను, సినీ పరిశ్రమలోనూ పరుచూరి గోపాలకృష్ణ శిష్యునిగా గుర్తింపు పొందారు.

'ఇక్కడ ఏం జరుగుతుందో నాకు తెలియాలి' అన్న 'అతడు' సినిమాలోని డైలాగ్ మంచి గుర్తింపు తీసుకువచ్చింది.

ముగ్గురు మొనగాళ్ళు, పేకాట పాపారావు చిత్రాలకు కథలు అందించిన ఆయన సినీ రంగంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు.

దర్శకుడు రవిరాజా పినిశెట్టితో రుక్మిణి అనే సినిమా కథాచర్చల్లో పాల్గొన్న ఆయన నటనకు ముగ్ధుడైన దర్శకుడు, ఎమ్.ధర్మరాజు.ఎమ్.ఏ. అన్న చిత్రంలో ఆయనకు తొలిసారిగా అవకాశం కల్పించారు.

పుణ్యభూమి నా దేశం, రుక్మిణి తదితర చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు వేసినా మా నాన్నకు పెళ్ళి అనే చిత్రంలో ఆయన నటించిన తాగుబోతు తండ్రి పాత్ర పేరు తెచ్చి పెట్టింది.

అలా ఆయన పెదరాయుడు, ప్రయత్నం, ముగ్గురు మొనగాళ్ళు, దుబాయ్ శీను, యమలీల2, కెవ్వుకేక, దేవరాయ తిమ్మరాజు, యమదొంగ, నేనున్నాను, పటాస్, కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ, జంపు జిలానీ, పాండవులు పాండవులు తుమ్మెద, నాయక్, రఫ్, చండీ, జై శ్రీరామ్, దూకుడు అభిరామ్, తెలుగమ్మాయి, తదితర చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు పొందారు.




దర్శకుడిగా కొడుకు, భజంత్రీలు ఆయన రూపొందించారు. మానాన్నకు పెళ్లి, రామసక్కనోడు, సర్దుకుపోదాం రండి, దూకుడు తదితర చిత్రాలకు ఐదు నందులు గెల్చుకున్నారు. అనేక ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు.

స్వంత ఊరంటే ఆయనకు చాలా ఇష్టం. అందుకే అక్కడ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్న ప్రయత్నంతో గ్రామ నాయకులను ఉత్తేజపరచి సహకరించేవారు.

కెరీర్ చివరినాళ్ళలో ఆమ్ ఆద్మీ పార్టీ అరవింద్ కేజ్రీవాల్ పై చిత్రం రూపొందిస్తుండగా ఆయన కథా నాయకుడుగా నటించటం మొదలుపెట్టారు కాని అనుకోకుండా 2015, జనవరి 23న తన 63 ఏళ్ళ వయసులో తెలుగు ప్రేక్షకులకు దూరమై హాస్యానికి, ప్రేక్షకులకు బాధను మిగిల్చారు.

# మాకు తెలుసు బాబూ...
# ధర్మవరపు సుబ్రహ్మణ్యం



**దూ**రదర్శన్ ప్రారంభమైన తొలినాళ్ళలో అనేక కార్యక్రమాలలో నటించి, నిర్మించి, నిర్దేశకత్వం వహించిన తరంలో తొలిసారిగా వెండితెర పైకి వచ్చిన నటులు ధర్మవరపు సుబ్రహ్మణ్యం.

'ఆనందోబ్రహ్మ' ద్వారా దూరదర్శన్‌లో ధర్మవరపు సుబ్రహ్మణ్యానికి మంచి గుర్తింపు వచ్చింది. చిన్నప్పటినుండి వామపక్షాల భావాలతో ప్రజానాట్యమండలి తరపున ఎన్నో నాటకాలు, ప్రదర్శనలు ఇచ్చిన ఆయన ఆనందోబ్రహ్మతో అందరికీ తెలిసారు.

ధర్మవరపు, ప్రకాశం జిల్లా కొమ్మినేనివారిపాలెం లో 1954 సెప్టెంబరు 20న జన్మించారు. అద్దంకి, ఒంగోలు సి.ఎస్.ఆర్ శర్మ కాలేజీల్లో విద్యాభ్యాసం చేసారు. అక్కడే చదువుతున్నప్పుడే నాటకాలపై మక్కువ ఏర్పడింది.

కొన్నాళ్ళు మద్రాసులో సినిమా అవకాశాల కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తరువాత హైదరాబాద్ వచ్చి పంచాయితీరాజ్ శాఖలో ఉద్యోగంలో చేరారు.

మళ్లీ అక్కడ కూడా నాటకాల వైపు వెళ్ళారు. రేడియో, దూరదర్శన్‌లలో పలు నాటకాలు రాసారు, ప్రదర్శించారు.

దూరదర్శన్‌లో తొలి తెలుగు ధారావాహికలు అనగనగా ఒక శోభ, మనసు గుఱ్ఱం లేదు కళ్లెం, పరమానందయ్య శిష్యుల కథతో మంచి గుర్తింపు వచ్చింది ఆయనకు.

తొలి అవకాశం జంధ్యాల రూపొందించిన 'జయమ్మ నిశ్చయంబురా' అనే చిత్రంలో వచ్చింది. ఆ తరువాత అనేక అవకాశాలు ఆయన్ను వెతుక్కుంటూ వచ్చాయి.

చాలా చిత్రాలలో లెక్చరర్ పాత్రలు, ఆఫీసర్ పాత్రలు ఆయన ధరించారు. ఆయా పాత్రలకి మంచి గుర్తింపు వచ్చింది.

ఒక్కడు సినిమాలో పాస్‌పోర్టు అధికారిగా ఆయన చేసిన కామెడీ విలక్షణీయంగా సాగింది. 'మాకు తెలుసు బాబూ'... మేమూ రాజులమే బాబూ!', '9848032919' ఇటువంటి డైలాగులు వినగానే ధర్మవరపు సుబ్రహ్మణ్యమే గుర్తుకు వస్తారు.

నరేష్ కథానాయకుడుగా తోకలేని పిట్ట అనే చిత్రానికి దర్శకత్వం కూడా వహించారు.

'వర్షం'లో గాలి గన్నారావు, 'రెడీ' చిత్రంలో హేపీ రెడ్డి అలియాస్ సంతోష్‌రెడ్డి మొదలైన పాత్రలు ఆయనకు మంచి గుర్తింపునిచ్చాయి.

'ఆలస్యం అమృతం' అనే సినిమాకు ఉత్తమ హాస్యనటుడుగా నంది అవార్డు అందు కున్నారు. ఆయన నటించిన చివరి చిత్రం 'ప్రేమ గీమా జాన్తా నై'.


1989 ఎన్నికల సమయంలో ఆయన కాంగ్రెస్‌లో చేరి ప్రచారం చేసారు.

ఆ తరువాత సాంస్కృతిక మండలి అధ్యక్షుడిగా కొనసాగారు.

బావా బావా పన్నీరు, ప్రేమా జిందాబాద్, పెళ్లి పుస్తకం, స్వాతికిరణం, ప్రేమ చిత్రం పెళ్లి విచిత్రం, పరుగో పరుగు, మిస్టర్ పెళ్ళాం, లేడీస్ స్పెషల్, ష్ గప్‌చుప్, పెళ్లికొడుకు, బ్రహ్మచారి మొగుడు, ఘరానాబుల్లోడు, సాహసవీరుడు సాగరకన్య, తోకలేని పిట్ట, ఫేమిలీ సర్కస్, తొమ్మిదినెలలు, ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం, ఇంద్ర, ఒట్టు ఈ అమ్మాయెవరో తెలీదు, ఒక్కడు, సింహాద్రి, నేను పెళ్లికి రెడీ, అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి, పిలిస్తే పలుకుతా, అమ్ములు, నేనున్నాను, మాయాబజార్, ఆదివారం ఆడవాళ్ళకు సెలవ్, దుబాయ్ శీను, లక్ష్యం, ఆపరేషన్ దుర్యోధన, శంకర్‌దాదా జిందాబాద్, చిరుత, జల్సా, ఆ ఒక్కడు, అన్నవరం, అందాలరాముడు, బొమ్మరిల్లు, బంగారం, శ్రీరామదాసు, జై చిరంజీవ, వీరి వీరి గుమ్మడి పండు, మన్మథుడు, ఆంధ్రుడు, ఔనన్నా కాదన్నా, అల్లరి బుల్లోడు, పుట్టింటికి రా చెల్లీ తదితర చిత్రాల్లో ఆయన నటించి మంచి గుర్తింపు పొందారు.

లివర్ కేన్సర్‌తో బాధపడుతూ ఆయన 2013 డిసెంబరు 7న తెలుగు ప్రేక్షకులకు దూరమయ్యారు.

ఆయన దూరమయినా ఆయన మార్కు హాస్యం మాత్రం ప్రేక్షకులకు గిలిగింతలు పెడుతూనే ఉంది. ఆయన స్థానాన్ని మెవరూ రీప్లేస్ చేయలేక పోయారు బాబూ!



# హాస్యానికే అమృతం–
# గుండు హనుమంతరావు

**ఎన్.**టి.ఆర్.నటించిన పిచ్చిపుల్లయ్య చిత్రంలో అమాయకుడైన అసిస్టెంట్‌గా ఎన్.టి.ఆర్ నటించారు. అలాంటి పాత్రల్లో అద్భుతమైన కామెడీ పండించవచ్చని ఆ కాలంలోనే నిరూపించబడింది. ఆ తర్వాత నెంబర్‌వన్ చిత్రంలో బ్రహ్మానందం కూడా అమాయకమైన అసిస్టెంట్ పాత్రలో నవ్వులు కురిపించారు.

గుండు హనుమంతరావు పేరు వినగానే అలాంటి పాత్రలే గుర్తుకు వస్తాయి. దాదాపు అనేక చిత్రాల్లో ఆయన చేసిన పాత్రలన్నీ అమాయకమైన అసిస్టెంట్ పాత్రలే. తన యజమాని ఏదో విధంగా మోసం చెయ్యడం, చివరికి బకరాగా మిగిలిపోవడం హనుమంతరావు చేసిన పాత్రల తీరుతెన్నులుగా ఉంటాయి.

దాదాపు 400 సినిమాలు, అనేక సీరియల్స్, కార్యక్రమాలతో పాటుగా 'అమృతం' టీవీ సీరియల్ ఆయనకి మంచి పేరును తీసుకువచ్చింది. అమృతం సీరియల్‌లో కూడా అమాయకమైన అసిస్టెంట్ పాత్రే.



విజయవాడలో 1956 అక్టోబరు 10న జన్మించారు హనుమంతరావు. మిఠాయిల వ్యాపారం చేసే తల్లిదండ్రులతో పాటు ఆయన కూడా వ్యాపారంలోనే ఉండేవారు. నటనపై మక్కువతో పలు నాటకాల్లో నటిస్తూ వెండితెరకు వచ్చారు. ఆయన తొలిసారిగా వేసిన వేషం రావణబ్రహ్మ! ఆగండి కొంచెం ఆలోచించండి, ఓటున్న ప్రజలకు కోటి దండాలు, రాజీవం, ఇదేమిటి తదితర నాటకాలు ఆయనకు మంచి గుర్తింపునిచ్చాయి.

'సత్యాగ్రహం'లో తొలిసారిగా నటించే అవకాశం వచ్చింది. ఆ చిత్రం ఆలస్యమవడంతో 'అహ నా పెళ్ళంట' లో గుండు హనుమంతరావు తొలిసారిగా తెరపై మెరిసారు.

ఆ తరువాత ఆయనకు అవకాశాలు వెల్లువలా వచ్చిపడ్డాయి. కళ్ళు, బాబాయ్ హోటల్, కొబ్బరిబొండాం, యమలీల, చినబాబు, రక్తతిలకం, బ్రహ్మపుత్రుడు, చెవిలో పువ్వు, ఘటోత్కచుడు, మాయలోడు, శుభలగ్నం, మావిచిగురు, రాజేంద్రుడు గజేంద్రుడు ఆలస్యం అమృతం విషం, క్రిమినల్, పెళ్లాం ఊరెళితే, తప్పు చేసి పప్పుకూడు, పెళ్లికాని ప్రసాద్, అన్నమయ్య, సమరసింహారెడ్డి, నరసింహనాయుడు, మృగరాజు, జల్సా మొదలైన సినిమాల్లో గుర్తింపు పొందిన పాత్రల్లో నటించారు. అమృతంలో నటించిన ఆంజనేయులు పాత్ర ఆయనకు అఖండమైన గుర్తింపును తీసుకువచ్చింది. అలా బుల్లితెర ద్వారా మూడు నంది పురస్కారాలను అందుకున్నారాయన.

రాజకీయాల్లో చేరి తెలుగుదేశం పార్టీ తరపున ప్రచారం చేసారు. కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఫిబ్రవరి 19, 2018న కన్నుమూసారు.

అమాయక నౌకరు అనే పాత్రకు రోల్‌మోడల్‌గా నిలిచారు.





# ఓకే ఓకే... ఐతే ఓకే-
# కొండవలస లక్ష్మణరావు

ఒక నటుడు ఏ పాత్రనయినా అవలీలగా చేయగలడు అని చెప్పడానికి ఉదాహరణ కొండవలస లక్ష్మణరావు.

నాటకాలు వేసిన రోజుల్లో ఆయన విలన్‌గానే ప్రేక్షకులకు పరిచయం. ఆయన విలనిజం చూసి భయపడిపోయేవారట అప్పటి ప్రేక్షకులు.

కాని సినిమాకు వచ్చిన తరువాత ఆయన కమెడియన్‌గా మారిపోయారు. అంత పెద్ద విలన్ కామెడీ చేస్తుంటే తెలిసిన వాళ్ళకి కొంచెం ఎబ్బెట్టుగానే ఉన్నా నవ్వులు మాత్రం ఇబ్బడిముబ్బడిగానే కురిపించారు ఆయన నటించిన చిత్రాల్లో.

ముఖ్యంగా 'ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు' అన్న చిత్రంలో 'ఐతే ఓకే' అన్న డైలాగ్‌తోనే పాపులర్ అయ్యారు.

చూపరులకు భయం పుట్టేలా నటించడంలో, విలనిజం చేయడంలో ఆయన మంచి మార్కులే కొట్టేసేవారు ఆ కాలంలో.

నాటకరంగంలో నిలదొక్కుకున్న తరువాత వంశీ రూపొందించిన ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారుతో వెండితెరకు పరిచయమయ్యారు లక్ష్మణరావు.

శ్రీకాకుళం మాండలికంతో మాట్లాడుతూ ప్రతి పాత్ర అదే మాండలికంలో చేస్తూ నవ్వులు కురిపించారు ఆయన.

1946 ఆగస్టు 10న శ్రీకాకుళంలోని కొండవలస అనే ఊరులో ఆయన జన్మించారు. ఇంటి పేరు కూడా కొండవలసే.

9వ తరగతి వరకు శ్రీకాకుళంలోనే చదివి ఆ తరువాత విశాఖపట్నం వచ్చారు. ఏవియన్ కాలేజీలో డిగ్రీ చదివారు. 1967లో విశాఖపట్నం పోర్టుట్రస్ట్‌లో ఉద్యోగం చేసారు.

అప్పటినుండి 2001 వరకు వైజాగ్‌లోనే ఉన్నారు. తండ్రి రైల్వే ఉద్యోగి.

కళాశాలలో ఉన్నప్పుడే నాటకాలు వేసేవారు. ఆయన డిగ్రీ పూర్తి అయిన తరువాత నాటకాల్లో విరివిగా నటించేవారు. 1961 నుండి 2001 వరకు స్టేజి ఆర్టిస్టుగా అందరికీ సుపరిచితులయ్యారు. నాటకరంగంలో దాదాపు 400 పైచిలుకు అవార్డులు అతనికి వచ్చాయీ అంటే విచిత్రం కదా! రెండు నంది అవార్డులు కూడా అందులో ఉన్నాయి.

నవరాగం అనే నాటకానికి ఉత్తమనటుడు, కేళీవిలాసం అనే మరో నాటకంలో ఉత్తమ విలన్‌గా నంది అవార్డులందుకున్నారు.

పొట్టిరాజుగా ఐతే ఓకే అంటూ, బక్క రెడ్డిగా ఎవడి గోల వాడిది చిత్రంలో ఆయన గుర్తింపు ఉన్న పాత్రల్లో నటించారు.

కెరీర్ ఊపు అందుకున్న తరువాత శ్రీరామచంద్రులు, ఎవడే అతగాడు, ఆనందమానందమాయే, మీ ఇంటికి వస్తే ఏమిస్తారు మా ఇంటికి వస్తే ఏం తెస్తారు, సారీ నాకు పెళ్లయ్యింది, పల్లకిలో పెళ్లికూతురు, దొంగ దొంగది, శతృవు, అప్పుడు, సూర్యం, కబడ్డీ కబడ్డీ, దొంగరాముడు అండ్ పార్టీ, రాజాబాబు, పందెం, కాంచనమాల కేబుల్ టీవీ, జైచిరంజీవ, చుక్కల్లో చంద్రుడు, వీరభద్ర, హ్యాపీ, అందాలరాముడు, శ్రీకృష్ణ 2006, అత్తిలి సత్తిబాబు ఎల్‌కెజి, మధుమాసం, భూకైలాస్, వీడు మామూలోడు కాదు, భజంత్రీలు, ఆదివారం ఆడవాళ్ళకు సెలవు, నవ్వులే నవ్వులు, సవాల్, బ్రహ్మలోకం టు యమలోకం వయా భూలోకం, కలెక్టరు గారి భార్య, కరెంట్, తెలుగమ్మాయి, సరదాగా కాసేపు, చండి, గలాటా, ఎలుకా మజాకా తదితర చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు పొందారు ప్రేక్షకులలో.



దాదాపు 200 పైచిలుకు చిత్రాల్లో నటించిన ఆయన మూత్రపిండాల వ్యాధితో 2015 నవంబరు 2న హైద్రాబాద్‌లో కన్నుమూసారు.

హాస్యం శ్రీకాకుళం నుండి హైద్రాబాద్‌కు ఆయనతో పాటే వలస వచ్చింది.

# మిమిక్రీ నవ్వులు-
# వేణు మాధవ్

సహజంగా అన్ని చిత్రాల్లో హాస్యనటుడు బ్రహ్మానందం పాత్ర అందరితో ఆడుకుంటుంటాడు. కాని తన తొలిచిత్రంలోనే బ్రహ్మానందాన్నే ఆడుకున్న వేణుమాధవ్ కెరీర్ వైవిధ్యంగా సాగింది.

ఈట్లు, ఓడలు, పోరులు, లాట్లు, గులాబి, గులగులజాం అంటూ ఆయన ఇడ్లీలకు, వడలకు, పూరీలకు జిలూబీలకు, గులాబ్‌జామ్‌లకు సరికొత్త పేర్లను పెట్టి నవ్వించారు తన తొలి చిత్రం 'సంప్రదాయం'లో.

మిమిక్రీ ఆర్టిస్టుగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన అందులో మంచి ప్రావీణ్యం సంపాదించి పేరు పొందారు. హైదరాబాద్‌లో రవీంద్రభారతి, త్యాగరాయగానసభ వంటి పలు కళాక్షేత్రాల్లో ఆయన ప్రదర్శించే మిమిక్రీ ప్రదర్శనలు చూసి దర్శకుడు ఎస్.వి కృష్ణారెడ్డి 'సంప్రదాయం'లో తొలి అవకాశం ఇచ్చారు.

1969 సెప్టెంబర్ 28న కోదాడలో జన్మించిన ఆయన చిన్నప్పటినుండే డ్యాన్సులు, మిమిక్రీలు చెయ్యడం మొదలుపెట్టారు.

వెంట్రిలాక్విజం పై ఆసక్తితో బొంబాయి వెళ్లి, వెంట్రిలాక్విజం చెయ్యడానికి ఓ బొమ్మ తీసుకువచ్చి అన్నిచోట్లా ప్రదర్శనలు ఇచ్చేవారు.

ఎన్.టి.ఆర్, చంద్రబాబు తదితర నాయకులు తమ సభలలో వేణుమాధవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చెయ్యాలని చెప్పేవారు. అలా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టెలిఫోన్ ఆపరేటర్ ఉద్యోగానికి హైద్రాబాద్ వచ్చారు.

ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు తన వెంట్రిలాక్విజం బొమ్మతో హైద్రాబాద్‌లో పలు ప్రదర్శనలు ఇచ్చేవారు.

తొలి చిత్రం విడుదల కాగానే ఆయనకు వరుస అవకాశాలు వచ్చాయి.


ఇక వెనక్కి తిరిగి చూసుకునే అవసరం లేకుండా పోయింది. ఆ తరువాత టిడిపి పార్టీ ప్రచారంలో పాల్గొనేవారు. అతని అభిరుచిని చూసిన ఎన్.టి.ఆర్ 'బొమ్మగారు' అని పిలవటం విశేషం.

'తొలిప్రేమ' సినిమాలో అమ్మాయిలపై వేణుమాధవ్ చెప్పిన డైలాగ్ ఆయన్ని ప్రేక్షకులకు చేరువ చేసింది. 'దిల్' చిత్రంలో వేణుమాధవ్ పోషించిన నితిన్ మామయ్య పాత్ర కూడా మంచి పేరు తెచ్చింది.

2006లో విడుదలైన 'లక్ష్మి' సినిమాతో ఉత్తమ హాస్యనటుడుగా నంది అవార్డును అందుకున్నారు. హంగామా సినిమాతో హీరోగా మారిన వేణుమాధవ్ 'ప్రేమాభిషేకం' చిత్రాన్ని రూపొందించారు. సై, ఛత్రపతి, ఆజాద్ లాంటి చిత్రాలతో మంచి గుర్తింపు పొందారు.

సినీ పరిశ్రమలో వేణుమాధవ్‌కు చిరంజీవి అన్నా, బాలకృష్ణ అన్నా ఎంతో గౌరవం. చిరు 150వ చిత్రం, బాలయ్య 100వ చిత్రం సక్సెస్ అందుకోవాలని వేణుమాధవ్ గుండు కొట్టించుకున్నారు. వేణుమాధవ్ తన పుట్టినరోజుకు కేక్ కట్ చేయడం లాంటి ఫార్మాలిటీస్‌ను పాటించరు.

పరిశ్రమకు వచ్చినప్పటినుంచి తన పుట్టినరోజును అనాథ శరణాలయంలోనే జరుపుకునేవారు. అక్కడ వారికి ఉపయోగపడే ఏదో ఒక పని చెయ్యడం చెప్పలేని



సంతృప్తి అని ఆయన తెలిపేవారు. చిరంజీవితో కలిసి జై చిరంజీవలో నటిస్తున్న సమయంలో వేణుమాధవ్ పుట్టినరోజు రావడం, చిరంజీవి కోసం రూల్ బ్రేక్ చేసి కేక్ కట్ చేసారు వేణుమాధవ్.

అచ్చిరెడ్డి, కృష్ణారెడ్డిల చలవతో పరిశ్రమలోకి అడుగు పెటినందున తన ఇళ్లకు 'కృష్ణ నిలయం' అని పేరు పెట్టుకున్నారు. కోదాడ నుండి ఎమ్‌ఎల్‌ఏ గా పోటీ చేయాలనే కోరిక మిగిలిపోయిందాయనకి.

ముత్యం, ఆయుధం, ఆంధ్రావాలా, ఆపరేషన్ దుర్యోధన, అడ్డా, సింహా, ఆజాద్ తదితర చిత్రాల్లో మంచి పేరు వచ్చింది.

దాదాపు 400 పైచిలుకు చిత్రాల్లో నటించిన ఆయన కాలేయ వ్యాధితో బాధపడుతూ సికింద్రాబాద్‌లో కన్ను మూసారు. ఆయన లేని లోటు ఇప్పటికీ పరిశ్రమలో అలా మిగిలిపోయింది.



# భయం...హాస్య మేళవింపు- జయప్రకాష్‌రెడ్డి

**'ఏం** అబ్బాయా ఏంజేస్తుండావ్', 'ఏమిరా నోరు లేస్తుండాది'... ఇటువంటి రాయలసీమ మాండలికం ఉన్న డైలాగులు వినగానే మనకు గుర్తుకు వచ్చేది జయప్రకాష్‌రెడ్డి.

రాయలసీమ మాండలికంలో ఆయన చెప్పిన డైలాగులకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. దాదాపు 300 చిత్రాలలో కమెడియన్‌గా, కామెడీ విలన్‌గా నటించి తెలుగు ప్రేక్షకులను మెప్పించారాయన.

1946 మే 8న కర్నూలుజిల్లా వీరారెడ్డిపల్లెలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కాగా ఈయన మేథ్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసారు.

ఓవైపు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, మరోవైపు సినిమాల కోసం ప్రయత్నాలు చేసేవారు. అలా తొలినాళ్ళలో కొన్ని చిన్న చిన్న చిత్రాలలో నటించారు.

వెంకటేష్ నటించిన 'ప్రేమించుకుందాం రా' చిత్రంతో రాయలసీమ మాండలికాన్ని తెరపై పండించడంతో, ఆయన కెరీర్ మలుపు తిరిగింది.

స్వచ్ఛంద పదవీ విరమణ చేసి సినిమాలకే అంకితమయ్యారు. చిన్నప్పటినుండే నాటకాల్లో ఆసక్తి ఉండడంతో, దానికితోడు తండ్రి ప్రోత్సహించడంతో ఆయన యూనివర్సిటీలో చదివేటప్పుడే నాటకాల్లో పాల్గొనేవారు. ఉద్యోగం చేస్తూ కూడా నాటకాలు వదల్లేదు.

జెపి థియేటర్ పేరుతో తండ్రి పేరున నాటకోత్సవాలను జరిపేవారు. జెపీస్ నెలనెలా నాటక సభ అనే సమాజాన్ని స్థాపించి నాటకరంగానికి సేవ చేసారు.

నల్గొండలో రాజారావు మెమోరియల్ అనే పేరుతో అనేక నాటకాలు వేసి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేవారు.

దాసరి నారాయణరావు ఆ నాటకం చూసి, జయప్రకాష్‌రెడ్డిని 'బ్రహ్మపుత్రుడు' చిత్రంలో పరిచయం చేసారు.

25 చిత్రాల్లో నటించినా బ్రేక్ రాకపోవడంతో మళ్ళీ తన ఉద్యోగానికి వెళ్ళిపోయారు.

తరువాత 1997లో ఆయనకు మంచి బ్రేక్ 'ప్రేమించుకుందాం రా' చిత్రంతో వచ్చింది. 'సమరసింహారెడ్డి' హిట్‌తో ఇక వెనక్కి తిరిగి చూసుకునే ఛాన్స్ లేకుండా పోయింది.


అన్ని ప్రాంతాల్లో తండ్రి ఉద్యోగరీత్యా తిరగడంతో అన్ని మాండలికాలు వంట పట్టేసాయి ఆయనకు. దాదాపు 100 నిముషాల పాటు సాగే అలెగ్జాండర్ ఏకపాత్రాభినయం అనేక ప్రదర్శనలు అనేకచోట్ల ఇచ్చి మెప్పించారు.

చిత్రం భళారే విచిత్రం, నీకోసం, ఆనందం, అల్లరి రాముడు, చెన్నకేశవరెడ్డి, కబడ్డీ కబడ్డీ, ఎంజాయ్, ఎవడి గోల వాడిది, ఛత్రపతి, విక్రమార్కుడు, రెడీ, కింగ్, ఆలస్యం అమృతం విషం, కిక్, ప్రస్థానం, దేవరాయ, షాడో, ఎదురులేని అలెగ్జాండర్, గలాటా, ప్రతినిధి, జేమ్స్‌బాండ్, పండగచేస్కో, మోసగాళ్లకు మోసగాడు, ఇంట్లో దెయ్యం నాకేం భయం, సుప్రీం, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య, రాధ, నేనే రాజు నేనే మంత్రి, ఎమ్మెల్యే, విజేత, అమర్ అక్బర్ ఆంథోనీ... లాంటి అనేక చిత్రాల్లో నటించి మెప్పించారాయన.

జయం మనదేరా, రాణి రుద్రమ, వేట, కొత్త సైన్యం చిత్రాలకు నంది అవార్డులు గెల్చుకున్నారు.

తన 74వ సంవత్సరంలో 2020 సెప్టెంబర్ 8న గుంటూరులో గుండెపోటుతో ఆయన కాలధర్మం చెందారు.

ఆయన లేకపోయినా ఆయన చిత్రాల ద్వారా మన కళ్ళముందు నిత్యం, 'ఏమిరా ఏం సినిమాలు చూస్తు న్నారబ్బా' అంటూ పలకరిస్తూనే వుంటారు జయ ప్రకాష్‌రెడ్డి.



# తొలి హీరోయిన్-
# సురభి కమలాబాయి

దర్శకుడు హెచ్.ఎమ్.రెడ్డి 1931లో రూపొందించిన తొలి తెలుగు చిత్రం 'భక్తప్రహ్లాద'. ఆ చిత్రంలో కథానాయిక పాత్ర పోషించింది సురభి కమలాబాయి.

సురభి కమలాబాయి కుటుంబం కళాకారుల కుటుంబం.

1907లో ఆమె తల్లి వెంకూబాయి గర్భవతిగా ఉండి నాటకం నటిస్తూండగానే స్టేజిపైనే జన్మించింది సురభి కమలాబాయి.

అలా చిన్నప్పటి నుండే కమలాబాయికి నటన ఉగ్గుపాలతో అలవడింది. చిన్న తనంలో కృష్ణుడు, ప్రహ్లాదుడు తదితర పాత్రలు వేసి మెప్పించేది. పెరిగి పెద్దయ్యాక మగ పాత్రలు ఆపేసి ఆడపాత్రలు వేయడం ప్రారంభించింది. అలా రంగస్థలంపై ఎదుగుతూ తొలి టాకీ చిత్రం భక్తప్రహ్లాదలో హిరణ్యకశిపునిగా నటించిన మునిపల్లె సుబ్బయ్య సరసన లీలావతిగా పరిచయమయ్యారు కమలాబాయి.

ఆ తరువాత 'పాదుకా పట్టాభిషేకం'లో సీతగా, 'శకుంతల'లో శకుంతలగా, 'సావిత్రి'లో సావిత్రిగా నటించారు. కొన్నాళ్ళు ముంబయ్ వెళ్లి అక్కడ దాదాపు 25 హిందీ చిత్రాలలో నటించారు. తొలి ద్విభాషా చిత్రం 'తుకారాం'లో ఈమె కథానాయికగా నటించడం ఓ విశేషం, ఓ రికార్డు కూడా! 1940 తరువాత కేరక్టర్ ఆర్టిస్టుగా మారారు. అనేక చిత్రాలలో నవ్వులు పూయించారు. పత్ని, మల్లీశ్వరి, లక్ష్మమ్మ, పాతాళభైరవి, సంక్రాంతి, అగ్నిపరీక్ష, భూకైలాస్, మంగళ, దేవదాసు, మాంగల్యబలం, పెళ్లినాటి ప్రమాణాలు, జయభేరి, వాగ్దానం తదితర చిత్రాల్లో నటించారు కమలాబాయి.

సంపాదించిన ధనమంతా ఓ బ్యాంక్‌లో డిపాజిట్ చేసారు కమలాబాయి. కాని ఆ బ్యాంక్ దివాళా తీసినందువల్ల ఆర్థిక ఇబ్బందులతో చివరి దశలో ఆమె 1971 మార్చి 30న కాలధర్మం చెందారు. మూకీ చిత్రాల ప్రదర్శనలో రీలుకు రీలుకు మధ్య బృందాలు గీతాలతో, నృత్యాలతో ప్రేక్షకులను అలరించేవారు.

హార్మోనియం, సారంగి, వయోలిన్ తదితర వాద్యపరికరాలను అద్భుతంగా వాయించగల దిట్ట కమలాబాయి. ఆమె నటించిన తీరుకు హిందీ నటుడు, గాయకుడు కె.ఎల్.సైగల్ ముగ్ధుడైపోయాడట.

తొలి సినిమా గీతాన్ని ఆలపించిన గాయనిగా సురభి కమలాబాయి వినుతికెక్కారు. 1931లో తొలి పాటల రచయిత చందాల కేశవదాసు రచించిన 'పరితాపంబు భరియించ తరమా' అన్న గీతాన్ని గానం చేసి రికార్డు నెలకొల్పారు వారు. మల్లీశ్వరి చిత్రంలో పక్కింటి ముచ్చట్లు తనకు నచ్చిన విధంగా చెప్పి మూతిని అష్టవంకర్లు తిప్పి, చివరకు అయినా నాకెందుకులే ఎవరా ఎట్టా పోతే నాకేంటంటూ రాగాలు తీసే-ఆమె నటన చూడాల్సిందే.



With Best compliments from
Brewstark Clothing
Cutomised designer wear
Weddings | birthdays | events
Designer lehengas, suits, blazer, sherwani, blouses, long frocks, kids wear
Contact- 9000222411, 9959222411. Email- info@brewstark.com

# జవ్వాది పరిమళం–
# జవ్వాది గంగారత్నం



**తొ**లి తరం రంగస్థల నటులు ఆ తరువాత సినిమా రంగంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అలా తన అద్భుతమైన నటనా ప్రతిభతో రంగస్థలం నుండి చలన చిత్రసీమకు వచ్చిన నటి జవ్వాది గంగారత్నం. గంగారత్నం అంటేనే గయ్యాళి పాత్రలకు పెట్టింది పేరు.

వీరు తూర్పుగోదావరి జిల్లా అంగలకుర్రు అగ్రహారంలో 1893లో జన్మించారు. బాల్యంలోనే జవ్వాది వెంకటరత్నంతో వివాహమయ్యింది. 16వ ఏటనే భర్త మరణించగా జీవనోపాధి కోసం 17 సంవత్సరాల చిన్న వయసులోనే నాటకాలు వేయడం మొదలుపెట్టారు. 1936లో సినిమా రంగ ప్రవేశం చేసారు. 90 సంవత్సరాల వరకు నట జీవితాన్నే కొనసాగించారు. ఈమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిశ్చంద్ర నాటకంలో కలకంఠిగా, చింతామణిలో శ్రీహరిగా వినుతికెక్కారు.

విద్యుద్దీపాలు లేని ఆ రోజుల్లో దివిటీల వెలుగులో దీపాలకాంతిలోనే నాటకాలు నిర్వహించేవారు. ఆ నాటకాలలో అద్భుతమైన నటన చూపేవారు. ఉద్దండులైన నటులు యడవల్లి సూర్యనారాయణ, గోవిందరాజుల సుబ్బారావు, స్థానం నరసింహా రావు, ఉప్పులూరి సంజీవరావు, నెల్లూరు నాగరాజుల లాంటి లబ్ధప్రతిష్టలతో ఈమె నటించారు.

1936 నుండి 1985 వరకు సినిమాల్లో నటించారు. ఆ తరువాత సినిమాలు వదిలివేసి మళ్లీ నాటక రంగంలో పునఃప్రవేశం చేసి దాదాపు 20 సంవత్సరాల పాటు పౌరాణిక, సాంఘిక, నాటకాలలో రాణించారు. తొలి సాంఘిక చలనచిత్రం 'ప్రేమవిజయం'లో నటించారు. వీరు చివరగా నటించిన చిత్రం జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన 'శ్రీవారి శోభనం'. 'అలకపాన్పు ఎక్కనేల చిలిపి గోరింక' అనే పాటలో కథానాయిక అనితారెడ్డితో కలిసి నటించారు.

గయ్యాళి పాత్రలను అతి సహజంగా పోషించేవారు. ఈమె పోషించిన గయ్యాళి పాత్రలు ఆ తరువాత వచ్చిన సూర్యకాంతంగారికి మార్గదర్శకంగా మారాయి.

సతీ తులసి, కనకధార, మాలపిల్ల, రైతుబిడ్డ, తెనాలి రామకృష్ణ, ఇది మా కథ, పల్నాటి యుద్ధం, యోగివేమన, కీలుగుఱ్ఱం, మల్లీశ్వరి, ప్రియురాలు, పక్కింటి అమ్మాయి, అర్ధాంగి, శ్రీకృష్ణ తులాభారం, నెలవంక తదితర చిత్రాల్లో వీరు తమ ప్రతిభను చాటారు.

2001లో తన 108వ ఏట ఈదూరులో కాలధర్మం చెందారు. వెండి తెరైనా, రంగస్థలమైన ఏదైనా నటించటానికి మహోన్నతమైన వేదిక అని భావించే గంగారత్నం నిజమైన నటి.





ఒక హాస్యపత్రిక అప్రతిహతంగా 200 ల సంచికలు పూర్తిచేసుని విజయవంతంగా కొనసాగడం అసాధ్యం. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ కార్టూనిస్టులు,హాస్యరచయితలకు,హాస్యప్రియులకు స్వర్గధామంగా నిలిచి, ఆహ్లాదకరమైన హాస్యాన్ని అందిస్తు, హాస్యయజ్ఞాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న హాస్యానందం పత్రిక సంపాదకులు రాముగారికి హృదయపూర్వక అభినందనలు.
చిరంజీవ చిరంజీవ సుఖీభవ సుఖీభవ.

https://youtube.com/c/nagrajcartoons యూట్యూబ్ ఛానల్

నాగ్రజ్ కార్టూనులు, స్టాండప్ కామెడీతో కూడిన వినోదభరిత ఛానల్.

# అమ్మో! సూరేకారం!...
# సూర్యకాంతం

జగమెరిగిన బ్రాహ్మణునికి జంధ్యమేల అన్నట్లు సూర్యకాంతం గురించి తెలుగు వారికి ప్రత్యేకంగా పరిచయం చెయ్యనవసరంలేదు. అంతగా తెలుగువారి ఇళ్ళల్లో ఆమె పేరు పాకిపోయింది. ఆడపిల్లలకు ఆమె పేరు పెట్టడానికి ఇప్పటికీ జంకేవారు ఉన్నారు. అంతగా భయపెట్టి ఆ పేరును తన ఒక్కదానికే స్వంతం చేసుకున్న హాస్య నట విదుషీమణి సూర్యకాంతం.

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ వద్ద వున్న వెంకట కృష్ణరాయపురంలో 1924లో అక్టోబరు 28న, 14వ సంతానంగా జన్మించారు. ఆరేళ్ళ చిన్న వయసులోనే పాడడం, నాట్యం నేర్చుకోవడం మొదలుపెట్టారు.

కాకినాడ యంగ్‌మెన్ హ్యాపీ క్లబ్‌లో నాటకాలను ప్రదర్శించేవారు. అలా నటనపై మక్కువతో మద్రాసు చేరుకున్నారు. తొలినాళ్ళలో ఆమెకు సరియైన అవకాశాలు రాకపోయినా చంద్రలేఖ సినిమాలో ఒక డాన్సర్‌గా నటించారు. ఆ తరువాత 'నారద నారది' అనే చిత్రంలో ఆమెకు మంచి అవకాశం వచ్చింది. ఆ తరువాత 'గృహప్రవేశం' సినిమాలో నటించారు.

సంసారం అనే చిత్రంలో గయ్యాళి అత్త పాత్ర వరించింది. ఇక ఆ సినిమా విడుదలయ్యాక ఆమెకు వెనక్కి తిరిగి చూసుకునే అవసరం లేకుండా పోయింది. గయ్యాళి పాత్రల్లో ఆమెకు పేటెంట్ హక్కు లభించింది. ఆ పాత్రల్లో ఎన్నిసార్లు చూసినా ప్రేక్షకులకు మోనాటనీ లేకుండా నటించేవారు. ఆమె ప్రత్యేకంగా హాస్యం చెయ్యకపోయినా ఆమె సంభాషణలు చెప్పే తీరు ప్రేక్షకులకు నవ్వు తెప్పిస్తుంది.

ముగ్గురు మూర్ఖురాళ్లు అనే చిత్రంలో ఆమె విలన్‌గా నటించారు. ఆ విలన్ ముగ్గురు మూర్ఖురాళ్లు-జయమాలిని, విజయలలిత, రమాప్రభలను నానా ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించే పాత్రలో ఆమె అద్భుతంగా నటించారు. విశేషమేమిటంటే ఆ ముగ్గురికి పోటీగా తాను కూడా క్లబ్ డ్యాన్స్‌లో ఫ్యాన్సీ దుస్తులు వేసుకుని నృత్యం చేసారు. అదొక వెరైటీ ఆ రోజుల్లో. తెరపై ఎంత గయ్యాళిగా కనిపించినా ఆమె గొప్ప వ్యక్తిత్వంగల వ్యక్తిగా అందరూ కొనియాడేవారు. సెట్‌కు ఆమె వచ్చింది అంటే మంచి మంచి భోజనాలు, ఫలహారాలు అందాయనే అర్థం.

'చక్రపాణి' చిత్రంలో భానుమతితో 'అంతెందుకు సగం చాలు' అనే ఊతపదంతో భానుమతి కన్నా ఎక్కువగా నవ్వించారు. రేలంగి, రమణారెడ్డి, నాగభూషణం, ఎస్వీఆర్, రావికొండలరావు లాంటి దిగ్గజాలకు అర్థాంగిగా నటించి మెప్పించారు. గుండమ్మకథ సినిమా పేరు ఆమె పేరుతోనే టైటిల్ ఉన్నా ఎన్‌టిఆర్ ఏఎన్ఆర్ ఆమె గొప్పతనాన్ని ఒప్పుకునే ఆ చిత్రంలో నటించారు.

ఇంకో విశేషమేంటంటే గుండమ్మకథ రీమేక్ చెయ్యాలంటే, ఏఎన్ఆర్, ఎన్‌టిఆర్, జమున, సావిత్రి లాంటి నటులున్నారు గాని సూర్యకాంతం లాంటి నటి లేక మళ్లీ తియ్యడానికి ఏ దర్శక నిర్మాతలు ధైర్యం చేయడంలేదు. అదీ ఆమె క్రెడిట్!

దాదాపు 14 భాషలు మాట్లాడేవారు. సన్మానాలకు, సత్కారాలకు దూరంగా ఉండే వారు. నటి జమునతో కలసి వృత్తి కళాకారుల సంక్షేమం కోసం అనేక ప్రదర్శనలిచ్చి, విరాళాలు వసూలు చేసి సాయమందించారు.



బ్రతుకుతెరువు, ప్రేమ, అమ్మలక్కలు, పెళ్లి చేసి చూడు, చంద్రహారం, లవకుశ, రక్తసంబంధం, మాంగల్యబలం, నిండుమనసులు, వెలుగునీడలు, మాయాబజార్, దొంగరాముడు, తోడికోడళ్ళు, చదువు కున్న అమ్మాయిలు, అందాలరాముడు, ముత్యాల ముగ్గు, దొంగల్లో దొర, అప్పు చేసి పప్పుకూడు, కృష్ణలీలలు, భాగ్యదేవత, శాంతినివాసం, పెళ్లి కాని పిల్లలు, శభాష్ రాజా, సిరిసంపదలు, తిరుపతమ్మ కథ, నర్తనశాల, డాక్టర్ చక్రవర్తి, సంగీతలక్ష్మి తదితర చిత్రాల్లో నటించి 750 చిత్రాలు పూర్తి చేసారు.

తిరుపతి పద్మావతి యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్‌ని ఇచ్చి సత్కరించారు. అలా అందరినోటా గొప్ప వ్యక్తిత్వం ఉన్న మహా మనిషి 1996 డిసెంబరు 15న తెలుగు ప్రేక్షకులకు దూరమయ్యారు. ఆమె పోయినా ఆమె కీర్తి అజరామరంగా నిలుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

# ఆమె పెదవి విరుపే నవ్వు-
# ఛాయాదేవి

**ఆం**ధ్రుల అత్తగారు సూర్యకాంతమైతే ఆమెకు సినీ ఆడపడుచు ఛాయాదేవి.

ఇద్దరూ కలిసి అనేక చిత్రాల్లో జమిలిగా చేసినటువంటి హాస్యం ప్రేక్షకులు ఎప్పటికీ మర్చిపోలేరు.

ఉదాహరణకి అదృష్టవంతులు చిత్రంలో వారిద్దరూ వియ్యపురాళ్ళుగా అట్లు అమ్ము కుంటూ కలిసి చేసిన కామెడీ ఆ సినిమాకే హైలెట్‌గా నిలిచింది.

సూర్యకాంతం కొడుకు పద్మనాభమైతే; ఛాయాదేవి కూతురు గీతాంజలి. వీరిద్దరూ ఒకేసారి పరిశ్రమకు వచ్చినా సూర్యకాంతంకు వచ్చిన గుర్తింపు ఛాయాదేవికి రాలేదనే చెప్పాలి. సూర్యుడు పక్కన ఛాయలాగే మిగిలిపోయింది ఛాయాదేవి.

అసలు ఛాయాదేవి అంటేనే సూర్యకాంతం గుర్తొస్తారు. వారిద్దరూ కాంబినేషన్ అదుర్స్. గుంటూరు నుంచి వచ్చిన ఛాయాదేవి తొలినాళ్ళలో నృత్యం అభ్యసించారు.

1928లో జన్మించిన ఆమె, 1942 'దీనబంధు' చిత్రంతో తొలి అవకాశం వరించింది.

తొలినాళ్ళలో రేణుక ఆఫీసులో చిత్తూరు నాగయ్య ఆఫీసులో వంట చేసే మహిళగా ఆమె సేవలందించారు. ఆ తరువాత ఆమె టాలెంట్‌ని గుర్తించి అవకాశాలివ్వటం మొదలుపెట్టారు.

1953లో వచ్చిన పిచ్చిపుల్లయ్యలో వితంతువుగా, జమిందారిణిగా అద్భుతంగా నటించి గుర్తింపు తెచ్చుకున్నారు ఛాయాదేవి. అలాగే కన్యాశుల్కంలో పూటకూళ్ళమ్మగా మంచి గుర్తింపు వచ్చింది.

సీతారామ కళ్యాణం చిత్రంలో 'సీతారాముల కళ్యాణము చూతమురారండి' అన్న పాటలో జనకుని భార్యగా ఆమె నడిచిన విధానం ఓ మహారాణిని గుర్తుకు తెచ్చేలాగా ఉంటుంది. ఆ పాటలో ఆమెను చూసిన ఎవరైనా ముగ్ధులు కావాల్సిందే.

అలాగే మాయాబజార్‌లో బలరాముని భార్యగా బంగారం పై ఉన్న అత్యాశ ఎలా వుంటుందో ఆమె కళ్ళతోనే పలికించారు. అదే విధంగా లాహిరి లాహిరి పాటలో ఆమె ఒలికించిన వగలు కూడా శృంగారప్రియులను అలరిస్తాయి. శశిరేఖ తల్లిగా క్రౌర్యంగా, ప్రియదర్శినిలో సంపదను చూసిన నటన హైలెట్‌గా నిలుస్తాయి.

అలాగే పరమానందయ్య శిష్యుల కథలో నాగయ్య భార్యగా శభాష్ అనిపించారు. శిష్యులు ఒకొక్కరు ఇంట్లోకి వెళ్ళేటప్పుడు ఆమె చూపిన హావభావాలు నవ్వులు పూయిస్తాయి.

కేరక్టర్ ఆర్టిస్టుగా గుండమ్మకథలో దుర్గమ్మగా, అదృష్టవంతులులో గీతాంజలి తల్లిగా, సూర్యకాంతంతో పెసరట్ల పేరమ్మగా పోటీపడి మరీ నటించారు ఛాయాదేవి.

నిండైన విగ్రహం, మంచి ముఖ కవళికలు, హాస్యం చిందించే బాడీ లాంగ్వేజ్ ఆమె ప్రత్యేకత. సెట్‌లో ఎవరికైనా ఆకలిగా వుందీ అంటే వెంటనే ఆమె వెళ్లి గబగబా అన్నం కలిపి తీసుకెళ్లి నోటికందించి మరీ తినిపించేవారట.

తోటి నటీనటుల పట్ల వాత్సల్యం చూపేవారు ఛాయాదేవి. అందుకే ఆమె అంటే అందరికీ ఇష్టం.

పాడిపంటలు, తాయారమ్మ బంగారయ్య, కల్పన, జ్యోతి, ప్రేమకానుక, నవరాత్రి,



శ్రీకృష్ణావతారం, తిరుపతమ్మ కథ, శ్రీకృష్ణార్జున యుద్ధం, దక్షయజ్ఞం, శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు కథ, సీతారామ కళ్యాణం, పెళ్లినాటి ప్రమాణాలు, పాండురంగ మహాత్యం, చిరంజీవులు, నా ఇల్లు, ప్రమీలార్జునీయం, పెద్దక్కయ్య, దసరా బుల్లోడు, గంగ మంగ, జాతకరత్న మిడతంబొట్లు, ఆడపెత్తనం, తదితర చిత్రాల్లో ఆమె తన ప్రతిభను కనబరిచారు.

దాదాపు 250 పైచిలుకు చిత్రాల్లో నటించిన ఛాయాదేవికి మధుమేహంతో ఓ కాలు తొలగించారు. దానికితోడు ఆమె ఇల్లు నాది అని ఓ నిర్మాత కోర్టుకెక్కడంతో ఆమె కుంగిపోయారు.

1983 సెప్టెంబర్ 4న ఆమె పరమపదించారు.

ఆమె లేకపోయినా ఆమె చిత్రాల ద్వారా ఎప్పటికీ ఛాయాదేవి మన కళ్ళముందు కదలాడుతూనే ఉంటారు.

# బాలకృష్ణుని పాత్రకు పేటెంట్-
# సురభి బాలసరస్వతి



సురభి నాటకాల కంపెనీ నుండి వచ్చిన ఎవరైనా తమ ఇంటి పేరును సురభిగానే పెట్టుకుంటారు. అలా మనకు పరిశ్రమలో కమలాబాయి ఒకరు, సురభి బాల సరస్వతి ఒకరు ఉన్నారు. శ్రీకాకుళంలో జన్మించిన సురభి బాలసరస్వతి ఏడవ ఏట నుంచే నాటకాలు వేసేవారు. అందులోనూ బాలకృష్ణుడిగా ఆమె గొంతెత్తి పాడితే రెండు, మూడు మైళ్ళు వినిపించేదని వినికిడి. అంత పెద్ద స్వరంతో ఆమె పాడుతుంటే వినే వాళ్ళు ఆసక్తిగా ఆ నాటకాలకి వచ్చేవారు. తారాశశాంకం లాంటి నాటకాల్లో ఆమె అద్భుతంగా రాణించారు.

1944 దాకా సురభి కంపెనీలోనే వుండి అనేక నాటకాలు ప్రదర్శించేవారు.

సినీ పరిశ్రమకు నృత్య కళాకారిణిగా వచ్చారు. ఆమె ఏ వేషం వేసినా ఆమె పద్యాలకు వన్స్‌మోర్‌లు లభించేవి.

తొలుత వి.ఎన్.స్వామి జంటగా రూపవతి అనే చిత్రంలో కథానాయికగా నటించారు. విశేషమేంటంటే ఈ చిత్రంలో మరో వాంప్ పాత్రధారిణి హిందీ కథానాయిక రేఖ పిన్ని సూర్యకళ. సూర్యకళ వాంప్‌గా నటించడంతో ఆమె అందం ముందు సురభి బాలసరస్వతి తేలిపోయింది. అందుకనే సినిమా పరాజయం చవిచూసింది. ఈ చిత్రంలో ఇంకో విశేషమేంటంటే ఓ పాటలో నర్తకిగా సావిత్రి నటించారు. ఆ ఒక్క పాటలో మాత్రమే సావిత్రి ఉంటారు. అంటే సురభి బాలసరస్వతి కథానాయికగా నటించిన చిత్రంలో సావిత్రి గెస్ట్‌రోల్ చేసారు. ఆ తరువాత ఎన్నో చిత్రాల్లో సావిత్రి కథానాయికగా నటిస్తే సురభి బాలసరస్వతి వాంపుగాను, చిన్న చిన్న కేరక్టర్లతో జీవితాన్ని గడిపేసారు. అదీ విచిత్రం!

ఆమెకు ఓ తమ్ముడు, ఓ అన్న ఉండేవారు. వారిద్దరూ కూడా అప్పట్లో కొన్ని చిత్రాల్లో నటించారు.

నిరుపేదలు, గాలిమేడలు, సిరిసంపదలు, ఉమాసుందరి, స్వప్నసుందరి, అర్ధాంగి, అడుగుజాడలు,అనార్కలి, కలిమిలేములు, తెనాలి రామకృష్ణ, శ్రీకృష్ణార్జున యుద్ధం, వారసత్వం, శాంతినివాసం, శ్రీవెంకటేశ్వర మహాత్మ్యం, గులేబకావళి కథ, చిరంజీవులు, ప్రేమ, మనదేశం, బొబ్బిలియుద్ధం తదితర చిత్రాల్లో నటించి మంచి పేరు గడించారు. చివరి రోజుల్లో ఆర్థిక ఇబ్బందులతో గూడూరులోని తన తమ్ముడి వద్ద శేష జీవితం గడిపారు. అక్కడే కాలం చేసారు.





# తొలితరం హాస్యనటి – కనకం

తొలితరంలో నటులు మొదట రంగస్థలంపై రాణించి ఉండాలి. ఆ తరువాత వారి పాటలు వారు పాడుకునేలా వుండాలి. ఏ పాత్ర ఇచ్చినా దాన్ని అద్భుతంగా పోషించగలిగి ఉండాలి. ఈ అన్ని రంగాల్లో కూడా గొప్ప ప్రతిభను కనబరిచిన నటి కనకం. టి.కనకంగా ప్రసిద్ధి చెందిన అలనాటి తెలుగు ప్రముఖ హాస్యనటి కనకం. చిత్రాల్లో నటించకముందు అనేక నాటకాల్లో నటించారు. సినిమాల్లో నటిస్తూనే నాటకాలు మాత్రం వదల్లేదు.

నవంబరు 12, 1930లో ఖరగ్‌పూర్‌లో జన్మించారు టి. కనకం. ఆమె అసలు పేరు కనకదుర్గమ్మ. అప్పట్లో నాటకాల్లో స్త్రీ పాత్రలు పురుషులే ధరించేవారు. అందుకు వ్యతిరేకంగా అలనాటి నటుడు బళ్ళారి రాఘవ ప్రోత్సాహంతో నాటకాల్లోకి వచ్చి, స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలని నిర్ణయించుకుని నాటకాల్లో వేయటం మొదలుపెట్టారు కనకం. మద్రాసు ఆల్ ఇండియా రేడియోలో ఆమె జానపద గీతాలు ప్రసారం చేసారు. బాలల కార్యక్రమంతో తన వాణిని వినిపించారు. తొలుత 'ప్రతిమ' అనే నాటకంలో ఆమె తన కెరీర్ మొదలుపెట్టింది. ఆ తరువాత 'షావుకారు' చిత్రంలో చాకలి రామిగా ప్రేక్షకులను అలరించింది.

తండ్రి రైల్వే ఉద్యోగి. బావ నాటకాలకు హార్మోనిస్టుగా పనిచేసేవారు. కనకదుర్గా నాట్యమండలిలో లోహితాస్యుడు, ప్రహ్లాదుడు, బాలకృష్ణుడు లాంటి బాలపాత్రలు అనేకం పోషించారు కనకం. పెళ్లి తప్పించుకోవడం కోసం మద్రాసు రైలెక్కేసారు ఆనాడు. తాపీ ధర్మారావునాయుడు ఆమెను కంటికి రెప్పలా చూసుకున్నారు మద్రాసులో.

1946లో గృహప్రవేశం చిత్రంలో బాలవితంతువుగా తొలి వేషం వేసారు.

అదే చిత్రంలో మరో పాత్రలో డాన్సర్‌గా కూడా నటించారు. అప్పుడే పరిచయమయ్యారు దర్శకులు ఎల్.వి.ప్రసాద్. శోభనాచల స్టూడియోలో వారికి కీలుగుఱ్ఱం పాత్ర వరించింది. అంజలీదేవి, కనకం ఇద్దరూ కలిసి రాక్షస స్త్రీలుగా నటించారు.

ఇదే చిత్రంలో రేలంగి, కనకం కలిసి డ్యూయెట్స్ కూడా పాడారు. 'గుణసుందరి కథ' చిత్రంలో మకరకన్య వేషం వేసినందుకు గాను ఆ కాలంలో సెక్సీ స్టార్‌గా ముద్ర పడింది ఆమెకు.

'రక్షరేఖ' చిత్రంలో కస్తూరి శివరావుకు జోడీగా మెప్పించారు.

'చేయి చేయి కలుపుకోర మామా' అనే పాట అప్పట్లో ఆ సినిమాలో పెద్ద హిట్ సాంగ్. 'కనకం అంటే బంగారమే. ఆమె హృదయం కూడా బంగారమే' అని శ్రీశ్రీ కితాబు ఇచ్చారు.

దాసీ చిత్రంలో ఎన్‌టిఆర్ రెండవ భార్యగా నటించారు. భాగ్యచక్రం, రక్షరేఖ, మానవతి, పల్లెటూరి పిల్ల, సౌదామిని, సక్కుబాయి, అగ్నిపరీక్ష, చంద్రవంక, ఆడపడుచు, ఆకాశరాజు, మాయపిల్ల, ప్రపంచం, భక్తప్రహ్లాద, లక్ష్మినివాసం, భార్య, లేతమనసులు తదితర చిత్రాల్లో నటించిన ఆమె చివరి చిత్రం 'ద్రోహి'. నాటకాల కోసం సినిమాలను వదులుకున్న నిజమైన రంగస్థల నటి కనకం. రంగస్థలంపై చింతామణి నాటకం ఆడుతూ నల్ల రామ్మూర్తి శ్రీహరి పాత్రలోనూ, మాధవపెద్ది



సత్యం, బిల్వమంగళుడుగా, రఘురామయ్య భవానీ శంకరంగా, రేలంగి సుబ్బిశెట్టిగా వేస్తే చింతామణిగా కనకం అద్భుతంగా నటించేది. అదో స్వర్ణయుగ చరిత్ర.

2004లో ఎన్‌టిఆర్ రంగస్థల పురస్కారం అందుకున్నారు. మద్రాసు తెలుగు అకాడమీ వారి ఉగాది పురస్కారం 1999లో లభించింది.

గుప్తా ఫౌండేషన్ అవార్డు, మా పురస్కారం, అజోవిభో నగదు పురస్కారం అందుకున్నారు కనకం.

చివరి రోజుల్లో ఆర్థిక సమస్యలు వెంటపడినా ఏ మాత్రం ధైర్యాన్ని చెక్కు చెదరనివ్వకుండా విజయవాడ లోనే శేషజీవితాన్ని గడిపారు.

తన 87ఏళ్ళ వయసులో 21 జూలై 2015లో కాలధర్మం చెందారు. తొలితరం రంగస్థల నటిగా తెలుగు వారికి ఎప్పటికీ గుర్తుండిపోయే నటి టి.కనకం! సార్థక నామధేయ నటి!!

# ఎర్రా...ఎర్రా బుర్రాబుగ్గల చిన్నది-
# మీనాకుమారి

**తె**లుగులో అసలు మీనాకుమారి అనే ఒక హాస్యనటి వుందని ఇప్పటి తరానికి తెలియదు.

ఆ పేరు వింటే దాదాపు ఇప్పుడంతా సీరియల్స్‌లో నటిస్తున్న మీనాకుమారినే అనుకుంటారు. కాని తెలుగులో 1960 దశకాల నుండి మీనాకుమారి అనే ఒక మంచి హాస్యనటి ఉండేది. ఆమె గురించిన సమాచారం ఇప్పుడు పెద్దగా దొరకడం లేదు.

అప్పట్లో వచ్చిన అనేక జానపద చిత్రాల్లో మోదుకూరి సత్యం, బాలకృష్ణ, రాజబాబు తదితరుల సరసన ఆమె హాస్యనటిగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారు.

స్వతహాగా మంచి అందగత్తె అయిన మీనాకుమారి నెల్లూరు దగ్గర కావలి నుండి వచ్చారు. అన్న, చెల్లి, తల్లి, తమ్ముడు అందరూ కలిసి చెన్నై వచ్చారు.

అక్కడ సినిమా అవకాశాల కోసం ప్రయత్నాలు చేసింది మీనాకుమారి. మంచి డాన్సర్ అయిన ఆమెకు  చాలా సులభంగానే అవకాశాలు వచ్చాయి.

1958లో కాశీనాథ్ నిర్మించిన 'శ్రీరామాంజనేయ యుద్ధం' చిత్రం ద్వారా పరిచయ మయ్యారు మీనాకుమారి. ఆ తరువాత కె.ఎస్. ప్రకాశరావు సోదరుడు కోవెలమూడి భాస్కరరావు దర్శకత్వంలో మనోరమ, సతీ సుకన్య చిత్రాలలో నటించారు.

ఆ తరువాత బి.విఠలాచార్య నిర్మించిన 'పెళ్లి మీద పెళ్లి' చిత్రం ద్వారా మరింత గుర్తింపు వచ్చింది మీనాకుమారికి.

ఎన్‌టిఆర్, బి. విఠలాచార్య, కె.బి.తిలక్ వంటి దర్శకులు రూపొందించిన అన్ని చిత్రాల్లో కూడా ఆమెకు పాత్రలు వరించాయి. ఎన్‌టిఆర్, శోభన్‌బాబు, కృష్ణ, సావిత్రి, విజయనిర్మల, షీల  తదితరులు నటించిన 'విచిత్ర కుటుంబం' చిత్రంలో రాజబాబు సరసన నటించి, మెప్పించారు.

ఆ చిత్రంలోనే 'ఎర్రా ఎర్రానిదాన బుర్ర బుగ్గలదానా' అనే పాటతో ఆమె కెరీర్‌లో ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. అందుకే అప్పటినుంచి ఆమెను 'ఎర్రా ఎర్రా బుర్ర బుగ్గల చిన్నది' అంటూ గుర్తు చేసుకునేవారు ఆ కాలం ప్రేక్షకులు.

కామెడీ వేషాలకు అద్భుతంగా సరిపోయిన మీనాకుమారి టైమింగ్ గాని, అలాగే నటన గాని, నృత్యాలు గాని చాలా చక్కగా ప్రేక్షకులను అలరించేవి. అందుకే ఆమెకు అవకాశాలు సులభంగా వచ్చాయి.

మహానటి సావిత్రికి మంచి స్నేహితురాలు అని చెపుతారు పరిశ్రమలో.





ఆ స్నేహ ఫలితమో ఏమో చివరలో ఆమె కూడా మద్యానికి బానిసయ్యిందని పరిశ్రమలో వినికిడి. ఆమె చెల్లెలు ఉషాకుమారి కూడా గ్రామదేవతలు అనే చిత్రంలో కథానాయికగా నటించింది. మంచి డాన్సర్ సహాయనటి, హాస్యనటిగా మంచి పేరును సంపాదించింది. మీనాకుమారి వ్యక్తిత్వ పరంగా చాలా గొప్ప మనిషి అని చెబుతారు. గుప్తదానాలు చేసేవారు. రోజుకు దాదాపు మూడు షిఫ్టులు పనిచేసేవారు.

ఆమెకు ఒక కుమారుడు. భర్త వై.సుబ్బారావు ఫిలిం పంపిణీదారుడుగా ఉండేవారు. కుమారుడు వెంకట నాగరాజు డాక్టర్‌గా అమెరికాలో పని చేస్తున్నారు.

చివరి రోజుల్లో క్యాన్సర్ వ్యాధిన పడి 2007 ఆగస్టు 13న కన్నుమూసారు. ఆమె చివరగా నటించిన చిత్రం 'జీవితంలో వసంతం'. చెల్లెలి కాపురం, ప్రేమనగర్ తదితర చిత్రాల్లో ఆమె నటన ఎన్నదగింది.

# జై పాతాళభైరవి-
# గిరిజ

**ఎన్‌టిఆర్**కు జానపద హీరోగా స్టార్‌డమ్ తెచ్చిన చిత్రం పాతాళభైరవి.

ఆ చిత్రంలో నాయిక మాలతి అయినా టైటిల్ రోల్ మాత్రం హాస్యనటి గిరిజదే.

'నరుడా ఏమి నీ కోరిక?' అంటూ ఆ చిత్రంలో మెరిసిన గిరిజ ఆ తరువాత కాలంలో అద్భుతమైన హాస్య నటిగా తెలుగు తెరను ఏలారు.

పరమానందయ్య శిష్యులు, అత్తా ఒకింటి కోడలే, మంచి మనసుకు మంచిరోజులు, మా ఇంటి మహాలక్ష్మి, మనోహర తదితర చిత్రాల్లో అక్కినేని నాగేశ్వరరావు, ఎన్‌టిఆర్, జగ్గయ్య, శివాజీ గణేశన్, హరనాథ్ తదితరుల సరసన కథానాయికగా నటించినా, ఆ తర్వాత హీరోయిన్‌గా సరియైన అవకాశాలు రాకపోవడంతో హాస్యనటిగా స్థిరపడిపోయారు.

మార్చి 3, 1938లో కంకిపాడులో జన్మించారు గిరిజ. గిరిజ తల్లి ప్రముఖ రంగ స్థలనటి దాసరి రామతిలకం. ఎస్.వి.ఆర్ హీరోగా నటించిన తొలి చిత్రం 'వరూధిని'లో దాసరి రామతిలకం కథానాయిక.

కంకిపాడులో పుట్టిన గిరిజ గుడివాడలో పెద్దమ్మ వద్ద వుంటూ చదువుకునేది. 13 ఏళ్ళ వయసులో మద్రాసులో వుంటున్న తల్లి వద్దకు వెళ్లింది. అందంగా వున్న ఆమె ఆ చిన్న వయసులోనే సినిమాల్లో నటించేందుకు ఆసక్తి చూపించింది.

కస్తూరి శివరావు ఆమెను కథానాయికను చేసి తొలి అవకాశం ఇచ్చారు.

1950-60 దశకాల్లో ఏకఛత్రాధిపత్యంగా హాస్యనటిగా సినీ జగత్తును ఏలిన మహారాణి గిరిజ. రేలంగితో జట్టు కట్టిన ఆమె చేసిన ఏ చిత్రమైనా హిట్టే. హీరో హీరోయిన్లకు సమానంగా కీర్తిప్రతిష్టలు పొందుతూ పారితోషికాన్ని కూడా అందుకునేవారు.

అన్నపూర్ణ, గుడిగంటలు, అప్పు చేసి పప్పుకూడు, జగదేకవీరుని కథ, ఆరాధన, నవ్వితే నవరత్నాలు, ధర్మదేవత, భలేఅమ్మాయిలు, దొంగల్లో దొర, మనోరమ, దైవబలం, పెళ్లికానుక, భట్టివిక్రమార్క, సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి, ఋణానుబంధం, కులదైవం, భార్యాభర్తలు, పరువు ప్రతిష్ట, రాముడు భీముడు, మంగమ్మ శపథం, నవరాత్రి, రహస్యం, ఆస్తిపరులు, ఇల్లరికం, తదితర చిత్రాల్లో నటించి పేరు గడించారు గిరిజ.

ఆ తరువాత అసిస్టెంట్ డైరెక్టర్ సి.సన్యాసిరాజును వివాహమాడారు. ఆయన దర్శకత్వంలో 'భలేమాస్టారు' ఎన్.టి.ఆర్, కాంచన, అంజలితో రూపొందించారు.

ఎన్‌టిఆర్, చంద్రకళ జంటగా 'పవిత్రహృదయాలు' అనే చిత్రాన్ని కూడా రూపొందించారు గిరిజ. కాని ఆ సినిమా సరియైన ఆదరణ పొందక నష్టాలు రావడంతో ఆస్తి మొత్తం కోల్పోవలసి వచ్చింది. దానికితోడు ఇన్నాళ్ళు ఆదరించిన రేలంగి కూడా కాలధర్మం చెందడంతో స్వంత ఇల్లు అమ్మేసి, అద్దె ఇంటికి మారవలసి వచ్చింది. తన సహనటుల ఆదరణతో బ్రతుకుబండి నెట్టవలసిన పరిస్థితి ఎదురయ్యింది గిరిజకు.

ఫామ్‌లో వున్నప్పుడు 6 కార్లు, 13 కుక్కలు ఆమెకు ఉండేవంటే అర్థం చేసుకోవచ్చు ఆమె ఎంత వెలుగు వెలిగారో...!

సహజంగా దయాస్వభావం కలిగింది గిరిజ. కాని చివరి రోజుల్లో ఇతరుల దయ



మీద ఆధారపడవలసి వచ్చింది. అదే విధివిలాసమంటే!

ఒక్కో హీరో పక్కన కథానాయికగా నటించేటప్పుడు బొట్టు మార్చి నటించేది అనేది పరిశ్రమలో ఆమెపై ఒక మాట చెలామణి అయ్యేది.

నాగేశ్వరరావు సరసన నటించాలంటే పెద్ద బొట్టు పెట్టేది. జగ్గయ్య సరసన నటించాలంటే పొడుగు బొట్టు పెట్టేది. ఇలా రకరకాల బొట్లతో వారి సరసన నటించ డానికి తాను కూడా సరిపోతాను అనే విధంగా ఆమె ప్రేక్షకులకు, దర్శకులకు నమ్మకాన్ని కలిగించేది.

దాదాపు 400 చిత్రాల్లో నటించిన గిరిజ హాస్య రాణిగా ప్రేక్షకుల హృదయాల్లో ముద్ర వేసింది.

చివరిరోజుల్లో సరైన ఆదరణ లేక కూతురు సలీమా ఆదరణతో కొంతకాలం బ్రతుకు బండి లాగినా సెప్టెంబర్ 5, 1995న కాలధర్మం చెందారు గిరిజ.

# అసమాన హాస్యం-
# భానుమతీ రామకృష్ణ

**తె**లుగు తెరకు దొరికిన ఓ వరం భానుమతీ రామకృష్ణ.

ఆమెతో సమానమైన నటి మరెవరూ ఇప్పటివరకూ రాలేదంటే అతిశయోక్తి కాదు.

దక్షిణ భారత సినిమాను ప్రభావితం చేసినవారిలో భానుమతి ప్రముఖులు.

నటిగా, నిర్మాతగా, దర్శకురాలిగా, స్టూడియో అధినేతగా, రచయిత్రిగా, గాయనిగా, సంగీత దర్శకురాలిగా అనేక పార్శ్వాలలో ఆమె తన ప్రతిభను కనబరిచారు.

ఇక నటిగా అంటే, అన్ని రసాలూ అద్భుతంగా పోషించగలిగినవారే నిజమైన నటులు- అన్న మాటను నిజం చేసి చూపారు. అందులోనూ హాస్యాన్ని పండించడం సామాన్యమైన విషయం కాదు.

హాస్యాన్ని పండించడంలో కూడా అందె వేసిన చెయ్యి భానుమతిది.

భానుమతి 1926 సెప్టెంబర్ 7న ప్రకాశం జిల్లా దొడ్డవరంలో జన్మించారు.

తండ్రి బొమ్మరాజు వెంకటసుబ్బయ్య. శాస్త్రీయ సంగీత కళాకారుడు. తండ్రి వద్దే సంగీతం అభ్యసించారు.

13 ఏళ్ళ వయసులోనే 'వరవిక్రయం' అనే చిత్రంలో నటించారు. దాదాపు 60 సంవత్సరాల పాటు సినీ పరిశ్రమలోనే ఉన్నా, ఆమె కేవలం 100 చిత్రాల్లో మాత్రమే నటించారు.

రాశి కన్నా వాశి గొప్పగా ఉండాలని భావించే ఆమె, మంచి మంచి కథలను, పాత్రలను ఎన్నుకుని మరీ నటించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు ఆమెకు గౌరవ పురస్కారాలు ఎన్నోసార్లు అందజేసాయి. అనేక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో అభినందించాయి.

రఘుపతి వెంకయ్య అవార్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందించింది.

భారత ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చి ఆమె గౌరవాన్ని ఇనుమడింపజేసింది.

ఇక ప్రేక్షకులిచ్చిన అవార్డులు రివార్డుల లెక్కే లేదు. ఎన్నో రకాల పాత్రలలో నటించినా ఆమె 'వరుడు కావాలి, అంతస్థులు, గృహలక్ష్మి, చక్రపాణి, అంతా మనమంచికే, విచిత్ర వివాహం, గడసరి అత్త సొగసరి కోడలు, మంగమ్మగారి మనవడు, బామ్మ మాట బంగారు బాట, మట్టిలో మాణిక్యం' తదితర చిత్రాలలో హాస్యాన్ని ఒలికించారు.

ఆమె హాస్యం చేస్తే అద్భుతంగా వుంటుందని అప్పటి విమర్శకులు చెప్పేవారు.

వరుడు కావాలి చిత్రంలో ఆమె చేసిన నటన హైలెట్‌గా నిలిచింది.

అలాగే అంతస్థులులో రమణారెడ్డి, రేలంగితో కలసి ఒలికించిన హాస్యం మరువలేం.

చక్రపాణి, అంతా మనమంచికే, విచిత్ర వివాహం తదితర చిత్రాల్లో హాస్యానికి పెద్దపీట వేసి నటించారు.

'గడసరి అత్త సొగసరి కోడలు' చిత్రంలో నటి శ్రీదేవికి పోటీగా హాస్యాన్ని ఒలికించారు.

'మంగమ్మగారి మనవడు' చిత్రంలో సుహాసినితో వెటకారంగా మాట్లాడుతూ నటన ఒలికించిన హాస్యం మరోసారి చూడాలనిపించేలా ఉంటుంది.

అలాగే మట్టిలో మాణిక్యంలో చలంతో కలిసి చేసిన కామెడీ అద్భుతం.



బామ్మ మాట బంగారుబాటలో సిల్క్‌స్మిత, నూతన్ ప్రసాద్, రాజేంద్రప్రసాద్, గౌతమిలతో ఆమె నటించిన సన్నివేశాలు నవ్వు తెప్పిస్తాయి.

మహానటి అయినా ఆమె హాస్యాన్ని మాత్రం వదల కుండా ఏ సన్నివేశంలో హాస్యం వస్తే ఆ సన్నివేశంలో అద్భుతంగా పండించి ప్రేక్షకులను మెప్పించేవారు.

అనేక పదవులను గౌరవప్రదంగా నిర్వహించారు. హాస్యయుతమైన పద్యాలను ఆలపించిన ఘనత కూడా భానుమతిదే.

2005 డిసెంబర్ 4న చెన్నైలో ఆమె తెలుగు ప్రేక్షకులకు దూరమయ్యారు.

ఆమె లేకపోయినా ఆమె నటించిన పలు హాస్య సన్నివేశాలు ఇప్పటికీ నవ్వు తెప్పిస్తూనే ఉన్నాయి తెలుగు ప్రేక్షకులకు.

ధన్యజీవి భానుమతి!

# హాస్యాంజలి -
# గీతాంజలి

ఎవరూ హాస్యనటిగా ముద్ర వేయించుకోవడానికి పరిశ్రమకు రారు.

ఎవరైనా సరే ముందు హీరోయిన్‌గా నటించాలనుకుంటారు. ఆ తరువాతే వారి విధివిధానాలు, అదృష్టం అన్నీ కలిసి వచ్చి ఏదో ఒక నటిగా ముద్ర వేసుకుంటారు.

అలా కథానాయికగా వచ్చి హాస్యనటిగా ఎదిగిన గీతాంజలి జీవితం వైవిధ్యభరితం.

1947 కాకినాడలో జన్మించిన 'మణి' ఆ తరువాత గీతాంజలిగా మారి హాస్యనటిగా అనేక చిత్రాల్లో నటించారు.

శ్రీరామమూర్తి, శ్యామసుందరి దంపతులకు జన్మించారు. నలుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్న కుటుంబంలో గీతాంజలి రెండవ అమ్మాయి. కాకినాడలో సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో కొన్నాళ్ళు చదివారు. మూడేళ్ళ ప్రాయం నుండే గీతాంజలి తన అక్క స్వర్ణతో పాటు గంధర్వ నాట్యమండలిలో నాట్యం నేర్చుకున్నారు. నాలుగేళ్ళ నుండే అక్కతో పాటు సభలలో నాట్యప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు.

తెలుగు, తమిళ భాషలలో ఎక్కువగా నటించిన గీతాంజలి కన్నడ, మలయాళంలో కూడా కొన్ని చిత్రాలలో నటించారు.

ముఖ్యంగా హిందీలో పారస్‌మణి అనే చిత్రంలో కథానాయికగా నటించి రికార్డు సృష్టించారు. రేలంగి- గిరిజ, రాజబాబు- రమాప్రభ ఎలా హాస్య జంటో అలాగే పద్మనాభం - గీతాంజలి ఓ మంచి పెయిర్‌గా హాస్యం పండించేవారు. ఏ చిత్రంలో చూసినా వారిద్దరిదే జంట. 'ఇల్లాలు' చిత్రంలో కథానాయికగా నటించారు.

ఆ తరువాత 'అమ్మాయిగారు అబ్బాయిగారు' అనే చిత్రంలో కూడా కృష్ణ సరసన నటించారు. ఆ చిత్రంలో 'అలాంటిలాంటి ఆడదాన్ని కాదు అబ్బాయా ఎలాంటి ఎలాంటి ఆడదాన్నో సూపుతానయా' అంటూ ఆమె చేసిన నృత్యం ఇప్పటికీ ఎంతో మంది ప్రేక్షకులకు గుర్తు ఉండే వుంటుంది. మంచి నృత్య కళాకారిణి కావడంతో ఎలాంటి నృత్యాలనైనా గీతాంజలి అద్భుతంగా ఆవిష్కరించేవారు.

'పంతాలు పట్టింపులు' అనే చిత్రంలో వాణిశ్రీకి సరిజోడుగా నృత్యాలు చేసి అలరించారు. 'శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న' చిత్రంలో 'మంగిడీలు మంగిడీలు' పాటలో పద్మనాభంకి సరిజోడిగా, అలాగే దేవత చిత్రంలో వారిద్దరి జంట నవ్వులు పూయించింది.

సీతారామ కళ్యాణంలో ఎన్‌టిఆర్, ఆమెకు సీత పాత్రను ఇచ్చి ప్రోత్సహించారు.

'పేయింగ్ గెస్ట్' అనే చిత్రంలో బేబి గీతాంజలిగా నటించడం మరో విశేషం.

నటుడు రామకృష్ణను వివాహం చేసుకున్నారు.

ఆమె అక్క స్వర్ణ కూడా కొన్ని చిత్రాల్లో నటించారు. 'సంబరాల రాంబాబు' చిత్రంలో 'పొరుగింటి మీనాక్షమ్మను చూసారా' పాటలో గీతాంజలి నటన చూడాల్సిందే.

డాక్టర్ చక్రవర్తి లో ఏఎన్ఆర్ చెల్లెలిగా 'పాడమని నన్నడగవలెనా' అనే పాటలో జీవించారు. అదే ఏఎన్ఆర్ మరో చిత్రం మురళీకృష్ణలో ఆమె పాత్ర హైలెట్‌గా నిలిచింది.

తోటలో పిల్ల కోటలో రాణి చిత్రంలో నాగకన్యగా అలరించారు.

పొట్టిప్లీడరు, నవగ్రహ పూజా మహిమ, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణ పాండవీయం,



లేతమనసులు, లక్ష్మీనివాసం, అదృష్టవంతులు, మూగ నోము, పూలరంగడు, మంచిమిత్రులు, రణభేరి, ఆదర్శ కుటుంబం, గూఢచారి 116, ప్రాణమిత్రులు, బభ్రువాహన, అవేకళ్ళు, హంతకులొస్తున్నారు జాగ్రత్త, లోగుట్టు పెరుమాళ్ళకెరుక, కాలం మారింది తదితర చిత్రాల్లో ఆమె నటించారు.

తెలుగు పరిశ్రమ హైద్రాబాద్‌కు వచ్చిన క్రమంలో ఆమె హైద్రాబాద్‌కు వచ్చి 'పెళ్లయిన కొత్తల్లో', 'గోపి గోపిక గోదావరి', 'గ్రీకువీరుడు', 'దటీజ్ ద మహాలక్ష్మి' తదితర చిత్రాల్లో హాస్యాన్ని పండించారు.

నంది అవార్డ్సు కమిటీలో మెంబర్‌గా సేవలందించారు. తొలిచిత్రం రాణీ రత్నప్రభ. చివరి చిత్రం దటీజ్ మహాలక్ష్మి.

సెప్టెంబర్ 31, 2019 గుండెపోటుతో వారు కాలధర్మం చెందారు.

# తెలుగింటి బామ్మ-
# నిర్మలమ్మ

**అం**దరికీ అమ్మలాంటి సూర్యకాంతంతో 'గుండమ్మకథ' చిత్రం రూపొందించారు. ఎంతోమంది మహామహులున్నా సూర్యకాంతానికి సంబంధించిన పాత్ర పేరునే టైటిల్‌గా పెట్టారు. అదే విధంగా ఎంతోమంది మహామహులు నటించినా 'పెదరాశి పెద్దమ్మ కథ' చిత్రానికి నిర్మలమ్మ పాత్ర పేరునే టైటిల్‌గా పెట్టారు. ఎన్నో చిత్రాల్లో అమ్మగా, బామ్మగా, అత్తమ్మగా అనేక రకాల పాత్రలు పోషించిన సహజనటి నిర్మలమ్మ.

వందలాది తెలుగు చిత్రాల్లో నటించారు. కేరక్టర్ ఆర్టిస్టుగా ఎంతో గుర్తింపు పొందారు. తెలుగు చలనచిత్ర రంగంలో అందరికీ బామ్మగా, కొందరికి అమ్మగా నటించి ఆయా పాత్రాల్లో జీవించిన అచ్చ తెలుగు నటి నిర్మలమ్మ.

1970 నుండి 2000 వరకు ఎన్ని పాత్రల్లోనో పరకాయ ప్రవేశం చేసారు. ఆమె సంభాషణలు పలికే తీరు ప్రతి నటుడు గమనించేవారు. ఆమె సెట్‌లో ఉంటే చాలు అక్కడ నవ్వులు వెల్లివిరిసేవి. ఆమె సినిమాల్లో ఉపయోగించిన అనేక సామెతలు ఇప్పటికీ ప్రేక్షకుల నోళ్ళల్లో మెదులుతూనే ఉంటాయి. తెలుగు సినీ పరిశ్రమలో ఆమెకు తెలియని వారు లేరు. ఆమెతో నటించని నటులూ లేరు. ఇంచుమించు దర్శకులందరి దర్శకత్వంలో నటించారు నిర్మలమ్మ.

1927లో మచిలీపట్నంలో జన్మించారు నిర్మలమ్మ. చిన్నప్పటినుండి నటనపై, సంభాషణలు పలికే విధానంపై ఆమెకు మంచి అవగాహన ఉండేది. దాంతో నాటక రంగానికి రావడం సులవైంది. నాటకాల్లో నటిస్తూనే విజయవాడ ఆకాశవాణి ద్వారా తన గాత్రంతో అనేక నాటకాలకు వన్నె తెచ్చారు. నటనపై ఉన్న మక్కువతో మద్రాసు చేరుకున్నారు. తొలిసారిగా 'గరుడ గర్వభంగం' అనే చిత్రంలో నటించారు.

కాని ఆ తరువాత సరియైన పాత్రలు రాక, చిన్నా చితకా పాత్రలతో కొన్నాళ్ళు గడిపారు. అప్పట్లో ఎక్కువగా చెలికత్తె వేషాలు, చిన్న చిన్న వేషాలు వేసేవారు. అలా వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని ఎందరో శ్రేయోభిలాషుల్ని సంపాదించు కున్నారు. సావిత్రి నటించిన దేవత చిత్రంలో 'అలయాన వెలసిన ఆ దేవుని రీతి' అన్న పాటలో కోడలు వడ్డించే విందు ఆరగించే అత్తగా కనిపిస్తారు. ఈ చిత్రంలో ఆమెకు ఒక్క డైలాగ్ కూడా లేకపోవడం విశేషం.

మనుషులు మారాలి చిత్రంలో ఆమె అభినయానికి మంచి గుర్తింపు వచ్చింది.

సంవత్సరానికి హీరోయిన్‌ల కన్నా ఎక్కువ చిత్రాల్లో నటించేవారు. అనేక వైవిధ్యమైన పాత్రల్లో జీవించారు. నటనాపరంగా మంచి టైమింగ్, ముఖంలో భావాలు మార్చటం, బాడీలాంగ్వేజ్, కట్టుబొట్టుతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

ముద్దుల కృష్ణయ్య చిత్రంలో బాలకృష్ణతో సిగ్గుపడుతూ ఈ వయసులో నాతో ఈ మాటలంటే నేనేం జవాబు చెప్పేది బాబూ అంటూ వగలు పోయిన విషయం గుర్తుకు వస్తే ప్రేక్షకుల్లో తియ్యటి భావన కలగక మానదు. గ్యాంగ్‌లీడర్ చిత్రంలో చిరంజీవి తాతగా వచ్చి 'స్వర్గంలో రంభ, ఊర్వశి, మేనకలు నాకోసం ఎదురు చూస్తున్నారు వెళ్తున్నాను'... అంటే స్త్రీ సహజమైన అసూయతో ఆమె మూతి తిప్పిన విధానం ఎవరికైనా నవ్వు తెప్పించక మానదు.

స్వాతిముత్యం, శంకరాభరణం, పట్నం వచ్చిన పతివ్రతలు, శుభసంకల్పం, మయూరి, మామగారు, ఆ ఒక్కటి అడక్కు, బాబాయ్ అబ్బాయ్, హీరో, ఒక రాధ ఇద్దరు కృష్ణులు, శ్రీ కనకమహాలక్ష్మీ రికార్డింగ్ డాన్స్ ట్రూప్, వారసుడొచ్చాడు, లాంటి అనేక చిత్రాల లో దాదాపు వెయ్యి సినిమాలు పూర్తి చేసారామె.



నిర్మాతగా మారి రాజేంద్రప్రసాద్, రజనితో 'చలాకీ మొగుడు చాదస్తపు పెళ్ళాం' చిత్రాన్ని రూపొందించారు. నటిగా అనేక అవార్డులందుకున్నారు. నాటక సమాజాలు బతకాలని అనేక సమాజాలుకు గుప్తదానాలు చేసారు. దాదాపు 82 సంవత్సరాల వరకు తన కెరీర్‌ను కొనసాగించిన నిర్మలమ్మ 2009 ఫిబ్రవరి 19న హైద్రాబాద్‌లో కన్నుమూసారు. వారు లేకపోయినా వారు నటించిన పాత్రలు ఎప్పటికీ సజీవంగా నిలిచి మరో బామ్మ ఇకరాదు అని చెప్పడానికి ఉదాహరణగా నిలుస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.



# కారం మిరియాల మిక్సీ-
# తెలంగాణ శకుంతల

'**న**రుకుతా నీయవ్వ', 'సంజయిందా బిడ్డ', 'పైసల్ వసూలు చేసే తరీక్ ఇది'... ఇలాంటి డైలాగులు వినిపిస్తే వెంటనే గుర్తొచ్చేది తెలంగాణ శకుంతల.

ఎర్రటి మిరపకాయలు, మిరియాలు రెండూ కలిసి మిక్సీలో వేస్తే ఎంత ఘాటు ఉంటుందో ఆమె డైలాగ్ డెలివరీలో, నటనలో అంత ఘాటు కనిపిస్తుంది.

గయ్యాళి అక్కగా, అత్తగా అనేక రూపాల్లో గడుసుదనాన్ని కలగలిపి నటించిన నటి తెలంగాణ శకుంతల. పుట్టింది పూనా అయినా తెలంగాణ మాండలికాన్ని తన దైన స్టైల్లో పలుకుతూ ఆ మాండలికానికే వన్నెలద్దిన నటి ఆమె.

అలా అదే మాండలికంలో అద్భుతంగా మాట్లాడడంతో ఆమె తెలంగాణ శకుంతలగా గుర్తింపు పొందారు.

1951 జూన్ 9న మహారాష్ట్రలోని పూనాలో జన్మించారు కడియాల శకుంతల. రంగస్థలంపై 'ఒంటికాలు పరుగు' అనే నాటకంతో కెరీర్ ప్రారంభించారు. పద్య పఠనంలో ప్రావీణ్యాన్ని సంపాదించి శ్రీకృష్ణ తులాభారం, మహాకవి కాళిదాసు తదితర పౌరాణిక నాటకాల్లో అద్భుతమైన ప్రతిభను కనబరిచారు.

1979లో వచ్చిన 'మా భూమి' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమయ్యారు.

'కుక్క' అనే చిత్రంలో ఆమె నటనకు గాను ఉత్తమ నంది బహుమతి లభించింది. ఏ పాత్రలో నటించినా ఆ పాత్రకు ఒక స్థాయిని తీసుకువచ్చి నవ్వులు కురిపించినా క్రౌర్యం, నిప్పులు కురిపించినా ఆమె వల్లే సాధ్యమయ్యింది. ఓ రకంగా లేడీ విలన్‌గా ముద్ర పడ్డారు.

విలనిజంలో కూడా కామెడీ చెయ్యడం ఆమెకే చెల్లింది. అనేక నాటకాల్లో కథా నాయికగా నటించి అనేక అవార్డ్స్, రివార్డ్స్, బహుమతులు అందుకున్నా వెండితెర మీద మాత్రం కేరక్టర్ నటిగా, విలన్‌గా, హాస్యనటిగా ఆమె నటించి పలువురి మన్ననలు అందుకున్నారు..

అహ నా పెళ్ళంట, గులాబి, సీతారామయ్య గారి మనవరాలు, కొండవీటి సింహం, తప్పు చేసి పప్పుకూడు, సందడే సందడి ఇంద్ర, అభిమన్యు, ధూమ్, వీడే విష్ణు, గంగోత్రి, పెళ్లాంతో పనేంటి, సింహాచలం, ఒక్కడు, అడవిరాముడు, దొంగ దొంగది, ఆంధ్రావాలా, ఒరేయ్ పండు, ఒక్కడే, సదా మీ సేవలో, సైనికుడు, లక్ష్మి, మా ఇద్దరి కథ, పిల్ల కుదిరితే పెళ్లి, మా నాన్న చిరంజీవి, కళ్యాణ్‌రామ్ కత్తి, బ్రహ్మలోకం టు యమలోకం వయా భూలోకం, ఎవరైనా ఎప్పుడైనా, బెండు అప్పారావు ఆర్ఎమ్‌పి తదితర చిత్రాల్లో ఆమె తన నటనతో తెలుగు ప్రేక్షకులకు నవ్వులు చిలికించారు.





లేడీ విలన్‌గా హాస్యాన్ని విరజిమ్ముతూ దాదాపు 300 చిత్రాలకు పైచిలుకు సినిమాల్లో నటించారు.

రంగుల కల, స్వర్ణక్క, నువ్వు నేను చిత్రాలకు నంది పురస్కారాలు లభించాయి. హార్ట్ స్ట్రోక్‌తో జూన్ 14, 2014న ఆమె తెలుగు ప్రేక్షకులను వదలి వెళ్లారు.

తెలంగాణ శకుంతల అంటేనే ఓ మార్క్... ఆ మార్క్‌ను ఎవరూ భర్తీ చేయలేరు.



## ఎల్కపిల్ల–
# కల్పనారాయ్

'**చా**లా బాగుంది' చిత్రంలో ఎల్‌బి శ్రీరామ్‌తో కలిసి ఎల్కపిల్లగా కల్పనారాయ్ చేసిన కామెడీ తెలుగువారు మర్చిపోలేరు. అదేవిధంగా 'కలిసుందాంరా' చిత్రంలో 'ఓలుంటారు ఓలుండరు ఓలుంటారు ఓలు లేరు' అన్న మేనరిజంతో నవ్వులు పూయించారు.

1950 మే 9 న కాకినాడలో జన్మించారు సత్యవతి. యంగ్‌మెన్ హేపీ క్లబ్‌లో నాటకాలు వేసేవారు. స్టేజినటిగా కెరీర్ మొదలుపెట్టి ఆ తరువాత సినిమా పరిశ్రమకు వచ్చారు.

ఆమె తొలుతగా నటించిన చిత్రం 'ఓ సీత కథ'. ఉన్నతమైన సంస్కారం కలది. ఆమె చేత్తో ఏది చేసినా మంచి జరుగుతుంది అని పరిశ్రమలో పేరుండేది. ఇంటికి ఎవరు వచ్చినా వారికి అన్నపూర్ణలా వడ్డించేది. సెట్స్‌లోనూ, ఇంటి దగ్గర స్టేజీలపైన మిమిక్రీ కూడా చేసి ప్రేక్షకులను నవ్వించేది. తన ప్రేమికుడు మోహన్‌రాయ్ పేరు కూడా కలిసి వుండాలని ఆమె తన పేరును కల్పనారాయ్‌గా మార్చుకుంది. ఆమెకు వివాహం కాలేదు. పెళ్లి చేసుకోకుండా కుటుంబ బాధ్యతలు నెత్తి మీద వేసుకుని చివరి కంటా పోరాడిన వ్యక్తిత్వం కల్పనారాయ్‌ది. జీవితంలో ఆనందాలు, విషాదాలు లాంటి రెండు పార్శ్వాలను చూసిన అనుభవం ఆమెది.

నీడలేని ఆడది, కోడళ్ళొస్తున్నారు జాగ్రత్త, డాక్టర్ మాలతి, కారు దిద్దిన కాపురం, ఆఖరి పోరాటం, హిట్లర్, ప్రేమించుకుందాం రా, కలిసుందాం రా, అల్లరి, జంబలకిడి పంబ, యువరత్న, శీను, పెళ్లి సంబంధం, ప్రియమైన నీకు, ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం, పుట్టింటికి రా చెల్లి, మధుమాసం, మంత్రదండం, జానకిరాముడు, కెప్టెన్ నాగార్జున, శ్రీమతి కావాలి, రామ్ రాబర్ట్ రహీమ్, శ్రీనివాస కళ్యాణం తదితర చిత్రాల్లో కల్పనారాయ్ తన నటనను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసింది.

చేతికి ఎముక లేకుండా దానాలు చేయడంతో చివరి రోజుల్లో పేదరికాన్ని అనుభవించింది. ఆమె చివరగా నటించిన చిత్రం 2005 లో సోగ్గాడు. తన 57వ ఏట 2008లో ఫిబ్రవరి 6న ఆమె తెలుగు ప్రేక్షకులకు దూరమయ్యారు.

గోతెలుగు.కామ్
ప్రతిరోజూ కొత్తదనమే !
కథలు ❖ కార్టూన్లు ❖ వ్యాసాలు ❖ సమీక్షలు ❖ నవలలు
www.gotelugu.com.
చదవండి - చదివించండి !

# శ్రీరామచంద్ర
# పిల్లల మరియు దంత వైద్యశాల

ఓల్డ్ క్లబ్ రోడ్, గుంటూరు వారి తోట, 6వ లైను, గుంటూరు - 1.

Ph. : 0863 - 2323743 Cell : 7731891177



డా॥ టి. చంద్రశేఖరరెడ్డి
ఎం.డి (పి.జి.ఐ. చండీఘర్)
పిల్లల వైద్య నిపుణులు






డా॥ టి. సరస్వతి
బి.డి.యస్.
దంత వైద్య నిపుణులు

- » 24 గం॥లు వైద్య సదుపాయము
- » నియోనేటల్ ఇన్‌టెన్సివ్ కేర్
- » పిడియాట్రిక్ ఇన్‌టెన్సివ్ కేర్
- » ఆపరేషన్ థియేటర్
- » వెంటిలేషన్ సౌకర్యం
- » అన్నిరకముల టీకాలు

**విశిష్ఠ సదుపాయాలు**

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రీయంబర్స్‌మెంట్
- వైయస్ఆర్ ఆరోగ్యశ్రీ
- APSPDCL ఉద్యోగులకు క్యాష్‌లెస్

- » పిప్పి పళ్ళకు ఫిల్లింగ్ చేయుట
- » పాడైన పళ్ళను తొలగించుట
- » ఎత్తు పళ్ళను, వంకర పళ్ళను క్లిప్స్ ద్వారా సరిచేయుట.
- » పిప్పి పళ్ళను తీయకుండా రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ చేయుట.
- » కట్టుడు పళ్ళు, ఫిక్స్‌డ్ పళ్ళు అమర్చుట.

**ఈ క్రింది కంపెనీలలో ఇన్సూరెన్స్ కలవారికి క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ కలదు.**

| | |
|---|---|
| గుడ్ హెల్త్ ప్లాన్ లిమిటెడ్ | డెడికేటెడ్ హెల్త్‌కేర్ సర్వీస్ టి.పి.ఎ. ఇండియా ప్రై. లిమిటెడ్ |
| ఫ్యూచర్ జనరల్ ఇండియా లిమిటెడ్ | స్టార్ హెల్త్ అండ్ ఎలైడ్ ఇన్సూరెన్స్ కం. లిమిటెడ్ |
| టి.టి.కె. హెల్త్ కేర్ టి.పి.ఎ. ప్రై. లిమిటెడ్ (విధాల్ హెల్త్) | స్మార్ట్ మెడిటెక్ టి.పి.ఎ. సొల్యూషన్స్ ప్రై. లిమిటెడ్ |
| యం.డి. ఇండియా హెల్త్‌కేర్ సర్వీసెస్ టి.పి.ఎ. ప్రై లిమిటెడ్ | అలంకిత్ హెల్త్‌కేర్ టి.పి.ఎ. లిమిటెడ్ |
| విపుల్ మెడికార్ప్ టి.పి.ఎ. లిమిటెడ్ | మెడికేర్ టి.పి.ఎ. సర్వీసెస్ ఇండియా ప్రై. లిమిటెడ్ |
| హెరిటేజ్ హెల్త్ టి.పి.ఎ. ప్రై లిమిటెడ్ | ఇ-మెడిటెక్ టి.పి.ఎ. సర్వీసెస్ ప్రై. లిమిటెడ్ |
| ఫ్యామిలీ హెల్త్ ప్లాన్ టి.పి.ఎ. లిమిటెడ్ | హెల్త్ ఇండియా టి.పి.ఎ. సర్వీసెస్ ప్రై. లిమిటెడ్ |
| మెడ్‌సేవ హెల్త్‌కేర్ టి.పి.ఎ. లిమిటెడ్ | మేడి ఎస్సిస్ట్ ఇండియా ప్రై. లిమిటెడ్ |

డి. ఎన్. బి
ప్రతిభకు సంకేతం

ఐ. ఎస్. ఓ
నాణ్యత నిరూపణం

ఎన్.ఏ.బి.హెచ్
ప్రగతి ప్రకటితం

**అత్యవసర కేసులు అన్నివేళల చూడబడును.**

# వైవిధ్యమైన నవ్వుల
# సారథి



ప్రతి నటుడికి ఏదో ఒక గుర్తింపు ఉండాలి. అటువంటి గుర్తింపు సరికొత్తగా వున్న నటుడు సారథి.

ఆయన వాయిస్సే అతనికి గుర్తింపు. ఆయన నవ్వులో వైవిధ్యం వుండి ప్రేక్షకులను అలరించేది. శబ్దాన్ని, నిశ్శబ్దాన్ని ఔపోసన పట్టిన కళాకారుడిగా, ఎక్స్‌ప్రెషన్‌కు సౌండ్‌ని మిక్స్ చేయడంతో ఆయన టైమింగ్ ఓ సరికొత్త ప్రజంటేషన్‌గా స్క్రీన్‌పై వెలిగిపోయేది.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 1942 జూన్ 26న సారథి జన్మించారు.

తండ్రి 'కడలి వీరదాసు' తొలినాళ్ళలో హరికథలు చెప్తూ నాటకాలు ప్రదర్శించేవారు. ఆ ప్రదర్శనలు చూసిన ఎన్.టి.ఆర్.ఆయనకు అభిమానిగా మారారు. తండ్రితో పాటే సారథి తొలిసారిగా శకుంతల నాటకంలో భరతునిగా నటించారు. దాదాపు 50 సంవత్సరాల పాటు నాటకరంగానికి, సినిమా రంగానికి సేవలు చేసారు.

వీరదాసు తన అభిమాని అయిన ఎన్‌టిఆర్‌కు సారథిని పరిచయం చేసారు.

ఎన్‌టిఆర్ రూపొందిస్తున్న సీతారామ కళ్యాణంలో నలకుబేరుడిగా ఆయన తొలిసారిగా తెరపై కనిపించారు. 18వ ఏటనే నాటకాల అనుభవంతో చెన్నైకి వెళ్ళిపోయిన విజయసారథి అక్కడ నుండి దాదాపు పదహారేళ్ళపాటు నాటకాలు వేస్తూ కాలం గడిపేసారు. అందుకే కళాకారులకు సమయం వచ్చింది అంటే సమయం దొరకదు అన్నట్లుగా, ఆయనకు భక్తకన్నప్ప చిత్రంలో రావుగోపాలరావు కొడుకు పాత్రతో అద్భుతమైన గుర్తింపు వచ్చింది.

రంగస్థలంపై దాదాపు పద్దెనిమిది సార్లు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డులు పొందారు. మద్రాసు ఆంధ్రా క్లబ్ చప్పట్ల మోతగా మారిపోయేది ఆయన నటనతో.

ఓ నాటకంలో 60 ఏళ్ళ ముసలివాడుగా నటిస్తే ఎస్.వి.ఆర్. ఆ నాటకం చూసి ఆశ్చర్యపోయారట. 20 ఏళ్ల పిల్లాడివి 60 ఏళ్ళ ముసలివాడుగా ఎలా నటించావు అని చెప్పి ఆయనను మెచ్చుకుని 500 రూపాయలు బహుమతిగా ఇచ్చారు ఎస్‌విఆర్.

దాదాపు 500 చిత్రాలకు పైచిలుకు నటించిన, ఆయన హైద్రాబాద్‌కు చిత్రపరిశ్రమ తరలిరావడం కోసం క్రియాశీలంగా వ్యవహరించారు.

మూవీ ఆరిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ సినీ కార్మికుల సంస్థకు వ్యవస్థాపక కోశాధికారిగా కూడా సేవలందించారు.

పరమానందయ్య శిష్యుల కథ, భక్తకన్నప్ప, అత్తవారిల్లు, అమరదీపం, ఇంద్రధనస్సు, చిరంజీవి రాంబాబు, జగన్మోహిని, మనవూరి పాండవులు, సొమ్మొకడిది సోకొకడిది, కోతలరాయుడు, గంధర్వకన్య, దశ తిరిగింది, అమ్మాయికి మొగుడు మామకు యముడు, నాయకుడు వినాయకుడు, మదనమంజరి, మామా అల్లుళ్ళ సవాల్, బాబులుగాడి దెబ్బ, మెరుపుదాడి, ఆస్తులు అంతస్తులు తదితర చిత్రాల్లో ఆయన నటన ఎన్నదగింది.




భక్తకన్నప్పలో కోకోపాగా, జగన్మోహిని చిత్రంలో కాళ్ళు పొయ్యిలో పెట్టి వంట చేస్తున్న దెయ్యాన్ని చూసి భయపడిన నటనతో ఆయన తెలుగు ప్రేక్షకులకు ఎప్పుడూ గుర్తుంటారు.

స్వర్ణయుగంలో సినిమా పరిశ్రమలోకి వచ్చిన ఆయన అద్భుతమైన నటుడిగా పలువురి నటీనటుల మెప్పును పొందారు. అంకితభావం, శ్రద్ధతో ప్రతి పాత్రను ప్రేక్షకులకు నచ్చేలా నటించేవారు.

ఆయన ప్రస్తుతం ప్రశాంత జీవనం గడుపుతున్నారు హైద్రాబాద్‌లో.

# బాల నటులకు ప్రేరణ విస్సు-
# విశ్వేశ్వరరావు



మెగాస్టార్ చిరంజీవి ఓ ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు–"తనకు నటుడు కావాలన్న కోరిక హాస్యనటుడు, బాలనటుడు అయిన విశ్వేశ్వరరావును చూసాక కలిగిందని, తొలినాళ్ళలో ఆయన నటన తనను ఆకట్టుకునేదని, ఆ ప్రేరణతోనే తానూ ఓ నటుడిగా ఎదగాలన్న కోరిక బలంగా పెరిగిందని".

ఆ నటుడే బాలనటుడిగా అనేక చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న గరిమెళ్ళ విశ్వేశ్వరరావు.

అందాల నటి శ్రీదేవితో తొలిసారిగా డ్యూయెట్‌లో నటించిన నటుడు కూడా విశ్వేశ్వరరావే కావడం విశేషం.

పట్టిందల్లా బంగారం అనే చిత్రంలో విశ్వేశ్వరరావు శ్రీదేవి, చిన్నప్పటి హీరో హీరోయిన్లుగా నటించారు. ఆ చిత్రంలో 'అమ్మను నేనంట, నాన్నవు నీవంట' పాటలో శ్రీదేవితో తొలిసారిగా డ్యూయెట్ పాడిన క్రెడిట్ విశ్వేశ్వరరావుదే. బాలనటుడిగా దాదాపు150 చిత్రాల్లో నటించిన ఆయన ఎన్‌టిఆర్, ఏఎన్ఆర్, సావిత్రి, సూర్య కాంతం, ఎస్‌విఆర్, శోభన్‌బాబు, కృష్ణ, తమిళంలో అగ్రహీరోలైన శివాజీగణేశన్, ఎమ్‌జి రామచంద్రన్‌లతో కూడా నటించారు.

అంతేకాక ఇప్పుడున్న చాలామంది హీరోలకు ప్రేరణ విశ్వేశ్వరరావు. జయసుధ నుండి చిరంజీవి వరకు అప్పట్లో ఆయనకు ఫ్యాన్స్‌గా వుండేవారు. బాలనటుడుగా కెరీర్ ముగిసాక, చదువుకుని ఉద్యోగంలో స్థిరపడ్డారు. మళ్లీ మెగాస్టార్ చిరంజీవి ఆహ్వానం మేరకు రీఎంట్రీ ఇచ్చారు.

ముఠామేస్త్రి, బిగ్‌బాస్, మెకానిక్ అల్లుడు లాంటి అనేక చిత్రాల్లో నటించారాయన.

అల్లురామలింగయ్య టైమింగ్‌ను పట్టుకున్న హాస్యనటుడిగా విశ్వేశ్వరరావుకి మంచి పేరుండేది. అలాగే డబ్బింగ్ చెప్పేటప్పుడు ఎన్‌టిఆర్‌తో సమానంగా డబ్బింగ్ చెప్పే వారు. 'శకుంతల' చిత్రంలో దుష్యంతుడికి ఎన్‌టిఆర్ డబ్బింగ్ చెపుతుంటే భరతుడికి విశ్వేశ్వరరావు డబ్బింగ్ చెప్పారు.

డబ్బింగ్ చెప్పడంలో తన ఘనత చాటుకున్నారాయన. డబ్బింగ్ ఆర్టిస్టుగా కూడా దాదాపు వెయ్యి చిత్రాలు పూర్తి చేసారాయన.

విశ్వేశ్వరరావు ఎస్ఎల్‌సి ప్యాసయ్యాక ఆ సంతోషకరమైన వార్త ఎమ్.జి.ఆర్.కు చెప్తే ఆయన ముచ్చటపడి అందరికీ స్వీట్స్ తెప్పించి పంచిపెట్టటం తన జీవితంలో మరిచిపోలేని అనుభవమంటారు విశ్వేశ్వరరావు. బాలనటుడిగా ఎప్పుడో చిన్నప్పుడు ఏఎన్ఆర్‌తో నటించారు విశ్వేశ్వరరావు. ఆ తర్వాత వాళ్లిద్దరూ కలుసుకోలేదు. మళ్ళీ పెద్దవాడైన తరువాత మెకానిక్ అల్లుడు అన్న చిత్రంతో ఇద్దరూ ఎదురయ్యారు.

చిన్నప్పుడు చూసిన విశ్వేశ్వరరావును గుర్తుపట్టిన ఏఎన్ఆర్ అక్కున చేర్చుకున్నారు.

ఆ సన్నివేశం తలచుకుంటే ఇప్పటికీ నాకెంతో ఆనందంగా వుంటుంది అంటారు విశ్వేశ్వరరావు.

ఎస్.వి.ఆర్.తో ఒకసారి ఆయన పక్కనున్న నటులు నీతో సమానమైన నటుడు ఈ బాలనటుడు అనేసరికి ఎస్‌విఆర్ తనదైన స్టైల్‌లో హుంకరించి అక్కున చేర్చుకుని ఆనందించిన సంగతి ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు విశ్వేశ్వరరావు.

ఏడేళ్ళ నుంచే అనేక నాటకాలు వేసారు. పాటలూ పాడగలరు. స్టేజి మీద తమిళ ప్రోగ్రామ్స్ కూడా చేసారు. పేరడీ పాటలు కూడా ఆలపించగలరు. ఇంగ్లీష్ తెలుగు మాటలు కలిపి అప్పుడప్పుడు నవ్వించే పాటలను పుట్టించి ప్రేక్షకులను నవ్వించగలరు. అలా ఏ ప్రక్రియ తీసుకున్నా ఆ ప్రక్రియతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న హాస్యనటుడు విశ్వేశ్వరరావు.

దాదాపు 140 సీరియల్స్‌లో నటించిన ఆయన ప్రస్తుతం డిజిటల్ మీడియాలో విస్సు టాకీస్ అనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించి తన అనుభవాలను నెమరువేసుకుంటూ ప్రేక్షకులకు హాస్యాన్ని అందిస్తూనే వున్నారు. బాలనటుడిగా పెద్దవాడైన తరువాత కూడా తన హాస్య పంథాను వదలకుండా ప్రేక్షకులకు నవ్వుల విందు ఇస్తున్న ఆయన ఎప్పటికీ పదిమందికి మార్గ దర్శకులు.

# పొట్టి అయినా గట్టి నవ్వుల చంద్రం-
# చంద్రమోహన్!



**మ**న తెలుగు తెరకు లభించిన అపురూపమైన వరాల్లో చంద్రమోహన్ ఒకరు.

ఏ పాత్రనైనా సరే అవలీలగా తెరపై ఆవిష్కరించేందుకు చంద్రమోహన్ నూటికి నూరుపాళ్ళు సరిపోతారు. అలా మన పరిశ్రమలో సత్యనారాయణ, నూతన్‌ప్రసాద్, రాజేంద్రప్రసాద్‌లు ఏ విధంగా అన్ని పాత్రలకు సరిపోతారో అదే విధంగా ఏ పాత్రకైనా పూర్తి న్యాయం చేయగల నటుడు చంద్రమోహన్.

కొంచెం పొడుగు తక్కువగా ఉండడంతో ఆయన సెకండరీ కథానాయకుడిగానే ఉండిపోయారు. హాస్య దృక్పథంతో కామెడీ హీరోగా అవతారమెత్తి ఇప్పటికీ ఎన్నో అద్భుతమైన చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు చంద్రమోహన్.

ఆయన అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖరరావు.


కృష్ణాజిల్లా పమిడిముక్కలలో 1945 మే 23న జన్మించారు. చదువుకునే రోజుల్లోనే నాటకాల మీద మక్కువతో అనేక నాటకాలు, నాటికలు ప్రదర్శించేవారు. బాపట్ల అగ్రికల్చర్ కాలేజీలో బిఎస్సీ చేస్తూ నాటకాలు వేసారు. ఏలూరులో కొన్నాళ్ళు ఉద్యోగం చేసారు. నటన మీద ఆసక్తి ఉండి చెన్నై చేరి ప్రయత్నాలు చేయగా, బి.ఎన్.రెడ్డి రూపొందించిన 'రంగులరాట్నం'లో తొలి అవకాశం ఆయనకు వరంలా దక్కింది.

ఏ పాత్రనయినా అర్థం చేసుకుని పాత్ర మాత్రమే తెరపై కనిపించేలా నటించే సత్తా ఉన్న చంద్రమోహన్‌కు ఆ తరువాత అవకాశాలు వెతుక్కునే అవసరమే లేకుండాపోయింది.

సుఖదుఃఖాలు, బంగారుపిచిక, ఆత్మీయులు, తల్లితండ్రులు, బొమ్మాబొరుసా, రామాలయం, కాలం మారింది, జీవనతరంగాలు, అల్లూరి సీతారామరాజు, దేవదాసు, కురుక్షేత్రం, ప్రాణంఖరీదు తదితర చిత్రాల్లో ఆయనకు మంచి పేరును తీసుకువచ్చాయి.

ఓ సీత కథ, సిరిసిరి మువ్వ, సీతామాలక్ష్మి, పదహారేళ్ళ వయసు, తాయారమ్మ బంగారయ్య, దశ తిరిగింది, శంకరాభరణం, మామా అల్లుళ్ళ సవాల్, శుభోదయం, రాధాకళ్యాణం, పెళ్ళి చూపులు, మూడుముళ్ళు, నాకూ పెళ్లాం కావాలి తదితర చిత్రాల్లో కథానాయకుడుగా నటించి మెప్పించారు.

ఆయనతో నటించిన ఏ హీరోయిన్‌కైనా మొదటి అవకాశం చంద్రమోహన్‌తో నటిస్తే ఆ తరువాత టాప్ హీరోయిన్‌గా ఎదుగుతుందన్న సెంటిమెంట్ పరిశ్రమలో వచ్చింది. అలా నటించిన వారిలో రంగులరాట్నంలో వాణిశ్రీ ఆయనకు జంటగా నటించి ఆ తరువాత అగ్రశ్రేణి కథానాయికగా ఎదగటం మనందరికీ తెలిసిన విషయమే.



దాదాపు 50 సవత్సరాల పైచిలుకు పరిశ్రమలో ఉన్నా ఏనాడూ ఎటువంటి వివాదాలూ ఆయన ఎదుర్కో లేదు. కేరక్టర్ ఆర్టిస్టుగా తండ్రిగా, మామగా ఆయన తన కెరీర్‌ను కొనసాగిస్తూ ఉన్నారు.

ఆదిత్య 369లో తెనాలి రామకృష్ణుడిగా, నిన్నే పెళ్లా డుతాలో ఆయిల్ పుల్లింగ్ మూర్తిగా మాటలు లేకుండా నటించారు. కూతురు, గణేష్, పౌర్ణమి, కలికాలం, కొత్త నీరు లాంటి చిత్రాల్లో ఆయన నటన అద్భుతంగా ఉంటుంది. 2005 సంవత్సరంలో అతనొక్కడే చిత్రానికి గాను ఉత్తమ కేరక్టర్ యాక్టర్‌గా నంది అవార్డు అందు కున్నారు ఆయన.

# హాస్యేంద్రప్రసాద్–
# రాజేంద్రప్రసాద్

**హా**స్యరసానికి పెట్టిన ఆభరణం రాజేంద్రప్రసాద్.

హాస్యం అంటేనే రాజేంద్రప్రసాద్ అనేలా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు ఆయన.

పెద్ద పెద్ద హీరోలంతా వైవిధ్యమైన సినిమాలు తీస్తుంటే, రాజేంద్రప్రసాద్ మాత్రం ప్రేక్షకులకు కావలసిన హాస్యరసాన్ని తేనెలా పిండి మరీ అందించారు.

ఏ చిత్రం చూసినా హాస్యమే... ఏ పాత్ర చూసినా హాస్యమే ఒలికించేది ఆయన నటనలో.

నటుడుగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా ఏ అవతారమెత్తినా అన్నిట్లోనూ హాస్యరసాన్నే ప్రేక్షకులకు అందించిన పరిపూర్ణ నటుడు రాజేంద్రప్రసాద్.

హాస్యనటులు మాత్రమే కామెడీని పండించగలరు అన్నమాటకు వ్యతిరేకంగా కథా నాయకుడు కూడా కామెడీ చేస్తే ప్రేక్షకులు ఆదరించి విజయం అందిస్తారని చెప్పడానికి ఆయన కెరీరే ఉదాహరణ.

గద్దె రాజేంద్రప్రసాద్ నిమ్మకూరులో 1956 జూలై 19న జన్మించారు.

గుడివాడ వద్ద ఉన్న దొండపాడులో ఆయన జన్మించారని మరొక మాట కూడా వినిపిస్తుంది. మొత్తానికి ఏదైతేనేం ఎన్‌టిఆర్ కుటుంబంతో ఆయనకున్న సాన్నిహిత్యం తో నటనపై మోజు ఉండడంతో మద్రాసులో ఓ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు.

1977లో ఎన్.టి.ఆర్. సలహాతోనే బాపు దర్శకత్వంలో స్నేహం అనే చిత్రంలో ఆయన ఓ కథానాయకుడుగా నటించారు.

సన్నగా, రివటలా ఉండే రాజేంద్రప్రసాద్ ఆ చిత్రంలో మంచి నటనను కనబరిచినా సరియైన ప్రోత్సాహం మొదట్లో ఆయనకు లభించలేదు. సిరామిక్ ఇంజనీరింగ్ లో డిప్లొమా చేసిన ఈ నటుడు ఆ తరువాత మంచుపల్లకీ, ఈ చరిత్ర ఏ సిరాతో, పెళ్లిచూపులు, రామరాజ్యంలో భీమరాజు, సంపూర్ణ ప్రేమాయణం లాంటి చిత్రాల్లో సహజ నటుడిగా రాణించారు.

వంశీ దర్శకత్వంలో రూపొందిన ప్రేమించు పెళ్లాడు చిత్రంతో హీరోగా మారి ఆ తరువాత హాస్య చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ హీరోగా పరిశ్రమలో నిలదొక్కుకున్నారు.


జంధ్యాల, రేలంగి నరసింహారావు, ఇవివి సత్యనారాయణ లాంటి హాస్య చిత్రాలను రూపొందించే దర్శకులతో అనేక చిత్రాల్లో నటించి రికార్డు సృష్టించారు.

ఒకానొక సమయంలో హీరోలందరకు చిత్రాలు లేక పరిశ్రమలో స్లంప్ ఏర్పడితే రాజేంద్రప్రసాద్ సినిమాలకు మాత్రం కలెక్షన్‌లు అద్భుతంగా వచ్చి స్లంప్ లేని హీరోగా పేరుపడ్డారు.

హీరోగా జైత్రయాత్ర చేస్తూనే మేడమ్ అనే ఓ చిత్రంలో ప్రయోగం చేసారు ఆయన. హాలీవుడ్ 'క్విక్ గన్ మురుగన్' అనే చిత్రాన్ని రూపొందించింది. ఆ చిత్రం కూడా తెలుగులో అనువాద రూపంలో వచ్చి విజయవంతమయ్యింది.

హాస్యకిరీటి అన్న బిరుదును పొందిన ఆయన ఎర్రమందారం చిత్రానికి గానూ ఉత్తమ నటుని పురస్కారం అందుకున్నారు 1991లో.

మేడమ్ చిత్రానికి గాను స్పెషల్ జ్యూరీ అవార్డు నంది పురస్కారం 1994లో అందుకున్నారు.



ఆ నలుగురుకు బెస్ట్ ఏక్టర్‌గా నంది అవార్డు 2004 లో అందుకున్నారు.

పరిశ్రమలో మా అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికై కళాకారులకు సేవలందించారాయన.

చెవిలో పువ్వు, పేకాట పాపారావు, దొంగకోళ్ళు, ముత్యమంత ముద్దు, గోల్‌మాల్ గోవిందం, కొబ్బరి బోండాం, రాజేంద్రుడు గజేంద్రుడు, ఆ ఒక్కటీ అడక్కు, అయ్యారే, ఓనమాలు, టామీ, సరిలేరు నీకెవ్వరు, అల వైకుంఠపురంలో, కౌసల్య కృష్ణమూర్తి లాంటి చిత్రాల్లో నటించారు.

ప్రస్తుతం కారెక్టర్ ఆర్టిస్టుగా మారి ఆయన తన జైత్రయాత్రను సాగిస్తూనే వున్నారు.

టోపీరాజా స్వీటీరోజాకు సంగీతం అందించి తనలో సంగీతకారుడు కూడా ఉన్నాడని నిరూపించారు ఈ నవ్వులరాజు రాజేంద్రప్రసాద్.

# పిచ్చకొట్టుడు నవ్వులు-
# సుధాకర్ బేత!

**'అ**బ్బో! పిచ్చకొట్టుడు కొట్టాడు నాన్నోయ్, పితః' అని యముడికి మొగుడులో... 'రఘు తాత రఘుతాత' అని కొక్కొరొకో చిత్రంలో ఆయన చేసిన కామెడీ ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టింది.

సుధాకర్ బేత, ప్రకాశం జిల్లా మార్కాపురంలో 1959 మే 18న జన్మించారు. తండ్రి డిప్యూటీ కలెక్టర్ అవడంతో అనేక ఊర్లు తిరిగారు. ఏడుగురు మగ సంతానంలో ఆయన చిన్నవారు. కోయలకుంట్ల, కుడుమూరు, ఆదోని, కర్నూలు, బోధన్, కాకినాడ, ఏలూరు, గుంటూరు తదితర ప్రాంతాలలో విద్యాభ్యాసం జరిగింది. కాలేజీలో ఉన్నప్పుడే మిమిక్రీలు, డాన్స్‌లు గట్రా చేసేవారు.

ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో చేరి నటుడుగా మారాలన్న ఆయన కోరిక చెన్నైలో తీరింది.

అక్కడ ఆయన రూం మేట్స్ చిరంజీవి, నారాయణరావు, హరిప్రసాద్‌లతో కలసి ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా ఉంటూ సినిమా అవకాశాల కోసం ప్రయత్నించేవారు.

ఒకసారి తమిళ దర్శకుడు భారతీరాజాను కలవడంతో ఆయన 'కిళ్లిక్కిమ్ పోగుమ్ రైల్' అన్న చిత్రానికి హీరోగా ఎంపిక చేసారు. రాధిక కథానాయిక. ఆ సినిమా సూపర్ హిట్ అవడంతో తమిళంలో వరుసగా దాదాపు 45 చిత్రాల్లో  కథానాయకుడుగా నటించి మెప్పించారు. ఆయనకు స్టార్‌డమ్ తమిళంలో వచ్చింది. తమిళంలో మంచి హీరోగా నిలబడ్డ తరుణంలో అక్కడ రాజకీయాల వల్ల తెలుగు సినిమా పరిశ్రమకు వచ్చేసారు. ఇక్కడికి వచ్చి సహాయనటుడిగా, కమెడియన్‌గా స్థిరపడ్డారు. హీరో అవకాశాలు చాలా తక్కువగా వచ్చాయి.

తెలుగులో తొలిసారిగా 'సృష్టిరహస్యాలు' అనే చిత్రంలో ఆయన నటించారు.

ఊరికిచ్చిన మాట, భోగిమంటలు, అత్తకు యముడు అమ్మాయికి మొగుడు, అల్లరి పిడుగు, గోల్‌మాల్ గోవిందం, ఆశయం, ఆహ్వానం, ఇద్దరు మిత్రులు, గోకులంలో సీత, దోషి, పచ్చని సంసారం, పెళ్లికానుక, ఫ్యామిలీ సర్కస్, ముగ్గురు మొనగాళ్ళు, పవిత్రప్రేమ, హిట్లర్ తదితర చిత్రాలలో ఆయన కామెడీని మనం చూడవచ్చు.





పద్మనాభం హాస్యం ఇష్టపడే ఆయన నిర్మాతగా మారి 'తాతయ్య పెళ్లి మనవడి శోభనం, పరుగో పరుగు, యముడికి మొగుడు' లాంటి చిత్రాలను రూపొందించి నిర్మాతగా మారారు. కెరీర్ చక్కగా సాగుతున్న తరుణంలో 2010 జూన్‌లో అనారోగ్యం బారిన పడి కోమాలోకి వెళ్లారు. మళ్ళీ స్వస్థత చేకూరి ప్రస్తుతం చిత్రాల్లో నటించడానికి సిద్ధమయ్యారు.

స్నేహితులు, శుభాకాంక్షలు అన్న చిత్రాలకు ఆయనకు నంది పురస్కారాలు వరించాయి.

తమిళంలో, తెలుగులో దాదాపుగా 600 పైచిలుకు చిత్రాలలో నటించిన ఆయన ఇప్పటికీ మంచి పాత్రలు వస్తే నటించడానికి సిద్ధమంటున్నారు.

మళ్ళీ సుధాకర్ తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చి నవ్వులు విరజిమ్మాలని హాస్యప్రియులు ఎదురు చూస్తున్నారు.

# నవ్వుల నరేష్-
# నరేష్

తెలుగు సినీ దర్శకురాలు విజయనిర్మల గిన్నీస్ బుక్ అవార్డు సాధించారు. ఆమె తనయుడుగా తెలుగు తెరకు పరిచయమయ్యారు నరేష్. తన ప్రతిభతో ఎప్పటికప్పుడు పాత్రలను ఎంపిక చేసుకుంటూ ప్రతి పాత్రలోనూ కొత్తదనం చూపించ డానికి ప్రేక్షకులకు నవ్వుల పువ్వులు అందించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు నరేష్.

విజయనిర్మల కొడుకుగా పరిశ్రమలో గుర్తింపు వున్న ఆయన హిందూపురంలో 1960 జనవరి 20న జన్మించారు.

బాలనటుడుగా 1972లో వచ్చిన పండంటి కాపురం చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసారు. రెండు కుటుంబాల కథలోనూ నటించారు. 1982లో విజయనిర్మల దర్శకత్వంలోనే 'ప్రేమసంకెళ్ళు' అనే చిత్రంలో కథానాయకుడుగా మెరిసారు.

కాని అంతకన్నా ముందు నాలుగు స్తంభాలాట జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన సినిమా విడుదలవటంతో తెలుగు తెరకు తొలిసారిగా హీరోగా నాలుగు స్తంభాలాటతో పరిచయమయ్యారు.

హీరోగా ఎదుగుతున్న క్రమంలోనే ఆయనకు పోలీసుభార్య అనే చిత్రం టర్నింగ్ పాయింట్ ఇచ్చింది. ఆ చిత్రంలో ఆయన చేసిన కామెడీ హీరో పాత్ర ప్రేక్షకులకు బాగా నచ్చడంతో అలాంటి కామెడీ చిత్రాల వైపే ఆయన ప్రయాణం సాగింది.

హాస్య దర్శకుడు జంధ్యాల రూపొందించిన హై హై నాయకా, రెండుజెళ్ళ సీత, శ్రీవారి శోభనం, పుత్తడిబొమ్మ, తదితర చిత్రాల్లో హాస్య కథానాయకుడిగా ఎదిగారు.

గొప్ప స్టార్ అనిపించుకోవడం కన్నా గొప్ప నటుడు అని అనిపించుకోవడమే తనకు సంతోషమని చెప్పే ఆయన అదే విధంగా ఎన్నదగిన చిత్రాల్లోనే నటించారు.

జంధ్యాల తన గురువు, స్నేహితుడు, సోదరుడు అన్నీ అని చెబుతారు నరేష్.

ఇవివి దర్శకత్వంలో వచ్చిన జంబ లకిడి పంబ ప్రయోగాత్మక చిత్రంగా నిలిచింది. చిత్రం భళారే విచిత్రం కూడా ఆయన కెరీర్‌లో ఒక గొప్ప హిట్‌గా నిలిచింది. శ్రీకనక మహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్ చిత్రంలో ఆయన సూపర్ స్టార్ కృష్ణకు డూప్‌గా నటించి మెప్పించారు.

దాదాపు 80 చిత్రాల వరకు ఆయన హీరోగా నటించారు. ఆ తరువాత కేరక్టర్






ఆర్టిస్టుగా మారి మల్లీశ్వరి, గౌరి, ఒరేయ్ పండు, అల్లరి రాముడు, మీ శ్రేయోభిలాషి, హీరో, ఆడు మగాడురా బుజ్జీ, చందమామ కథలు, దృశ్యం, లక్ష్మీ రావే మాఇంటికి, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్, బీరువా, రెండు రెళ్లు ఆరు, చలో, సమ్మోహనం, దేవదాసు, శైలజారెడ్డి అల్లుడు, ప్రతిరోజు పండగే, ఒరేయ్ బుజ్జిగా లాంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పిస్తున్నారు.

వీలైతే విలన్‌గా కూడా నటించాలని ఆయన కోరిక.

2019 మా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఎన్నికలలో గెలిచి ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు 200 చిత్రాల పైచిలుకు పూర్తి చేసిన ఆయన 2013లో నంది పురస్కారం, అలాగే ఎస్వీఆర్ పురస్కారాన్ని అందు కున్నారు.

మరెన్నో చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు నవ్వులు పువ్వులు పంచాలని కోరుకుందాం.

# నవ్వుల కోట-
# కోట శ్రీనివాసరావు



కామెడీ విలన్స్ రావుగోపాలరావు, నూతన్‌ప్రసాద్‌లు రాజ్యమేలుతున్న తరుణంలో వారికి ధీటుగా పరిశ్రమలో అందర్నీ ఆకర్షించినవారు కోట శ్రీనివాసరావు.

'హూఁ ఈడెవడ్రా బాబూ!', 'ఐతే నాకేంటి', 'మరదే నా స్పెషల్', 'అయ్యా నరకాసురా!', 'అంటే నాన్నా అదీ'... ఈ డైలాగులు కోట శ్రీనివాసరావు మార్క్.

ఇవి వినగానే కోట శ్రీనివాసరావు గుర్తుకు రావడం సహజం.

1942 జూలై 10, కృష్ణా జిల్లా కంకిపాడులో జన్మించారు కోట శ్రీనివాసరావు.

చిన్నతనం నుండే నాటకరంగంపై ఆసక్తి ఉండడంతో ఆయన 20 ఏళ్ళకే రంగ స్థలంపై అడుగిడారు. 1978, 79లో 'ప్రాణంఖరీదు' నాటకం వేస్తుండగా ఆ నాటకం చూసిన నిర్మాత క్రాంతికుమార్ తాను రూపొందిస్తున్న ప్రాణం ఖరీదు చిత్రంతో ఆయనకు తొలి అవకాశం ఇచ్చారు.

అప్పటినుండి అడపాదడపా చిత్రాలు చేస్తూనే స్టేట్‌బ్యాంక్‌లో ఆయన ఉద్యోగం చేసుకునేవారు. 'ప్రతిఘటన' చిత్రంలో మంత్రి కాశయ్య పాత్రకు అపూర్వమైన ఆదరణ లభించడంతో, ఇక తన మొత్తం సమయాన్ని సినిమా పరిశ్రమకే కేటాయించారాయన.

'అహ నా పెళ్ళంట' లో పిసినిగొట్టు పాత్రలో అద్భుతంగా రాణించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. 'నేను కాశయ్యను మాట్లాడతాండ' అంటూ తెలంగాణ మాండలికంలో ఆయన చేసిన నటన ప్రేక్షకులను మాయ చేసింది.

అహ నాపెళ్ళంటలో చాయ్ అమ్ముకునేవాడిగా 'ఆ చాయ్, కాఫీ, చాయ్, కాఫీ' అంటూ కుంటుకుంటూ నడిచి వెళ్లిన నటన నవ్వులు పూయించింది. అందులోనే కామెడీ మిక్స్ చేసి సుత్తి వీరభద్రరావు, బ్రహ్మానందంతో కలిసి చేసిన హాస్యం ప్రేక్షకులను విరగబడి నవ్వేలా చేసింది.

శత్రువులో వైవిధ్యమైన బాడీ లాంగ్వేజ్‌తో నటించారు. అది హిట్టుగా నిలిచింది. ఆ తరువాత జంబలకిడి పంబలో విలనీ హాస్యం పండించారు.

అలాగే 'రెండిళ్ళ పూజారి'లో హిజ్రాగా ఆయన చేసిన పాత్ర సరికొత్తగా ప్రేక్షకులకు పరిచయమయ్యింది.

'ఆ నలుగురు' చిత్రంలో కర్కశమైన వడ్డీ వ్యాపారస్తుడిగా ఆయన చివర్లో కన్నీరు తెప్పించిన నటన అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు'లో కోట పోషించిన పాత్ర తక్కువైనదేం కాదు. మనవడిని ఇవ్వలేని కొడుకు కోడలుతో ఆయన చేసిన అభినయం అద్భుతం. 'గణేష్' చిత్రంలో చనిపోయిన కొడుకును చూడడానికి హాస్పిటల్‌కి వచ్చినప్పుడు ఆయన చూపించిన ఒక్క ఎక్స్‌ప్రేషనే పలువుర్ని కట్టి పడేసింది.


'వీరప్రతాప్', 'ఘటోత్కచుడు' చిత్రాలలో ఎస్‌విఆర్‌లా మాంత్రికుడిగా మెప్పించారు. రాజకీయంగా 'మండలాధీశుడు' చిత్రంలో ఎన్‌టిఆర్‌లా నటించి మెప్పించారు.

హిందీ 'సర్కార్' చిత్రంలో అమితాబ్‌కు ధీటుగా నటించి చూపారు.

అయోధ్య రామయ్య, బిగ్‌బాస్, శివ, మనీ, పెళ్ళైన కొత్తలో, గాయం, చిన్న, రేపటిపౌరులు, దేవాంతకుడు, మూడుముళ్ళు, శాంతినివాసం, శ్రీకనకమహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్, సాహసం చేయరాడింభకా, ఖైదీ నెంబర్ 786, ప్రేమవిజేత, మనసున్న మారాజు, హైహై నాయకా, బావ బావ మరిది, శ్రీమాన్ బ్రహ్మచారి, చెవిలో పువ్వు, ఇద్దరూ ఇద్దరే, సీతారామయ్యగారి మనవరాలు, కొబ్బరి బొండాం, ప్రేమ ఎంత మధురం, అశ్వమేధం, రాజేంద్రుడు గజేంద్రుడు, చిట్టెమ్మ మొగుడు, అక్క పెత్తనం చెల్లెలి కాపురం, ముఠామేస్త్రి, గోవిందా గోవిందా, నెంబర్ వన్, ముగ్గురు మొనగాళ్ళు, శుభసంకల్పం, ఘరానాబుల్లోడు. ఒహో నాపెళ్ళంట, గోకులంలో సీత, అన్నమయ్య, అనగనగా ఒకరోజు.... ఇలాంటి ఎన్నో చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మెప్పును పొందారాయన.

ఇప్పటికీ మంచి పాత్రలు వస్తే నటించడానికి సిద్ధమే నంటారు.

దాదాపు 700 పైచిలుకు చిత్రాలలో నటించిన 'కోట' తెలుగు తెరకు దొరికిన ఓ మణిపూస.



# వారెవ్వా ఏమి ఫేసు...
# బ్రహ్మానందం

**ఆ**యనదో కొత్త పలుకు... కొత్త భాష... అంతకుముందు ఎవరూ సాధించలేని సరికొత్త రికార్డు బ్రహ్మానందం సొంతం.

పలు భాషల్లో దాదాపు 1000 పైచిలుకు చిత్రాల్లో నటించి గిన్నీస్ బుక్ అవార్డు విజేతగా నిలవడం హాస్య నటులందరికీ గర్వకారణం.

భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందించగా, ఉత్తమ హాస్యనటుడుగా ఐదు సార్లు నంది అవార్డులు అందుకున్నారు. ఫిలింఫేర్ అవార్డులు, మా అవార్డులు, సైమా పురస్కారాలు, నాగార్జున విశ్వ విద్యాలయం ఇచ్చిన డాక్టరేట్... ఆయన జీవితంలో కలికితురాయిగా మారాయి.

ఇన్ని విజయాల వెనుక ఆయన బహుముఖ ప్రజ్ఞ, నవ్వించాలనే తపన ఎప్పటి కప్పుడు ప్రేక్షకుణ్ణి సరికొత్తగా నవ్వించాలనే తపన ఉన్నాయి.

తెరపై ఆయన కనిపిస్తేనే నవ్వులు విరుస్తాయి థియేటర్‌లో. అంతగా ఆయన తెలుగు ప్రేక్షకులకు దగ్గరైపోయారు. తెలుగు తెరపై ఇప్పటివరకు హాస్యనటులు సాధించలేని అనేకమైన సరికొత్త రికార్డులను సాధించి చూపారు.

1956 ఫిబ్రవరి 1న గుంటూరు జిల్లా చాగంటివారి పాలెంలో ఆయన జన్మించారు.

తండ్రి కన్నెగంటి నాగలింగాచారి, తల్లి లక్ష్మీనరసమ్మ. హైస్కూల్ చదువు సత్తెన పల్లిలోను, ఇంటర్మీడియట్ భీమవరంలోను, గుంటూరులో తొమ్మిది సంవత్సరాల పాటు తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తూ, మిమిక్రీలు చేస్తూ, నాటకాలు వేస్తూ అందర్నీ మెప్పించారు. తండ్రికి రంగస్థల నటన ప్రవృత్తి కూడా ఉండడంతో నటనపై మక్కువ ఏర్పడింది. చిన్నవయసులో చుట్టుపక్కల వారిని అనుకరిస్తూ తల్లి చెప్పిన మాటలే ఆయనకు మిమిక్రీగా మారాయి. అలా కార్యక్రమాలలో మిమిక్రీలు చేయడం, సాంస్కృతిక బృందాలలో కలిసి చురుకుగా పాల్గొనడం ఆయనకొక వ్యాపకంగా మారింది.

మొదట 1985లో దూరదర్శన్‌లో వచ్చిన పకపకలు అనే కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి ప్రేక్షకులకు నవ్వులు పంచారు. ఆ కార్యక్రమంతో మంచి స్పందన వచ్చింది. నలుగురి దృష్టిలో పడ్డారు బ్రహ్మానందం.

నరేష్ కథానాయకుడుగా వేజేళ్ళ సత్యనారాయణ దర్శకత్వంలో 'శ్రీ తాతావతారం' అనే చిత్రంలో తొలిసారిగా తెరపై మెరిసారు. ఆ చిత్రం విడుదల ఆలస్యం కావడంతో జంధ్యాల దర్శకత్వం వహించిన 'అహ నా పెళ్ళంట' చిత్రం ముందు విడుదలై బ్రహ్మానందంకి మంచి కామెడీ నటుడుగా గుర్తింపు తీసుకువచ్చింది.

'పోతావురోరేయ్ నాశనమైపోతావు' అంటూ యజమాని పీనాసితనాన్ని బయటికి చెప్పుకోలేక తనలో తానే చెప్పుకునే అంతర్ముఖ డైలాగ్‌లతో బ్రహ్మానందం ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అరగుండుగా నటించిన ఆ పాత్ర బ్రహ్మానందంకు మంచి గుర్తింపు తీసుకువచ్చింది.

ఇక అప్పటినుండి వెనక్కి తిరిగి చూడలేదు బ్రహ్మానందం. సంవత్సరానికి దాదాపు 40,50 చిత్రాల్లో నటించేవారు. నీయెంకమ్మ... పండగ చేస్కో... రకరకాలుగా వుంది మాస్టారూ...ఖాన్‌తో గేమ్స్ ఆడకు... శాల్తీలు లేచిపోతాయ్...దొరికాడా వేసెయ్యండి... జప్ఫా...ఇరుకుపాలెం వాళ్ళంటే ఎకసెక్కాలుగా వుందా...నా పెర్‌ఫార్మెన్స్ మీకు నచ్చినట్లయితే ఎస్. ఎమ్. ఎస్ చెయ్యండి...నన్ను ఇన్‌వాల్వ్ చెయ్యకండి రావుగారు... ఇలాంటి డైలాగులతో ప్రేక్షకులను పగలబడినవ్వేలా చేసారు బ్రహ్మానందం.

జగదేకవీరుడు అతిలోక సుందరి, జాబిలమ్మ పెళ్లి, ముగ్గురు మొనగాళ్ళు, చిట్టెమ్మ మొగుడు, ఆంటీ, పెళ్ళి చేసుకుందాం రా, ఆంధ్రావాలా, ఆపరేషన్ దుర్యోధన, గణేష్, నాగవల్లి, నాయిష్టం, జీనియస్, అధినాయకుడు, ఒక్కడినే, పవిత్ర, బూచమ్మ బూచోడు, అమృతం, చందమామ, యమలీల 2, కిక్ 2, దోచెయ్, కొరియర్ బాయ్ కళ్యాణ్, జ్యోతిలక్ష్మి, సిల్లీ ఫెలోస్ లాంటి అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు నవ్వుల విందు చేస్తూనే వున్నారు. ఇంకా ఆయన మరిన్ని చిత్రాల్లో నటించి నవ్వులు పంచాలని కోరుకుందాం.

# అక్కుమ్ బక్కుమ్- అలీ

దేవుడు మనిషిని ఈ భూమ్మీదకి వెళ్ళేటప్పుడు నువ్వీ పని చెయ్యాలిరా అని చెప్పి పంపిస్తాడట. అలాగే తెలుగు ప్రేక్షకులకు నవ్వులు పండించమని, చూసే వారి ముఖాల్లో ఆనందం వెల్లి విరిసేలా చేయమని చెప్పి, అలీని భూమ్మీదకి పంపించినట్టున్నాడు ఆ దేవుడు.

చిన్నప్పటినుండి తనదైన స్టైల్లో నవ్వులు కురిపిస్తూనే వున్నారు అలీ.

అలీ తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రిలో ఓ పేద ముస్లిమ్ కుటుంబంలో 1968 అక్టోబరు 10న జన్మించారు. తండ్రి మహమ్మద్ భాషా దర్జీగా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేవారు. అలీకి చిన్నవయసు నుంచే చదువు మీద ఆసక్తి లేకపోవడంతో, మ్యూజిక్ ఆర్కెస్ట్రా నిర్వహించే శ్రీపాద జిత్ మోహన్ మిత్రా బృందంలో ఆయన్ని చేర్పించారు.

అక్కడ మిమిక్రీలు, డాన్సులు చేస్తూ అలీ అందర్నీ ఆకట్టుకునేవారు.

అలా సాగిపోతున్న తరుణంలో ఓసారి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో 'ప్రెసిడెంట్ పేరమ్మ' అనే చిత్రాన్ని రాజమండ్రిలో చిత్రీకరిస్తున్నారు.

చిత్రబృందానికి కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అలీ లోని ప్రతిభను గమనించిన విశ్వనాథ్ ప్రెసిడెంట్ పేరమ్మలో ఓ చిన్న వేషం ఇచ్చారు.

అదే ఆయన తొలి వేషం. ఆయన తరువాత దేవుడు మామయ్య, ఘరానా దొంగ, సిరిమల్లె నవ్వింది, ముక్కోపి తదితర చిత్రాల్లో ఆయన నటించారు. అప్పటిదాకా పెద్దగా ఎవరికీ తెలీని అలీ భారతీరాజా దర్శకత్వంలో వచ్చిన సీతాకోకచిలకతో అందరికీ పరిచితమయ్యారు. ఆ చిత్రంలో బాబాయ్‌గా అలీ నటన హైలెట్‌గా నిలిచింది.

ఆ చిత్రంతోనే అలీకి బాలనటుడుగా 'నంది అవార్డు' వచ్చింది. ఇక ఏమైనా సరే చావో రేవో తేల్చుకోవాలని చెన్నైలోనే ఉంటూ అవకాశాల కోసం ప్రయత్నిస్తూ ఉండేవారు. అటు బాలనటుడు కాదు, ఇటు పెద్ద నటుడు కాకపోవడంతో తొలి రోజుల్లో అనేక కష్టాలను ఎదుర్కొన్నారాయన.


ఆ తరువాత ప్రేమఖైదీ, రాజేంద్రుడు గజేంద్రుడు, మాయలోడు, అమ్మాయి కాపురం తదితర చిత్రాల్లో నటించడంతో మళ్లీ కెరీర్ టర్న్ తీసుకుంది.

హలో బ్రదర్, ముద్దులప్రియుడు, సాహసవీరుడు సాగరకన్య, తొలిప్రేమ, తమ్ముడు, ఖుషి, కుంతీపుత్రుడు తదితర చిత్రాల్లో నటించారు.

దర్శకులు ఎస్.వి. కృష్ణారెడ్డి అలీ లోని ప్రతిభను గమనించి 'యమలీల' చిత్రం నిర్మించారు. ఈ సినిమాకన్నా ముందు అలీ 'ఎంద చేట' అంటూ రాజేంద్రుడు గజేంద్రుడులో చేసిన కామెడీకి ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు వచ్చింది.

యమలీల సూపర్‌హిట్ అవడంతో అక్కుంబక్కుం, తిమ్మరాజు, గుండమ్మగారి మనవడు, ఘటోత్కచుడు, ఆలీబాబా అరడజను దొంగలు చిత్రాల్లో కథానాయకుడుగా నటించి మెప్పించారు.

కానీ కమెడియన్‌గానే తన కెరీర్ కొనసాగుతుందని ప్రకటించి అనేక అవకాశాలను ఆ తరువాత అందుకున్నారు. పలు టివి కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా కొనసాగు తున్నారు. 'అలీతో సరదాగా' అనే కార్యక్రమంలో లబ్ధప్రతిష్టులైన తారలను ఆయన పరిచయం చేసే కార్యక్రమం సూపర్‌హిట్ అయ్యింది. మన్‌మోహన్ జాదూ మలాం, దగ్గు నివారిణి 'నివారణ్ 90' లాంటి మందులకు ఆయన ప్రచారకర్తగా ఉన్నారు.



కొన్నాళ్ళు తెలుగుదేశం పార్టీ తరఫున ప్రచారం చేసారు. ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు.

తండ్రి పేరుతో ఓ ఛారిటబుల్ ఏర్పాటు చేసి సమాజ సేవ కూడా చేస్తున్నారు. ఫిలిం ఫేర్ అవార్డులు అమ్మ నాన్నా ఓ తమిళ అమ్మాయి, సూపర్ చిత్రాలకు గాను లభించాయి. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు. ప్రస్తుతం ఎటువంటి పాత్రలు వచ్చినా ఆ పాత్రల్లో మోనాటినీ లేకుండా సరికొత్తగా నవ్వులను చిందించడానికి తన ప్రయత్నం తాను చేస్తూనే వున్నారు. ఆయన కెరీర్‌లో మంచి చిత్రాలు మరెన్నో చేయాలని కోరుకుందాం.

# నటనలో పరిణితి–
# భరణి తనికెళ్ళ

**తె**లుగు చిత్రసీమలో విద్వాంసుడైన ఓ నటుడు ఉన్నారా అంటే దానికి సమాధానంగా తనికెళ్ళ భరణి పేరు వినిపిస్తుంది. అది నిజం.

ఆయనలో పరిణతి చెందిన నటుడున్నాడు. అద్భుతమైన రచయిత ఉన్నాడు. ఓ మంచి విజన్ ఉన్న దర్శకుడు ఉన్నాడు. రంగస్థల నటుడూ ఉన్నాడు. తెలుగు భాషాభిమాని ఉన్నాడు. అంతకుమించి ఆధ్యాత్మికపరంగా గొప్ప భక్తుడు ఉన్నాడు వెరసి తనికెళ్ల భరణి. అన్ని విద్యలలో పరిణతి పొందిన వాణి ఆయనది.

పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలంలో జగన్నాథపురంలో 1956 జూలై 14న జన్మించారు. అనేక చిత్రాలలో హాస్య ప్రధాన పాత్రలు, విలన్ టైప్ పాత్రలు పోషించారు. ఓ రకంగా సకల కళావల్లభుడు, కోవిదుడు అన్నట్లుగా ఆయన తన పాత్రల ద్వారా ప్రేక్షకులకు పరిచయమయ్యారు.

అద్దెకొంప, అగ్గిపుల్ల, ఆత్మహత్య, కొత్త కలాలు, ముగింపు లేని కథ, గోగ్రహణం అనేక నాటకాలు, కవితలు, కథలు ఆయన రాసారు.

చిత్ర పరిశ్రమకు వచ్చి తొలిసారిగా 'కంచుకవచం' అనే చిత్రానికి రచయితగానే ఉంటూ ఓ పాత్రలో కూడా నటించారు.

ఆ తరువాత లేడీస్‌టైలర్, శివ, మొండిమొగుడు పెంకిపెళ్ళాం, జగదేకవీరుడు అతిలోక సుందరి లాంటి చిత్రాలలో ఆయన చిన్న చిన్న పాత్రలలో కనిపించినా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. నటుడుగానే కాకుండా మాటల రచయితగా, కథారచయితగా సక్సెస్ అయ్యారు పరిశ్రమలో.

సొగసు చూడతరమా, ఎగిరే పావురమా, మావిచిగురు, పరదేశి వంటి చిత్రాలలో కేరక్టర్ ఆర్టిస్టుగా ఆయన కనిపించారు. తన కేరక్టర్‌కు పాటలు కూడా ఉండడంతో 'వారెవ్వా ఏమి ఫేసు అచ్చు హీరోలా ఉంది బాసు' అంటూ రమ్యకృష్ణ లాగ ఉంటదీ అంటూ పెళ్లిసందడిలో ఇప్పసారా కొట్టరో దప్పు చేతబట్టరో అంటూ దోస్త్ చిత్రంలో పాటల్లో ఆయన చూపిన హావభావాలు తెలుగు ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టాయి.


2012లో ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మిలతో 'మిథునం' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ చిత్రం అనేక అవార్డులను, రివార్డులను అందుకోవడం విశేషం.

నటుడుగా అనేక అవకాశాలు వస్తుండడంతో, రచయితగా తన పెన్నుకు కొన్నాళ్లు విశ్రాంతి ఇచ్చారాయన. ప్రతి పాత్రను తనదైన స్టైలులో మెరుగులు దిద్ది వెండితెర మీద ఆవిష్కరించే ప్రయత్నం చేసారు. అందులోనూ విజయం సాధించారు.

వారసుడొచ్చాడు, నారీ నారీ నడుమ మురారి, ఇంద్ర... తదితర చిత్రాల్లో ఆయన పాత్ర హైలెట్‌గా నిలుస్తుంది. ముఖ్యంగా యమలీల చిత్రంలో గూండాగా 'నాకో బుల్లి చెల్లి ఆ చెల్లికి జరగాలి పెళ్లి మళ్ళీ మళ్ళీ' అంటూ కవిత్వం చదివిన సన్నివేశం బాగా ప్రేక్షకులలోకి వెళ్లి నవ్వులు పూయించింది.

ఓవైపు నటుడుగా, మరోవైపు సాహితీవేత్తగా పరికిణీ, ఎందరో మహానుభావులు, ఆటగదరా శివ అనే గ్రంథాలను ఆయన రచించారు. ఆయన రూపొందించిన సిరా, కీ లాంటి షార్ట్‌ఫిల్మ్‌కు అనేక అవార్డులు వెతుక్కుంటూ వచ్చాయి.

'ఆడు మగాడురా బుజ్జీ' అని ఆయన చెప్పిన డైలాగుతోనే ఓ సినిమాను




రూపొందించారు అంటే ఆయన చెప్పిన విధానానికి ఎంత క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

'ఆట గదర శివా!' అంటూ శివుని తత్వాన్ని బోధించిన రచయితగా పలువురి మన్ననలు పొందారాయన.

జాబిలమ్మ పెళ్ళి, ఆరోప్రాణం, మన్మథుడు, నువ్వు నాకు నచ్చావ్, అప్పుల అప్పారావు, చెట్టు కింద ప్లీడరు, అహో బ్రహ్మ ఒహో శిష్య, సర్దుకుపోదాం రండి, ఎంత బాగుందో, నేనున్నాను, మిస్సమ్మ, రక్తచరిత్ర, కరెంట్, కలెక్టర్ గారి భార్య, శంభో శివ శంభో, డి ఫర్ దోపిడీ, రారా కృష్ణయ్య, కార్తికేయ, జెండాపై కపిరాజు, సుప్రీం, గురు, నేనే రాజు నేనే మంత్రి, విజేత, ఎంత మంచి వాడవురా, అమీతుమీ, సమ్మోహనం లాంటి అనేక చిత్రాల్లో నటించి ఇప్పటికీ మెప్పిస్తున్నారు తనికెళ్ళ దశ భరణి.

# మరదే హాస్యమంటే...
# ఎల్బీ శ్రీరాం!



**సి**నీ పరిశ్రమలోకి రచయితలుగా వచ్చి నటులుగా మంచి మంచి పాత్రలను పోషించి ప్రేక్షకుల్లో ఓ వైవిధ్యమైన గుర్తింపు తెచ్చుకున్న రచయితలలో ఎల్బీ శ్రీరామ్ ఒకరు.

వేదపండితుల ఇంట్లో జన్మించిన ఆయన పేరు 'లంక భద్రాద్రి శ్రీరామ్, ఎల్బీ శ్రీరామ్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురం జిల్లాలోని నేదునూరులో 1972 మే 30న జన్మించారు. నటుడుగా, రచయితగా రంగస్థలంపై మంచి పేరు తెచ్చుకున్నారు. రేడియోలో అనేక కార్యక్రమాలను అందించారు.

నాగేష్ తనయుడు ఆనందబాబు కథానాయకుడుగా రూపొందిన 'కిష్కిందాకాండ' ద్వారా రచయితగా గుర్తింపు వచ్చింది ఎల్బీశ్రీరాంకు. మాటల రచయితగా హలోబ్రదర్, హిట్లర్ చిత్రాలకు పనిచేసి స్టార్ రైటర్‌గా ఎదిగారు.

ఆ తర్వాత ఇవివి సత్యనారాయణ ప్రోత్సాహంతో చాలా బాగుంది చిత్రంలో పల్లెటూరి బైతుగా ఆయన కల్పనారాయ్‌తో చేసిన కామెడీ ప్రేక్షకులకు కలకాలం గుర్తుండిపోయేలా ఉంటుంది. మరదే ఎటకారమంటే... పుసుక్కున మందు తాగెస్తే ఎట్లా... లాంటి డైలాగులతో ఆ పాత్ర క్లిక్ కావడంతో అనేక అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. ఏ పాత్ర చేసినా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు ఉండేలా నటించేవారు.

మధ్యతరగతి మనిషి జీవితానికి సాక్ష్యంగా రూపొందిన 'అమ్మో ఒకటో తారీకు' చిత్రంలో కథానాయకుడు ఆయనే. సెంటిమెంట్, భావోద్వేగాల సమాహారంగా నటించి ఆ చిత్రాన్ని విజయవంతం అయ్యేలానటించారాయన. ఆయన రచించిన 'ఒంటెద్దు బండి' అనే నాటకమే ఈ చిత్రానికి మూలం.

కేరక్టర్ ఆర్టిస్టుగా అనేక చిత్రాల్లో నటించారు. జయం మనదేరా, ఆజాద్, మృగరాజు, తొమ్మిదినెలలు, హనుమాన్ జంక్షన్, అల్లరి రాముడు, శివరామరాజు, తొట్టిగ్యాంగ్, దిల్, మిస్సమ్మ, జానకి వెడ్స్ శ్రీరామ్, రాధాగోపాళం, బన్నీ, హ్యాపీ, అమ్మచెప్పింది, స్టాలిన్, అన్నవరం, సుందరకాండ, సొంత ఊరు, కత్తి కాంతారావు లాంటి చిత్రాలలో అద్భుతమైన టైమింగ్‌తో కామెడీని, కేరక్టర్‌ను పండించిన నటుడాయన.

భాగ్యలక్ష్మి బంపర్ డ్రా అరుంధతి, హిట్లర్, హలోబ్రదర్, అప్పుల అప్పారావు, ఏప్రిల్ ఒకటి విడుదల లాంటి చిత్రాలకు రచన చేసి ఆ చిత్ర విజయానికి తోడ్పడ్డారు.



1999లో రామసక్కనోడు చిత్రానికి మాటల రచయితగా, 2000 సంవత్సరంలో చాలాబాగుంది చిత్రంలో హాస్యనటుడిగా, 2009లో 'సొంత ఊరు' చిత్రానికి ఉత్తమ మాటల రచయితగా అదే చిత్రానికి పాత్రోచితమైన నటనకు గాను నాలుగు నంది పురస్కారాలు అందుకోవడం ఆయన జీవితంలో గొప్ప విశేషం.

ప్రస్తుతం నటుడుగా కొనసాగుతూనే ఎల్బీ శ్రీరాం ఆ(హా)ర్ట్ ఫిలిమ్స్ పేరుతో షార్ట్ ఫిలిమ్స్ రూపొందిస్తున్నారు. ఆయన రాసిన గజేంద్రమోక్షం నాటకం అనేకవేల ప్రదర్శనలు జరుపుకుంది. అనేక నాటకాలు రాసారు. నటుడుగా, స్క్రిప్ట్ రచయితగా, హాస్య నటుడుగా, రంగస్థల నటుడుగా ఆయన అన్ని పార్శ్వాల లోను తనదైన శైలిలో రాణిస్తున్నారు.

ఇంకా మరెన్నో చిత్రాల్లో నటించి ప్రేక్షకులను హాస్య తరంగాలలో ఓలలాడించాలని కోరుకుందాం.

# నవ్వుల మందుగుండు-
# గుండు సుదర్శన్

మన తెలుగువారికి ఒక సామెత ఉంది... అన్నప్రాసన నాడే ఆవకాయ అన్నం అని. అలాగే తొలిచిత్రంలోనే విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టిఆర్‌తో కెమెరా పంచుకోవడం అంటే సామాన్యమైన విషయం కాదు. అటువంటి అరుదైన ఫీట్‌ను చేసిన నటుడు గుండు సుదర్శన్.

సహజంగా పెద్ద తారలతో నటించవలసి వస్తే తొలిసారిగా కెమెరా ముందుకు వచ్చిన నటుడు ఎవరైనా తడబడతారు. ఆయన మాత్రం ఎటువంటి తడబాటు లేకుండా అందులోనూ బాపు దర్శకత్వంలో ఆ చిత్రంలో నటించి మెప్పించారు గుండు సుదర్శన్. ఆ చిత్రమే శ్రీనాథ కవిసార్వభౌముడు. ఆ చిత్రంలోనే గుండు సుదర్శన్ తొలిసారి కెమెరా ముందుకు వచ్చారు. కాని మిస్టర్ పెళ్లాం ముందుగా విడుదలవడంతో ఆయన మొదటి చిత్రంగా మిస్టర్ పెళ్లాం అయింది.

జనవరి, 3న భీమవరంలో జన్మించారు ఆయన. చిన్న వయసునుండే నాటకాలు ఆడే అనుభవం ఉంది. సివిల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసి హైద్రాబాద్‌లోని జెఎన్‌టియు విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పూర్తి చేసారు. సైకాలజీలో కూడా పట్టా సంపాదించారు.

భీమవరంలో కాలేజీ అధ్యాపకుడిగా పనిచేస్తూ అప్పుడప్పుడు వచ్చి సినిమాల్లో నటించే ప్రయత్నమూ చేసారు. ఆ ప్రయత్నంలో భాగంగానే బాపు దర్శకత్వంలో ఆయన తొలి రెండు చిత్రాల్లో నటించడం జరిగింది.

మిస్టర్ పెళ్లాం చిత్రంలో ఆయన చేసిన రెండు పాత్రలకు నూటికి నూరు పాళ్ళు మార్కులు పడ్డాయి. 'అంతా విష్ణుమాయ' అన్న డైలాగ్‌తో ఆయన పాపులర్ అయ్యారు.

ఆ తరువాత రాంబంటు, చిత్రం, రామసక్కనోడు లాంటి చిత్రాల్లో నటిస్తూ భీమవరం టు హైద్రాబాద్ షటిల్ కొట్టేవారు. మధ్యలో కొన్నాళ్ళు సినిమాలకు గేప్ వచ్చింది.


హైదరాబాద్‌లో పిహెచ్‌డి పూర్తి చేసాక పూర్తి స్థాయి నటుడుగా మారిపోయారు. తన ఉద్యోగానికి రాజీనామా చేసి- మిస్టర్ పెళ్లాం, రాంబంటు, స్టూడెంట్ నెం.1, చిరునవ్వుతో, శ్రావణి సుబ్రమణ్యం, ఎలా చెప్పను, ఆంధ్రుడు, మల్లీశ్వరి, అతడు, ఖలేజా, లౌక్యం, గుంటూరు టాకీస్, టచ్ చేసి చూడు, మత్తు వదలరా... తదితర చిత్రాలలో నటించి మంచి పేరు సంపాదించుకుని, దాదాపు 350 పైచిలుకు సినిమాలు పూర్తి చేసారాయన.

ఇదంతా నాణేనికి ఒకవైపు అయితే, మరోవైపు మంచి రచయిత, ఉపన్యాసకుడు కూడా ఉన్నాడు ఆయనలో. హాస్యానందంలో కొంటె ప్రశ్నలకు మహా కొంటె జవాబులు ఇచ్చే కోణంగి కూడా ఆయనలో దాగి ఉన్నాడు. సినిమాల్లోనే కాకుండా బుల్లితెరలోనూ అనేక కార్యక్రమాలకు వ్యవహార కర్తగా, వ్యాఖ్యాతగా ఆయన ప్రేక్షకులకు దగ్గరయ్యారు.

కమెడియన్‌గా చిత్ర పరిశ్రమలో రాణించడం ఓ అదృష్టం. అది అందరికీ దొరికే ఫలం కాదని చెబుతారాయన.

సరియైన టైములో సరియైన డెసిషన్ తీసుకుని చిత్ర పరిశ్రమలోకి రాకపోవడం వల్ల తన పరుగు పందెంలో కొంచెం వెనుకబడ్డానని నిర్భయంగా ఒప్పేసుకుంటారు.

అనేకమంది గుండుతో నటించే నటులున్నా తనకే 'గుండు' అనే టైటిల్ రావడం



అచ్చి వచ్చిందని ప్రేక్షకులకు అది నచ్చింది కాబట్టి ఆ గుండుతోనే ఉండిపోయానని నవ్వుతూ చెప్తారు సుదర్శన్. అందుకే అన్ని విషయాల్లోను నిండు గుండుగా నిలబడ్డానని అంటారు నవ్వుతూ.

లెక్చరర్స్, డాక్టర్స్, హౌస్ ఓనర్స్, చేతగాని మొగుడు, శాడిస్ట్‌ల లాంటి పాత్రలలో ఇంకా తెలుగు తెరపై హాస్యం పండాల్సిన అవసరం వుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తారు. పాత్రలో పస లేకుండా మూసగా ఉంటే అది ఎప్పటికీ మొనాటనీగా వుంటుందని, సరియైన గుర్తింపు రాదని, అటువంటి పాత్రలే తనకు ఇప్పటివరకు వచ్చాయని నిర్భయంగా చెబుతారు. స్పీకింగ్ స్పెషలిస్ట్ అయిన ఈ బుక్ లవర్‌కు మరిన్ని మంచి పాత్రలు పడితే, మరో మంచి నటుడు తెలుగు తెరకు దొరికినట్లే. అటువంటి పాత్రలు ఆయనకు రావాలని మరింత పేరు తెచ్చుకోవాలని హాస్యానందం కోరుకుంటోంది.

# నవ్వుల అల్లరి రాజా...
# అల్లరి నరేష్

ఇప్పుడున్న యువతరం నటుల్లో కామెడీని అద్భుతమైన టైమింగ్‌తో పండించాలంటే మొదట గుర్తొచ్చేది అల్లరి నరేష్.


హాస్య దర్శకుడు ఇ.వి.వి.సత్యనారాయణ తనయుడిగా 'అల్లరి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నరేష్ ఆ తరువాత అల్లరి నరేష్‌గా స్థిరపడిపోయారు.

అనేక చిత్రాల్లో తన హాస్య నటవైభవాన్ని చాటిచెప్పారు. చినప్పటినుండి సినిమా ఇండస్ట్రీలో పెరగటం వల్ల రాజేంద్రప్రసాద్ ప్రభావం, తండ్రి రూపొందించే హాస్యచిత్రాల ప్రభావం రెండూ అతనిపై ముద్ర వేసుకున్నాయి. అలా హాస్యనటుడిగా ఇప్పటి తరానికి నవ్వులు పూయిస్తున్నాడు.

హాస్యనటుడిగానే కాకుండా అభినయ ప్రాధాన్యత ఉన్న సినిమాల్లో కూడా తన సత్తాను చాటి తనలో మంచి నటుడున్నాడని నిరూపించుకున్నాడాయన. ఉదాహరణకి ప్రాణం, గమ్యం, శంభో శివ శంభో, నేను చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రల్లో, కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన శుభప్రదం చిత్రంలో చక్రిగా అల్లరి నరేష్ అభినయానికి మంచి మార్కులే పడ్డాయి. అదే విధంగా 'లడ్డుబాబు' అనే ప్రయోగాత్మక చిత్రంలో లడ్డులా కనిపించడానికి 5, 6 గంటల మేకప్ వేసుకుని మరీ నటించారాయన. అల్లరి నరేష్ సినిమా అంటే కామెడీకి మినిమమ్ గ్యారంటీ అన్న నానుడి ప్రేక్షకుల్లో ఉంది. అందువల్లే ఈతరం కామెడీ హీరోగా ఆయన నిలబడ్డారు.

ధనలక్ష్మి ఐలవ్‌యు, జూనియర్స్, తొట్టిగ్యాంగ్, మా అల్లుడు వెరీగుడ్, నువ్వంటే నాకిష్టం, డేంజర్, పార్టీ, కితకితలు, రూమ్‌మేట్స్, గోపి గోడమీద పిల్లి, పెళ్ళయ్యింది కానీ, సీమశాస్త్రి, సుందరకాండ, విశాఖ ఎక్స్‌ప్రెస్, పెళ్లికాని ప్రసాద్, బొమ్మన బ్రదర్స్ చందన సిస్టర్స్, సిద్ధు ఫ్రమ్ శ్రీకాకుళం, బ్లేడు బాబ్జీ, దొంగలబండి, బెండు అప్పారావు ఆర్‌ఎమ్‌పి, రాంబాబు గాడి పెళ్లాం, ఆకాశరామన్న, బెట్టింగ్ బంగార్రాజు, సరదాగా కాసేపు, కత్తి కాంతారావు, అహనా పెళ్ళంట, సీమ టపాకాయ్, మడత కాజా, నువ్వా నేనా, సుడిగాడు, యముడికి మొగుడు, యాక్షన్ త్రిడి, కెవ్వు కేక, జంప్‌జిలానీ, బందిపోటు, జేమ్స్‌బాండ్, మామ మంచు అల్లుడు కంచు, సెల్ఫీ రాజా తదితర





చిత్రాల్లో అల్లరి నరేష్ నవ్వుల్ని విరబూయించాడు తెలుగు తెరపై.

తమిళంలో కూడా కురుంబు, పోరాలి అనే చిత్రాలలో నటించి తన సత్తా చాటారు.

'కితకితలు' చిత్రంలో గీతాసింగ్‌తో కలిసి ఆయన చేసిన కామెడీ సూపర్ హిట్.


అలాగే బ్లేడు బాబ్జీ మంచి ఆదరణ పొందింది.

1982 జూన్ 30 న పోరుమామిడిలో జన్మించిన ఆయన హైద్రాబాద్‌లోనే తన నివాసం ఏర్పాటు చేసుకున్నారు.

హాస్య పాత్రలే కాకుండా అభినయం వున్న ఏ పాత్రనైనా చేయడానికి ఆయన నేను సిద్ధంగా వున్నానని ఇటీవల తెలిపారు.

మంచి పాత్రలతో మరిన్ని చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు హాస్యం అందించాలని కోరుకుందాం.

# హాస్య మోహనుడు–
# బాబూ మోహన్



నటుడన్న వాడికి అందం, మంచి స్ఫురద్రూపం కావాలనే పడికట్టు పదాలను తోసి రాజని బాబూమోహన్ ఎటువంటి పాత్రలోనైనా లీనమై, నటనే నటుడికి కావాలని నిరూపించారు.

'మాకీ కిరి కిరి... పాయే...ఇంత కూరుంటెయ్యమ్మో...' లాంటి మాటలు వింటే గుర్తొచ్చే పేరు బాబూమోహన్. జంబలకిడి పంబలో ఇన్‌స్పెక్టర్‌గా పిచ్చివాళ్ళందరికీ క్లాసులు చెప్పే టీచరుగా ఆయన చేసిన నటన చాలు ఆయన ఎంత మంచి నటుడో చెప్పడానికి!

1952 మార్చి 19న ఖమ్మం జిల్లా బీరోలు అనే కుగ్రామంలో జన్మించారు బాబూమోహన్. తండ్రి ఉపాధ్యాయుడు. బాబూమోహన్ ప్రభుత్వ రెవెన్యూ విభాగంలో ఉద్యోగం చేస్తూ సినిమాల మీద ఆసక్తితో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసారు.


ఆయన మొదట నటించిన సినిమా 'ఈ ప్రశ్నకు బదులేది?'. 'మామగారు'లో బిచ్చగాడి పాత్రలో ఆయనకు మంచి గుర్తింపు వచ్చింది. అలాగే 'మాయలోడు' చిత్రంలో 'ఏమిటి? ఎందుకు? ఎలా?' అనే డైలాగులతో స్టార్ కమెడియన్‌గా ఎదిగారు.

మామగారు, రాజేంద్రుడు గజేంద్రుడు, పెదరాయుడు, 20వ శతాబ్దం, చిరునవ్వుల వరమిస్తావా? ముగ్గురు మొనగాళ్ళు, చిట్టెమ్మమొగుడు, భారత్‌బంద్, దేవి, దోషి, రెండిళ్ళ పూజారి, హలో బ్రదర్, వారసుడు, అప్పుల అప్పారావు, ఇద్దరూ ఇద్దరే, ఆయుధం, పుణ్యభూమి నాదేశం, ఆయనకిద్దరు, అమ్మోరు, సిసింద్రీ, అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి, పెళ్లిసందడి, వినోదం, అన్నమయ్య తదితర చిత్రాల్లో ఆయన పండించిన నవ్వులు తెలుగు ప్రేక్షకులకి గిలిగింతలు పెడుతూనే ఉన్నాయి.

'రాజేంద్రుడు గజేంద్రుడు' చిత్రంలో 'చినుకు చినుకు అందెలలో' పాటలో ఆయన చేసిన నృత్యం ఆ చిత్రంలో హైలెట్‌గా నిలిచింది.

హీరోగా సుందర వదనా సుబ్బలక్ష్మి మొగుడా అనే చిత్రంలో నటించారు. ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లతో ఆయన నృత్యాలు ప్రేక్షకులకు కనువిందు చేసాయి.

చిన్నప్పటినుండి ఎన్‌టిఆర్ అభిమాని అవడంతో కొన్నాళ్ళు తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. మెదక్ జిల్లా ఆందోల్ నియోజక వర్గంనుండి శాసనసభ్యుడిగా ఎన్నికై సాంఘిక సంక్షేమ శాఖామంత్రిగా పనిచేసారు.




2004, 2014ల్లో జరిగిన ఎన్నికలలో ఓడి పోయారు. ఆయన ప్రస్తుతం బిజెపి పార్టీలో క్రియాశీలక సభ్యునిగా సేవలు చేస్తున్నారు.

మరెన్నో చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు హాస్యం, వినోదం అందించాలని కోరుకుందాం.







# హాస్య తరంగం-
# సునీల్‌వర్మ

ఇప్పటితరం హాస్యనటులతో పోల్చుకుంటే సునీల్‌ది ఓ వైవిధ్యమైన కథనం.


చిన్న పాత్రలతో పరిశ్రమలో పరిచయమై ఆ తరువాత మంచి టైమింగ్ ఉన్న కమెడియన్‌గా ఎదిగి, ఆ తరువాత సిక్స్ ప్యాక్ హీరోగా మారి అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టారు సునీల్.

ఇందుకూరి సునీల్‌వర్మ భీమవరంలో 1973 ఫిబ్రవరి 28న జన్మించారు. చిన్న వయసులోనే తండ్రి దూరమవడంతో అమ్మమ్మగారి ఊరు పెదపులివర్రులో ఎక్కువగా ఉండేవారు. అక్కడే నాలుగో తరగతి దాకా చదువుకున్నారు. ఆ తరువాత భీమవరంలో ఉండి పాఠశాలలో చదివారు. చిన్నప్పటినుండే నటనపై మక్కువతో కళాశాలలో చేరాక ఫైనాన్స్ కోర్సు చేసారు. డ్యాన్సులు కూడా చక్కగా చేసేవారు. అలా నటనపై ఇష్టంతో తన స్నేహితుడైన దర్శకుడు త్రివిక్రమ్ ప్రోత్సాహంతో తొలిసారిగా 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రంలో బంతి అనే పాత్రలో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు.

నేనున్నాను, నువ్వు నేను, మనసంతా నువ్వే, బొమ్మరిల్లు, నువ్వే నువ్వే, నువ్వు లేక నేను లేను, నువ్వే కావాలి, ఠాగూర్, మల్లీశ్వరి, ఉల్లాసంగా ఉత్సాహంగా, కలుసుకోవాలని, విజయం, నేను పెళ్లికి రెడీ, మాస్, జై చిరంజీవ, అతడు, జల్సా, రెడీ, ఢీ, కింగ్, వాసు, కాంచనమాల కేబుల్ టివి, పెళ్లాం ఊరెళితే తదితర చిత్రాల్లో హాస్యాన్ని పండించి, ప్రేక్షకుల్ని మెప్పించారు.

తాను మొదటి సినిమాలో ఏ హీరోయిన్‌తో అయితే కమెడియన్‌గా నటించారో అదే హీరోయిన్‌తో కథానాయకుడుగా అందాలరాముడు చిత్రంలో నటించారు. ఆ తరువాత సిక్స్ ప్యాక్ చేసి మర్యాదరామన్న, కథ స్క్రీన్ ప్లే దర్శకత్వం అప్పలరాజు, పూలరంగడు, మిస్టర్ పెళ్లికొడుకు, తడాఖా, భీమవరం బుల్లోడు, కృష్ణాష్టమి, జక్కన్న, ఈడు గోల్డ్‌హే, ఉంగరాల రాంబాబు, టూ కంట్రీస్ తదితర చిత్రాల్లో కథానాయకుడుగా నటించి మెప్పించారు.

కమెడియన్‌గా, కథానాయకుడుగా ఆయనకు ప్రేక్షకులు మంచి మార్కులే వేసినా ఆయన స్నేహితుడు త్రివిక్రమ్ మాత్రం విలన్‌గా బాగా పనికొస్తాడని చెపుతూ ఉండేవారు. ఆ మాటను పాటిస్తూ ఇటీవల వచ్చిన కలర్‌ఫొటో చిత్రంలో సునీల్ విలన్‌గా నటించి మెప్పించారు.



రాబోయే రోజుల్లో కామెడీ పండిస్తారో, కథానాయకు డౌతారో, విలన్‌గా నటిస్తారో ప్రేక్షకులే నిర్ణయిస్తారు.

మర్యాదరామన్న చిత్రానికి స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకున్న ఆయన ఇప్పటివరకు దాదాపు 300 పై చిలుకు చిత్రాల్లో నటించారు.





# లైఫే కామెడీ-
# వెన్నెల కిషోర్



అసలు సినిమాలంటే తెలీదు... నటనంటే అంతకన్నా తెలీదు... సినిమాల్లో వేషాలొస్తాయని అందులో నటిస్తే, మంచి మంచి పాత్రలు వస్తాయని, అవి పేరు తెస్తాయని అతనికి ఏమాత్రం తెలీదు. అయినా కాని అదృష్టం అందలం ఎక్కించినట్లుగా హాస్యనటుడు వెన్నెల కిషోర్‌గా మారిపోయారు ఈ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 'కిషోర్'

నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలో జన్మించిన కిషోర్ తండ్రి వద్దనే పాఠాలు అభ్యసించారు. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కిషోర్ కామారెడ్డిలోనే పదవ తరగతి దాకా చదివి ఇంటర్మీడియట్ చదవడానికి హైదరాబాద్‌కు వచ్చారు.

డిగ్రీ బికాం చేసారు. హైదరాబాద్ వచ్చినప్పటినుంచే సినిమాలు చూడటం ప్రారంభించారు కిషోర్. డిగ్రీ తరువాత ఓ కోర్స్ చేసారు. ఆ కోర్స్ వల్ల అమెరికా, ఆస్ట్రేలియాల్లో రెండు విద్యాసంస్థల్లో సీటు వచ్చింది. జిఆర్ఇ, టోఫెల్ లో కూడా మంచి స్కోర్ సాధించారు. అమెరికాలోని మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి వర్జీనియాలో కామర్స్ ఫైనాన్స్ సాఫ్ట్‌వేర్ టెస్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు ఆయన.

అలా ఉద్యోగంలో ఉన్నప్పుడే దర్శకుడు దేవాకట్టా దగ్గర సహాయకుడిగా పని చేయడానికి కుదిరారు. దేవాకట్టా నిర్మించే ఓ చిత్రంలో ఓ నటుణ్ణి ఫైనలైజ్ చేసిన తరువాత ఆ నటుడు అమెరికా రాకపోవడంతో, ఆ పాత్రలో ఆపద్ధర్మంగా నటించాల్సి వచ్చింది కిషోర్‌కు. ఆ చిత్రమే 'వెన్నెల'.

ఆ సినిమా సూపర్‌హిట్ అవడంతో, మంచి గుర్తింపు రావడంతో కిషోర్ కాస్త 'వెన్నెల కిషోర్'గా మారారు.

ఆ తరువాత ఇండియాకి వచ్చి ఉద్యోగాలు చేయాలనుకున్నారు. కాని అనుకోకుండా అవకాశాలు తలుపు తట్టడంతో ఉద్యోగాన్ని వదిలేసి పూర్తి స్థాయి సినిమా నటుడుగా తెలుగు సినీ పరిశ్రమలోకి స్థిరపడిపోయారాయన.

నటించడం ఏమాత్రం తెలీని వెన్నెల కిషోర్ పూర్తి స్థాయి నటుడుగా మారిపోవటం విధివిలాసమే.

ఇందుమతి, సమర్థుడు, కరెంట్, బిందాస్, చక్రి, ఇంకోసారి, ప్రస్థానం, స్నేహగీతం, ఆరెంజ్, ఏమైందీవేళ, తిమ్మరాజు, అహ నా పెళ్ళంట, సీమ టపాకాయ్, దూకుడు, మడతకాజా, పిల్లజమిందార్, మిస్టర్ నూకయ్య, దరువు, జులాయ్, జబర్దస్త్, అబ్బాయి క్లాసు అమ్మాయి మాసు, అలా ఎలా, లక్ష్మీ రావే మా ఇంటికి, బూచమ్మ బూచోడు, ప్యార్ మే పడిపోయానే, జెండా పై కపిరాజు, కౌసల్య కృష్ణమూర్తి, మత్తు వదలరా, ఏదైనా జరగొచ్చు, డిస్కో రాజా, భీష్మ లాంటి చిత్రాలతో నవ్వులను తెలుగు తెరపై పూయిస్తున్నాడు వెన్నెల కిషోర్.



దర్శకుడుగా కూడా జప్ఫా, వెన్నెల వన్ బై టు అనే చిత్రాన్ని ఆయన రూపొందించారు.

'ఇంకోసారి' చిత్రంకు గాను 2019లో ఆయనకు ఉత్తమ హాస్యనటుడు నంది అవార్డు లభించింది. ఆయన దర్శకత్వం వహించిన 'వెన్నెల వన్ బై టు' చిత్రం పరాజయం పాలవడంతో తన పేరు ముందున్న 'వెన్నెల'ని తొలగించి ప్రస్తుతం కిషోర్‌గానే చలామణి అవుతున్నారు. కిషోర్ మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకుని నవ్వులు పూయించాలని కోరుకుందాం.

# ఆశ, దోశ, అప్పడం, వడ-
# రఘుబాబు

ఏ హాస్యనటుడికైనా ఒక హాస్యముద్ర ఏర్పడిపోతుంది. ఆ హాస్యనటుడికి అటువంటి పాత్రలే వస్తాయి. కాని రఘుబాబు శైలి వైవిధ్యం. ఆయన విలనిజం చేసినా, హాస్య నటుడిగా చేసినా, కేరక్టర్ ఆర్టిస్టుగా చేసినా ఆ పాత్రే కనపడడం ఆయన బాడీలాంగ్వేజ్ ప్రత్యేకత.

కామెడీ చేస్తే ప్రేక్షకులు నవ్వుతారు. విలనిజం చేస్తే ప్రేక్షకులు కోపంగా చూస్తారు. ఆయన కేరక్టర్ ఆర్టిస్టుగా మంచి నటన పండిస్తే ప్రేక్షకులు ఉదాత్తంగానే ఆయన్ని చూస్తారు. అలా ఏ ముద్ర పడని నటుడిగా రఘుబాబు తెలుగు పరిశ్రమలో కనిపిస్తున్న హాస్యనటులు.

ఆయన తండ్రి ప్రసిద్ధ నటులు గిరిబాబు. రఘుబాబు 1960 అక్టోబరు 10న ప్రకాశం జిల్లా రావినూతలలో జన్మించారు. ఇంజనీరింగ్ చదువు మధ్యలో మానేసి ప్రొడక్షన్ పనుల కోసం చెన్నై వచ్చేసారు. తొలినాళ్ళలో నిర్మాత కావాలన్న ఆశ ఆయనకుండేది. అందుకే కొన్ని కన్నడ, తమిళ చిత్రాలను తెలుగులో డబ్బింగ్ చేసి విడుదల చేసారాయన. నటుడిగా తొలిసారి 'దొంగలున్నారు జాగ్రత్త ' అనే చిత్రంలో హీరోగా చేసారు. కాని ఆ తరువాత ఆయనకు అవకాశాలు రాకపోవడంతో కొన్నాళ్ళు అలాగే ఉండిపోయారు.

చిన్నతనంలోనే శ్రీకృష్ణ తులాభారం అనే నాటకంలో స్వంత ఊర్లో వసంతకుడిగా నటించి ఆయన ప్రేక్షకుల మెప్పును పొందారు. సెకండ్ ఇన్నింగ్స్‌లో కృష్ణవంశీ తన చిత్రం మురారిలో ఒక అమాయకపు పాత్రలో ఆయనను నటింపచేసారు. ఆ చిత్రం హిట్ అవడంతో రఘుబాబుకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తరువాత ఆదిలో చేసిన గంగిరెడ్డి పాత్ర, చెన్నకేశవరెడ్డి చిత్రంలో లాబరన్నగా చేసిన పాత్రలు మంచి గుర్తింపునిచ్చాయి.

అలాగే బన్నీ, కృష్ణం వందే జగద్గురుం, కరెంటు లాంటి చిత్రాలలో ఆయన చేసిన పలు పాత్రల నటనతో ప్రేక్షకులకు దగ్గరయ్యాయి. బెండు అప్పారావు చిత్రంలో ఆహుతి ప్రసాద్ ఇంట్లో నౌకరుగా ఆయన చేసిన కామెడీ ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టింది. ముఖ్యంగా రఘుబాబు చేసిన పలు చిత్రాల్లో దొంగస్వామీజీ వేషం బాగా క్లిక్ అయి, దొంగ స్వామీజీగా నటించాలంటే రఘుబాబే నటించాలి అన్నంత పేరు రఘుబాబుకు రావటం విశేషం.






టాటా బిర్లా మధ్యలో లైలా, నేనింతే, అల్లరి రాముడు, దిల్, ఆంధ్రావాలా, గుడుంబాశంకర్, అస్త్రం, ఆ ఒక్కడు, ఆలస్యం అమృతం, బ్రహ్మలోకం టు యమలోకం వయా భూలోకం, భలే మొగుడు భలే పెళ్లాం, వీడు తేడా, వనకన్య వండర్ వీరుడు, నిప్పు, నా ఇష్టం, అడ్డా, జప్పా, జంప్ జిలానీ, రఫ్, టామీ, సౌఖ్యం, జేమ్స్‌బాండ్, కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ, కిక్ 2, మన ఊరి రామాయణం, మీలో ఎవరు కోటీశ్వరుడు, ఆటాడు కుందాం రా, బాబు బంగారం, నేను లోకల్, శైలజారెడ్డి అల్లుడు, రూలర్, చాణక్య, డిస్కోరాజా, భీష్మ తదితర చిత్రాల్లో ఆయన హాస్యంతో ప్రేక్షకులను మెప్పించారు.

ఓనమాలు చిత్రంలో ఆయన నటనకు గాను 2012 ఉత్తమ హాస్యనటుడి నంది పురస్కారం అందుకున్నారు.

రఘుబాబు మరెన్నో విజయాలు అందుకోవాలని, నటుడుగా రాణించాలని కోరుకుందాం.

# ఎటకారం డాట్ కామ్
# కృష్ణ భగవాన్



**జస్ట్** మిస్... మరదే వెటకారమంటే, నేను ఫిజికల్లీ హేండీకేప్డ్, మెంటల్లీ రిటైర్డ్. ఇటువంటి పంచ్ డైలాగులు వినగానే గుర్తొచ్చే పేరు కృష్ణ భగవాన్.

నటుడవ్వాలన్న కోరిక లేకపోయినా ఆయన నటుడుగా మారడం ఓ విచిత్రం అని చెబుతారు.

తూర్పుగోదావరి జిల్లా కైకోలు గ్రామంలో 1965 జూలై 2న జన్మించారు ఆయన. అసలు పేరు మీనవల్లి పాపారావు చౌదరి. అమ్మమ్మ, నానమ్మ కలిసి కృష్ణ భగవాన్ అని పెట్టారు. ఆయన చదువులో దిట్ట కాకపోయినా బి.కాం దాకా చదివారు. కైకోలు, కాకినాడ, హైదరాబాద్ ప్రాంతాలలో ఆయన విద్యాభ్యాసం సాగింది. కొన్నాళ్ళు వ్యాపారం చేసి అది అచ్చి రాక చివరికి నటన వైపు దృష్టి పెట్టారు.

తొలినాళ్ళలో ఆయన ప్రదర్శించిన నాటకాలు. మిమిక్రీ ప్రదర్శనలు ఆయన్ను వెన్ను తట్టాయి. చలోమంటూ మద్రాసు వెళ్లిపోయారు. అక్కడ రవితేజ తదితరులతో రూమ్‌లో ఉంటూ సినిమా అవకాశాల కోసం ప్రయత్నించసాగారు నృత్యతార అనురాధ ఇంట్లో ఆయన అద్దెకు ఉండేవారు.

తొలిసారిగా పెండింగ్ ఫైల్ అనే నాటకంలో నటించిన ఆయన ఆ తరువాత దర్శకుడు వంశీ ప్రోత్సాహంతో మహర్షి అనే చిత్రంలో తెరపై మెరిసారు. ఆ తరువాత ఏప్రిల్ 1 విడుదల చిత్రంలో ఆయన విలన్‌గా ఆయన నటన మరువరానిది.

ఆ చిత్రం విడుదల అయ్యాక చాలామంది ఓ మంచి విలన్ తెలుగు తెరకు దొరికాడు అని అనుకున్నారు. కాని ఆయనకు సరియైన అవకాశాలు రాలేదు.

ఏవో కొన్ని చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు చేసినా గుర్తింపు రాలేదు. స్వతహాగా నేను కమెడియన్‌ని కాదు అని చెపుతారు ఆయన.

కమెడియన్ ఫేసు కాకపోయినా నా నోరు కమెడియన్‌గా మార్చిందని ఆయన కాయనే చెప్పుకుంటారు స్వగతంలో.

విశేషమేంటంటే కృష్ణభగవాన్‌కు ఒక పాత్ర ఇస్తే ఆ పాత్రకు సంబంధించిన అన్ని రకాల పంచ్‌లు, డైలాగులు, వెటకారం డాట్ కామ్ లాంటి నవ్వులు విరబూసే మాటలు ఆయనే రాసుకోగలరు అన్న ఒక నమ్మకం దర్శకులకు ఏర్పడింది.


కొన్నాళ్ళు మాటల రచయితగా కూడా కొన్ని చిత్రాలకు మాట సాయం చేసారు. వంశీ రూపొందించిన ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు చిత్రంలో ఆయన చేసిన కామెడీ ప్రేక్షకులకు మంచి కిక్ ఇచ్చింది.

అనేక చిత్రాల్లో పంచ్ డైలాగులతో ప్రేక్షకులను నవ్వించారు కృష్ణభగవాన్. టాటా బిర్లా మధ్యలో లైలా, బొమ్మన బ్రదర్స్ చందన సిస్టర్స్...లాంటి చిత్రాలలో మరో హీరోతో కలిసి హీరోగా నటించారు. జాన్ అప్పారావు ఫార్టీ ప్లస్ అనే చిత్రంలో సిమ్రాన్‌తో కలిసి సోలో హీరోగా నటించి ప్రేక్షకులకు నవ్వులు పండించారు.

కబడ్డీ కబడ్డీ, దొంగరాముడు అండ్ పార్టీ, శ్రీరామచంద్రులు, లక్ష్మీనరసింహ, ఒక పెళ్లాం ముద్దు రెండో పెళ్లాం వద్దు, మీ ఇంటకొస్తే ఏమిస్తారు మాఇంటికి వస్తే ఏంతెస్తారు, లీలామహల్ సెంటర్, నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమొరీస్, వెంకీ, సారీ నాకు పెళ్ళయ్యింది, కొంచెం టచ్‌లో ఉంటే చెబుతాను, మిస్టర్ అండ్ మిసెస్ శైలజా కృష్ణమూర్తి, ఎవడి గోల వాడిది, అదిరిందయ్యా చంద్రం, అల్లరిబుల్లోడు, కాంచనమాల కేబుల్ టివి, అందరివాడు, ఏమండోయ్ శ్రీవారు, రాజబాబు, రాఖీ, అమ్మ చెప్పింది, దుబాయ్ శీను, ఎవడయితే నాకేంటి, మీ శ్రేయోభిలాషి, పెళ్ళయింది కానీ, దొంగ సచ్చినోళ్ళు, మిస్టర్ గిరీశం, కుబేరులు, గోపి గోపిక గోదావరి, సరదాగా కాసేపు, మనసారా, ఏమైందీవేళ, వీడు తేడా, జీనియస్, ఆడు మగాడ్రా బుజ్జీ, అలా ఎలా, పాండవులు పాండవులు తుమ్మెద, నాన్న నేను నా బాయ్‌ఫ్రెండ్స్ లాంటి చిత్రాలలో ఆయన ప్రేక్షకులకు దగ్గరయ్యారు.

మంచి చిత్రాలను ఎంచుకుని, మంచి పాత్రలు వస్తే విలన్‌గానయినా సరే ప్రేక్షకులను అలరించగల దిట్ట కృష్ణ భగవాన్.

# ఎక్స్‌ప్రెస్ కామెడీ-
# సప్తగిరి



**హా**స్యనటుడుగా సినీ పరిశ్రమలోకి ఒక ఎక్స్‌ప్రెస్‌లాగా దూసుకొచ్చిన కమెడియన్ సప్తగిరి.

'పరుగు' చిత్రంలో చిన్న పాత్రతో పరిచయమైనా, ఆ తరువాత 'ప్రేమ కథా చిత్రమ్' తో దెయ్యం బారిన పడిన అర్భకుడిగా, మారుతి దర్శకత్వంలో నటించి మెప్పించారు.

'గులాబ్‌జామ్‌లన్నీ గులగులలాడిపోయాయి' అన్న డైలాగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'అక్కా అక్కా' అంటూ దెయ్యాన్ని సంబోధించిన తీరు ప్రేక్షకులకు నచ్చింది.

1989 మే 1న చిత్తూరు జిల్లా పుంగనూరులో జన్మించారు.

ఆయన అసలు పేరు వెంకట ప్రభు ప్రసాద్. సినిమాకు పెట్టుకున్న పేరు సప్తగిరి.

అతని టైమింగ్, ఎక్స్‌ప్రెషన్ ప్రేక్షకులకు నచ్చడంతో ఒక్కసారిగా హాస్యనటుల జాబితాలో చేరిపోయారు.

ఆయన బాల్య దశ అంతా పుంగనూరు, ఐరాల ప్రాంతాలలో జరిగింది. ఇంటర్ చదివాక సినిమాల్లో నటించాలన్న కోరిక పెరిగింది. పరిశీలనా దృష్టి ఎక్కువవడంతో అసిస్టెంట్ డైరెక్టరుగా అవకాశాల కోసం మొదట్లో ప్రయత్నించారు.

దర్శకుడు విరించి వర్మ స్నేహితుడు, శేఖర్ సూరి వద్ద దర్శకత్వ శాఖలో చేరారు. ఏ ఫిలిం బై అరవింద్‌కు పనిచేస్తూ అన్ని విభాగాల్లోనూ పరిజ్ఞానం సంపాదించుకున్నారు. బొమ్మరిల్లు చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేసారు. అందులోనే తొలి వేషం వేసారు.

దర్శకత్వం, నటన రెండూ చేస్తూ- ఓయ్, మంత్ర, గబ్బర్‌సింగ్, తదితర చిత్రాల్లో నటించి, ప్రేమ కథా చిత్రమ్‌తో టర్నింగ్ పాయింట్ తీసుకున్నారు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌తో హీరోగా మారారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, దృశ్యం, పవర్, సోగ్గాడే చిన్ని నాయనా, చిత్రాంగద, రాధ, ఏంజిల్, సుప్రీమ్, లోఫర్, కొరియర్‌బాయ్ కళ్యాణ్, మనం, జ్యోతిలక్ష్మి, జక్కన్న, టెంపర్, కొలంబస్, బీరువా, గెడ్డంగ్యాంగ్, జోరు, బ్రూస్‌లీ తదితర చిత్రాల్లో తన నవ్వులను ప్రేక్షకులకు అందించారు. ఓవైపు కమెడియన్‌గానే నటిస్తూ తనకు నచ్చిన కథల కోసం కథానాయకుడుగా నటించడం కోసం ఆయన ఎదురు చూస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ రాజా చిత్రానికి 2016లో నంది అవార్డు అందుకున్నారు. అల్లురామలింగయ్య స్మారక పురస్కారం అందుకున్నారు. మంచి మంచి కథలు ఎన్నుకుని అడపా దడపా కథానాయకుడుగా నటిస్తే, సప్తగిరికి మంచి భవిష్యత్తు ఉంటుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.





# లకలకషకలక హాస్యం-
# షకలక శంకర్

ఆయన జీవితమే ఓ హాస్య చదరంగం. అయితే ఆ నవ్వులు కూడా ఒక్కొక్కసారి కష్టాలు కూడా తెచ్చిపెడతాయి. అలాంటి కష్టాలు చిన్నప్పటినుండి ఎదుర్కొన్నారు షకలక శంకర్.

ఎన్ని కష్టాలు ఎదురైనా నవ్వడమే అతని నైజం. ఎదుటి వాళ్ళకి అతని నవ్వులు పంచడమే అతనికి సంతృప్తి ఇచ్చే అంశం. ఇప్పుడు అతని రేంజ్ మారిపోయింది. అతడి నవ్వుల కోసం ప్రేక్షకులు ఎదురు చూసేలా ఎదిగారు.

అతని మార్కు శ్రీకాకుళం మాండలికం. పెయింటింగ్ పని చేస్తూ దాదాపు నాలుగేళ్ళ పాటు గడిపేసారు. నటి నిర్మలమ్మ వద్ద కొన్నాళ్ళు, ఆఫీస్‌బాయ్, ప్రొడక్షన్ బాయ్‌గా పనిచేసారు.


పడిన కష్టాలన్నిటికి ఎప్పుడో ఒకప్పుడు మంచి కెరీర్ వస్తుందనే అతని ఆశే మంచి మంచి అవకాశాలు వచ్చేలా చేసింది ఆ నమ్మకమే.

తొలిసారిగా 'రన్ రాజా రన్' దర్శకుడు సుజిత్ ఓ చిన్న షార్ట్‌ఫిల్మ్‌లో అతనికి అవకాశం ఇచ్చాడు. ఆ తరువాత జబర్దస్త్‌లో అవకాశం వచ్చింది. అక్కడ హిట్ అవడంతో ఒక వెనక్కి తిరిగి చూసుకునే అవసరమే అతనికి లేకపోయింది. ఆనందో బ్రహ్మ అన్న షార్ట్‌ఫిల్మే తనకి టర్నింగ్ పాయింటని ఆయన చెప్తారు. పదో తరగతిలోనే చదువుకు గుడ్‌బై కొట్టిన ఆయన సినీ పరిశ్రమలో అన్ని పాఠాలు నేర్చుకున్నారు.

దర్శకుడు రాంగోపాల్‌వర్మను అనుకరించడం, తనదైన ముద్ర శ్రీకాకుళం మాండలికంలో మాట్లాడడం పవన్‌కళ్యాణ్ అభిమానిగా పాటలు పాడడం లాంటి విలక్షణమైన శైలితో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు షకలక శంకర్.

సీతమ్మ అందాలు రామయ్య సిత్రాలు, ఇంట్లో దెయ్యం నాకేం భయం, కవ్వింత, రాజుగారి గది, రాజుగారి గది 2, రైట్ రైట్, గరం, ప్రేమికుడు, కుందనపు బొమ్మ, బంతిపూల జానకి, ఎక్స్‌ప్రెస్ రాజా, గీతాంజలి, నందిని నర్సింగ్ హోం, జంబలకిడి పంబ, శంభో శంకర, మత్తు వదలరా లాంటి చిత్రాలలో ఆయన హాస్యం ప్రేక్షకులకు నచ్చింది. రాంగోపాల్‌వర్మ బయోపిక్ లో నటించారు. మిర్చిలాంటి కుర్రాడు, బెంగాల్ టైగర్, సావిత్రి, సర్దార్ గబ్బర్‌సింగ్, ఆడోరకం ఈడోరకం, ద్వారక, గుంటూరోడు తదితర చిత్రాలు ఆయనకు మంచి పేరు తెచ్చాయి.





తాను పడిన కష్టాలు ఆయనెప్పుడూ మర్చిపోలేదు. అందుకే తన వివాహానికి డబ్బు ఖర్చు పెట్టకుండా ఆ డబ్బుతోనే పుస్తకాలు, ఆట సామగ్రి, విద్యార్థులకు పంపిణీ చేసి ఉన్నతమైన మనసును చాటుకున్నారు.

కాడెద్దులు లేని రైతులకు, నాగళ్ళు లేని కర్షకులకు వాటిని అందిస్తూ సమాజంలో తన వంతు సహాయాలను అందిస్తున్నారు.

ప్రస్తుతం రాంగోపాల్‌వర్మ పై రూపొందిస్తున్న 2,3 చిత్రాలను ఆయనే హీరోగా నటించడం విశేషం. ప్రస్తుతం అక్షర, బొమ్మ అదిరింది దిమ్మ తిరిగింది, త్రీ మంకీస్, నేనే కేడీ నెం వన్, భాగ్యనగర్ వీధుల్లో, గమ్మత్తు, సవ్యసాచి, ఇగో... లాంటి చిత్రాల్లో నటిస్తున్నారు షకలక శంకర్.

షకలక శంకర్ మరెన్నో విజయాలు అందుకోవాలని కోరుకుందాం.

# చెల్లి పెళ్లి మళ్ళీ మళ్ళీ-
# జెన్ని

**‘య**మలీల’ చిత్రంలో ‘చెల్లికి పెళ్లి మళ్ళీ మళ్ళీ’ అంటూ తోటరాముడు రాసిన కవితకు వ్యాఖ్యానం చేసిన జెన్నీ గుర్తున్నాడా! ఆ పాత్రతోనే ఆయనకు పరిశ్రమలోనూ, ప్రేక్షకులలోనూ అద్భుతమైన గుర్తింపు వచ్చింది.

తూర్పుగోదావరి జిల్లా ఆలమూరులో జన్మించారు ఆయన. మచిలీపట్నంలో పియుసి దాకా చదివారు. చదువుకునే రోజుల్లోనే ఆలిండియా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో జాతీయస్థాయిలో పాల్గొన్నారు. భీమవరంలో బికాం చదివారు ఆ తరువాత హైద్రాబాద్ వచ్చి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంకామ్ చేసారు.

ఆ తరువాత ఆయనకు ఇసిఐఎల్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉద్యోగం లభించింది. ఉద్యోగ బాధ్యతలు ఉండడం వల్ల సినీ రంగంపై ఎక్కువ దృష్టిని సారించలేకపోయారు.

కాని 2000 సంవత్సరంలో తన ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేసాక సినిమాలపై దృష్టి పెట్టారు.

దర్శకులు జంధ్యాల జెన్ని ప్రదర్శిస్తున్న ఓ నాటకానికి అతిథిగా వచ్చి, ఆ నాటకంలో జెన్నీ నటన చూసి ‘అహ నా పెళ్ళంట’ చిత్రంలో తొలి అవకాశమిచ్చారు. ఆయన నటుడే కాక మూకాభినయం కళాకారుడు. మైమ్ కళాకారుడుగా అనేక ప్రదర్శనలు పలు దేశాల్లో ఇచ్చారు. 400 పైగా సినిమాలు, 1000 కి పైగా టివి కార్యక్రమాలు, దాదాపు 100 పైచిలుకు రేడియో కార్యక్రమాల్లో పాల్గొని తన సత్తా చాటారు.


‘యమలీల’ చిత్రంలో ఆయన పోషించిన పత్రికా సంపాదకుడి పాత్ర మంచి పేరు తీసుకురావడంతో వరుసగా అలాంటి పాత్రలే ఆయన్ని వరించాయి.

దాదాపు వంద చిత్రాల్లో చర్చి ఫాదర్‌గా ఆయన నటించడం విశేషం. ‘మురళీ కళానిలయం’ పేరుతో ఇప్పటికీ నాటకాలు, మైమ్ ప్రదర్శనలు ఇస్తున్నారాయన. మధు ఫిలిం ఇన్‌స్టిట్యూట్, నిజాం కాలేజీలలో, థియేటర్ ఆర్ట్స్ ఫాకల్టీగా పనిచేస్తున్నారు. దాదాపు 50కి పైగా కథలు రాసారు. అందులో ఓ పదిహేను కథలకు బహుమతులు కూడా రావడం విశేషం. సోమేపల్లి సాహితీ పురస్కారం రెండుసార్లు అందుకున్నారు.

ఆగడు, రెడీ, దూకుడు, నేను పెళ్లికి రెడీ, అయ్యారే, ఆ ఒక్కడు, ఠాగూర్, హలో బ్రదర్, మాయలోడు, ప్రాణదాత, విజయ్, ఆంటీ తదితర చిత్రాల్లో ఆయన నవ్వులను వెండితెరపై ఆవిష్కరించారు.



ప్రపంచంలో మూకాభినయం చేసే తొలి కళాకారుడిగా గుర్తింపు వచ్చింది. ఇదొక రికార్డుగా ఆయన చెపుతారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 1000 ప్రదర్శనలు ఇచ్చిన ఆయన మూకాభినయానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు.





# హాస్య ప్రభ–
# రమాప్రభ!



రమాప్రభ హాస్యం కోసమే పుట్టారు... హాస్యమే తన జీవితానికి లక్ష్యంగా చేసుకున్నారు.. హాస్యాన్ని దాదాపు 5 దశాబ్దాల పాటు తెలుగు తెరపై చిలికిస్తూనే వున్నారు. ఎవరూ సాధించలేని రికార్డు దాదాపు 1400 కు పైగా దక్షిణ భారతదేశపు చిత్రాలలో నటించి ఓ రికార్డును సృష్టించారు రమాప్రభ.

ఎంతోమంది కామెడీ నటులతో జత కట్టి హాస్యాన్ని సృష్టించినా రాజబాబుతో చేసిన హాస్యం మాత్రం ఎవర్‌గ్రీన్‌గా మిగిలిపోయి రాజబాబు, రమాప్రభ హిట్ పెయిర్ అన్న కీర్తిని తీసుకువచ్చింది.

1946 మే 5న చిత్తూరు జిల్లా వాయల్పాడులో జన్మించారు ఆమె.

ఏనాడూ పాఠశాలకు వెళ్లి చదువుకోని ఆమె జీవితాన్ని మాత్రం చక్కగా చదువు కున్నారు. మేనత్తకు పిల్లలు లేకపోవడం వల్ల వారికి దత్తతగా వెళ్ళారు. తండ్రి కృష్ణదాస్ ముఖర్జీ. గూడూరు లో మైకా వ్యాపారం చేసేవారు. పెంపుడు తండ్రి కూడా అదే వ్యాపారంలో ఉండేవారు. చిన్నతనం నుంచే రమాప్రభకు నటనపై మక్కువ పెరిగింది. ఇక ఆ దృష్టితోనే ఆమె అన్ని ప్రయత్నాలూ చేసేవారు.

తెలుగు సినిమాల్లోకి రాకముందు తమిళ నాటకరంగంలో 4000లకు పైగా రంగస్థల ప్రదర్శనలు ఇచ్చారు. రమాప్రభకు 12 ఏళ్ళ వయసులోనే పెంపుడుతండ్రి చనిపోగా బ్రతుకుతెరువు కోసం తల్లితో కలిసి మద్రాసు వచ్చేసారు. 'పుస్తకం పట్టకుండానే సినీ నటినయ్యాను. ఒకటో తరగతి చదివేందుకు కూడా పాఠశాలకు వెళ్ళలేదు. చదవకుండా ఉంటేనే సినీ నటులవుతారు.' అంటూ ఆమె ఓ సరికొత్త విషయాలు ఆమె జీవితాన్ని అనుసరించి చెబుతూంటారు.

'ఇల్లు ఇల్లాలు' చిత్రంలో రాజబాబుతో కలిసి 'వినరా సూరమ్మ కూతురు మొగుడా విషయం చెబుతాను' అన్న పాట ఇప్పటికీ ఆమె కెరీర్‌లో ఎవర్‌గ్రీన్‌గా నిలుస్తుంది.

అదే విధంగా రాధమ్మపెళ్లి చిత్రంలో 'కాకినాడ రేవు కాడ ఓడెక్కి బొంబాయి రేవుకాడ దిగుదామా' అన్న పాట ఆమె పాడి నటించడం మరో విశేషం. ఆ పాట కూడా ఆమె కెరీర్‌లో ఓ సూపర్‌హిట్.

నటుడు శరత్‌బాబును వివాహం చేసుకున్నా 12 ఏళ్ళకే వీరి వివాహం రద్దయింది.

హాస్యనటిగా అనేక వందల చిత్రాల్లో నటించిన ఆమె సూర్యకాంతం, ఛాయాదేవి, ఎస్.వి.ఆర్, రమణారెడ్డి, అల్లురామలింగయ్యలతో చేసిన అనేక చిత్రాల్లోని హాస్యం ఇప్పటికీ ప్రేక్షకులకు గిలిగింతలు పెడుతూ ఉంటుంది.


హాస్యనటిగా అనేక పాత్రల్లో నటించిన ఆమె ఆ తరువాత సిరిసిరిమువ్వ అనే చిత్రంతో కేరక్టర్ ఆర్టిస్టుగా మారి జయప్రదకు సవతి తల్లిగా నటించారు. అందులో గయ్యాళి భార్యగా సత్యనారాయణతో ఆమె చేసిన నటన ఆ చిత్రానికే హైలెట్ అయింది.

తొలిచిత్రం చిలకా గోరింక. ఇదే చిత్రం కృష్ణంరాజుకు కూడా తొలిచిత్రం కావడం విశేషం. వింత కాపురం, బస్తీలో భూతం, ప్రేమకానుక, బొమ్మాబొరుసా, విచిత్రబంధం, తాతా మనవడు, ఇద్దరమ్మాయిలు, బడిపంతులు, జీవనజ్యోతి, జేబుదొంగ, ఉత్తమురాలు, శ్రీ రాజరాజేశ్వరి విలాస్ కాఫీ క్లబ్, మనుషులంతా ఒక్కటే, సొమ్మొకడిది సోకొకడిది, దొంగలదోపిడీ, ప్రాణంఖరీదు, ఇంటింటి రామాయణం, ఇది కథ కాదు, 47 రోజులు, పట్నం వచ్చిన పతివ్రతలు, రుద్రకాళి, జననీ జన్మభూమి, స్వాతి, ముచ్చటగా ముగ్గురు, ముగ్గురుమూర్ఖురాళ్ళు, అనసూయమ్మ గారి అల్లుడు, కారు దిద్దిన కాపురం, శ్రీషిరిడీ సాయిబాబా మహాత్యం, వివాహ భోజనంబు, అప్పుల అప్పారావు, ఆవిడా మా ఆవిడే, ప్రేమంటే ఇదేరా, ఫ్యామిలీ సర్కస్, ఆంధ్రావాలా తదితర చిత్రాల్లో ఆమె తన నటనా వైభవాన్ని కొనసాగించారు.

ఇప్పటికీ అమ్మమ్మ, నాయనమ్మ పాత్రలతో ప్రేక్షకు లను తన హాస్యంతో పలకరిస్తూనే ఉన్నారు.

ఎన్నో అవార్డులు పొందవలసిన రమాప్రభ ఇప్పటికీ సరియైన అవార్డును ఏదీ పొందలేకపోవడం మన తెలుగు సినీ హాస్యప్రియులకు విచారకరం.

భవిష్యత్తులో మరెన్నో అవార్డులు, రివార్డులు అందు కోవాలని ఆశిద్దాం.



# నవ్వుల వరద–
# శ్రీలక్ష్మి

'నేను కవిని కానన్నవాడ్ని కత్తితో పొడుస్తా. నేను రచయిత్రిని కానన్నవాడ్ని రాయెత్తి కొడతా!'... ఇలాంటి డైలాగులు మనకి శ్రీలక్ష్మితోనే పరిచయమయ్యాయి.

హాస్యబ్రహ్మ, దర్శకులు జంధ్యాల తెలుగు తెరకు అందించిన ఆణిముత్యం శ్రీలక్ష్మి. వీరు అలనాటి తెలుగు హీరో అమర్‌నాథ్ కుమార్తె.

80వ దశకంలో యువహీరోగా వెలిగిన రాజేష్‌కు సోదరి. మానాపురం లక్ష్మి జూలై 30న మద్రాసులో జన్మించారు.

చిన్న వయసులోనే తండ్రి దూరమవవడంతో కుటుంబం కోసం నటనను వృత్తిగా స్వీకరించారు. బాపు రూపొందిస్తున్న వంశవృక్షంలో, కె.విశ్వనాథ్ రూపొందిస్తున్న శుభోదయం చిత్రంలో కథానాయికగా ఎంపికయ్యింది. కాని వచ్చిన రెండు అవకాశాలు చేజారిపోయాయి.

తమిళ, మళయాళ భాషల్లో హీరోయిన్‌గా కొన్ని చిత్రాల్లో నటించారు శ్రీలక్ష్మి.

వేటగాడు, మావూళ్ళో మహా శివుడు, ఖైదీకృష్ణుడు, కొండవీటి సింహం, ఊరికిచ్చిన మాట, నివురుగప్పిన నిప్పు, తదితర చిత్రాల్లో నటించాక నివురు గప్పిన నిప్పులో హాస్యనటిగా మంచి మార్కులు పడడంతో ఆమెకు హాస్య పాత్రలు రావటం మొదలుపెట్టాయి.

గోపాలకృష్ణుడులో ఏఎన్ఆర్‌కు జోడీగా ఓ పాటలో కనిపిస్తారు శ్రీలక్ష్మి. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన రెండు జెళ్ళ సీతలో ఆమెకు ఓ అవకాశం వచ్చింది. ఆమె టాలెంట్‌ను గుర్తించిన డైరెక్టర్ ఆమె పాత్రను మరింత పొడిగించి పెంచారు. దాంతో యాదృచ్ఛికంగా పొడిగించిన ఆ పాత్రకు ఉత్తమ హాస్యనటిగా అవార్డు లభించింది.

ఆ పాత్రతోనే ఆమె హాస్యనటిగా స్థిరపడి దాదాపు ఎన్నో సంవత్సరాల పాటు అవార్డులు, రివార్డులు అందుకున్నారు. విశేషమేంటంటే శుభోదయంలో కథానాయికగా నటించిన సులక్షణ, వంశవృక్షంలో కథానాయికగా నటించిన జ్యోతి ఆ తరువాత కథానాయికలుగా రాణించలేకపోయారు. ఓరకంగా ఆ రెండు చిత్రాల్లో అవకాశాలు చేజారిపోవటం శ్రీలక్ష్మి అదృష్టమనే చెప్పాలి.



చిరంజీవి కథానాయకుడుగా వచ్చిన చంటబ్బాయ్ చిత్రంలో పొట్టి ప్రసాద్‌తో కలిసి శ్రీలక్ష్మి సృష్టించిన హాస్య తరంగాలు ఎప్పటికీ ప్రేక్షకులకు నవ్వులు విరజిమ్ముతూనే ఉంటాయి. ఆ చిత్రంలో ఎడిటర్‌గా ఉన్న పొట్టిప్రసాద్‌ను తన కవితలతో ఇబ్బంది పెట్టిన కోడలిగా ఆమె నటన అద్భుతంగా సాగింది.

పుత్తడిబొమ్మ, మంత్రిగారి వియ్యంకుడు, అమరజీవి, శ్రీవారికి ప్రేమలేఖ, బాబాయ్ అబ్బాయ్, ఆనందభైరవి, శ్రీవారి శోభనం, రెండు రెళ్లు ఆరు, మొగుడూ పెళ్లాలు, శాంతినివాసం, అరణ్యకాండ, స్వర్ణకమలం, చూపులు కలసిన శుభవేళ, హాయ్ హాయ్ నాయకా, బావా బావా పన్నీరు, సూత్రధారులు, చెవిలో పువ్వు, ప్రాణానికి ప్రాణం, లేడీస్ స్పెషల్, కొబ్బరిబోండాం, ఇద్దరు పెళ్ళాల ముద్దుల పోలీస్, ఆదిత్య 369, బాబాయ్ హోటల్, వన్ బై టు, రాజేంద్రుడు గజేంద్రుడు, మాయలోడు, జంబలకిడిపంబ, శుభలగ్నం, మావిచిగురు, శుభసంకల్పం, ఎగిరే పావురమా, నువ్వు నాకు నచ్చావు లాంటి అనే చిత్రాలలో ప్రేక్షకులను తన నవ్వులతో అలరించారు శ్రీలక్ష్మి.

మంచి హాస్యపాత్రలు లభిస్తే నవ్వులు కురిపించడానికి ఇప్పటికీ సిద్ధంగానే ఉన్నారు.

ఆమెకు మరిన్ని మంచి చిత్రాలు రావాలని, ఆ పాత్రలతో ప్రేక్షకులకు నవ్వుల విందు చేయాలని కోరుకుందాం.

# సరళ హాస్యం-
# కోవై సరళ

ఎంత పెద్ద నటుడికైనా ఒక్కొక్కసారి ఒక్కొక్క పాత్ర సవాల్ విసురుతుంది. ఆ పాత్రల్లో నటించడం ఇబ్బందిగా మారుతుంది. అయినా దర్శకుడు చెప్పిన సూచనల మేరకు నటించి మెప్పిస్తారు.

కాని కోవై సరళకు మాత్రం ఇప్పటివరకు అటువంటి సవాల్ విసిరే పాత్ర ఎదురు కాలేదు. ఏ పాత్ర వచ్చినా పిండి దంచినట్టు దంచి చాలా సరళంగా ఆ పాత్రలో జీవించి ప్రేక్షకులను మెప్పిస్తుందామె. అటువంటి నటి మన తెలుగు తెరకు రావడం తెలుగు ప్రేక్షకుల అదృష్టం.

తెలుగులో తమిళం కలుపుతుందో, తమిళంలో తెలుగు భాష కలుపుతుందో మొత్తానికి ఆమె భాష వైవిధ్యంగా వినిపిస్తూ డైలాగ్ డెలివరీ సరికొత్తగా ఉండి ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తుంది.



1962 ఏప్రిల్ 7న కోయంబత్తూర్‌లో జన్మించారు వారు. కోయంబత్తూర్ నుంచి వచ్చారు కనుక కోవై సరళ అయ్యారు. నటనపై మక్కువతో తమిళ చిత్ర పరిశ్రమకు వచ్చి అనేక చిత్రాల్లో నటించారు. ఆ తరువాత తెలుగు చిత్రాలలో కూడా ఎంట్రీ ఇచ్చారు.

మళయాళీ కుటుంబంలో జన్మించిన కోవై సరళ ఎంజిఆర్ చిత్రాలు చూసి నటనపై ఆసక్తి పెంచుకున్నానని చెప్పడం విశేషం. చదువు పూర్తయిన తరువాత తండ్రి, సోదరి ప్రోత్సాహంతో పరిశ్రమలోకి వచ్చి విజయకుమార్, కె. ఆర్. విజయ జంటగా నటించిన 'వెల్లిరథం' అనే చిత్రంలో తొలిసారిగా తెరపై కనిపించారు.

ముందాన్నయ్ ముడిచ్చు, చిన్నవీడు తదితర చిత్రాల్లో తనకన్నా ఎక్కువ వయసున్న పాత్రల్లో నటించి మెప్పించారు. తరుణ్ కథానాయకుడుగా వచ్చిన నువ్వేకావాలి చిత్రంలో ఆమె చేసిన అల్లరి హాస్యం ప్రేక్షకులకు ఆనందాన్నిచ్చింది.

'ఊ పె కు హ' అంటూ ఆమె చేసిన ఊళ్ళో పెళ్లికి కుక్కల హడావిడి అన్న నినాదం, ఘకిరియా అన్నపదం ప్రేక్షకులకు నచ్చింది.

ఆ తరువాత బ్రహ్మానందంతో జతకట్టి అనేక చిత్రాల్లో గయ్యాళి, అమాయక భార్యగా, సౌమ్యం ఉన్న స్త్రీగా, భర్త మాటకు ఎదురు చెప్పలేని భార్యగా ఇలా రక రకాల పాత్రలు అలవోకగా నటించి మెప్పించింది.



ఎవడిగోల వాడిది చిత్రంలో ఆమె చేసిన నటన ఎప్పటికీ ప్రేక్షకులకు గుర్తుండి పోతుంది.

ఎంత బావుందో, శ్రీరామచంద్రులు, దేశముదురు, ఎలా చెప్పను, సందడే సందడి, హీరో, గ్రీకువీరుడు, కిక్2, పెళ్లాం చెపితే వినాలి... ఇలాంటి చిత్రాల్లో ఆమె అద్భుతమైన టైమింగ్‌తో హాస్యాన్ని పండించి తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు.

2003 సంవత్సరంలో ఓరి నీ ప్రేమ బంగారం గానూ చిత్రంలో ఉత్తమ హాస్యనటిగా నంది పురస్కారం అందుకున్నారు కోవై సరళ.

మరెన్నో చిత్రాల్లో కోవై సరళ తన హాస్యంతో తెలుగు ప్రేక్షకులను మురిపించాలని కోరుకుందాం.

# సరస నట సార్వభౌమ-
# సత్యనారాయణ



తెలుగు చిత్రాలలో శ్రీకృష్ణుడు, శ్రీరాముడు అంటే ఎన్‌టిఆర్ ఎలాగో యముడు అంటే సత్యనారాయణే. అంతకుముందు నటించిన ఎస్‌విఆర్ ని మరపించి ఆయా చిత్రాల్లో కామెడీతో యముడి పాత్రకు ప్రాణ ప్రతిష్ఠ చేసారు సత్యనారాయణ.

దాదాపు 60 సంవత్సరాల పాటు తెలుగు సినిమా రంగంలో అనేక పాత్రలో నటించిన ఆయన వైవిధ్యమైన హాస్యపాత్రల్లో నటించి మెప్పించారు.

ప్రేక్షకులకు తన హాస్యంతో గిలిగింతలు పెట్టారు. పౌరాణిక, సాంఘిక, చారిత్రక, జానపద పాత్రలు ఎన్నిచేసినా అందులో ప్రతినాయకుడిగా కేరక్టర్ ఆర్టిస్టుగా నటించి మెప్పించారు. శారద చిత్రంలో చెల్లికి, మరణించిన ఆమె భర్త గురించి చెప్పలేని ఉదాత్తమైన పాత్రలో ఎంత ఇమిడిపోయారో అంతే విధంగా హాస్యాన్ని కూడా చిలికించి హాస్య నటసార్వభౌమ అని పిలిపించుకున్నారు సత్యనారాయణ.

ఆలీబాబా 40 దొంగలు, డబ్బుకు లోకం దాసోహం, శ్రీరంగనీతులు, యమగోల, యమలీల, ఘటోత్కచుడు, శుభాకాంక్షలు, కోడలు దిద్దిన కాపురం, వేటగాడు, అడవిరాముడు, డ్రైవర్‌రాముడు, సావాసగాళ్ళు, ముగ్గురు మూర్ఖులు, తాయారమ్మ బంగారయ్య, మా ఊళ్ళో మహా శివుడు, అమ్మాయికి మొగుడు మామకు యముడు, ప్రేమబంధం, యముడికి మొగుడు, తాతయ్య పెళ్లి మనవడి శోభనం, ఏమండీ ఆవిడ వచ్చింది, అల్లుడా మజాకా తదితర చిత్రాల్లో ఆయన హాస్యాన్ని మనం రుచి చూడవచ్చు.

కోడలు దిద్దిన కాపురంలో 'ఓం సచ్చితానంద ఈ సర్వం గోవింద' అంటూ దొంగ స్వామీజీగా ఆయన నటన ఇప్పటికీ అలాంటి పాత్రలు నటించేవారికి ఓ కొలబద్దగా నిలిచింది. శ్రీరంగనీతులు చిత్రంలో తాను నీతులు చెపుతూ, తన తప్పులు ఎక్కడ బయట పడిపోతుందోనని ఆయన చేసిన నటన ఎప్పటికీ ఎవర్ గ్రీన్!

యమగోల చిత్రంలో, అలాగే యమలీలలో యముడికి మొగుడులో యమధర్మ రాజుగా హాస్యాన్ని చిలికించారు. ఇక ముగ్గురు మూర్ఖులు చిత్రంలో అయితే సినిమా అంతా హాస్యమే నిండి ఉంటుంది. ఆ పాత్రలో జీవించారనే చెప్పాలి. అలాగే 'వింత ఇల్లు సంత గోల' చిత్రం కూడా! 'తాయారమ్మ బంగారయ్య' చిత్రంలో లోపల విషా దాన్ని దాచుకుని పైకి అనేకమంది ఇబ్బందులను తొల గించే పాత్రలో సత్యనారాయణ, షావుకారు జానకి చేసిన నటన అద్భుతంగా సాగు తుంది.



ఇక 'అమ్మాయికి మొగుడు మామకు యముడు'లో కృష్ణతో చేసిన కామెడీ సరికొత్తగా సాగి ప్రేక్షకులను అలరించింది.

'మొరటోడు' చిత్రంలో ఆయనే హీరో. ఆ చిత్రం కూడా కామెడీగా సాగి ప్రేక్షకులకు నచ్చుతుంది. రమా ఫిలింస్ ప్రొడక్షన్స్ అనే సంస్థను స్థాపించి ఇద్దరు దొంగలు, కొదమసింహం, బంగారు కుటుంబం, ముద్దుల మొగుడు లాంటి చిత్రాలను నిర్మించారు.

రాజకీయాల్లోకి వెళ్లి మచిలీపట్నం నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారాయన.

ఇటీవల బాలకృష్ణ రూపొందించిన కథానాయకుడు చిత్రంలో ఆయన తనదైన స్టైల్‌లో హెచ్.ఎమ్.రెడ్డిగా కనిపించి మెప్పించారు.

# తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక



హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

Smile in
every page
Satisfaction in
every smile

గత 18 ఏళ్ళుగా
ఇంటిల్లిపాదిని
నవ్విస్తున్న
హాస్య
పత్రిక



అసలు మీరు నవ్వితే... ఇంకా బావుంటారు...
అందుకే హాస్యానందం చదువుతారు!
ఆ విషయం మీకు తెల్సు కనుకే...
హాస్యానందం కొంటారు!!
ఇలాగే మీరెప్పుడూ హసానందంగా
ఉండాలనుకుంటారు... కాబట్టే
హాస్యానందం కొని చదువుతారు!!!

అయితే ప్రతినెలా ఈ 'నవ్వులు' మీ ఇంటికి చేరాలంటే
మీరు చేయవలసిందల్లా హాస్యానందం సభ్యులుగా చేరడమే!

ఒక్కేడాదికి జస్ట్ 300 రుపీస్.... రెండేళ్ళకి ఓన్లీ 500 రుపీస్!
జీవిత చందా 5000 రుపీస్.
ఇంకేమైనా డౌట్లుంటే... 9849630637 నెంబర్‌కి ఫోన్ చేయండి!

#8-215/4, Near Ramalayam, YERRABALEM-522 503, Mangalagiri, Guntur Dist.
Ph: 9849630637


# హాస్యానందం సౌజన్యంతో

# శ్రీకనపర్తి చిట్టిబాబు (SBI) నిర్వహించిన కార్టూన్ పోటీ ఫలితాలు

## అంశం: నేటి స్వామీజీలు

న్యాయ నిర్ణేత- శ్రీ సరసి


**మొదటి బహుమతి రూ.3,000/-లు గెలుపొందిన కార్టూన్**



**రెండవ బహుమతి రూ.2,000/-లు గెలుపొందిన కార్టూన్**





**10 ప్రత్యేక బహుమతులు పొందిన 10 కార్టూన్లు. ఒకో కార్టూన్‌కి రూ.500/-లు నగదు బహుమతి**
























కార్టూన్ ఇష్టులు శ్రీ కనపర్తి చిట్టిబాబుగారు కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సంకల్పంతో హాస్యానందంతో కలిసి నిర్వహించిన ఈ పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం విశాఖపట్టణంలో ఫిబ్రవరి 14న జరుగుతుంది.

తేదీ: 14, ఫిబ్రవరి, 2021 ✦ సమయం: ఉదయం 10 గంటల నుండి.

వేదిక : విశాఖ పౌర గ్రాంథాలయం, ద్వారకానగర్, విశాఖపట్టణం.

హాస్యానందం నవ్వుల తెర తారల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ


భువన్ ఫన్ బుక్- తొలి తెలుగు ఫుల్ పేజీ కార్టూన్ల సంపుటం ఆవిష్కరణ

Happy Birthday

# Shankar గారి రేఖాశీస్సులు



'ఫిబ్రవరి' లో పుట్టిన కార్టూనిస్ట్ మిత్రులందరికీ
**జన్మదిన శుభాకాంక్షలు.** -హాస్యానందం



జి.ఎస్.ఆర్-
ఫిబ్రవరి,1



వెంకట్రావు(టివి)-
ఫిబ్రవరి,2



గిరి-ఫిబ్రవరి,6




ఎన్.ధీరజ-
ఫిబ్రవరి,7



కొండ రవిప్రసాద్-
ఫిబ్రవరి,10



శేఖర్-ఫిబ్రవరి,15



హరగోపాల్-
ఫిబ్రవరి,17




ఎవిఎస్ మన్యం-
ఫిబ్రవరి,19



ద్రోణంరాజు-
ఫిబ్రవరి,22



యువరాజ్-
ఫిబ్రవరి,23



గోపు-ఫిబ్రవరి,24



దేవులపల్లి-
ఫిబ్రవరి,26

(అక్షజ్ఞవారి 'మన కార్టూనిస్టుల రూపురేఖలు' సౌజన్యంతో)

# తెలుగు చలనచిత్ర హాస్య నటీనటులకు అక్షర అభినందనలు

పల్లవి: తెలుగు చలన చిత్రాల్లో
వెండి తెర వేల్పులు !
అద్వితీయ మూర్తులు
అజరామర కీర్తులు!!
హాస్య నటీనటులకు శత సహస్ర వందనాలు!
వినోద విందు దాతలకు సుగంధ చందనాలు!!

చరణం: రేలంగి రువ్వినాడు హాస్య పువ్వులెన్నో
రమణారెడ్డి మాటల్లో నవ్వు ఊటలెన్నో
రాజబాబు పెట్టినాడు కితకితలెన్నో
పద్మనాభ వినిపించిన పకపక లెన్నో ॥తెలుగు॥

చరణం: అదిగో! అల్లు రామలింగయ్య హాస్యపుజల్లు
అలీ–చలం వంటి వాళ్ళు కొందరికే చెల్లు
బ్రహ్మకు గిలిగింత పెట్టు బ్రహ్మానందం
'హాస్యబ్రహ్మ' బిరుదుపొందె బ్రహ్మానందం
॥తెలుగు॥

చరణం: కోట శ్రీనివాసుడు కోటినవ్వుల రేడే
బాబూమోహన్‌తో జత నవ్వు రువ్వినోడే
విరివిగానె పండించిరి వినోదాల పంట
సుత్తి–వీరభద్రుడు సుత్తి–వేలు జంట ॥తెలుగు॥

చరణం: దరహాస భాషణాల హాస్యరస చతురుడు
ధర్మవరం సుబ్రహ్మణ్య ధన్యచరితుడు
విశేషనటుడు గొల్లపూడి మారుతీరావు
చేయలేని వినోదాల విందులే లేవు ॥తెలుగు॥

చరణం: తనికెళ్ళ భరణి పలుకు ఆలకిస్తే నీవు
తనువెల్ల నిలువెల్ల పులకరించిపోవు
ఎల్బీ శ్రీరాముడు వత్తి పలుకుమాటలు
ఏనాడు వాడని నవ్వుల పూదోటలు ॥తెలుగు॥

చరణం: చలపతిరావు–చిడతల అప్పారావు
కళ్ళు చిదంబరం–సాక్షి రంగారావు
ఎవరికి వారే సాటి ఎవరు పోటి లేరు
పొట్ట చెక్కలయ్యేలా పకపకలు జాలువారు ॥తెలుగు॥

చరణం: గయ్యాళి పాత్రలోను నవ్వించిన కాంత
అయ్యారే అనిపించే మన సూర్యకాంత
శ్రీలక్ష్మి వైవిజయ–హేమ కృష్ణవేణిలే
రమాప్రభ వంటివారు హాస్య రాజ్యమేలే

చరణం: కొండవలస వంటివారు హాస్యము పండించగా
ఐరన్ లెగ్ శాస్త్రి అదే మనకు వడ్డించగా
పొట్టి ప్రసాదు అందించే వినోదాలవిందులే
కోళ్ళ సత్యం వేసే నవ్వులచిందులే....

చరణం: అనంత్–చిట్టిబాబు కృష్ణ భగవానులు
సునీల్–రఘుబాబు సుధాకర్ కిశోరులు
మాటల్లో విరుపులు నటనల్లో మెరుపులు
రాతిగుండె మనుషులను నవ్వించు మహానటులు
॥తెలుగు॥

చరణం: రాజేంద్రుని చిత్రాలు చిత్రవిచిత్రాలే
నగేషంటే నవ్వుల సామ్రాజ్య రారాజులే
నాటి బాలకృష్ణ (అంజి) బాగానే నవ్వించే
మేటి హాస్య నటులెందరో అమరులై జీవించే
॥తెలుగు॥

చరణం: జయప్రకాష్‌రెడ్డి కూడ హాస్యము పండించే
వేణుమాధవ్ సైతం హాస్యమే వడ్డించే
అల్లరి నరేషుదీ హాస్యనట జీవనం
ఎమ్మెస్ నారాయణదీ నవ్వుల పారాయణం॥తెలుగు॥

చరణం: శ్రీనివాసరెడ్డి కూడ నవ్వుల అడ్డా
సప్తగిరి నవ్వుల నటవంశపు బిడ్డా
గుండుహనుమంతుని హాస్యపు జల్లులు
గుండు సుదర్శన ప్రదర్శనాలు కోకొల్లలు ॥తెలుగు॥

చరణం: తెలుగు చిత్రసీమలో హాస్యనట దేవుళ్ళు!
ఆనందపు విరిజల్లు కురిపించిన వాళ్ళే!!
వినోదాల విందులు అందించిన హాస్యనటులు
అజరామర కీర్తిని అందుకున్న వాళ్ళే! ॥తెలుగు॥

చరణం: ఏవీయెస్ హాస్యము అందరికీ 'ఓ యెస్'
మల్లికార్జునుడు మన నవ్వుల 'బాస్'
ఎందరో హాస్యనటులు ఈ గీతంలో మిస్
అందరూ నా వాళ్ళే ఈ జనశ్రీ ప్రామిస్ ॥తెలుగు॥

**–'జనశ్రీ' జనార్ధన్ కుడికాల, హన్మకొండ**

# తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం 2021 సందర్భంగా కార్టూన్ పోటీలు



**శ్రీ తలిశెట్టిరామారావు జయంతి మే,20**

**తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా**

**హాస్యానందం నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన ఈ కార్టూన్ పోటీలో మన కార్టూనిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ...**

| | | |
|---|---|---|
| మొదటి బహుమతి | - ₹ 10,000/- | + ప్రశంసా పత్రం + జ్ఞాపిక |
| రెండవ బహుమతి | - ₹ 6,000/- | + ప్రశంసా పత్రం + జ్ఞాపిక |
| మూడవ బహుమతి | - ₹ 4,000/- | + ప్రశంసా పత్రం + జ్ఞాపిక |
| విశిష్ట బహుమతులు (20) | - ₹ 1,000/- | + ప్రశంసా పత్రం |




**బాపురమణ కార్టూన్ పురస్కారం-2021**

2020 జనవరి నుండి 2021 జనవరి దాకా మీరెన్నో పత్రికల్లో, వెబ్ మెగజైన్‌లలో ఎన్నెన్నో మంచి కార్టూన్లు వేసి ఉంటారు. వాటిలో మీకు బాగా నచ్చిన కార్టూన్ ఒక్కటి (ఎప్పుడు పబ్లిష్ అయిందో ఆ తేదీతో పాటు) పంపిస్తే వాటిల్లో ఒక దానికి బాపు రమణ పురస్కారం ఇస్తూ సన్మానించాలని నిర్ణయించాం! **8000** రూపాయల పురస్కారం తో పాటు... ప్రశంసా పత్రం, సత్కారం.




ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ శేఖర్ పేరిట **శేఖర్ అవార్డు 2021** కార్టూన్ పోటీకి 'సోషల్ మీడియా' అనే అంశంతో కార్టూన్లు ఆహ్వానిస్తున్నాం! **10,000** రూపాయల పురస్కారం తో పాటు ప్రశంసాపత్రం, మెమెంటో.




బాపురమణ అకాడమీ, ఆత్రేయపురం-హైదరాబాద్ వారు ప్రముఖ కార్టూనిస్ట్ కుమారి రాగతి పండరి జ్ఞాపకార్థం ఓ మహిళా కార్టూనిస్ట్‌కి **కుమారి రాగతి పండరి పురస్కారం-2021** అందజేస్తున్నారు. వివరాలు హాస్యానందం మే2021 సంచికలో...

**కార్టూన్లు మాకు చేరవలసిన ఆఖరి తేదీ- 2021, 1, ఏప్రియల్**


కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపవలెను- **hasyanandampoteelu@gmail.com**

# ఆరోగ్యకరమైన హాస్యానికి చిరునామా

**ఆ**రోగ్యకరమైన హాస్యానికి చిరునామా హాస్యబ్రహ్మ పద్మశ్రీ జంధ్యాల.

నవ్వడం ఒక భోగం. నవ్వించడం ఒక యోగం. నవ్వలేకపోవడం ఒక రోగం అంటారు జంధ్యాల. ఆయన చెప్పింది నూరుపాళ్ళు కరెక్ట్.

ఒక పరిశోధనలో తేలిందేమిటంటే హాయిగా నవ్వుకోవడం వలన మన శరీరంలో జరిగే ఆరోగ్యకరమైన మార్పుల వలన బిపి, షుగరు, స్ట్రెస్ తగ్గుతుంది. కాబట్టి జంధ్యాల గారి సినిమాలు చూసి హాయిగా నవ్వుకుని ఆరోగ్యంగా ఉండండి.



జంధ్యాలగారు సుమారు 40కి పైగా దర్శకత్వం వహించారు. శంకరాభరణం లాంటి మొదలైన చిత్రాలకి డైలాగులు రాసి ఎంతో ప్రాముఖ్యత సంపాదించుకున్నారు. హాస్యబ్రహ్మగా జంధ్యాలగారు సృష్టించిన అనేక హాస్యచిత్రాలు శ్రీవారికి ప్రేమలేఖ, అహ నా పెళ్ళంట, రెండు రెళ్ళు ఆరు, మొదలైనవి. మెగాస్టార్ చిరంజీవితో ఫుల్ కామెడీ చిత్రం చంటబ్బాయి చేసిన ఘనత జంధ్యాల గారికే దక్కింది. బాలకృష్ణతో బాబాయ్ అబ్బాయి, అనేకమంది హీరోలతో అనేక హాస్యచిత్రాలు నిర్మించారు. ఆయనకు డైరెక్టరుగా నంది అవార్డు తెచ్చిన సూపర్ హిట్ కామెడీ చిత్రం శ్రీవారికి ప్రేమలేఖ.

ఈ సినిమాలో జంధ్యాలగారు ఎటువంటి అసభ్యత లేకుండా కుటుంబం అంతా కలిసి నవ్వుకునేలా తీసారు. ఈ సినిమాలో నరేష్ తండ్రిగా నటించిన సుత్తి వీరభద్రరావు పాత్రకి కోపం ఎక్కువ. కనపడిన అందర్నీ తిడుతుంటాడు. ఈయనకి ఇంకొక విచిత్రమైన అలవాటు కోపం వస్తే గోడకి తల బాదుకోవడం. ఈ పాత్రని జంధ్యాలగారు చాలా అద్భుతంగా సృష్టించారు.

ఈయనకి ఇద్దరు కూతుళ్ళు కామాక్షి, పూర్ణ. కామాక్షిగా సంగీత నటించారు. ఈమె విచిత్ర వంటకాలు వండి అందరిపైనా ప్రయోగిస్తుంది. కూరగాయలవాడితో, భర్తతో, మామగారితో ఈ మె చేసిన వంటల కామెడీ సూపర్. ఇంకొక కూతురు పూర్ణగా శ్రీలక్ష్మి నటించారు. ఈమె భాషాభేదము లేకుండా మళయాళం, తెలుగు, తమిళ సినిమాలు చూసి ఆ కథను టైటిల్స్‌తో సహా ఎమోషనల్‌గా కనపడినవారందరికీ చెప్తుంటారు. ఈమెకి అనేకమంది బాధితులు ఉంటారు ఆమె భర్తతో సహా. అందర్నీ ఈ పాత్ర విసిగించి మనల్ని మాత్రం నవ్విస్తుంది.

సుత్తి వీరభద్రరావుగారి గుమస్తా పాత్ర పేరు భీముడు. మిశ్రో నటించారు. ఆయన వీర భద్రరావుగారి కొడుకు పెళ్లి కుదిరితే గుండు చేయిస్తానని వీరభద్రరావుగారు మొక్కుకుంటారు. పెళ్లి మధ్యలో ఆగిపోతే గుండు సగంలో ఆపేస్తారు. ఈ ప్రహసనంలో మంచి హాస్యం పండుతుంది.

నరేష్ ఆఫీసులో ప్యూన్‌గా పనిచేసే వ్యక్తిగా రాళ్లపల్లి నటించారు. ఈయన మద్యపానాన్ని అంటే మందు కొట్టడాన్ని మాట్లాడుకోవటంగా చెప్తాడు. ఇలా రకరకాలుగా ఇంగ్లీషులో మాట్లాడుకోవటం, రష్యన్‌లో మాట్లాడుకోవటం స్వగతంగా మాట్లాడుకోవటం ఇలా రకరకాలుగా చెప్తాడు. ఇది చాలా గమ్మత్తుగా ఉంటుంది.

ఇంగ్లీషులో సుత్తివీరభద్రరావుగారు రాళ్ళపల్లిని కలిసి తిట్టే సన్నివేశం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

తెలుగు ప్రేక్షకులందరికీ గుర్తుండిపోయే శ్రీవారికి ప్రేమలేఖ చిత్రాన్ని సృష్టించిన జంధ్యాలగారు హాస్యప్రియుల గుండెల్లో చిరస్మరణీయులుగా నిల్చిపోతారు.

కామెడీ ఆర్టిస్టుల గురించి హాస్యానందం ఈ ప్రత్యేక సంచికలో, చాలా మంది కమెడియన్లని మనకి పరిచయం చేసిన జంధ్యాల గారిని స్మరించుకోవటం మన కర్తవ్యం!

నవ్వే జనాః సుఖినోభవంతు. **–డా॥వి.వి. రామ కుమార్,**

షుగరువ్యాధి నిపుణులు, గుంటూరు,

With best compliments from

ESTD1995

యస్.వి.ఆర్.షుగర్ హాస్పిటల్

Opp: Veterinary Hospital, Bhagathsingh Center, Kothapet, GUNTUR.

Ph: 0863 2320048. email: ramdiabetologist@yahoo.com

విలువైన వస్తువులు చవకగా దొరకవు...
చవకైన వస్తువులు చిరకాలం మన్నవు!



Jaquar

ఆథరైజ్డ్ డీలర్:
**సాంబమూర్తి ఎంటర్‌ప్రైజెస్**
క్వాలిటీ పైప్ ఫిట్టింగ్ షాప్
12-10-04, కాన్వెంట్ వీధి, విజయవాడ-520 001
ఫోన్: 0866-256 3824


Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P


## బాపు రమణ అకాడమీ

బాపుగారి పుట్టినరోజు సందర్భంగా
ప్రతియేడు డిశంబర్ 15న
ఇద్దరు ప్రముఖులకు
బాపు పురస్కారం, రమణ పురస్కారం
ఇచ్చి సత్కరిస్తోంది.

2015వ సంవత్సరంలో
శ్రీ జయదేవ్,
శ్రీ కె.విశ్వనాథ్ గార్లకు;
2016వ సంవత్సరంలో
శ్రీ చంద్ర,
శ్రీ శ్రీరమణ గార్లకు;
2017వ సంవత్సరంలో
శ్రీ సరసి,
శ్రీ యండమూరి వీరేంద్రనాథ్
గార్లకు;
2018వ సంవత్సరంలో
శ్రీ సత్యమూర్తి,
శ్రీ తనికెళ్ల భరణి గార్లకు;
2019వ సంవత్సరంలో
శ్రీ శంకర్,
శ్రీ వంశీ గార్లకు;
2020వ సంవత్సరంలో
శ్రీ గోపి,
శ్రీ ఎల్బీ శ్రీరాం గార్లకు...
ఈ పురస్కారాలు ఇచ్చి
అకాడమీ సత్కరించింది.



అధ్యక్షుడు-
జ్ఞిం



కార్యదర్శి-
వేగిరాజు సుబ్బరాజు














Hasyanandam February 2021. RNI No. APTEL 08387/01/1/2003-TC

THE WEEK - NIELSEN SURVEY 2014
7th Best Hospital in India
ORTHOPAEDICS HOSPITALS

# SUNSHINE HOSPITALS

Dr. Gurava Reddy & Associates



## We are the largest JOINT family and are heads (and knees, hips & spine) above the rest

SUNSHINE BONE & JOINT INSTITUTE

## SUNSHINE HEART INSTITUTE

### Our Expert CARDIOLOGY & CT Surgery Team

24hr HEART CARE



### Honours in Joint Replacement Surgery

- **Highest** number of Joint Replacements per year in South India
- **Second** Highest Number of Joint Replacements Per Year in ASIA
- **10,000** Joint Replacements at Sunshine in 4 Years
- **20,000** Joint Replacements by Dr. A.V. Gurava Reddy

### Infrastructure Highlights

- 350-bed facility.
- Multi-super specialty hospital.
- Entire floor dedicated to Critical Care
- 14 modular Operating Theaters with laminar airflow.
- Exclusive floor for trauma suite - 25 ER beds, X-ray units, multi-slice CT scan & 1.5 Tesla MRI scan, Cathlab, 2 operative rooms and 10-bed trauma ICU emergency with separate entry for ambulance round-the-clock.

### Multi-Super Specialty Services :

Orthopaedics | Joint Replacements | Cardiology | Cardiothoracic Surgery | Critical Care & Pain Management | Anaesthesiology | Electrophysiology | Emergency & Trauma | Minimal Access Surgery | Neurology | Neurosurgery | Oncology | Medical Oncology | Surgical Oncology | Nephrology | Pulmonology | Internal Medicine | General Surgery | Vascular Surgery | Spine Surgery | Obstetrics & Gynaecology | Paediatrics | Paediatric Surgery | Bariatric Surgery | Plastic & Cosmetic Surgery | Urology | Endocrinology & Diabetology | Gastroenterology | Surgical Gastroenterology | Rheumatology | Ophthalmology | ENT | Dental | Dermatology | Dialysis | Physiotherapy | Psychiatry | Dietetics & Nutrition | Bio-chemistry | Clinical Pathology | Micro-biology | Hepatology | Haematology | Radiology | CT Scan | MRI | Cath Lab | Blood Bank & Transfusion

**SUNSHINE HOSPITALS**

PG Road, Paradise, Sec-bad 03, Telangana, India
T: **44 55 00 00 / 43 44 45 46** F: 27 89 00 91
E: info@sunshinehospitals.com
F: facebook.com/sunshinehospitals
**8008 108 108**

**SUNSHINE HEART INSTITUTE**

PG Road, Paradise, Sec-bad 03, Telangana, India
T: **43 44 45 55** F: 27 84 32 85
E: info@sunshineheartinstitute.com
F: facebook.com/sunshineheartinstitute
**8008 102 102**

**SUNSHINE HOSPITALS BHUBANESWAR**

Spreading smiles in Odisha

Laxmi Sagar Square, Cuttak-Puri Road
Bhubaneswar, Odisha

**www.sunshinehospitals.com**